

మనసులో
# మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక: 199: బుధవారం 18 మార్చి 2026:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు32:- వెలరూ/ 9-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

## అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం



- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం

04

## మీ సాయం మాకక్కర లేదు



- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక

4



# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

### మరో 15 రోజులకు అవసరమైన నిల్వలు

- త్వరలోనే మరింత గ్యాస్ సరఫరా
- కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్ నెట్‌వర్క్ పెంచాలి
- ప్రజలు పానిక్ కాకుండా చైతన్య పరచాలి
- అధికారులతో సమీక్షలో సీఎం చంద్రబాబు సూచన
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల



**అమరావతి, మార్చి 17 (మనసులో మాట):** రాష్ట్రంలో ప్రస్తుతం 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. మరికొన్ని టన్నుల గ్యాస్ త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరాకు ఇబ్బందుల్లేవని, ఆస్పత్రులు, హాస్టళ్లు, ఆలయాలకు కొరత రాకుండా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. గ్యాస్ సరఫరా అంశంపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో గ్యాస్ సరఫరా విషయంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆర్టీజీఎస్ నుంచి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేవైసీ, ఓటీపీల ద్వారా సిలిండర్ల డైవర్షన్ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్ లభ్యత పెరిగేలా చూడాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఉత్పత్తి పెంపు, మెరుగైన పంపిణీ జరిగేలా చూడాలని సమీక్షకు హాజరైన సీఎస్ సాయిప్రసాద్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు, గెయిల్, ఓఎన్జీసీ ప్రతినిధులకు సూచించారు.

మిగతా 2 లో



## ఉగాది కానుకగా ‘దివ్యాంగ శక్తి’

- ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- స్త్రీ శక్తి స్ఫూర్తితో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం..
- సహాయకులకు 50 శాతం రాయితీ

2

## ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుభవార్త

- వడ్డీలో 50శాతం రాయితీ కల్పించిన ఏపీ ప్రభుత్వం

3






## ఐసిస్‌తో సంబంధాలు

- మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్

02

## 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

- ఏపీఈడీబీ కార్యాలయ ప్రారంభోత్సవంలో లోకేశ్

**మంగళగిరి, మార్చి 17(మనసులో మాట)::** రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే మన ఏకైక లక్ష్యం కావాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆమేరకు పరిశ్రమల స్థాపన ద్వారా ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. మంగళగిరి సమీపంలోని చినకాకానిలో మయూరి టెక్ పార్క్ భవనంలో ఏర్పాటుచేసిన ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడి ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం ఏపీఈడీబీని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం 20 నెలల కాలంలోనే పెద్దఎత్తున పెట్టుబడులు సాధించిందని లోకేశ్ అన్నారు. దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వచ్చాయని చెప్పారు. గూగుల్, ఆర్సెలార్ మిత్తల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీని ఎంచుకున్నాయన్నారు. ఇప్పుడు వేగాన్ని మరింత పెంచాల్సిన అవసరముందని చెప్పారు. ఉద్యోగాల

మిగతా 2 లో





## గుండె ధైర్యం వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

- విలువలు, విశ్వసనీయత మీద పుట్టిన వైఎస్సార్‌సీపీ
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కూటమి
- మనం మంచి చేశాం కనకనే ప్రతి ఇంట్లో పాలనపై చర్చ
- ఇక మిగిలి ఉన్నది రెండేళ్లే...చివరి ఏడాది ఎన్నికలు
- మధ్యలో నా పాదయాత్రతో ప్రజల్లో చైతన్యం తెస్తా
- మరింత పట్టుదలగా మనం ప్రజల్లోకి వెళ్లగలగాలి
- ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్

2



## సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌తో మత్స్యకారులకు మేలు

- స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు
- కలెక్టరేట్ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

3

జువ్వలదిన్నెలో ఏర్పడుతున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్ మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.2500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు.

## వివేకా హత్యకేసును తప్పుదారి పట్టించే యత్నం

- హత్యకేసు నిందితులతో మీడియా సమావేశాలా?
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్

3



## ఎంపీ పుట్టా మహేశ్‌పై చర్యలేవీ

ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు
మండిపడ్డ వైసీపీ అధినేత జగన్



# ఉగాది కానుకగా 'దివ్యాంగ శక్తి'

**నినేడు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**

**స్త్రీ శక్తి స్ఫూర్తితో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం..**

**సహాయకులకు 50 శాతం రాయితీ**

**అమరావతి, మార్చి 17(మనసులో మాట):** రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించే 'స్త్రీ శక్తి' పథకం ఘనవిజయం సాధించడంతో, అదే స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కోసం 'దివ్యాంగ శక్తి' పథకానికి శ్రీకారం చుట్టింది. ఉగాది పండుగ కానుకగా ఈ సరికొత్త పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం మంగళగిరిలో లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ తదితరులు పాల్గొననున్నారు. పథకం ప్రారంభం అనంతరం ముఖ్యమంత్రి మరియు ఇతర నేతలు దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించి, అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందులో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 11.16 లక్షల మంది దివ్యాంగులకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుంది. 40 శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వారికి ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం వర్తిస్తుంది. కేవలం దివ్యాంగులకే కాకుండా, వారి వెంట వచ్చే సహాయకులకు (ఎవశ్రీజూవతీం) టికెట్ ధరకు 50 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తం 4 నుంచి 21 రకాల వైకల్యాలు ఉన్న వర్గాల వారందరికీ ఈ పథకాన్ని విస్తరించారు. దీనివల్ల దాదాపు 12.76 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని అంచనా. ఇప్పటికే అమలవుతున్న స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటివరకు 52 కోట్లకు పైగా మహిళలు ప్రయాణించగా, ప్రభుత్వం రూ. 1,826 కోట్లు భరించింది. ఇప్పుడు దివ్యాంగ శక్తి పథకం అమలు కోసం ఏటా రూ. 207 కోట్లను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించనుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ బుధవారం స్థానిక ఎమ్మెల్యేలు ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. గతంలో డిసెంబర్ 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, ఉగాది పండుగ ముందే ఈ పథకాన్ని అమలులోకి తీసుకురావడంపై దివ్యాంగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. స్త్రీ శక్తి బస్సుల్లోనే దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించడం ద్వారా సామాజిక భద్రతలో రాష్ట్రం మరో అడుగు ముందుకు వేసిందని ప్రభుత్వం పేర్కొంది.




# 20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి


కల్పనే సింగిల్ ఎజెండాగా ఉండాలని మంత్రి సూచించారు. నూతన పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రాజెక్టుల గ్రౌండింగ్ మన ప్రధాన లక్ష్యం కావాలని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంటీ కృష్ణబాబు, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్, ఏపీఈడీబీ సీఈవో సాయికాంత్ వర్మ, ఏపీఐఐసీ వైస్ ఛైర్మన్, ఎండీ అభిషిక్త్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో నాసిరకం భోజనం

**ఆరోపణలు రావడంతో లోకేశ్ ఆకస్మిక తనిఖీ**

**విజయవాడ, మార్చి 17(మనసులో మాట):** మైలవరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం అంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో తారక రామానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వడ్డిస్తున్న భోజనంపై విద్యార్థులను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. 'భోజనం రోజూ బాగోవడం లేదా? ఆ ఒక్క రోజే బాగోలేదా?' అంటూ విద్యార్థులను ఈ సందర్భంగా ప్రశ్నించారు. పాఠశాలలో భోజనం బాగుంటుందంటూ మంత్రికి బదులిచ్చారు విద్యార్థులు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. ఆ తర్వాత సమీపంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రాన్ని సైతం ఆయన సందర్శించారు. అందులోని చిన్న పిల్లలతో లోకేశ్ ముచ్చటించారు. ఆ తర్వాత పాఠశాల స్థితిగతులపై మైలవరం ఎంఈవో, హెడ్‌మాస్టర్‌తో లోకేశ్ మాట్లాడారు. ఆ క్రమంలో తనతో పాటు తెచ్చిన నివేదికపై ఎంఈఓతో లోకేశ్ చర్చించినట్లు తెలుస్తోంది. న్నతాధికారులు, పార్టీ శ్రేణులుకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రి లోకేశ్ ఈ పాఠశాలను సందర్శించారు. లోకేశ్ పర్యటనపై మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్‌కూ ఎలాంటి సమాచారం అందలేదని తెలుస్తోంది. మంత్రి లోకేశ్ రాకను తెలుసుకున్న విద్యా శాఖ అధికారులు మైలవరానికి పరుగులు తీశారు.





# రాష్ట్రంలో 14వేల టన్నుల ఎల్పీజీ గ్యాస్

మొదటి పేజీ తరువాయి

సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాలని.. కేజీ బేసిన్ గ్యాస్‌ను పైప్డ్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగం గరిష్ఠంగా పెంచాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు. మరో 15 రోజులకు అవసరమైన గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ప్రజలు ప్యానిక్ అవకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈకేవైసీ, ఓటీపీల ద్వారా గ్యాస్ సిలిండర్ల డైవర్షన్ లేకుండా పర్యవేక్షించాలని సూచించారు. ప్రజలకు తక్షణం అందుబాటులోకి వచ్చే ప్రత్యామ్నాయాలపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో ఇండక్షన్ స్టవ్స్ స్టాక్‌లను పెంచేలా చూడాలని ఆదేశించారు. గ్యాస్ కంపెనీలు స్వల్పకాలికంగా ఉత్పత్తి పెంచి, మెరుగైన పంపిణీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ÷ూష్ట్రంలో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపీలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును పైప్డ్ నెట్వర్క్ ద్వారా ప్రజలకు సరఫరా చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీఎన్జీ, పీఎన్జీల వినియోగాన్ని గరిష్ఠంగా పెంచే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సమావేశానంతరం ఏపీలో ఎక్కడా గ్యాస్




కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. 100 శాతం ప్రజలకు గ్యాస్ అందిస్తున్నామన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. గతంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఉండేవారని.. ఇప్పుడు వారు ఆరోగ్యశాఖ కిందకు మారినట్లు చెప్పారు. ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత ఉందని... వాటిని త్వరలో భర్తీ చేస్తామని ప్రకటించారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. ఎక్కడ అక్రమ రవాణా జరుగుతున్నా ఉక్కుపాదం మోపుతున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు.రాష్ట్రంలో గృహావసరాల కోసం ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని నాదెండ్ల మనోహర్ తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు సగటుగా 2.81 లక్షల గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌లు జరుగుతాయని, ప్రస్తుతం రోజుకు సుమారు 2.92 లక్షల సిలిండర్లను సరఫరా చేస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మి ఒక్కసారిగా ఎక్కువ బుకింగ్‌లు చేయడంతో సర్వర్లు జామ్ అవుతున్నాయని చెప్పారు. కేంద్ర నిబంధనల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల తర్వాతే మరో గ్యాస్ సిలిండర్ బుకింగ్‌కు అనుమతి ఉంటుందని గుర్తు చేశారు.బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఓటీపీ ద్వారా మాత్రమే గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే విధానం అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఇప్పటికే 616 కేసులు నమోదు చేసి 2500 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి గ్యాస్ సరఫరాను పర్యవేక్షిస్తున్నామని, ప్రజలు యాప్, ఫోన్ కాల్, వాట్సాప్, మిస్డ్ కాల్ లేదా ఆన్‌లైన్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని మంత్రి సూచించారు. ÷-రజలు పుకార్లను నమ్మకుండా సంయమనం పాటించాలని, రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా సజావుగా కొనసాగుతోందని మంత్రి స్పష్టం చేశారు.

# గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్

**ఒంగోలు పార్టీ కేడర్‌తో సమావేశంలో వైఎస్ జగన్**

**అమరావతి, మార్చి 17(మనసులో మాట):** గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ జగన్‌ది మాత్రమే కాదు.. వైఎస్సార్‌సీపీ అంతా కలిసి కట్టుగా నిర్మించుకున్నాం. వైఎస్సార్‌సీపీ విలువలు,విశ్వసనీయత మీద పుట్టింది. అదే పునాదుల మీద కొనసాగుతోంది. గుండె ధైర్యం.. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ మార్క్.మనం మంచి చేశాం. కాబట్టే ప్రజలతో కలిసి ముందుకెళ్తున్నాం. మన పాలనకు, బాబు పాలనకు మధ్య తేడా ప్రజలు గుర్తించారు. ప్రతి ఇంట్లోనూ ఇదే చర్చ జరుగుతోందన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కేడర్‌తో వైఎస్ జగన్ భేటీ అయ్యారు. వైఎస్ జగన్ భేటీలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు ఇంఛార్జి చుండూరు రవి, పార్లమెంటు ఇంఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. అవినీతి కోసం మాత్రమే వాళ్లు అధికారంలో ఉన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేశారు. మనం అధికారంలోకి వచ్చినప్పుడు అద్భుతమైన రాష్ట్రాన్ని ఇచ్చినట్లు బాబు బిల్డప్. వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసి అప్పగించారు. కేవలంలో ఖజానాలో రూ.100కోట్లు మాత్రమే ఉంచారు. తర్వాత కోవిడ్ లాంటి కష్టాలు ఎదుర్కొన్నాం. ఆర్థికంగా ఒత్తిళ్ల మధ్య మన పరిపాలన సాగింది. ప్రజలకు ఇచ్చిన మాటను ఎప్పుడూ వదిలి పెట్టలేదు. దేశ చరిత్రలో జరగని విధంగా హామీలు అమలు చేశాం. ముందుగానే క్యాలండర్ ఇచ్చి హామీలను అమలు చేశాం. బడ్జెట్‌లో క్యాలెండర్ పెట్టి పథకాలు అమలు చేశాం. పేదలను, మధ్యతరగతి ప్రజలను ఆదుకున్నాం. మన హయాంలో రూ.3.31లక్షల కోట్లు అప్పు చేస్తే రూ.2.7లక్షల కోట్లు అక్కచెల్లెమ్మల ఖాతాలో వేశాం. రెండేళ్లకే చంద్రబాబు కమిటెడ్ అప్పులు.. గ్రాస్ అప్పులు రెండేళ్లకే రూ.3.30లక్షల కోట్లు దాటాయి. చంద్రబాబు హామీలు మోసాలుగా తేలిపాయా యని వైఎస్ జగన్ అన్నారు. 'మన పథకాలన్నీ చంద్రబాబు నాయుడు రద్దు చేశారు. ఈ డబ్బులన్నీ ఎవరి జేబులోకి వెళ్లిపోయాయి. జగన్ ఏం చేయగలిగాడు. బాబు ఎందుకు చేయలేక పోతున్నాడని చర్చిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా మనం పథకాలు అమలు చేశాం. ఇప్పుడు దోచుకో.. పంచుకో.. తినుకో.. ఇదే కొనసాగుతుందని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం



లేదు. అమరావతి పనుల్లో తీవ్రమైన అవినీతి. భూములను శెనక్కాయలకు, బెల్లానికి ఇచ్చేస్తున్నారు. ఏపీలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డారు. పార్లమెంటు చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ ఆయనే. ఇలాంటి వాటిపట్ల చంద్రబాబు వ్యవహరించిన తీరు దారుణం అన్నారు. చంద్రబాబు ఒక పాలకుడిగా వ్యవహరించడం లేదు. మోసం చేశారని బాధితురాలు సీఎంకు ఫిర్యాదు చేస్తే కమిటీలు వేస్తామంటున్నారు. ఆదిమూలం మహిళపై లైంగిక దాడి చేస్తే పంచాయతీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపల్‌పై వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై నో యాక్షన్. మహిళలకు అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్ అన్నారు. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీద నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీద కూడా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా నో యాక్షన్. ఆదినారాయణరెడ్డి కొడుకు డ్రగ్స్‌తో పట్టుబడితే నో యాక్షన్. తన కొడుకు స్విమ్మింగ్? పూల్స్? వద్ద తాగుతు, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్ చేస్తే నో యాక్షన్ అన్నారు. తన బావమరిది మహిళలపై నీచంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని బాబు అన్నారు. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు. చంద్రబాబుకు ఇక మిగిలింది రెండేళ్లే. చివరి ఏడాది ఎలాగూ ఎన్నికలున్నాయి. మధ్యలో నా పాదయాత్ర కూడా ఉంటుంది. జగన్ 2.0 లో కార్యకర్తలకు పెద్దపీట. కార్యకర్తల ద్వారానే ప్రజలకు మరింత మంచి' అని అన్నారు. ఒంగోలు నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై కీలక సూచనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నియోజకవర్గాల వారీగా ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామని, వాటిలో భాగంగానే ఈ సమావేశం నిర్వహించామని తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఒక్కరిది కాదని, వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా నిర్మించిన పార్టీ అని జగన్ పేర్కొన్నారు. పార్టీ విలువలు, విశ్వసనీయత మీదే పుట్టిందని.. అదే పునాదులపై ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. గత 16 సంవత్సరాల్లో ప్రజల తరఫున అనేక పోరాటాలు చేశామని, గుండెధైర్యమే వైసీపీ ట్రేడ్ మార్క్ అని వైఎస్ జగన్ చెప్పారు. తమ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను తుచా తప్పకుండా అమలు చేశామని తెలిపారు. మేనిఫెస్టోను కచ్చితంగా పాటిస్తూ ముందుగానే క్యాలెండర్ ప్రకటించి పథకాలను అమలు చేసినట్టు గుర్తు చేశారు. ఆర్థిక ఒత్తిళ్లు, కోవిడ్ వంటి సంక్షోభాల మధ్య కూడా పేదలు, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచామన్నారు. వైసీపీ హయాంలో తీసుకున్న అప్పుల్లో పెద్ద భాగాన్ని నేరుగా ప్రజల ఖాతాల్లోకి పంపించామని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మీద విమర్శలు చేస్తూ.. సీఎంచంద్రబాబు హామీలను నిలబెట్టుకోలేకపోయారని వైఎస్ జగన్ ఆరోపించారు. రెండేళ్లలోనే భారీ అప్పులు చేసినప్పటికీ ప్రజలకు ఉపయోగపడే విధంగా వాటిని వినియోగించలేదని విమర్శించారు. తమ ప్రభుత్వ పథకాలను రద్దు చేసి ప్రజలను నిరాశపరిచారని అన్నారు. అమరావతి అభివృద్ధి పనుల్లో అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడం లేదని, దోపిడీ పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. చుండూరు రవికి పూర్తి మద్దతు ఉంటుందని, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలతో దగ్గరగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు సాగాలని జగన్ సూచించారు.

# డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ

**పార్లమెంట్ చరిత్రలోనే ఇదే తొలిసారి**

**అయినా ఎంపీ పుట్టా మహేశ్‌పై చర్యలేవీ**


**ఇదే చంద్రబాబు తరహా రాజకీయాలు**

**మండిపడ్డ వైసీపీ అధినేత జగన్**

**అమరావతి, మార్చి 17:** పార్లమెంట్ చరిత్రలో డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడ్డ ఎంపీ పుట్టా మహేషే అని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారం పుట్టా మహేష్‌తో మొదలై, పుట్టా మహేష్‌తో ఆగిపోలేదన్నారు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం అని మండిపడ్డారు. తప్పు చేసిన వారిపట్ల చంద్రబాబు చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో విచ్చలవిడిగా డ్రగ్స్ దందాలు జరుగుతున్నాయని ఫైర్ అయ్యారు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, మోసాలపై కమిటీలు వేసి కాలయాపన చేస్తోందన్నారు. కోనేటి ఆదిమూలం మహిళపై లైంగిక దాడిచేస్తే చర్యలు లేవని వైఎస్ జగన్ మండిపడ్డారు. 'డ్రగ్స్ తీసుకుంటూ టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ పట్టుబడ్డాడు. ఇలాంటి వాటిపట్ల సీఎం చంద్రబాబు వ్యవరించిన తీరు అత్యంత దారుణం. ఒక పాలకుడిగా



ఆయన వ్యవహరించలేదు. తప్పు చేసిన వారిపట్ల తయన చర్యలు తీసుకోలేదు. అందుకనే విచ్చలవిడిగా జరుగుతున్నాయి. అత్యాచారాం చేశారని, ఆపై మోసం చేశారని బాధితురాలు స్వయంగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తే.. దానిపై కమిటీలు అంట. కోనేటి ఆదిమూలం మహిళ మీద దారుణమైన లైంగిక దాడిచేస్తే పంచాయితీ చేశారు. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. మహిళలతో అశ్లీల వీడియో కాల్స్ చేసిన గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే మీద నో యాక్షన్. చివరకు మంత్రి సంధ్యారాణి పీఏ మీదా నో యాక్షన్. ప్రస్తుత టీటీడీ ఛైర్మన్ మీదా నో యాక్షన్. వీడియో, ఫొటోలతో పట్టుబడ్డా.. నో యాక్షన్' అంటూ వైఎస్ జగన్ ÷ర్ అయ్యారు. 'ఆదినారాయణ రెడ్డి కొడుకు డ్రగ్స్ తీసుకుంటూ పట్టుబడితే నో యాక్షన్. ఇలాంటి వాటికి వత్తాసు పలికే భావన సీఎం చంద్రబాబుకు ఉంది కాబట్టే.. ఇలాంటివి జరుగుతున్నాయి. తన కొడుకు స్విమ్మింగ్ పూల్స్ వద్ద తాగుతూ, తూలుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చూస్తే నో యాక్షన్. తన బావమరిది అమ్మాయిలకు ముద్దైనా పెట్టాలి, కడుపైనా చేయాలని అని బహిరంగంగా మాట్లాడితే నో యాక్షన్. చిన్నప్పుడు తాను ఇంతకంటే ఎక్కువే చేశానని చంద్రబాబు అన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. కేజీబీవీ మహిళా ప్రిన్సిపాల్ మీద వేధింపులకు పాల్పడ్డ ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మీద నో యాక్షన్. లాగి చెంపకేసి ఒక్కటి పీకాల్సింది పోయి... చేసిందేమిటన్నారు. చంద్రబాబు మైండ్ సెట్ ఎలాంటిదో ఇవన్నీ సూచిస్తున్నాయి. వీళ్లకు ప్రజలకు మంచి చేయాలన్న మైండ్ సెట్ లేదు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.




# ఆస్తిపన్ను చెల్లింపుదారులకు శుభవార్త

**వడ్డీలో 50శాతం రాయితీ కల్పించిన ఏపీ ప్రభుత్వం**

**అమరావతి, మార్చి 17:** మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఆస్తి పన్ను బకాయిలు పెరిగిపోయిన నేపథ్యంలో బకాయిల వసూలు కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ జీవో నెంబర్ 58ని విడుదల చేశారు. దీని ప్రకారం ఈ నెల 31 తేదీలోగా బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతం రాయితీ లభిస్తుంది. ఇప్పటికే వడ్డీతో కలిపి పన్ను చెల్లించిన వారికి తదుపరి బిల్లులో ఆ మినహాయింపు మొత్తాన్ని సర్దుబాటు చేసి ఇస్తామని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు.


# అరటి ఎగుమతులు ధమాల్

**దేశయంగా ముందుకు రాని కొనుగోలుదారులు**

**ఆందోళనలో జిల్లా అరటి రైతులు**



**అనంతపురం, మార్చి 17 :** పశ్చిమ దేశాల్లో కొనసాగుతున్న యుద్ధంతో అరటి రైతులు కుదేలవుతున్నారు. ఎగుములు ఆగి, ధరలు పడివపోవడంతో పలు చోట్ల అరటి రైతులు ఆందోళనకు దిగారు. తమ పంటలను కొనుగోలు చేయాలని కోరుతున్నారు. 20 రోజుల క్రితం ఆశాజనకంగా ఉన్న అరటి ధర ఉన్నఫలంగా పడిపోయింది. కిలో రూ.5కు కూడా కొనే నాథుడు కరువవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అరటి సాగు గణనీయంగా ఉంది. తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దాదాపు 47 వేల ఎకరాల్లో ఈ ఏడాది అరటి సాగైంది. ఫిబ్రవరిలో కిలో రూ.22 నుంచి రూ.24 వరకు ధర పలికింది. వారం రోజులుగా అరటిపై యుద్ధం నీడలు కమ్ముకోవడంతో ఎగుమతి పూర్తిగా ఆగిపోయింది. కొనేందుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతదో తోటల్లోనే అరటి కాయలు వాడిపోతున్నాయి. ఎకరా విస్తీర్ణంలో అరటి సాగు, కోత కూలి కలుపుకొని సుమారు రూ.1.40 లక్షల వరకూ ఖర్చవుతోంది. ఎకరాకు 20 టన్నులు దిగుబడి వస్తోంది. ప్రస్తుత ధర ప్రకారం ఎకరాకు లక్ష రూపాయలు మాత్రమే వచ్చే అవకాశముంది. అది కూడా మొదటి పంట అయితేనే ఈ ధర వస్తుంది. పంట కొనుగోలుకు వ్యాపారి వస్తేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే ఎండ తీవ్రతకు నెల రోజుల్లో గెలలు నేలకొరిగే ప్రమాదం ఉంది. రెండు, మూడో ఏడాది పంటను అడిగేవారు కరువయ్యాడు. మైక్రోసన్ అరటిని సాగు చేసిన వారి పొలాల్లో పంట కోత దశలో నాణ్యతగా ఉంది. ఎకరాకు 20 టన్నుల దిగుబడి వచ్చింది. వారం ముందు వరకు వ్యాపారులు టన్ను రూ.20 వేలకు అడిగారు. ప్రస్తుతం వారికి ఫోన్ చేస్తే ధర పడిపోయిందంటూ టన్ను ఐదు వేల రూపాయలకు కూడా కొనుగోలుకు ముందుకురావడం లేదని వాపోతున్నారు. పంట కోయకపోతే గెలలు నేలకొరిగిపోయి పూర్తిగా నష్టపోతామని అంటున్నారు. ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.



# ఆర్డీటీ లైసెన్స్ పునరుద్ధరణకు చొరవచూపండి

**న్యూఢిల్లీ, మార్చి 16(మనసులో మాట):** అనంతపురం జిల్లాకు చెందిన రూరల్ డెవల్‌పమెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ)కు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద లైసెన్స్ పునరుద్ధరణకు చొరవ తీసుకోవాలని కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకి రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. హిందూపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌తో



కలిసి సోమవారం పార్లమెంటులో రామ్మోహన్‌తో మంత్రి పయ్యావుల భేటీ అయ్యారు. ఆర్డీటీ కార్యకలపాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఎదురవుతున్న పరిపాలనా అడ్డంకులపై చర్చించారు. ప్రస్తుతం కొన్ని పరిపాలనా సమస్యల కారణంగా ట్రస్ట్ కార్యకలాపాలు ప్రభావితమవుతున్న నేపథ్యంలో ఆ అడ్డంకులను త్వరితగతిన తొలగించేందుకు కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అందాల్సిన ఆర్థిక సహాయం, రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల కోసం కేంద్ర ఆర్థిక శాఖలోని వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులతోనూ పయ్యావుల భేటీ అయ్యారు.

# వివేకా హత్యకేసును తప్పదారి పట్టించే యత్నం

- హత్యకేసు నిందితులతో మీడియా సమావేశాలా?
- జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, మార్చి 17:** మంత్రి వివేకా హత్య కేసులో నిందితులను కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. సొంత బాబాయ్ హత్య కేసులో నిందితులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం జగన్ దిగజారుడు తనానికి పరాకాష్ఠ అని విమర్శించారు. 'అబద్ధాల పునాదుల మీద పుట్టిన పార్టీ వైసీపీ.. బాబాయ్‌ను చంపింది ఎవరో తెలిసినా సాక్ష్యాలు చెరిపేయడమే మీ పనా?' అని ప్రశ్నించారు. ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. గుండెపోటు థియరీ నుంచి గొడ్డలి వేటు వరకు గంటకో మాట మార్చిన 'జగన్నాటకం' గూగుల్ టేకవుట్‌లో బట్టబయలైందని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ విచారణ వద్దని, నిందితుడు అవినాశ్ రెడ్డిని కాపాడటానికి బాంబులతో బెదిరిస్తున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం కోసం పోరాడుతున్న వివేకా కన్నకూతురు సునీతమ్మపై అక్రమ సంబంధాల ముద్ర వేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీబీఐ కావాలన్నారు.. అధికారంలోకి వచ్చాక సీబీఐని తరిమికొట్టారు, ఇదేనా మీ నీతి' అంటూ మంత్రి విరుచుకుపడ్డారు. త్య జరిగిన చోట రక్తపు మరకలను చెరిపేసి ఇంకో రకంగా చిత్రీకరించిన చరిత్ర జగన్ మోహన్ రెడ్డిది అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. 'హత్య కేసును ఆస్తి, అక్రమ సంబంధాల వైపు తిప్పడం.. అసలు నిందితులను కాపాడేందుకేనా ఈ డ్రామా?' అని ప్రశ్నించారు. 15 రోజులకోసారి పక్క రాష్ట్రాల నుంచి వచ్చి 3 గంటలు అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మే రోజులు పోయాయని అన్నారు. ప్రజల మీద, కుటుంబ సభ్యుల మీద ప్రేమ లేదని.. కేవలం దోచుకున్న వారిని కాపాడటమే వైసీపీ ఏకైక అజెండా అని ఆరోపించారు. ఒక ఆడబిడ్డ న్యాయం కోసం ఏడుస్తుంటే ఆమెపైనే నిందలు వేయడం రాజకీయ సంస్కృతా అని నిలదీశారు. 'అరాచకాలు, హత్యలు చేశారు కాబట్టే ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారు.. అది గుర్తుపెట్టుకోండి' అంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ హెచ్చరించారు. అందుకే మాజీ మంత్రి వివేకా హత్య కేసులో నిజాలు దాచేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని మంత్రి అనగాని ఆరోపించారు. చెల్లెలు సునీత బాధపై స్పందించకుండా నిందితుడితో ప్రెస్‌మీట్ పెట్టిస్తారా?అని ప్రశ్నించారు. బాబాయ్‌ను చంపిన వారిని కాపాడేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారన్నారు. ఐదేళ్లు సీఎంగా ఉన్నప్పుడు వాస్తవాలను జగన్ ఏమార్చారు. అధికారం పోయాక బలప్రదర్శన చేస్తున్నారే తప్ప ప్రజలపై ప్రేమ లేదు. జగన్ చెప్పే అబద్ధాలు నమ్మకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు' అని అనగాని అన్నారు. ఈ సందర్భంగా వివేకా హత్యపై జగన్, అవినాష్‌రెడ్డి వ్యాఖ్యల వీడియోలు ప్రదర్శించారు.

# పశువుల కాపరులకు చేయూత

- జాతీయ పశువ్యాది నియంత్రణా పథకం
- ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- ఇంటి వద్దనే ఏప్రిల్ 29వ తేదీ వరకూ టీకాలు కార్యక్రమం..
- పశుసంవర్ధక శాఖ సంచాలకులు దామోదర్ నాయుడు..

**విజయవాడ, మార్చి 17:** 4 నెలల వయస్సు గల ఆవు, గేదె జాతి పశువుల్లో , దూడల్లో గాలి కుంటు వ్యాధి సోకుతుందని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు చెప్పారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను ప్రతీ రోజూ మొదలుకుని ఏప్రిల్ 29వ తేదీ వరకూ పశుపోషకుల ఇంటి వద్దనే పశు సంవర్ధక శాఖ సిబ్బంది అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని పశువుల కాపరులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని చెప్పారు. గాలికుంటు వ్యాధి సోకడానికి ప్రధాన కారణం పశువులు బలహీనంగా ఉండడం, రోగనిరోధకశక్తి తక్కువుగా ఉండడం అన్నారు. సంకరజాతి పశువుల్లో వ్యాధి ఎక్కువ అన్నారు. గాలికుంటు వైరస్ ద్వారా సోకుతుందన్నారు. దీనికి నివారణెళి మార్గం అన్నారు. గాలికుంటు తీవ్రత వలన పాలదిగుబడి తగ్గడం, పశువులు ఈసుకు పోవడం, ఎద్దులు గిత్తలలో పొలం పనుల సామర్థ్యం తగ్గడం, దూడలు అయితే మరణించడం జరుగుతుందని చెప్పారు. దీనివలన పశు పోషకులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. గాలికుంటు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని జిల్లాలకు 83 లక్షల 69 వేల 700 డోసుల వ్యాధి నిరోధక టీకాలను పంపిణీకి సిద్ధం చేశామని చెప్పారు. పశుపోషకులు ఇంటివద్దనే అందించే టీకాల ప్రక్రియను పశువుల కాపరులు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. పశువులలో పుండ్లు ఏర్పడడం, కలుషిత మేత, దాణా, నీరు సేవించడం, మలమూత్ర వ్యాధుల వలన గాలికుంటు వ్యాధి వైరస్ వ్యాపిస్తుందని సంచాలకులు వివరించారు. వ్యాధి నిర్ధారణకు ప్రధానమైన అంశాలు పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 104-106 డిగ్రీల ఫారెన్ హీట్ ఉండడం. నోటిలో బొబ్బలు రావడం, అవి 24 గంటలు చితికి పోవడం, దీనివలన నొప్పి ఏర్పడడం, మేత తినలేకపోవడం, నోటి నుండి చొంగ కారుతుందని చెప్పారు. అంతే కాకుండా గిట్టల మధ్య బొబ్బల వలన పశువులు నడవలేవన్నారు. పొదుగు వ్యాధి రావడం, బ్యాక్టీరియా బొబ్బలను ఆశించడం, చీముతో కూడిన పుండ్లు తయారై పశువులు అస్వస్థతకు లోను అవుతాయని చెప్పారు. చూడి ఉన్న పశువుల్లో గాలికుంటు వలన గర్భస్రావం కలుగుతుందని చెప్పారు. సంకర జాతి పశువుల్లో రక్తహీనత శ్వాస పీల్చుకోలేక పోవడం, రొప్పు రావడం, ఎండ వాతావరణ వేడి తట్టుకోలేక పోవడం వంటి లక్షణాల వలన పశువులు నీరసిస్తాయని చెప్పారు. సంకర జాతి పశువుల్లో ఎక్కువుగా కనపడే గాలికుంటు వ్యాధి దుష్ఫలితాల నుండి పశువులు కోలుకోవడానికి సుమారు 6 మాసాల సమయం పడుతుందని చెప్పారు. 4 నెలల వయస్సు పైబడిన ఆవు గేదె జాతి పశువులకు మరియు దూడలకు ఏప్రిల్ 29వ తేదీ వరకూ ఉచితంగా టీకాలు అందిస్తామన్నారు. ప్రధానమైన మొదటి రౌండ్ లో 30 రోజులు, రెండవ రౌండ్ లో మిగిలిన పశువులకు టీకాలు వేస్తామన్నారు. తదుపరి 15 రోజుల పాటు బూస్టర్ డోస్ అందిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పశువుల కాపరుల ఇంటి వద్దనే ఉచితంగా టీకాలు ఇస్తారని చెప్పారు. కావున పశుపోషకులు అందరూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ విలువైన పశువులను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు టి. దామోదర్ నాయుడు తమ ప్రకటనలో పశువుల కాపరులకు విజ్ఞప్తి చేశారు.

# సాగర్ డిఫెన్స్ ప్రాజెక్టతో మత్స్యకారులకు మేలు

- సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌తో మత్స్యకారులకు మేలు
- స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు
- మత్స్యకారులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- కలెక్టరేట్ సమావేంలో మంత్రి కొల్లు రవీంద్ర



**నెల్లూరు, మార్చి 17:** జువ్వలదిన్నెలో ఏర్పడుతున్న సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్ మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు రూ.2500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానికంగా పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. మత్స్యకారులు కేవలం వృత్తిపరంగా మాత్రమే కాకుండా పారిశ్రామికవేత్తలుగానూ ఎదగాలని సూచించారు. ఇందుకోసం 125 ఎకరాల భూమిని అందుబాటులో ఉంచి పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వెల్లడించారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ అభివృద్ధిపై కలెక్టరేట్‌లో మత్స్యకార నేతలతో సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. ఈ సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, కళ్యాణ్ చక్రవర్తి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై మత్స్యకారులలో ఉన్న అనుమానాలను సమావేశంలో నివృత్తి చేసినట్లు మంత్రి తెలిపారు. మంచి ప్రాసెసింగ్ చేసిన చేపల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, దీని ద్వారా మత్స్యకారులకు అధిక లాభాలు చేకూరుతాయని చెప్పారు. సాగర్ డిఫెన్స్ కంపెనీ కొంత భూమినే కోరిందని, మిగిలిన ప్రాంతం మత్స్యకారుల ప్రయోజనాలకే వినియోగిస్తామని స్పష్టం చేశారు. అదే సమయంలో వైసీపీ నేతలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నారని మంత్రి విమర్శించారు. పరిశ్రమలు రావడం వల్ల యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, గత పాలనలో పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో పరిశ్రమలు తిరిగి వస్తున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంకటకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్‌లు.. మత్స్యకారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన గొప్ప కానుక అని అన్నారు. హార్బర్‌లకు అనుసంధానంగా పరిశ్రమలు రావాలని ప్రస్తుత ప్రభుత్వ ఆలోచన అని తెలిపారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌ను తీసుకువచ్చినందుకు చంద్రబాబు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. కృష్ణపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయంగా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ఏర్పడిందని, దీనికి అనుబంధంగా అనేక పరిశ్రమలు రానున్నాయని చెప్పారు. త్వరలోనే ఈ హార్బర్ పూర్తిస్థాయిలో మత్స్యకారులకు అందుబాటులోకి రానుందని తెలిపారు. వైసీపీ ఆరోపిస్తున్నట్లు హార్బర్‌ను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. మత్స్యకారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, వారికి న్యాయం జరిగేలా చూస్తామని నాయకులు హామీ ఇచ్చారు.

# రైతులను ఆదుకోవడంలో కూటమి విఫలం

**మండిపడ్డ మాజీమంత్రి సాకే శైలజానాథ్**




**అమరావతి, మార్చి 17:** ఏపీలో రైతులు, రైతు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వ్యవసాయం దండగ అనే రీతిలోనే ఇప్పటికీ చంద్రబాబు ఆలోచిస్తున్నారంటూ దుయ్యబట్టారు. సగటున రోజుకు 8 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ రంగంలో ఉన్న సంక్షోభమే ఈ ఆత్మహత్యలకు కారణం. విపత్తులు వచ్చినా ప్రభుత్వం మాటలు తప్ప.. లబ్ధి చేకూర్చడం లేదు. ఎన్నికల ముందు రైతులకు, రైతు కూలీలకు అనేక హామీలు ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొర మినహా ఏ పంటకు గిట్టుబాటు ధరలు లేవని అన్నారు. మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా ధరల స్థిరీకరణ నిధికి రూ.3,000 కోట్లు కూడా కేటాయించలేదు. వైఎస్సార్, జగన్ పరిపాలనలో రైతే రాజు అన్నట్లుగా పరిస్థితులు ఉండేవి. క్రాప్ ఇన్సూరెన్స్ డబ్బులు చెల్లించక రైతులు విపత్తులతో నష్టపోయారు. అన్నంపెట్టే రైతుల సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం వెంటనే స్పందించాలి. చిన్న, సన్నకారు రైతాంగాన్ని ఆదుకోవాలి' అని సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు.



సంపాదకీయం

# సమాజానికి చీడలా.. డ్రగ్స్ మహమ్మారి!

ఉడ్తా పంజాబ్... పేరుతో ఆనాడు గోలగోల జరిగింది. పంజాబ్ మాదక ద్రవ్యాలకు నిలయంగా మారింది. అక్కడ యువత పెడదారి పడుతోందని దేశవ్యాప్తంగా ఆందోళన వెల్లువెత్తింది. దీనిపై సినిమాలు వచ్చాయి. ఇప్పుడు దేశంలో ఎక్కడో ఒకచోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి రవాణా, మాదక ద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి మత్తులో అనేకానేక హత్యాచారాలు జరిగాయి. ఇటీవల మదనపల్లెలో ఓ దుండగులు బాలికను హత్యాచారం చేసిన సంగతి చూశాం. మద్యం, మత్తు పదార్థాలు సమాజాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నా పాలకులు పట్టించు కోవడంలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. నిత్యం కాపలా కాసి పట్టుకుంటున్నా గంజాయి రవాణా ఆగడం లేదు. రేవ్ పార్టీలు, ఫామ్ హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రజాప్రతినిధులే డ్రగ్స్ స్వీకరిస్తే సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు. మొయినా బాద్ ఫామ్‌హౌజ్‌లో తెలంగాణ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేశ్‌లు పట్టుబడడం దారుణం కాక మరోటి కాదు. ఇలాంటి వారిని రాజకీయాల నుంచి తరిమేయాలి. ఇలాంటి వారిని ప్రజాజీవితానికి దూరం చేయాలి. ఇలాంటి వారి వల్లనే నేర సామ్రాజ్యం విస్తరిస్తుంది. డ్రగ్స్ ఎంతటి దారుణానికైనా తెగించేలా చేస్తుంది. ఎక్కడో యూరప్, ఆఫ్రికా దేశాల్లో ఉన్న ఈ దురలవాటు మెల్లగా మనదేశంలోకి అడుగుపెట్టి ఆందోళనకు గురి చేస్తోంది. మెక్సికోలో డ్రగ్స్ మాఫియా డాన్ ఎలా నేర సామ్రాజ్యాన్ని స్థాపించాడో ఇటీవలే చూశాం. అతడిని ఎన్‌కౌంటర్ చేశరు. అలాగే ఇక్కడి నేరాలను కూడా ఆదిలోనే అదుపు చేయకపోతే సమాజానికి క్యాన్సర్‌లా పట్టిపీడిస్తుంది. 1980లో ఎల్మెంచో కాలిఫోర్నియాలో హెరాయిన్ సరఫరా చేస్తూ పోలీసులకు దొరికాడు. కొంతకాలం జైలుశిక్ష కూడా అను భవించాడు. తిరిగి మెక్సికోకి వచ్చాక కొన్నాళ్లు పోలీసుగా పనిచేశాడు. ఆపై అన్ని మెళకువలు తెలుసుకున్నాకదాన్ని వదిలిపెట్టి 2009లో తన డ్రగ్ మాఫియాకు ప్రాణం పోసాడు. అనూహ్యంగా ఆ ముఠా 2015లో 20 మంది పోలీసుల్ని తలలు నరికి చంపేసింది. అప్పట్నించిమెంచో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ జాబితాలోకి చేరి పోయాడు. ఎల్మెంచో వద్దనున్న ఆయుధ సంపత్తి అలాంటిలాంటిది కాదు. సాయుధ వాహనాలు, రాకెట్ లాంఛర్లు, భారీ ఎత్తున ఆయుధాలను కూడా మెక్సికో సైన్యం స్వాధీన పరుచుకొంది. అతని ముఠాలో ఉన్న వాళ్లంతా కిరాయి హంతకులుగా పేరుపడిన వారే. తనకు ఎదురు తిరిగిన ప్రభుత్వాధికారుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేవాడు. ఈ ముఠా మెక్సికో సైన్యానికి సవాల్‌గా మారింది. అతడి నేర సామ్రాజ్యాన్ని పెంచిపోషించిన వారెవరో అందరికీ తెలుసు. ఇది ప్రపంచానికి ఓ గుణపాఠం కావాలి. తెలంగాణ మాజీ న క్సలైట్ నయీమ్‌ను పెంచి పోషించిందెవరో అందరికీ తెలుసు. ఇలా నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల సమాజం ఛిద్రం కాగలదని గుర్తించాలి. అందుకే నేర స్వభావం ఉన్న వారికి ఏ రూపంలోనూ సకహరించ కూడదు. భారాస మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పట్టుబడిన ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌తో పాటు అతని స్నేహితుడు నమిత్‌శర్మల మత్తు చరిత్ర కొత్త అనుమానాలు రేకెత్తిస్తోంది. మత్తు మందులు వాడే అలవాటు వీరికి గతంలోనూ ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ వాసి నమిత్‌శర్మ, ఏలూరు ఎంపీ మహేశ్‌ల నుంచి సేకరించిన నమూనాల్లో ఇతర మాదకద్రవ్యాల అవశేషాలు కూడా లభించడమే ఇందుకు కారణమని చెబుతున్నారు. వాస్తవానికి తాజా కేసు దర్యాప్తుతో దీనికి సంబంధం లేకపోయినప్పటికీ మత్తు మందుల సరఫరా మూలాలను గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్న ఉద్దేశంతోనే పోలీసులు పాత విషయాలనూ తవ్వితీయబోతున్నారు. పార్టీలో తాము డ్రగ్స్ వాడలేదని నిందితులు తొలుత బుకాయించినప్పటికీ పోలీసుల పరీక్షల్లో మొత్తం 11 మందిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ఇందులో నమిత్‌శర్మ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్, కొకైన్ ఆనవాళ్లు లభించాయి. పుట్టా మహేశ్ నుంచి సేకరించిన నమూనాల్లో యాంఫిటమిన్, మెథా యాంఫిటమిన్ ఆనవాళ్లు దొరికాయి. మిగతా నలుగురూ కొకైన్ వాడినట్లు తేలింది. పోలీసులు ప్రశ్నించినప్పుడు తాను సిమ్లా నుంచి కొకైన్ తీసుకొచ్చా నని బెంగళూరుకు చెందిన కౌషిక్ రవి వెల్లడించాడు. వారి సోదాల్లోనూ కొకైన్ మినహా ఇతరత్రా మత్తు మందులేవీ అక్కడ దొరకలేదు. కానీ, నమిత్‌శర్మ, పుట్టా మహేశ్‌ల నమూనాల్లో మాత్రం ఇతర మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభించాయి. వారిద్దరూ వీటిని శనివారం జరిగిన పార్టీలో తీసుకున్నారా...? అంతకు ముందే వాడారా..? అనే వివరాలన్నీ తదుపరి దర్యాప్తులో వెల్లడవుతాయని పోలీసులు చెబుతున్నారు. వీటన్నింటినీ పరిశీలిస్తే రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో చిక్కిన వారందరికీ కొంతకాలంగా మత్తుమందులు వాడే అలవాటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. పరీక్షలు చేసినపుడు ఆరుగురు డ్రగ్స్ వాడగా, అందులో ఐదుగురు కొకైన్ తీసుకున్నట్లు తేలింది. మొత్తంగా ఈ కేసుతో పాటు గతంలో పట్టుబడ్డ కేసులను కూడా విచారించాలి. అక్రమ సంపాదనకు అలవాటు పడ్డవారు డ్రగ్స్ పార్టీలకు అలవాటు పడుతున్నారు. తెలంగాణ లో గతంలో సినీ రంగాన్ని కూడా మాదకద్రవ్యాల కేసు ఓ కుదుపు కుదిపింది. కానీ ఆ కేసు ఆచూకీ లేకుండా పోయింది. వీటిని ఇలాగే వదిలేస్తే రేపు సమాజానికి సవాల్‌గా మారుతుందని గుర్తించాలి. ఉడ్తా పంజాబ్ కాదు..ఉడ్తా తెలుగు రాష్ట్రాలుగా మారినా ఆశచర్యం లేదు. గంజాయి, డ్రగ్స్‌పై రాజకీయ కేసులే కాకుండా మామూలుగా కూడా ఎక్కడా ఎవరు ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజం చెడిపోక ముందే మేల్కోవాలి.




డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక


# మీ సాయం మాకక్కర లేదు

- అమెరికా చాలా శక్తివంతమైన దేశం
- హర్మోజ్ జలసంధి వ్యవహారం చూసుకుంటాం
- మిత్ర దేశాలకు ట్రంప్ ఘాటు హెచ్చరిక



**వాషింగ్టన్, మార్చి 17:** హోర్ముజ్ జలసంధిలో ముడి చమురు రవాణాకు రక్షణగా యుద్ధ నౌకలను పంపించాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యర్థనను పలు దేశాలు తిరస్కరించాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మీడియా సమావేశంలో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరాన్ విషయంలో తమకు ఎవరి సాయం అవసరం లేదని అన్నారు. 'మాకు ఎవరి అవసరమూ లేదు. అమెరికా శక్తిమంతమైన దేశం. మా మిలిటరీ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనది' అని వ్యాఖ్యానించారు. యుద్ధ నౌకలను పంపించాలన్న ట్రంప్ అభ్యర్థనపై నాటో దేశాలు ఆచితూచి స్పందించిన విషయం తెలిసిందే. యుద్ధ నౌకలను పంపే విషయమై చర్చలు జరుగుతున్నాయని యూకే పేర్కొంది. జపాన్ కూడా దాదాపుగా ఇదే ప్రకటన చేసింది. తమకు యుద్ధ నౌకలను పంపే యోచనే లేదని ఆస్ట్రేలియా స్పష్టం చేసింది. అసలు తమను ఈ విషయమై ఎవరూ సంప్రదించలేదని కూడా ఆస్ట్రేలియా కేబినెట్ మంత్రి కేథరిన్ కింగ్ పేర్కొన్నారు. ఇక ట్రంప్ అభ్యర్థనను జర్మనీ నిర్ద్వంద్వంగా తోసి పుచ్చింది. యుద్ధం ప్రారంభించే ముందు అమెరికా గానీ ఇజ్రాయెల్ గానీ తమను సంప్రదించలేదని జర్మనీ ఛాన్సలర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమకు కొన్ని చట్టపరమైన పరిమితులు ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్య సమితి, ఐరోపా సమాఖ్య, నాటో నుంచి తమకు అనుమతులు లేవని చెప్పారు. ఇరాన్ విషయంలో నాటో దేశాల నుంచి తాను ఆశించిన స్పందన లేకపోవడంతో ట్రంప్ గతంలోనూ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగమైనా కూడా వారు అమెరికాకు సాయం చేసేందుకు ముందుకు రావట్లేదని అన్నారు. సమిష్టి రక్షణ బాధ్యతను పట్టించుకోవట్లేదని విమర్శించారు. హోర్ముజ్ జలసంధిని పట్టించుకోకపోతే నాటో దేశాల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని కూడా హెచ్చరించారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన భయాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో అక్కడికి యుద్ధ నౌకలను పంపాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపును మిత్ర దేశాలతో పాటు చైనా తోసిపుచ్చాయి. నాటో కూటమి కూడా ముందుకురాలేదు. ఈ దేశాలు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని ట్రంప్ బెదిరింపు ధోరణిలో మాట్లాడిన సంగతి తెలిసిందే. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

# అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం

- కాబూల్ ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడి
- దాడిలో 400 మంది మృత్యువాత
- మంటల్లో చిక్కుకున్న ఆస్పత్రి భవనం
- దాడి ఘటనను తోసిపుచ్చి పాక్ ప్రభుత్వం








**కాబూల్, మార్చి 17:** అఫ్గానిస్థాన్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోగా.. 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై పాకిస్థాన్ వైమానిక దాడి చేసిందని.. ఈ దాడిలో 400 మంది ప్రాణాలు కోల్పోయారని తాలిబన్లు ప్రకటించారు. ఈ దాడిలో ఆస్పత్రి పూర్తిగా ధ్వంసమైందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తాలిబన్ ప్రభుత్వం తెలిపింది. ఇదిలాఉంటే.. అఫ్గాన్ ప్రభుత్వ ఆరోపణల్ని పాకిస్థాన్ కొట్టిపడేసింది. కాబూల్‌లోని ఏ ఆస్పత్రిని కూడా తాము టార్గెట్ చేసుకోలేదని పేర్కొంది. అఫ్గానిస్థాన్ చెప్పేదాంట్లో నిజాలు లేవంది. ఇదిలావుంటే పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ దేశాల మధ్య ఘర్షణలు మూడో వారానికి చేరుకున్నాయి. ఇరుపక్షాలు భీకర దాడులకు పాల్పడుతున్నాయి. సరిహద్దుల్లో పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని.. పాక్ సైనికులు జరిపిన కాల్పుల్లో నలుగురు అఫ్గాన్ సైనికులు చనిపోయినట్లు ఆ దేశాధికారులు చెప్పారు. ఈ ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే కాబుల్‌లోని ఆస్పత్రిపై వైమానిక దాడికి పాల్పడినట్లు అఫ్గాన్ ఆరోపించింది.'కాబుల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌పై పాక్ వైమానిక దళం దాడి చేసింది. ఈ దాడిలో భారీ ప్రాణ నష్టం జరిగింది. చాలా మంది గాయపడ్డారు. పాకిస్థాన్ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. దీనికి తగిన గుణపాఠం చెబుతాం' అని తాలిబన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తెలిపారు. అఫ్గానిస్థాన్ రాజధాని కాబూల్‌లోని ఆస్పత్రిపై పాక్ వైమానిక దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. దాడి అనంతరం ఆస్పత్రిలో భారీ పేలుడు సంభవించడంతో.. ఆకాశంలోని భారీగా మంటలు ఎగిసి పడుతున్న దృశ్యాలు అందులో రికార్డయ్యాయి. మరో వీడియాలో భద్రతా సిబ్బంది టార్చ్‌లైట్ వెలుగులో శిథిలాల కింద నుంచి మృతదేహాలను వెలికి తీస్తుండగా, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. కాబూల్‌లోని డ్రగ్స్ రిహాబిలేషన్‌కు సంబంధించిన ఆస్పత్రిపై సోమవారం రాత్రి 9 గంటలకు పాక్ వైమానిక దాడి జరిపిందని అఫ్గానిస్థాన్ డిప్యూటీ ప్రభుత్వ ప్రతినిధి హమ్దుల్లా ఫిత్రత్ తెలిపారు. ఈ దాడిలో ఆస్పత్రి భవనం చాలావరకు ధ్వంసమైందన్నారు. 400 మంది వరకు మరణించారని.. 250 మంది గాయపడ్డారని చెప్పారు. వైమానిక దాడులతో ఆస్పత్రి భవనంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయని.. అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. దాడిలో మాదక ద్రవ్యాలకు బానిసలైన వారి చికిత్స కోసం ఉపయోగిస్తున్న పరికరాలు చాలా వరకు ధ్వంసమయ్యాయని అఎ÷-గాన్ ఆరోగ్య శాఖ ప్రతినిధి షరాఫత్ జమాన్ తెలిపారు. మృతుల్లో ఎక్కువగా రోగులే ఉన్నారని పేర్కొన్నారు. కాగా, పాక్ దాడిని ఆఎ÷-గానిస్థాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ తీవ్రంగా ఖండించారు. ఇది అఎ÷-గాన్ సార్వభౌమాధికారాన్ని ఉల్లంఘించే చర్యేనని అభివర్ణించారు. కాబూల్‌లోని ఆస్పత్రి లక్ష్యంగా దాడులు చేశారని ఆఎ÷-గానిస్థాన్ చేసిన ఆరోపణలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆస్పత్రి లక్ష్యంగా ఎటువంటి దాడులు జరపలేదని స్పష్టం చేసింది. తాలిబాన్ సైనిక స్థావరాలు, ఆయుధ గోదాములు, ఉగ్రవాద మద్దతు కేంద్రాలే లక్ష్యంగా కచ్చితమైన దాడి చేశామని పాకిస్థాన్ సమాచార మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పౌరులకు, ఆస్తులకు ఎటువంటి నష్టం జరగకుండానే జాగ్రత్త పడుతూనే దాడులు చేశామని స్పష్టం చేసింది.

# కాబూల్ ఆస్పత్రిపై దాడి పిరికిపంద చర్య

అఫ్గాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి

పాక్ తీరును తీవ్రంగా తప్పపట్టిన భారత్




**న్యూఢిల్లీ,మార్చి 17:** అఫ్గానిస్థాన్‌లోని కాబుల్ ఆసుపత్రిపై పాకిస్థాన్ జరిపిన వైమానిక దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది పిరికిపంద, అమానుష చర్య అంటూ మండిపడింది. రంజాన్ వేళ ఇలాంటి దాడులకు పాల్పడటం దారుణమని విచారం వ్యక్తంచేసింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రకటనను విడుదల చేసింది. పాక్ ది అత్యంత పిరికిపంద, అమానవీయ చర్య. ఈ దారుణమైన మారణహోమాన్ని ఒక సైనిక ఆపరేషన్‌గా కప్పిపుచ్చుకునేందుకు పాకిస్థాన్ ప్రయత్నిస్తోంది. ఇది అఫ్గానిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడి. ఈ హేయమైన, నిర్లక్ష్యపూరిత చర్య ప్రాంతీయ శాంతి భద్రతలకు ప్రత్యక్ష ముప్పు. సరిహద్దుల ఆవల ఇలాంటి తీవ్రమైన హింసాత్మక చర్యలతో.. తమ అంతర్గత వైఫల్యాలను పాక్ ఇతరులపై నెట్టాలని చూస్తోంది. పవిత్ర రంజాన్ మాసంలో ఈ దాడికి పాల్పడటం మరింత దారుణం. ఈ నేరపూరిత చర్యకు పాల్పడిన వారిని అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా చేయాలి. పాకిస్థాన్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న దాడులను తక్షణమే అడ్డుకోవాలని భారత విదేశాంగ శాఖ తమ ప్రకటనలో పేర్కొంది. అఫ్గాన్ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతకు భారత్ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. మాదక ద్రవ్యాలకు బానిసైన వారికి చికిత్స అందిస్తున్న కాబుల్‌లోని ఓ ఆస్పత్రిపై సోమవారం రాత్రి పాక్ వైమానిక దాడులు చేపట్టింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 400 మంది మరణించినట్లు అఫ్గానిస్థాన్ ప్రభుత్వం ప్రకటించింది. దాడి కారణంగా భవనం పూర్తిగా ధ్వంసమైంది.

# ఇటానగర్‌లో విరిగిపడ్డ కొండచరియలు

గోడకూలి నలుగురు మృత్యువాత

**ఇటానగర్,మార్చి17:** కొండచరియలు విరిగిపడడంతో గోడ కూలి నలుగురు మృతి చెందారు. ముగ్గురికి గాయాలయ్యాయని ఇటానగర్ అధికారులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. సోమవారం సాయంత్రం ఇటానగర్‌లో నీతి బీహార్ ప్రాంతంలో ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిని చోకి తసర్, రతన్ బర్మాన్, గోడక్ రాజా, గోడక్ టాబిన్‌లుగా అధికారులు గుర్తించారు. నిర్మాణ పనుల్లో భాగంగా కొంతమంది కార్మికులు అక్కడ పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. రెస్క్యూ బృందం ఘటనా స్థలం నుంచి నాలుగు మృతేహాలను వెలికితీశారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు అని ఇటానగర్ ఎస్‌పి జుమార్ బసర్ మీడియాకు వెల్లడించారు.

# ఐసిస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు

మొరాదాబాద్‌లో డెంటల్ విద్యార్థి అరెస్ట్

**లక్నో,మార్చి17:** యుపిలో టెర్రరిస్ట్ సంబంధాలు ఉన్నవారిపై దాడులు కొనసాగుతున్నాయి. నిషేధిత ఉగ్రవాద సంస్థ ఐసిస్‌తో ఆన్‌లైన్‌లో సంబంధాలున్నాయనే ఆరోపణలతో 19 ఏళ్ల వైద్య విద్యార్థిని యుపి పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భారత్‌లో పనిచేస్తున్న ఐసిస్ అనుబంధ ఆన్‌లైన్ నెట్‌వర్క్ కార్యకలాపాలపై కొనసాగుతున్న దర్యాప్తులో భాగంగా, షహరాన్‌పూర్ జిల్లాకు చెందిన హారీష్ అలీని ఆదివారం మొరదాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు ఎటిఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. బిడిఎస్ (డెంటిస్ట్) రెండో సంవత్సరం చదువుతున్న హారీష్ అలీ, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు మరియు సెషన్, డిస్కార్డ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ అప్లికేషన్‌ల ద్వారా ఐసిస్ సభ్యులు, సానుభూతిపరులతో సంబంధాలు కలిగి ఉన్నాడని అధికారులు పేర్కొన్నారు. ఐసిస్ భావజాలాన్ని ప్రచారం చేయడానికి, దేశంలో ఉగ్రవాద సంస్థను బలోపేతం చేయడానికి వ్యక్తులను నియమించడం లక్ష్యంగా ఆన్‌లైన్ గ్రూపులను సృష్టిస్తున్నారని ఎటిఎస్ తెలిపింది. నిందితులు అల్ ఇత్తిహాద్ మీడియా ఫౌండేషన్ అనే పేరుతో ఒక ప్రత్యేక గ్రూపును కూడా నడిపారని, భారత్‌తో పాటు విదేశాల్లో ఐసిస్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులతో సంబంధాలు కొనసాగించారని అధికారులు తెలిపారు. లక్నోలోని ఎటిస్ పోలీస్ స్టేషన్‌లో యుఎపిఎ మరియు బిఎన్‌ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఎటిఎస్ పేర్కొంది.



### చిక్కుముడి విప్పిన కేంద్ర మంత్రి

# మూలపేట పోర్ట్ కు లైన్ క్లియర్

- 385.24 ఎకరాల భూమి బదలాయింపు ఉత్తర్వులు విడుదల
- సమస్య ఒడ్డుకు చేరడంతో మరింత వేగంగా పోర్ట్ నిర్మాణం
- ఇటు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖతో, అటు ఎపి మేరిటైం బోర్డు ను సమన్వయం చేసిన రామ్మోహన్ నాయుడు
- ఉగాది ముందు శుభవార్త తెచ్చిన శ్రీకాకుళం ఎంపి



**శ్రీకాకుళం , మార్చి 17 (మనసులో మాట) :** మూలపేట పోర్టు నిర్మాణ క్రమంలో కీలక సమస్యగా మారిన 385 ఎకరాల సాల్ట్ ల్యాండ్స్ సమస్య కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో పరిష్కారం అయింది. ఇందుకు సంబంధించి భారత ప్రభుత్వ వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహం, అంతర్గత వాణిజ్య విభాగం నుండి మంగళవారం నాడు అధికారిక ఉత్తర్వులు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశను మార్చే కీలకమైన ప్రాజెక్ట్ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణాన్ని కీలకంగా తీసుకున్న కూటమి సర్కారు.. తాము అధికారంలోకి వచ్చింది మొదలు పనుల్లో వేగాన్ని పెంచింది. సమస్యలను సరిచేస్తూ.. నిత్యం సమీక్షలు చేస్తూ.. నిర్మాణంలో తుదిదశకు చేరుకుంది. ప్రస్తుతం అనుసంధాన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే ఇదే తరుణంలో పోర్ట్ నిర్మాణంలో వీరికి ప్రధాన సమస్యగా మారింది నౌపాడ పరిధిలోని ఉప్పు భూముల సమస్య.. మొత్తంగా 385.24 ఎకరాల సాల్ట్ భూములు కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖా పరిధిలోని అంతర్గత వాణిజ్య విభాగం, సాల్ట్ విభాగం పరిధిలో నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరీ ఆధీనంలో ఉన్నాయి. వీటిని పోర్ట్ నిర్మాణం కోసం అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఎపి మేరిటైం బోర్డు కు మధ్య చర్చలు నడుస్తూనే ఉన్నాయి. మూలపేట పోర్ట్ నుండి టెక్కలిని, జాతీయ రహదారిని అనుసంధానించేందుకు ఈ 385.24 ఎకరాలు కీలకంగా మారాయి. వీటి మీదుగానే వంద ఎకరాల పరిధిలో 330 అడుగుల విశాల రహదారులు, భవిష్యత్ ఎగుమతి, దిగుమతులకు సరిపడ మౌలిక వసతులను నిర్మించాలి. వీటితో పాటు సుమారు 280 ఎకరాలు ప్రధాన పోర్ట్ విస్తరణ కోసం అవసరం కానుంది. అయితే ఈ భూముల అప్పగింతపై ఏకాభిప్రాయం రాకపోవడంతో పోర్ట్ నిర్మాణంకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఈ సమస్య పరిష్కారం పై దృష్టి సారించిన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. అవకాశం దొరికిన ప్రతీసారి కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖతో, డైరక్టర్ ఆఫ్ పోర్ట్స్, పోర్ట్స్ అడ్మినిస్ట్రేషన్ సి.ఈ.ఓ, మేరిటైం బోర్డ్, శ్రీకాకుళం జిల్లా యంత్రాంగం ఇలా వరుసగా భేటిలు, సమీక్షలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాడు ఈ భూములను నౌపాడ సాల్ట్ ఫ్యాక్టరి నుండి ఎపి మేరిటైం బోర్డ్ కు 99 ఏళ్ల లీజు ప్రాతిపదికన అప్పజేప్పుతున్నట్టు అధికారిక ఉత్తర్వులు రావడంతో శుభవార్తను రామ్మోహన్ నాయుడు జిల్లా వాసులకు తెలియజేశారు. శ్రీకాకుళం జిల్లా, ఉత్తరాంధ్ర అభివృద్ధి దిశను మార్చనున్న మూలపేట పోర్ట్ విషయంలో తాజా సమస్య పరిష్కారంతో కీలక అడ్డంకి తొలగిందని ఆనందం వ్యక్తం చేశారు.

# వ్యవసాయం తోనే రైతన్న గెలవాలి

**పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర**



**పార్వతీపురం , మార్చి 17 (మనసులో మాట) ప్రతినిధి :** రాష్ట్రాన్ని సాగుకు అనుకూల పరిస్థితులు కల్పించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, వ్యవసాయం నిలవాలని రైతన్న గెలవాలి అన్నదే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. రైతన్నా.. మీకోసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం పట్టణంలోని జగన్నాథపురం లో పర్యటించిన ఎమ్మెల్యే రైతుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న రాయితీలు, సబ్సిడీలు సంక్షేమ పథకాలతో పాటు, వ్యవసాయాన్ని మెరుగుపరుచుకునేందుకు వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన అన్నారు. గత ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం రైతులకు 20వేల రూపాయలు మూడు విడతలుగా జమ చేయడం జరిగిందని, అలాగే సాగునీటి పథకాలను మెరుగుపరుస్తూ నదుల అనుసంధానం ప్రక్రియ ద్వారా వ్యవసాయదారులకు తాగునీరు సరఫరాను మెరుగుపరిచేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపరచడమే కాకుండా విస్తృతంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుకు కృషి జరుగుతుంది అని అన్నారు. రైతులకు ఎప్పటికప్పుడు ఆధునికంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులను, నూతన పంటల గురించి వివరిస్తూ సాగును లాభదాయకంగా మారుస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన ఏర్పరచుకొని రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సహకారంతో వ్యవసాయాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

- అల్లూరి జిల్లా గిరిజన సమస్యలను వివరించిన రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

**పాడేరు టౌన్ , మార్చి 17 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, గిరిజన సంక్షేమం, గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బలోపేతం మరియు అభివృద్ధికి సంబంధించిన అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరత, రహదారులు, తాగునీరు, వైద్యసేవలు, విద్యా సౌకర్యాల లోపం వంటి సమస్యలను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే గిరిజన రైతులు పంటలకు సరైన ధరలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలియజేసి, వారికి సరైన మద్దతు ధరలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా సంఘాలను ఆర్థికంగా 7వ పేజీలో

### అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ చేతుల మీదుగా

# పాత్రికేయులకు అక్రిడేషన్ కార్డులు పంపిణీ



**చింతపల్లి, మార్చి 17 ( మనసులో మాట) ప్రతినిధి :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలోనూ పాత్రికేయుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పలువురు పాత్రికేయులకు అధికారిక అక్రిడేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్రిడేషన్ కమిటీ సభ్యునిగా ఎంపికైన విశాలాంధ్ర పాత్రికేయుడు షేక్ ఖాసిం వల్లి కలెక్టర్ చేతుల మీదుగా తన గుర్తింపు కార్డును అందుకున్నారు. ఖాసిం వల్లితో పాటు చింతపల్లి ప్రాంతానికి చెందిన పలువురు సీనియర్ పాత్రికేయులు కూడా ఈ కార్యక్రమంలో అక్రిడేషన్ కార్డులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పాత్రికేయులు వృత్తి ధర్మాన్ని పాటిస్తూ నిష్పాక్షిక వార్తా రచనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎప్పటికప్పుడు వార్తా కథనాల ద్వారా తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారికి అందాల్సిన సదుపాయాల విషయంలో సానుకూలంగా స్పందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అక్రిడేషన్ కార్డులు అందుకున్న వారిలో చింతపల్లి మండలానికి చెందిన పాత్రికేయులు ఉండటంతో స్థానిక మీడియా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, కమిటీ సభ్యులు, ఇతర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.



### 20 కోట్లు తో అనకాపల్లి పట్టణంలో

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు

**అనకాపల్లి ప్రతినిధి, మార్చి 17 (మనసులో మాట) :** అనకాపల్లి పట్టణంలో 80,82,83 వార్డు లలో మంగళవారం 20 కోట్లు రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలను మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ , రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మెన్ మళ్ళ సురేంద్ర, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీష్ తదితరులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం లోని భీమునిగుమ్మం వద్ద రైల్వే ఇంజిన్ ఆకృతిలో ఫౌంటేన్ ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం లో మౌలిక సదుపాయల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత



ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం,జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికసంఖ్యలో కూటమి పార్టీ ల శ్రేణులు, మహిళలు పాల్గొన్నారు.

### అనకాపల్లి లో ఘనంగా

# ప్రారంభమైన నూకాంబిక జాతర మహోత్సవాలు

- అమ్మవారి కి ప్రత్యేక పిండి వంటలతో మహిళలు సారె సమర్పణ
- అమ్మవారిని దర్శించుకున్న విశాఖ సంపత్ వినాయక ఆలయ వ్యవస్థాపకులు టిఆర్ చోళన్, పలువురు ప్రముఖులు
- జాతర ఏర్పాట్లు పరిశీలించిన అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 17 (మనసులో మాట) :** రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ముందుగా విశాఖపట్నం సంపత్ వినాయక దేవస్థాన వ్యవస్థాపకులు టిఆర్ చోళన్, దేవాదాయ ధర్మధాయ శాఖ సహాయ కమిషనర్ డివివి ప్రసాదరావు తదితరులు అమ్మవారి ని దర్శించుకొని, పూజలు జరిపారు. అంతకుముందు మహిళలు పెద్ద ఎత్తున పసుపు కుంకమలు, వివిధ రకాల పిండి వంటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి సారె సమర్పించారు. ముందుగా అమ్మవారి ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను (గొల్ల బాబు), ఆలయ సహా కమిషనర్ యాళ్ళ శ్రీధర్ వారికి స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

**జాతర మహోత్సవ ఏర్పాట్లును పరిశీలించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**

శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాన్ని పురష్కరించుకొని మంగళవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అమ్మవారి పండుగ ఏర్పాట్లు పరిశీలించారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ సహాయ కమిషనర్ యాళ్ల శ్రీధర్ తదితరులు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం జాతర, కొత్త అమావాస్య పండుగ సందర్భంగా క్యూలైన్లు, పందిళ్ళను పరిశీలించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి శ్రావణి, సీఐ లు ప్రవీణ్ కుమార్, వెంకటనారాయణ, ఆలయ ధర్మకర్తలు సూరే సతీష్, దాడి రవికుమార్, పొలిమేర స్వాతి ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు , మజ్జి జానకి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్,వద్దాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి పైడిరాజు, యర్రవరపు సంతోషి కుమారినాగేషి, తదితరులు పాల్గొన్నారు.



## నర్సీపట్నం నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న చింతకాయల విజయ్ కుటుంబ సభ్యులు



**నర్సీపట్నం , మార్చి 17 (మనసులో మాట) :** నర్సీపట్నం: శ్రీ నూకాంబిక అమ్మవారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆయన సతీమణి డాక్టర్ సువర్ణ , కుమార్తె నిహిత, కుమారుడు శివన్ పాత్రుడు అమ్మవారి ఆలయానికి విచ్చేయగా, ఆలయ కమిటీ సభ్యులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వారు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించి, భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిపించి, వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి శేషవస్త్రంతో వారిని ఆశీర్వదించారు.

### నవ్వులు,సరదా సంభాషణల మధ్య

# ముగిసిన నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- రాజకీయాలకు అతీతంగా నర్సీపట్నం అభివృద్ధికి కృషి చేద్దాం : స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం , మార్చి 17 (మనసులో మాట) :** నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆఖరి రోజు అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో, నవ్వుల నడుమ ముగిసింది. రాజకీయాలకు అతీతంగా సభ్యులందరూ సరదాగా ముచ్చటించుకుంటూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. నర్సీపట్నం అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా కృషి చేద్దామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పిలుపునిచ్చారు. నర్సీపట్నం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఎంతటి వారైనా ఓడిపోక తప్పదని ఎన్టీఆర్ లాంటి మహోన్నత వ్యక్తి ఉదాహరణను గుర్తుచేశారు. గెలిచినప్పుడు గర్వం ప్రదర్శించకూడదని, చేసిన అభివృద్ధిపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటేనే ప్రజలకు మరింత సేవ చేయగలమని ఆయన హితవు పలికారు. తాను రిటైర్ అయ్యేలోపు ప్రస్తుతం ఉన్న మూడేళ్ల పదవీకాలాన్ని నర్సీపట్నం అభివృద్ధి కోసమే వెచ్చిస్తానని, నియోజక



వర్గాన్ని అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడుదామని, అభివృద్ధి విషయంలో మాత్రం అందరూ సహకరించాలని కోరారు. స్పీకర్ హోదాలో తాను ఏ ఒక్క పార్టీకి పరిమితం కాదని, అభివృద్ధి విషయంలో కౌన్సిలర్ల పట్ల ఎలాంటి వివక్ష చూపబోనని అయ్యన్నపాత్రుడు ఉద్ఘాటించారు. మున్సిపాలిటీలో ఏ వార్డు తనను గెలిపించింది, ఏ వార్డు ఓడించింది అనే భేదభావం లేకుండా ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా సర్వే చేయించి అత్యవసరమైన రోడ్లు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ నిధుల నుంచి రూ.21 కోట్లు నర్సీపట్నానికి తీసుకొచ్చానని, వచ్చే నెలలో మరో పది కోట్ల రూపాయలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అలాగే, లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా సహకారంతో విశాఖలోని పరిశ్రమల నుంచి వచ్చే సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల్లో 20 శాతం నర్సీపట్నం అభివృద్ధికి మళ్లించేలా చర్యలు తీసుకున్నానని వివరించారు. కౌన్సిలర్లు ఏ పార్టీ వారైనా పనుల కోసం తన వద్దకు వస్తే సహకరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నా, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల కంటే మిన్నగా ఏపీలో రూ.4 వేల పింఛను ఇస్తున్నామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీల చిత్తశుద్ధి వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఇదే క్రమంలో నర్సీపట్నాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. పెద్ద చెరువు వద్ద 108 అడుగుల భారీ శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నామని, దీని ద్వారా రోజూ వేలాది మంది పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అలాగే బలిగట్టం కొండపై ఉన్న పురాతన బ్రహ్మ లింగేశ్వర స్వామి ఆలయం చోళ రాజుల కాలం నాటి ఆలయ జీర్ణోద్ధారణకు ఆర్కియాలజీ శాఖ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. నూకాలమ్మ పండుగ తన కుటుంబానికి మాత్రమే పరిమితం కాదని, ఊరందరిదని పేర్కొంటూ కౌన్సిలర్లందరినీ పండుగలో పాల్గొనాలని ఆహ్వానించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక



## మునగ ఉత్పత్తులతో మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం : నాబార్డ్ డీడీఎం రమేష్ కృష్ణ

**శ్రీకాకుళం , మార్చి 17 (మనసులో మాట) :** గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడమే నాబార్డ్ ప్రధాన లక్ష్యమని, మునగ విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ ద్వారా మహిళలు నెలకు రూ.10 వేల వరకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని నాబార్డ్ జిల్లా అభివృద్ధి అధికారి రమేష్ కృష్ణ పేర్కొన్నారు. మెలియాపుట్టి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నాబార్డ్ ఆధ్వర్యంలో, జిల్లా మహిళా సమాఖ్య అమలు చేసిన 15 రోజుల 'మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' మంగళవారం ముగిసింది. ఈ ముగింపు వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మునగలో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయని, ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ శిక్షణ పొందిన మహిళలకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించడంతో పాటు, నాబార్డ్ ప్రాయోజిత ప్రదర్శనలు, రూరల్ మార్ట్స్ ద్వారా మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీఎంలు ఈశ్వరరావు, త్రినాధమ్మ, మండల మహిళా సమాఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పిర్యాదు దారునికి తప్పుడు ఎండార్స్మెంట్ ఇచ్చిన తహాశీల్దార్

- పిజిఆర్ఎస్ పై ప్రజలకు నమ్మకం పోయింది అన్న వెంకన్న




**దేవరాపల్లి , మార్చి 17 (మనసులో మాట) :** నాలుగు సర్వే నెంబర్లుకు పీజిఆర్ఎస్ లో పిర్యాదు చేస్తే ఒక సర్వే నెంబరుకే ఎండార్స్మెం ట్ ఇచ్చి పిర్యాదు దారున్ని, ఉన్నతాధి కారులను దేవరాపల్లి తహసీల్దార్ తప్పు తోవ పట్టిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న ఆరోపించారు. తప్పుడు త్రోవ పట్టిస్తు భూకబ్జా దార్లును రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన అధికారులు కంచె చేను మేసిన చందంగా మారారని విమర్శించారు. అధికారుల తీరు చూస్తే ప్రజలు సమస్యలు పట్ల ప్రభుత్వ భూములు రక్షించడంలోను ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో స్పష్టంగా అర్దమౌతుందని అన్నారు. ఇటువంటి అధికారులు వలన ప్రభుత్వానికి పూర్తిగా చెడ్డ పేరు రావడంతో పాటు ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్లు నిర్వహిస్తున్న పీజిఆర్ఎస్ పై పూర్తిగా ప్రజలకు నమ్మకం పోతుందని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని, తప్పుడు ఎండార్స్మెంట్ లు ఇచ్చి ఉన్నతాధికారులను పిర్యాదు దారున్ని తప్పుత్రోవ పట్టించిన తహాశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

## 19న ఘనంగా ఉగాది వేడుకలు : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం , (మనసులో మాట) ప్రతినిధి మార్చ్: 17 :** శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని గురువారం ఉగాది పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. స్థానిక శ్రీ మన్నార్ రాజగోపాల స్వామి ఆలయం లో జిల్లా స్థాయి ఉగాది వేడుకల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. జిల్లా పర్యాటక శాఖాధికారి మొత్తం కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయాలని, వేదిక అలంకరణ ఉద్యానవన శాఖ ఉప సంచాలకులు, పబ్లిక్ అడ్రస్ సిస్టం సమాచార శాఖ సహాయ సంచాలకులు, ప్రాథమిక ఆరోగ్య చికిత్సా కేంద్రం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, పారిశుధ్య నిర్వహణ, మంచినీరు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగావేదిక పై బ్యానర్, వేదపండితుల ఆశీర్వచనము, "పంచాంగ శ్రవణం" "పండిత సత్కారం", కార్యక్రమానికి వచ్చిన అందరికీ పులిహోర, చక్కెర పొంగలి ఉ ఉగాది పచ్చడి ఏర్పాటు చేయాలని దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేశారు. మార్చి 19వ తేదీన ఉదయం శ్రీ మన్నార్ రాజగోపాల్ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ప్రజలందరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు.

## సుబ్రమణ్య స్వామివారి చైత్ర పౌర్ణమి మహోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



**మల్కాపురం , మార్చి 17 (మనసులో మాట) :** కంచర పాలెం గ్రామంలో ఈ నెల 24 వ తేదీ నుంచి వచ్చే నెల 2 వరకు విశాఖ నగరంలోని కంచరపాలెం, ఇందిరానగర్- 1 కొండపైన కొలువై ఉన్న సుబ్రహ్మణ్యం స్వామివారి దేవాలయంలో చైత్ర పౌర్ణమి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లను పూర్తి చేసినట్టు దేవాలయం కమిటీ గౌరవ అధ్యక్షులు గొందు సీతారాం అన్నారు, మంగళవారం దేవాలయ ప్రాంగణంలో దేవాలయ కమిటీ రూపొందించిన ఉత్సవాల సంబంధిత గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది,ఆవిష్కరణ అనంతరం సీతారాం మాట్లాడుతూ చైత్ర పౌర్ణమి మహోత్సవాలు ఈ నెల 24 వ తేదీన ఉదయం ధ్వజా రోహణతో ప్రారంభం కాబోతున్నాయన్నారు. 28వ తేదీన కాల సర్పదోష నివారణ కోసం ప్రత్యేక పూజ లు జరుగుతాయన్నారు. 29 న వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి కళ్యాణం,అన్నసంతర్పణ జరుగుతుంది. వచ్చే నెల 2 వ తేదీన ఉదయం 5 గంటల నుంచి స్వామి వారికి క్షీరాభిషేకం,పంచామృత అభిషేకములు నిర్వహిం చేందుకు చర్యలు ముమ్మరం చేశామన్నారు, దేవాలయ కమిటీ అధ్యక్షుడు బైరి చిరంజీవి, ప్రధాన కార్యదర్శితెరపల్లి రంగారావు, ఉపాధ్యక్షులు వియ్యపు రాజ్ కుమార్ లు మట్లాడుతూ భక్తుల సారధ్యాన ఆట కావిడిల తోను,పాల కావిడిలతో స్వామి వారికి మొక్కులను చెల్లించుకుంటారన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి తిరువీధి రథోత్సవం నిర్వహిస్తున్నామన్నారు, కమిటీ సంయుక్త కార్యదర్శి మారుతి హరీష్ కుమార్ మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజల సహాయ సహకారాలు,మహా విశాఖ నగర పాలక సంస్థ,పోలీసు శాఖల సమన్వయంతో విజయవంతం చేస్తామని అన్నారు,కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హేమ సుందరాచారి,కోశాధికారి ఎం వి సత్య నారాయణ,ఇతర సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్లపై పశువులు..వాహనదార్లూ జాగ్రత్త



**గూడెం/ సీలేరు , మార్చి 17 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం లో హైవే రోడ్డుపైన మరియు గ్రామాలకు వెళ్లే రోడ్ల పైన మూగజీవులు పశువులు రాత్రివేళ నిద్రిస్తున్నాయి కావున రాత్రివేళ ప్రయాణించే వాహనదారులు జాగ్రత్త వహించాలి దీనిపై జీకే వీధి పోలీస్ వారు పలుమార్లు పత్రిక ప్రకటన విడుదల చేశారు రాత్రి వేల పశువుల యజమానులు వెంటనే వాటిని పశువుల శాలలో గాని ఇంటి దరిదాపుల్లో గాని తీసుకువెళ్లి ఉంచుకోవాలని లేనియెడల ఏమైనా హానీ జరిగిన వెంటనే పశువుల యజమానిపై చర్యలు తీసుకుంటామని ఇదివరకు పలు పత్రికల్లో ప్రకటన ఇవ్వడం జరిగింది కావున పశువుల యజమానులు జాగ్రత్తగా మెతకు వెళ్లిన పశువులను ఇంటికి తీసుకో వెళ్లి మీ మీ నివాసాల్లో ఉంచుకోగలరని జి కే వీధి ఎస్సై సురేష్ బాబు హెచ్చరించడం జరిగింది.

## నెల రోజులుగా ఆగిన బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సిగ్నల్స్

### పట్టించి కోని సంబంధిత అధికారులు



**గూడెం/ సీలేరు , మార్చి 17 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల పరిధిలోగల లకవరపుపేట పంచాయితీ లొ కే,కోడిసింగి గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మించి సంవత్సరం కాలం గడున్తుంది కానీ ప్రారంభమైనప్పటినుండి అప్పుడప్పుడు సిగ్నల్స్ వచ్చి పోవడం తప్ప పూర్తిగా సిగ్నల్స్ లేక అత్యవసర పరిస్థితుల్లో గ్రామస్తులు ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు గత నెల రోజుల నుండి పూర్తిగా బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సిగ్నల్స్ లేవు టవర్ నిర్మించారు ఓన్లీ గ్రామానికి రేడియేషన్ పెరుగుదలకు నిర్మించినట్లుగా ఉన్నట్టు ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు పూర్తిగా ఒక్కరోజు అయినా పూర్తి స్తాయి సిగ్నల్స్ పనిచేయలేదని గ్రామస్తులు అన్నారు సంబంధిత బిఎస్ఎన్ఎల్ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించగలరని గ్రామస్తులు కోరారు

## ప్రమాదాలు నివారణకు ధర్మవరం జాతీయ రహదారివద్ద పై వంతెన నిర్మించాలి



**ఎస్.రాయవరం , మార్చి 17 (మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలం ధర్మవరం వద్ద జాతీయ రహదారి పై వంతెన నిర్మించాలని కోరుతూ ఆ గ్రామానికిచెందిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం అప్పల రాజు పిజిఅర్ ఎస్ లోజిల్లాకలెక్టర్ కు వినతి పత్రం అందచేసారు.


జాతీయ రహదారికి ఇరువైపుల గ్రామం విస్తరించి ఉన్నందున వివిధ పనులుకోసం విద్యార్థులు, రైతులు, వ్యవసాయ కూలీలు రోడ్డుకిరుపక్కల తిరుగుతుంటారని, దీనితో పలువురు రోడ్డుప్రమాదాలు గురుఅవుతున్నారని ఆయన తెలిపారు. ఆరులైన్లరహదారి విస్తరణ సమయంలో ఇక్కడ పై వంతెన నిర్మాణంచేయాలంటూ ఆ వినతిపత్రంలో విజ్ఞప్తి చేసారు.

## హోంమంత్రి పుట్టినరోజు సందర్భంగా ఉచిత కంటి వైద్యశిబిరం



**ఎస్.రాయవరం , మార్చి 17 (మనసులో మాట) :** రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పుట్టిన రోజు వేడుకలలో భాగంగా ఎస్. రాయవరం మండలం ధర్మవరం గ్రామంలో ఈనెల 22వతేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆగ్రామ మాజీ ఉపసర్పంచ్ సియ్యాదుల అచ్యుత్ కుమార్ తెలిపారు. పాయకరావుపేట హైమ నేత్రలయం వారి సహకారంతో ఈవైద్య శిబిరంలో కంటిపరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటిఆపరేషన్లు నిర్వహిస్తారని అచ్యుత్ కుమార్ తెలిపారు. ఈ అవకాశాన్ని ధర్మవరం పరిసరగ్రామల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## ముమ్మరంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి



**ఎస్.రాయవరం ,మార్చి 17 (మనసులో మాట) :** ఎస్. రాయవరం మండలంలోని పలుగ్రామల్లోనిరోడ్లు నిర్మాణ పనులు చురుకుగా సాగుతుండటంతో దశాబ్దాలుగానెలకొన్న రోడ్డుఇబ్బందులు తీరాయి. దార్లపూడి జంక్షన్ నుండి వరహావంతెన వరుకు ఉన్న రోడ్డుగోతులుపడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోనేవారు. ఇటీవల రోడ్డునిర్మాణం పూర్తి చేయటం తో పలుగ్రామాలప్రజలు హర్షంవ్యకం చేస్తున్నారు. జాతీయ రహదారి నుండి గెడ్డపాలెం వెళ్ళే రోడ్డు, రేవుపోలవరం నుండి బంగారమ్మవెళ్ళేరోడ్డుతో పాటు పేట సూదిపురం తదితర గ్రామాలుకు కొత్తగారోడ్లు నిర్మించటంతో గత కొన్నేళ్ళుగా స్థానికులు పడ్తున్న రోడ్డు ఇబ్బందులు తప్పినట్లుఅయింది.

## శ్రీ.శ్రీ.శ్రీ దారాలమ్మ జాతర మహోత్సవం ప్రారంభం



**గూడెం / సీలేరు , మార్చి 17 (మనసులో మాట) :** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ లో దారకొండ గ్రామంలో వెలిసిన మన్యం ఆరాధ్య దైవం శ్రీ శ్రీ శ్రీ దారాలమ్మ తల్లి 60,వ ,,జాతర మహోత్సవం ఈరోజు నుండి అతి వైభవంగా జరుగుతుంది, ఈవో సాంబశివరావు అన్నారు ఈవో ఆధ్వరంలో ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగింది ఆలయానికి ధారకొండ నుంచి అమ్మవారి ప్రధాన పండగ రోజు అమ్మవారి ఘటలను స్థానిక మహిళలు భక్తులు ఊరేగింపుగా తీసుకువెళ్లడం పూర్వం నుండి వచ్చే ఆనవాయితీ అని తెలిపారు మూడు రోజులు జరిగే పండగకు తుని పట్టణానికి చెందిన దారులమ్మ తల్లి భక్తుడు చిన్న దంపతుల ఆధ్వర్యంలో జాతరకు వచ్చిన భక్తులకు ఉచిత అన్నదాన చేస్తున్నట్టు ఈవో సాంబశివరావు తెలిపారు మన్యం ఆరాధ్య దైవంగా భావించే శ్రీ దారాలమ్మ తల్లి ఆలయానికి జాతర సమయంలో అధిక జన సమూహంలో దూర ప్రాంతాల నుండి భక్తులు మొక్కులు తీర్చుకోడానికి తరలివస్తుంటారు అదేవిధంగా అంతర్రాష్ట్ర రహదారికి అనుకొని ఉన్న ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉందని ఆలయ అర్చకులు తెలిపారు మూడు రోజుల జరిగే జాతర సమయంలో అమ్మవారికి వేకువజామునే లేచి పూజలు భజన కార్యక్రమాలు అమ్మవారి అలంకరణ ఊరేగింపు దిమున నృత్యాలు అనంతరం నిర్వహించాలని ఈవో సాంబశివరావు ఆలయ కమిటీ తెలిపారు.

## ఘనంగా శ్రీ గంగాలమ్మ గావు పండగ



**చీడికాడ , మార్చి 17 (మనసులో మాట) :** మండలంలో దండి సురవరం గ్రామంలో శ్రీ గంగాలమ్మ తల్లి గావు పండగ మంగళవారం ఘనంగా జరిగింది ఈ పండగ గ్రామ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా ఉదయం నుండి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా తప్పుడు గుళ్ళు జరిగాయి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి డిసిసిబి చైర్మన్ కోన తాతారావు మాజీ మంత్రి బూడి ముత్యాలయుడు మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు భరణి కాన రామారావు పిఎసిఎస్ అధ్యక్షులు బొబ్బాది తాతారావు మాజీ సర్పంచ్ వేపాడ నాగేశ్వరావు పాల్గొని శ్రీ గంగాలమ్మ తల్లి ఆలయంలో పూజలు నిర్వహించారు ఉదయం 11 గంటల నుండి ఆలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

### నూకాలమ్మ జాతర సందర్భంగా

## మాకవరపాలెంలో వైభవంగా సమారాధనా కార్యక్రమం



**మాకవరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** మాకవరపాలెం మండలం, మాకవరపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నూకాలమ్మ జాతర సందర్భంగా భారీ స్థాయిలో సమారాధనా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తం పండుగ వాతావరణంతో కళకళలాడింది. దూరదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

జాతర సందర్భంగా అమ్మవారికి అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి మహామంగళహారతులు ఇచ్చారు. భక్తులు కొబ్బరికాయలు, పండ్లు సమర్పించి తమ కోరికలు నెరవేరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి, వందలాది మంది భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీకి చెందిన ఉప సర్పంచ్ లాలం రాము, వైఎస్సార్సీపీ మండల ఎంపీపీ రుత్తల సర్వం, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ ఇలాంటి జాతరలు గ్రామ ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు సమర్థవంతంగా నిర్వహించడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని భక్తి శ్రద్ధలతో నూకాలమ్మ తల్లిని ప్రార్థించారు.

## మహిళలపై దాడులు చేయించిన టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడిని తొలగించండి

### వైసిపి నాయకుల డిమాండ్



**అనకాపల్లి టౌన్ , మార్చి 17 (మనసులో మాట) :** తిరుమల పవిత్రతను కాపాడుకోవాలంటే తక్షణమే టీటీడీ చైర్మన్ బి ఆర్ నాయుడు తొలగించాలని వైసీపీ డిమాండ్ చేసింది తిరుపతి లో మహిళలపై దాడులు చేయించి గతంలో టీటీడీలో ఏ చైర్మన్ ను వ్యవహరించని విధంగా ప్రవర్తిస్తున్న ప్రస్తుత చైర్మన్ బిఆర్ నాయుడును తొలగించాలని నిరసన తెలియజేస్తు వైసిపి నాయకులు కార్యకర్తలు నాలుగు రోడ్ల జంక్షన్లో మంగళవారం మానవహారం నిర్వహించారు. ముందుగా వైసిపి కార్యాలయం నుండి ర్యాలీ బయలుదేరి రామచంద్ర థియేటర్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్కు చేరుకుంది. అక్కడవున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంక్షన్ లో మానవహారం చేశారు. అనంతరం మాజీ డిప్యూటీ సీఎం బుడి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీ డాక్టర్ బిసెట్టి సత్యవతి, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జిల్లా వైసీపీ అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల అనురాధ మాట్లాడుతూ పదవిలో కూర్చున్నప్పటి నుండి వివాదస్పదమైన చర్యలు చేస్తున్న వ్యక్తిని సిఎం చంద్ర బాబు ఇలాంటి పవిత్రమైన పదవి లో ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారు .తనను లైంగికంగా వేధిస్తున్నారు అని ఒక మహిళ స్పష్టం గా చెప్ప నా,అడ్డంగా వీడియోలు ఫోటోలు తో దొరికి పోయిన సిగ్గు లేకుండా నైతిక బాధ్యత వహించకుండా ఇంకా నాయుడు ఎందుకు పదవిలో కొనసాగుతున్నారు.



బి.ఆర్.నాయుడు ను వెంటనే ఆ పదవి నుండి తొలగించమని మహిళలు తిరుపతిలో ఆయన బస చేసిన చేసిన హోటల్ వద్ద నిరసన తెలిపితే గుండాలతో దాడి చేయించడం ఎంత దౌర్జన్యం అన్నారు. తక్షణమే సీఎం చంద్రబాబు నాయుడు టీటీడీ చైర్మన్ పదవి నుండి నాయుడ్ని తొలగించాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లి బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు జానకిరామరాజు, యువజన అధ్యక్షుడు జాజుల రమేష్, మాజీ గవర్ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, మాజీ సుంకరమెట్ట సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ కే యం నాయుడు. ఆర్ ఈ సి ఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు నీటిపల్లి లక్ష్మీ,శోభ, నీలకంఠ సంతోష లక్ష్మి , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## గిరిజన అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి

**ఒకటి తరువాయి** బలోపేతం చేయడం, స్వయం ఉపాధి అవకాశాలు పెంచడం, అటవీ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం అత్యవసరమని కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. జీసీసీ ద్వారా గిరిజనులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా కొత్త పథకాలు తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలను విస్తరించి మధ్యవర్తుల సమస్యను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసినట్లు కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే అమలులో ఉన్న పథకాలతో పాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. జీసీసీ కార్యకలాపాలను ఆధునీకరించి గిరిజన ఉత్పత్తులకు జాతీయ స్థాయి మార్కెట్ కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కార్యక్రమాలు కూడా తీసుకురా నున్నట్లు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గిరిజనుల జీవన ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ ముఖ్యమంత్రిని కోరారు.

## వలసల నివారణే లక్ష్యం : ఎంపీపీ అనూష దేవి ఆశయం

- తాజంగి జలాశయంలో చేప పిల్లల విడుదల
- మత్స్యకారులకు ఉచితంగా బోట్లు, వలల పంపిణీ
- ఎంపీపీ కోరాబు అనూష దేవి



**చింతపల్లి , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 17 :** గిరిజన ప్రాంతాల్లోని మత్స్యకారులు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా, స్థానికంగానే ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నదే ప్రభుత్వ ప్రధాన సంకల్పమని చింతపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు కోరాబు అనూష దేవి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన తాజంగి జలాశయంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ వంతల మహేశ్వరితో కలిసి ఆమె జలాశయంలోకి చేప పిల్లలను విడిచిపెట్టారు. అనంతరం జరిగిన సభలో ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన, ధార్తీ అభిజన జీవన్ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ పథకాల సమన్వయంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను, ప్రభుత్వం 90 శాతం భారీ రాయితీతో 30,000 చేప పిల్లలను అందజేసినట్లు తెలిపారు. జలాశయంలో మత్స్య సంపద పెరగడం ద్వారా స్థానిక మత్స్యకారులకు చేతినిండా పని దొరుకుతు ందని, తద్వారా వలసలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకారులకు అదనపు ఊతం ఇచ్చేలా ట్రైకార్ నిధుల ద్వారా మంజూరైన మూడు ఫిషింగ్ బోట్లు, చేపల వలలను లబ్ధిదారులకు ఎంపీపీ ఉచితంగా అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతులను సద్వినియోగం చేసుకొని మత్స్య కారులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆమె సూచిం చారు. జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ పి. శ్రీనివాస రావు, మత్స్య అభివృద్ధి అధికారి జి. మురళీకృష్ణ పాల్గొని మత్స్య సంపద పెంపుపై మత్స్యకారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాజంగి మత్స్య సహాయకురాలు సిహెచ్. కుమారి, వీఆర్వో సత్యవతి, గిరిజన మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు ఎస్. రామదాసు, నీటి వినియోగ సంఘం అధ్యక్షులు బాలయ్య పడాల్, సంఘ సభ్యులు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## మునగపాక శ్రీ పరదేశమ్మ ను దర్శించుకున్న కర్రి సాయికృష్ణ

**మునగపాక , మార్చి 17 (మనసులో మాట) :** యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండలం, మునగపాకలో వెలసి ఉన్న శ్రీ పరదేశమ్మ అమ్మవారి పండుగ మహోత్సవాల సందర్భంగా, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు గవర, కార్పొరేషన్ డైరెక్టర్ భీమరసెట్టి శ్రీనివాసరావు తో కలిసి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు విల్లూరి నర్సింగరావు, క్లస్టర్ ఇంచార్జ్ కాండ్రేగుల శంకర్, మల్ల వరాహ నరసింగరావు, మల్ల శేషు, దాడి శ్రీను తదితర తంపరమూల సంఘ సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిర్దేశించిన నిబంధనల ప్రకారమే క్వారీ నిర్వహణ జరగాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి




**సీతానగరం , మార్చి 17 (మనసులో మాట) :** మండలంలోని నిడగల్లు గ్రామ పరిధిలో రెండు ప్రతిపాదిత క్వారీల నిర్వహణపై మంగళవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి సలహాలు, సూచనలు మరియు అభ్యంతరాలను ఆయన స్వయంగా స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లా దుతూ.. క్వారీ నిర్వహణలో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని, కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మరియు నిర్వాహకులను



ఆదేశించారు. క్వారీ వల్ల చుట్టుపక్కల పొలాలకు, గాలికి ఎటువంటి నష్టం కలగకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించా లన్నారు. గ్రామస్థులు లేవనెత్తిన అంశాలను రికార్డు చేశామని, వాటిని నివేదిక రూపంలో ప్రభుత్వానికి మరియు పర్యావరణ కమిటీకి పంపిస్తామని జె.సి తెలిపారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదలకి ఇళ్ళ స్థలమైనా ఇవ్వాలి లేకుంటే ఇంటి అద్దెను ప్రభుత్వమే చెల్లించాలి : సిపిఐ పోరుబాట


- సిపిఐ విజయనగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 17 :** పేదవాడికి జానెడ జాగా ఇవ్వడానికి నిరాకరిస్తున్న పాలక ప్రభుత్వాలు, వారికి వత్తాసు పలికే అధికారులు విలువైన ప్రభుత్వ వాగు, వంక, చెరువు, రస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనాం, వక్స్, అటవీ భూములను యదేచ్ఛగా ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకునే భూ మాఫియాకి కొమ్ముకాస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) విజయనగరం నియోజకవర్గ కార్యదర్శి బుగత అశోక్ విమర్శించారు. మంగళవారం ఉదయం స్థానిక మర్బ్ నగర్ ( బుచ్చెన్న కోనేరు ), శాంతినగర్, ఫైనల్ వీధి ప్రాంతాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) విజయనగరం నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో పేదలకు ఇంటి స్థలం కోసం మార్చ్ 24 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన ఆందోళన కార్యక్రమం కోసం గడప గడపకి వెళ్ళి కరపత్రాలతో ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు రాజకీయాలు చూపకుండా ఎటువంటి షరతులు పెట్టకుండా అందరికీ పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు ఇంటి స్థలం ఇస్తాం ! ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తాం !! అర్హులందరికీ రేషన్ కార్డులు, పెన్షన్లు ఇస్తాం, ఆర్థిక, రాజకీయ, సామాజిక సమానత్వానికి, సాధికారతకు పెద్దపీట వేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఓట్లు దండుకొని, అందలమెక్కగానే ఎన్నికల వాగ్దానాలు పూర్తిగా పక్కకు నెట్టి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారిందని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అర్హులైన పేదలకు పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి 5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని, టిడ్కో ఇళ్ళ లబ్దిదారులకు స్వాధీనం చేయాలని, భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలని, ఇళ్ళు ఇవ్వకపోతే అద్దె ఇంట్లో ఉండే పేదవారికి ప్రభుత్వమే అద్దె చెల్లించాలని, గుంకలాం, కొండకరకాం, సారిక గుండాల పేట ప్రాంతాల్లో గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇచ్చిన జగనన్న కోలనిల్లో మౌళిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందించి, ప్రాధమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్, అంగన్వాడీ కేంద్రం, విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, భూమిలేని నిరుపేద రైతులకి సాగుభూమి పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) దశల వారీ పోరుబాటకు శ్రీకారం చుట్టిందన్నారు. భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేసే అసైన్మెంట్ కమిటీ పోరాడి సాధించుకుంటే, చట్టాన్ని సమూల మార్పులు చేసి ఫ్రీ హోల్డ్ పేరుతో ఒక్కసారిగా దళితులను భూమికి దూరం చేసే దుస్సాహసానికి ఒడిగట్టారు. పారిశ్రామిక అవసరాల పేరుతో, సంస్థల పేరుతో అయినవారికి ఎకరా ఐదు లక్షల విలువ చేసే భూమిని అర్థ రూపాయికి కట్టబెట్టడం, ఎక్కడ, ఎవరికి భూమి కావాలన్నా దళితులు, పేదల చేతుల్లో ఉన్న భూములే గుర్తుకువచ్చే పాలక ప్రభుత్వాలు ఎవరున్నా దోపిడీలో సారూప్యత, సమన్వయం, సఖ్యతను చాటే మేకవన్నె పులులను ఎదుర్కోవాలంటే సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ విజయనగరం నియోజకవర్గ సమితి నాయకులు పొందూరు అప్పలరాజు, వెలగాడ రాజేష్, బూర వాసు, మద్దుల సూరిడమ్మ, ఎఐవైఎఫ్ సభ్యులు ఆర్. రాజ్ పాల్ మరియు పార్టీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## శ్రీ భోగలింగేశ్వరస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు

- ఆదాయం 78,288 రూపాయలు

**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 17 (మనసులో మాట) :** అనకాపల్లి శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ధర్మకర్తల మండలి మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇన్స్పెక్టర్,భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగింది. ఇటీవల మహాశివరాత్రి పర్వదినాన (28 రోజులకు) భక్తులు కానుక రూపంలో హుండీ ద్వారా వచ్చిన ఆదా యం 55628 రూపాయలు, టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయం 22660 రూపాయలు మొత్తం 78288 రూపాయలు . విదేశీ కాయిన్స్ యూఏఈ ధీరమ్స్ 30 విలువ కలిగినవి వచ్చాయని దేవస్థాన ఛైర్మెన్ కాండ్రేగుల సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమం



లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి మురళీకృష్ణ, హుండీ పర్యవేక్షకులు చంద్ర తేజ, ధర్మకర్త మండలి సభ్యులు యలమంచిలి బంగారు రాజు, పెంటకోట అనూష గణేష్, రాపేటి లీలా సంతోష్, అర్చకులు పేరూరు చిన్నస్వామి, దేవస్థాన సిబ్బంది రామ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరంలో 71 యూనిట్ల సేకరణ

**చోడవరం , మార్చి 17 (మనసులో మాట) :** కన్నడ నట దిగ్గజం, దివంగత పునీత్ రాజ్ కుమార్ 51వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ నూకాంభిక కళ్యాణ మండపం లో నిర్వహించిన శిబిరం లో 71 యూనిట్లు రక్తం సేకరించారు చోడవరం ఎలక్ట్రికల్ ఎడిఈ వై.సురేష్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన సేకరణ వంటి సమాజ హితం కోరే సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని సంస్థ నిర్వాహకులను ప్రోత్సహించారు. ఆయనతోపాటు



పాల్గొన్న కాళ్ల వెంకట రమణ మూర్తి, సింగంపల్లి రవికుమార్ లు యువత సేవా తపస్వి లాంటి పునీత్ రాజ్ కుమార్ ను ఆదర్శంగా తీసుకుని రక్త సేకరణ వంటి కార్యక్రమాలు చేయడం మంచి సంప్రదాయం అన్నారు .ఇప్పటికీ 5వ సారి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షులు గోలుకొండ గణేష్ తెలిపారు . కార్యక్రమంలో సంఘ సభ్యులు తప్పెటల గణేష్ కుమార్, సాంబారు శ్రీను, పవన్, ప్రసాద్, సాయి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు హాజరయ్యారు

## శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ వారి 68వ వార్షిక జాతర మహోత్సవంలో సిరమ్మ

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 17 :** పాత పశువుల మార్కెట్ దగ్గర మంగళ వీధిలో కొలువైవున్న శ్రీ శ్రీ శ్రీ నూకాలమ్మ వారి 68వ వార్షిక జాతర మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ మంగళవారం ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. అమ్మవారి జాతరలో పాల్గొన్న సిరమ్మకి నూకాలమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక ముఖ్య నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీ నూకాళామ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల ఆశీర్వాదం పొందారు. తదనంతరం కమిటీ వారు ఏర్పాటు చేసిన ప్రసాదంను తాను స్వయంగా భక్తులకు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ వారి కృప కటాక్షాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో కలిగి ఉండాలని ఆమె కోరారు. ఉత్సవ కమిటీలు ఇటువంటి కార్యక్రమాలు చేయడంవలన ప్రజల్లో భక్తి భావాన్ని, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో 25 వ డివిజన్ కార్పొరేటర్ యడ్ల రాజేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్య కర్తలు, భక్తులు, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. సినిమా టికెట్ ధరలు పెంచి సామాన్యుడికి వినోదాన్ని దూరం చేయడం దుర్మార్గం. సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలని ఎఐవైఎఫ్ డిమాండ్. గత కొద్ది కాలంగా భారీ బడ్జెట్ సినిమాల పేరుతో థియేటర్లలో టికెట్ ధరలను ఇష్టానుసారంగా పెంచుతూ సామాన్య ప్రేక్షకుడిపై మోయలేని భారం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాము. వినోదం అనేది ప్రతి ఒక్కరి హక్కు, కానీ నేడు మల్టీప్లెక్స్‌లు మరియు




సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకున్నాయని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బూర వాసు మండిపడ్డారు .మంగళవారం ఉదయం విజయనగరంలో స్థానిక సినిమా థియేటర్ దగ్గర రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు నిరసన కార్యక్రమం తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు, జిల్లా ఉపాధ్యక్షులు వెలగాడ రాజేష్ లు మీడియాలో మాట్లాడుతూ సినిమా టికెట్ ధరలు పెంచి సామాన్యుడికి వినోదాన్ని దూరం చేయడం దుర్మార్గమన్నారు. రైతు పంటకి గిట్టుబాటు ధర అడిగితే పెంచారు కానీ సినిమా టిక్కెట్ ధరలు పెంచుతారా అని ప్రశ్నించారు. ధరల నియంత్రణ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, భారీ చిత్రాల విడుదలకు ఇచ్చే ప్రత్యేక ధరల పెంపు జీవోలను నిలిపివేయాలన్నారు. పాత ధరలు సామాన్య మధ్యతరగతి కుటుంబాలు థియేటర్లకు వచ్చి సినిమా చూసేలా టికెట్ ధరలను గతంలో ఉన్న సాధారణ స్థాయికి తగ్గించాలని డిమాండ్ చేశారు. టికెట్ ధరల నిర్ణయంలో ప్రేక్షకులకు మరియు ప్రజా సంఘాలకు భాగస్వామ్యం కల్పించాలన్నారు. అర్ధరాత్రి పూట జీవోలు విడుదల చేస్తూ ప్రేక్షకులను ఇబ్బంది పెట్టకూడదన్నారు. సినిమా పరిశ్రమ మనుగడ సాగాలంటే కేవలం వసూళ్లు మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకుడు థియేటర్ కు రావడం కూడా ముఖ్యం. ధరలు తగ్గించని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మాజీ పొందూరు అప్పలరాజు, నాయకులు ఆర్ రాజ్ పాల్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రెండు కిలోల గంజాయితో వ్యక్తి అరెస్టు

**దేవరాపల్లి , మార్చి 17 (మనసులో మాట) :** పోలీసులకు ముందస్తు సమాచారం మేరకు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దాడి నిర్వహించి రెండు కేజీల గంజాయితో పాటు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీరాంపురం జంక్షన్ వద్ద మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా జైనవాడు వైపు నుంచి ఒక వ్యక్తి బ్యాగ్ తో వచ్చి పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా ఆ వ్యక్తిని వెంబడించి పట్టుకున్నారు. రెండు కిలోల గంజాయితో పట్టుబడిన వ్యక్తి బి హేమంత్ కుమార్ (23)ను అరెస్ట్ చేసి చోడవరం కోర్టుకి హాజరు పరిచినట్లు స్థానిక ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. ఈ వ్యక్తి ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి విజయవాడకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైందని ఎస్ఐ సత్యనారాయణ



పేర్కొన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు.

## పతంజలి పురస్కారానికి కుప్పిలి పద్మ ఎంపిక

**విజయనగరం , (మనసులో మాట) జిల్లా ప్రతినిధి మార్చ్ 17 :** కె.ఎన్.వై పతంజలి సాహితీ పురస్కారానికి ఈ ఏడాదికి ప్రముఖ స్త్రీ వాద రచయిత్రి కుప్పిలి పద్మని ఎంపిక చేసినట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ ప్రకటించారు. ఈ నెల 29వ తేదీన గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరిగే పతంజలి జయంతోత్సవాలలో ఈ పురస్కారాన్ని ఆమెకు ప్రధానం చేస్తామని వెల్లడించారు. మంగళవారం గురజాడ ఇంట్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్లుగా పతంజలి పేరిట రచయితలైన జర్నలిస్టులకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ మోహన్, దేవీ ప్రియ, సతీష్ చందర్, జీ.ఆర్. మహర్షి, గంటేడ గౌరి నాయుడు, అట్టాడ అప్పలనాయుడు, చింతకింది శ్రీనివాసరావు, రౌతు బంగారు నాయుడు, అరుణ పప్పు, తాడి ప్రకాష్ కి ఇవ్వడం మా వేదికకు ఎంతో గర్వకారణమన్నారు. ఆ క్రమంలోనే ఈ ఏడాదికి గాను కుప్పిలి పద్మని తమ కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఆమె వార్తలో మైదానం శీర్షికన సమకాలీన అంశాలపై స్పందించిన తీరు తెలుగు విమర్శకుల ప్రశంసలు అందుకున్నారని అన్నారు. సుమారుగా 159 కథలు రాశారన్నారు. వాటిలో ఆరు నవలలు ఉన్నాయన్నారు. ప్రధానంగా కరోనా మహమ్మారి



ముట్టడించి అతలాకుతలం చేస్తున్న దశలో 'మళ్లీ తేయాకు తోటలోకి' పేరిట కార్మికుల జీవితాల్లోని ఒడిదుడుకులను చాలా హృద్యంగా రచించారు న్నారు. రచనా వ్యాసంగంలో ఆమె ప్రతిభా పాటవాలకి గుర్తుగా ఎన్నో అవార్డులు ఆమెను వరించాయన్నారు. వాటిలో ప్రముఖంగా ఆంధ్రప్రదేశ్ ఉగాది పురస్కారం, సుశీలా నారాయణ రెడ్డి ఉత్తమ రచయిత్రి అవార్డు, అరుణ్ సాగర్ సాహితీ పురస్కారం, అమృతలత అపూర్వ అవార్డు, వాసిరెడ్డి సీతాదేవి అవార్డు, చాసో పురస్కారం, దాట్ల దేవదానందరాజు సాహితీ పురస్కారం...ఇలా ఎన్నో పురస్కారాలు ఆమె అందుకున్నారు. మన ఉత్తరాంధ్రకి చెందిన ప్రముఖ మహిళా రచయిత్రి కావడం మరింత గర్వకారణమన్నారు. ఈ నెల 29 ఆదివారం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాయంత్రం జరిగే పతంజలి సాహితీ పురస్కార సభకి సాహితీ వేత్తలు, విద్యార్థులు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వేదిక కార్యదర్శి న్.కె.బాబు, ప్రతినిధులు వి.ఎమ్.కె.లక్ష్మణరావు, బండ్ల మూడి నాగేంద్ర ప్రసాద్, పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు, తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భారీ స్థాయిలో జన సమీకరణ

**కోటవురట్ల , మార్చి 17 (మనసులో మాట) :** నక్కపల్లి మండలంలో ఈనెల 23వ తేదీన ఆర్సెలాల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వస్తున్న నేపాథ్యంలో భారీ స్థాయిలో జన సమీకరణ చేయాలని అధికారులు, టిడిపి నాయకులు నిర్ణయించారు.

ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా



టిడిపి ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మండల టిడిపి అధ్యక్షుడు లింగన్నాయుడు మాట్లాడుతూ ప్రజలను కార్యకర్తలను తీసుకువెళ్లేందుకు మండలానికి 40 బస్సులను కేటాయించినట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి సీఎం సభకు కార్యకర్తలు ప్రజలు బయలుదేరి రావాలని సూచించారు. ఈ మేరకు సంబంధిత గ్రామ శాఖ ఇన్చార్జిలు బాధ్యత తీసుకోవాలన్నారు. వేలాదిమందికి స్టీల్ ప్లాంట్ ఉపాధి కల్పిస్తుందన్నారు.

KANCHARLA
మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## కార్మిక సంఘాలతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తగవు : గనిశెట్టి సత్యనారాయణ




**మునగపాక , మార్చి 17 (మనసులో మాట) :** ప్రభుత్వం షాపులు మరియు సంస్థలకు సంబంధించి రెండు జీఓలు జారీ చేసింది. ఈ జీఓలు వీటిలో పనిచేసే కార్మికుల పై తీవ్ర ప్రభావం చూపిస్తాయని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇటువంటి ముఖ్యమైన సమస్యపై కనీసం కార్మిక సంఘాలతో కూడా చర్చించకుండా ఏకపక్షంగా వ్యవహరించింది. ఇప్పటికే షాపులు మరియు సంస్థలలో పనిచేసే కార్మికుల పనిగంటలను 8 నుండి 10కి పెంచింది. అదే సమయంలో వారానికి 48 గంటలు పనిచేస్తే సరిపోతుందన్నది. కానీ 10 గంటలు పనిచేస్తే అదనంగా ఒకరోజు సెలవు వస్తుందని మాత్రం ఎక్కడా చెప్పలేదు. కొద్ది కాలంలోనే ఇప్పుడు మరో జీఓ జారీ చేసి షాపులు, సంస్థలను యజమానులు ప్రతిరోజూ 24 గంటలు తెరిచి ఉంచవచ్చని, కార్మికులతో పనిచేయించుకోవచ్చని చెప్పింది. కానీ పని వారానికి 48 గంటలు మాత్రమేనని మళ్లీ ఎందుకు పనికిరాని మాటలు మాట్లాడింది. అని గని శెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారానికి 48 గంటలు మించితే ఓవర్‌టైమ్ ఇవ్వాలని చెప్పింది. కానీ ఇప్పటికే రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. షాపుల్లో కార్మికులు రోజుకు 8 గంటలకు మించిన పని కాలానికి డబుల్ ఓటీ లేకుండా 10 నుండి 12 గంటలు పనిచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, లేబర్ అధికారులు దీన్ని చూసి చూడనట్లు నటిస్తున్నారు. 24 గంటలూ సంస్థలు, షాపులు తెరిచి ఉన్నట్లయితే 8 గంటల పని విధానం ప్రకారం మూడు షిఫ్టులు ఉండాలి. ఇప్పుడు కనీసం ఆ పద్ధతిని కూడా పేర్కొనకుండా పని చేయమనడం కార్మికులను కట్టుబానిసలుగా మార్చడానికే. 48 గంటలు దాటితే ఓటీకి అర్హత ఉంటుందని చెప్పడం కార్మికులను మరోసారి మోసపుచ్చడానికే. షాపులు, సంస్థలకు రిజిస్ట్రేషన్ రెన్యువల్స్ లేకుండా కేవలం ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే చాలని చెప్పడం కూడా కార్మిక చట్టాలు పాటించని యజమానులను రక్షించడానికే. షాపులు, ఫ్యాక్టరీలు మినహా మిగతావన్నీ సంస్థల క్రిందకు వస్తాయి. బార్లు, హోటల్స్ తదితరాలన్నీ కూడా దీని క్రిందకు వస్తాయి. అపారమైన సంఖ్యలో ఉన్న కార్మికులను దోపిడీ చేసుకుని యజమానులు తమ వ్యాపారాలను తేలిక చేసుకునేందుకు, వేగంగా చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కార్మికుల ప్రయోజనాలు దానికి పూచిక పుల్లగా ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులు కూటమి ప్రభుత్వ విధానాలను ఎదురించి పోరాడాలని, 8 గంటల పని విధానాన్ని రక్షించుకోవాలని గని శెట్టి పిలుపునిచ్చారు. ఈ రెండు జీఓ లను వెంటనే ఉపసంహరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గని శెట్టి డిమాండ్ చేశారు.

## శృంగవరపుకోట ఆర్టీసీ డిపో డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి



**శృంగవరపుకోట , మార్చి 17 (మనసులో మాట) :** శృంగవరపుకోట ఆర్టీసీ డ్రైవర్ల నిర్లక్ష్య వైఖరి మరోసారి రుజువైంది... విజయనగరం నుండి ధర్మవరం మీదుగా ఎస్ కోట వచ్చే AP35x9689.. నెంబర్ గల బస్సు వన్ వే నుండి అనగా వన్ వే ట్రాఫిక్ వద్ద రైట్ సైడ్ సబ్ వే గుండా శ్రీ శ్రీనివాస మహల్ పక్కనుండి పోలీస్ స్టేషన్ ఎదురుగా వెళ్లకుండా డైరెక్ట్ గా గాంధీ బొమ్మ జంక్షన్ నుండి దేవి గుడిజంక్షన్ మీదుగా కాంప్లెక్స్ కు వెళ్లడం వలన ట్రాఫిక్కు చాలా అంతరాయం కలుగుతుంది.. ఎదురుగా బస్సు వస్తే తప్పుకునేందుకు కనీసం 10 నుండి 15 నిమిషాలు సమయం పడుతుంది... దీనివలన బైక్ మీద వెళ్లే వాళ్లకు నడిచి వెళ్లే ప్రజలకు చాలా అంతరాయం కలుగుతుంది... మార్చి 16 తారీఖున సంధ్య అనే హోంగార్డు వన్ వే రూల్స్ పాటించని బస్సు ముందు అడ్డంగా నిలబడి బస్సును ఆపింది... అయినా సరే ఈరోజు కూడా వన్ వే ట్రాఫిక్ రూల్స్ ను పాటించకుండా వారికి ఇష్టం వచ్చినట్టుగా బస్సులను నడుపుతున్నారు... ఇలాంటి డ్రైవర్లపై ఆర్టీసీ డిపో యాజమాన్యం సీరియస్ గా యాక్షన్ తీసుకోవాలి అని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు..



## స్వర్ణాంధ్ర 2047 లక్ష్యసాధన కై అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

- నైపుణ్య యాప్ వినియోగం పై యువతకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్ణయాల అమలుపై అధికారులకు దిశా నిర్దేశం : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

**అనకాపల్లి ప్రతినిధి , మార్చి 17 (మనసులో మాట) :** స్వర్ణాంధ్ర 2047 సాధనలో భాగంగా నిర్ణయించిన పది సూత్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ చేపట్టి రాష్ట్రం లో జిల్లా ను అభివృద్ధి పథంలో ప్రథమ స్థానంలో నిలిచేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా ఈనెల 5 న రాష్ట్ర ముఖ్యమంత్రి తో జిల్లా అభివృద్ధి కార్యక్రమాల పై జరిగిన రివ్యూ సమావేశానికి సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి దిశా నిర్దేశం చేసారు. అనంతరం ఈనెల 11, 12 తేదీలలో అమరావతి సచివాలయంలో రెండు రోజుల కలెక్టర్ల కాన్ఫరెన్స్లో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల అమలుపై అధికారులతో సమీక్షించారు. ప్రతి కుటుంబానికి బేసిక్ ఫ్యామిలీ ఎమెనిటీస్ అందేలా చూడడంతో పాటు కమ్యూనిటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను మెరుగుపర్చాలని అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో రోడ్డు కనెక్టివిటీ పెంచడం, డ్రైనేజ్ నెట్‌వర్క్ మెరుగుపరచడం, స్ట్రీట్ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ (వేస్ట్ టు వెల్త్) కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని చెప్పారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సేవల నాణ్యత పెంపు, ప్రభుత్వ ప్రధాన పథకాల అమలు, వాట్సాప్ గవర్నెన్స్ పై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ మార్గదర్శి- బంగారు కుటుంబం పథకం కింద ఫ్యామిలీ కార్డు ద్వారా కుటుంబాలకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథ కాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మరిం త నాణ్యతతో అమలు చేయాలన్నారు. వ్యవసాయ రంగం లో ఆధునిక సాంకేతికత పెంచాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నైపుణ్య యాప్ వినియోగం పై యువతకు అవగాహన శిబిరాలు ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల నియంత్రణపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మండల, వార్డు, గ్రామ స్థాయిలో ఎక్కడా మంచినీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జలధార స్కీమ్ జిల్లాలో అమలు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టా లన్నారు. రిజర్వాయర్ ఫిల్లింగ్ , వాటర్ హార్వెస్టింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వార్డులలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు.

పి.ఎం సూర్యఘర్, పి.ఎం కుసుమ్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. స్వచ్చాంధ్ర కార్యక్రమంలో జిల్లాను మరింత మెరుగు పర్చాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని ఎడి మార్కెటింగ్ ను కలెక్టర్ ఆదేశించారు. స్మార్ట్ కిచెన్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ పై అధికారులకు పలు సూచనలు చేసారు. ముందుగా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న జిల్లాలలో అనకాపల్లి జిల్లా మూడవ స్థానంలో నిలిచిందని అందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ ని జిల్లా అధికారుల సంఘం తరపున మరియు రెవెన్యూ అధికారుల సంఘం ఘనంగా సన్మానించారు. ఈ సమీక్ష సమావేశంలో జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సిపిఓ రామారావు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ కంఠం భూమి అన్యాక్రాంతం కాకుండా చూడాలని కలెక్టర్ కు ఫిర్యాదు



**మాకవరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** మాకవరపాలెం సర్వేనెంబర్ 173లో గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ కంఠంకు సంబంధించిన 40 సెంట్ల భూమిని ఆక్రమించేందుకు కొందరు భూ ఆక్రమణదారులు ప్రయత్నిస్తున్నారనే సమాచారంతో , ఆక్రమణను అడ్డుకునేలాఅధికారులకు ఆదేశాలు ఇవ్వాలని మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష మాట్లాడుతూ, సర్వేనెంబర్ 171 కవిశెట్టి చెరువుకు ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 173లో సుమారు రూ. 2 కోట్లు విలువచేసే 40 సెంట్లు భూమిలో ఎటువంటి ఆక్రమణలు జరగకుండా ముందస్తుగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశామని, అయినా అక్రమార్కులు ప్రయత్నాలు చేస్తున్నారనే సమాచారంతో అక్రమాలు జరగకుండా చూసేలా అధికారులను ఆదేశించాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశామన్నారు. భవిష్యత్తులో ఆ స్థలంలో రన్నింగ్ ట్రాక్, పార్కు ఏర్పాటు చేసే ఆలోచన ఉందని ఆమె వెల్లడించారు.

## ఆటో ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆర్థిక సాయం



**నర్సీపట్నం రూరల్ , మార్చి 17 (మనసులో మాట) :** మండలంలోని అయ్యన్నపాలెం వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో మరణించిన మహిళ కుటుంబానికి శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యం లో రూ. 24 వేల ఆర్థిక సాయం అందించారు. గత ఏడాది డిసెంబర్ 12న మండలంలోని అయ్య న్నపాలెం వద్ద జరిగిన ఆటో ప్రమాదంలో గొలు గొండ మండలం చీడిగుమ్మల శివారు పోలవరం గ్రామానికి చెందిన అడ్లబోయిన లక్ష్మి మృతి చెందింది. ఆమెకు భర్త, 5 సంవత్సరాల లోపు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని ఆ కుటుంబానికి తమ వంతు సహాయంగా శ్రీకృష్ణ యాదవ సంఘం మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకు లు పోలవరం గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుం బానికి రూ. 24 వేలు ఆర్థిక సాయం అందించారు. కుటుంబానికి ఆర్థిక సాయం అందించినందుకు శ్రీకృష్ణ యాదవ సంఘానికి మృతురాలి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గం యాదవ సంఘం నాయకుడు పాము అప్పలనాయుడు, శ్రీకృష్ణ యాదవ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కోర్ని బద్రి యాదవ్, అల్లూరి జిల్లా అధ్యక్షుడు కృష్ణంరాజు యాదవ్, విశాఖ జిల్లా అధ్యక్షుడు మన్యాల శ్రీను యాదవ్, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు కోరాడ ప్రసాద్ యాదవ్, రాష్ట్ర కమిటీ నాయకుడు పల్లా నూకరాజు యాదవ్, స్థానిక నాయకులు మిస్కా రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సర్పంచ్లు, ఎంపిటీసిలకు సన్మాన కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్యచంద్ర



**నాతవరం , మార్చి 17 (మనసులో మాట) :** అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నాతవరంలో మంగళవారం మండలంలోని మహిళా సర్పంచ్ లు, ఎంపిటిసిలకు సన్మాన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర, తాండవ ప్రాజెక్టు ఛైర్మన్ కరక సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర సర్పంచ్లు, ఎంపీటీసీలను సన్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో సూర్యచంద్ర మాట్లాడుతూ మహిళలకు సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలు



కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళల పేరిట ఇప్పటికే తల్లికి వందనం, స్త్రీశక్తి ఉచిత బస్సు, ఉచిత గ్యాస్ వంటి పథకాలు అందిస్తుందని చెప్పారు. మహిళా సాధికారిత, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలగా వెంకటకృష్ణారావు, ఎంపీపీ సాగిన లక్షణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం, సింగంపల్లి సన్యాసిదేముడు, అంకంరెడ్డి నానిబాబు, మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు, నేతలు విజయ్‌కుమార్, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పలు అంశాలపై ప్రాదేశిక సభ్యులకు శిక్షణ కార్యక్రమం




**దేవరాపల్లి , మార్చి 17 (మనసులో మాట) :** స్థానిక సంస్థల అభివృద్ధిపై మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, గ్రామ వార్డు సభ్యులకు (ఎల్ ఎస్ డి జి) థీమ్ 1 నుంచి 9 పై మండల స్థాయిలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, గ్రామ వార్డు సభ్యులు హాజరయ్యారు. రిసోర్స్ పర్సన్స్ వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించార. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం, డిప్యూటీ ఎంపీడీవో మంగవేణి, కార్యాలయం పరిపాలన అధికారి డి.వి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ




**పార్వతీపురం , మార్చి 17 (మనసులో మాట) :** రాష్ట్రంలో అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం, టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులకు స్వాధీనం, భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేసి, బాడుగ ఇంట్లో ఉండే పేదవారికి అద్దె చెల్లించాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆందోళనకు శ్రీకారం చుట్టిందని పార్వతీపురం మన్యం జిల్లా సిపిఐ కార్యదర్శి కె. మన్మధరావు వాపోయారు. ఈవేరకు సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇళ్ళు ఇస్తాం! ఇంటి స్థలం ఇస్తాం! రేషన్ కార్డులు, పెన్షన్ తో పాటు మౌలిక సదుపాయాలైన రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, 24 గంటలు త్రాగునీరు అందించి, భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేసి ఆర్థిక, రాజకీయం, సామాజిక సమానత్వానికి, సాధికారతకు పెద్దపీట వేస్తామంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి ఓట్లు దండుకొని, అందలం ఎక్కగానే ఎన్నికల వాగ్దానాలు పూర్తిగా పక్కకు నెట్టి ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడడం పరిపాటిగా మారిందన్నారు. పేదవాడికి జానెడు జాగా ఇవ్వడానికి నిరాకరిస్తున్న పాలక ప్రభుత్వాలు, వారికి వత్తాసు పలికే అధికారులు విలువైన ప్రభుత్వ వాగు, వంక, చెరువు, రస్తా, అసైన్డ్, దేవాదాయ, ఈనాం, వక్ఫ్, అటవీ భూములను యదేచ్ఛగా ఆక్రమించి అమ్ముకుని సొమ్ము చేసుకునే భూ మాఫియా కొమ్ముకాస్తున్నారని, భూమిలేని నిరుపేదలకు భూమి పంపిణీ చేసే అసైన్మెంట్ కమిటీ పోరాడి సాధించుకుంటే, చట్టాన్ని సమూలమార్పులు చేసి ఫ్రీ హోల్డ్ పేరుతో ఒక్కసారిగా దళితులను భూమికి దూరం చేసే దుస్సాహసానికి ఒడిగట్టారని అన్నారు. పారిశ్రామిక అవసరాల పేరుతో, సంస్థల పేరుతో అయినవారికి ఎకరా ఐదు లక్షల విలువ చేసే భూమిని అర్ధ రూపాయికి కట్టబెట్టడం, ఎక్కడ, ఎవరికి భూమి కావాలన్నా దళితులు, పేదల చేతుల్లో ఉన్న భూములే గుర్తుకువచ్చే పాలక ప్రభుత్వాలు ఎవరున్నా దోపిడీలో సారూప్యత సమన్వయం సఖ్యతను చాటే మేకవన్నె పులులను ఎదుర్కోవాలంటే సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం అందరికీ ఇళ్ళు అనే నినాదంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి కనీసం పునాదికి కూడా సరిపోని లక్ష 50 వేలు అందిస్తామంటూ, ఇంటి స్థలం, రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల దేనంటూ ప్రధాన బాధ్యత నుండి తప్పుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 68వేల ఎకరాల్లో 17వేల కాలనీలు 32 లక్షల మందికి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 1 లక్ష 50 వేలతో పాటు అదనంగా 30 వేలు జోడించి 1 లక్షా 80 వేలతో ఒక సెంటు స్థలంలో ఇంటి నిర్మాణానికి 30.75 లక్షల మందికి బలవంతపు రిజిస్ట్రేషన్లు చేయించి ఆరు మాసాల్లో పూర్తిచేయకపోతే రద్దు చేస్తామంటూ హుకుం జారీ చేయడంతో 7.43 లక్షల మంది ఐదు రూపాయల వడ్డీకి రుణాలు తెచ్చి అప్పులపాలై ఆ ఇంటి నిర్మాణం పూర్తికాకుండానే అమ్మకానికి పెట్టినవారు, ఒక్క సెంటు స్థలం సరిపోదంటూ 21.76 లక్షల మంది ససేమీరా ఒప్పుకోనివారు, నిర్మాణ వ్యయం పెంచాలన్న వారి ఆలోచనలకు ఆజ్యం పోస్తూ తాను అధికారంలోకి రాగానే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి 4 లక్షలు ఆర్థిక సహాయం, భూమిలేని నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేస్తానంటూ నమ్మబలికి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు కావస్తున్నా అమలుచేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ డొంక తిరుగుడు షరతులతో పేదల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్నదని మన్మధరావు వాపోయారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల్లో అతి ముఖ్యమైన ఇళ్ళు, ఇంటి స్థలం వాగ్దానం అమలుచేయాలని సిపిఐ చేపట్టిన దశల వారి పోరాటాలకు దిగివచ్చి 2025 జనవరి 27వ తేదీన జిఓ ఎంఎస్ నెం. 23 విడుదల చేసిందని ఈ జీవో ప్రకారం దరఖాస్తు చేసుకునేవారు జీవితంలో ఇప్పుడే గాని ఎక్కడ గాని ఇంటి స్థలం పొందినట్లు గాని, ఇంటి పన్ను, కరెంట్ బిల్లు తన పేరు మీద ఉండరాదని, చివరకు జగనన్న కాలనీలో ఇంటి పట్టా పొంది ఇల్లు కట్టుకోకపోయినా ఇంటి స్థలం పొందడానికి అనర్హులంటూ చావుకబురు చల్లగా చెప్పినట్లు చంద్రబాబు ప్రభుత్వం పేద ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. ఇంటి స్థలం పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన షరతులు సడలించి గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం చేపట్టనివారికి, ఇంటి స్థలం తీసుకోని వారికి, ఇంటి స్థలం మంజూరు కానివారికి ప్రస్తుత ప్రభుత్వం పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు కేటాయించి, సిమెంటు, స్టీలు, ఇసుక, కంకర, ఇటుక, కూలి పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని, రోజువారి కూలీకి పోయినా పూట గడవక అద్దె చెల్లించలేక అవస్థపడుతున్న కుటుంబాలకు అద్దె చెల్లింపుకు ప్రభుత్వం ఆర్థిక భరోసా అందించి ఆదుకోవాలని, భూమిలేని గ్రామీణ నిరుపేదలకు సాగుభూమి పంపిణీ చేయాలనీ, టిడ్కో ఇళ్ళను లబ్ధిదారులకు స్వాధీనం చేయాలని సిపిఐ చేపట్టిన దశలవారీ ఆందోళనలో భాగంగా మార్చి 24న రాష్ట్రవ్యాప్తంగా లక్ష గొంతుకలు ఒక్కటై నినదిస్తూ ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆందోళన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్వీఎస్ కుమార్, ఈ.వి నాయుడు పాల్గొన్నారు.

## శ్రీ పైడితల్లమ్మ అమ్మవారికి వెండి కిరీటం అలంకరించిన జై భారత్ ఛానెల్ ఎండి దాసరి. త్రినాథ్ దంపతులు



**సబ్బవరం , మార్చి 17 (మనసులో మాట) :** సబ్బవరం మండలం పెదగొల్లలపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పైడి తల్లమ్మ అమ్మవారికి సుమారు 2.60 లక్షల రూపాయల విలువైన వెండి కిరీటం అదే గ్రామానికి చెందిన జై భారత్ ఛానెల్ మేనేజింగ్ డైరెక్టర్, జి. టి రియల్ ఎస్టేట్ అధినేత, నేటి స్వేచ్ఛ దిన పత్రిక ఎడిటర్ దాసరి త్రినాథ్ దంపతులు మంగళ వారం అలంకరించి తమ భక్తి ప్రపతులు చాటు కు న్నారు. ఇక్కడి అమ్మవారికి మూరు వారం పండుగ నిర్వహించే సమయానికి వెండి కిరీటం అలంకరించాలని తాను భావించి, వేద పండితుల తో సంప్రదించి నప్పుడు సుమారు 800 కు పైగా కిలోగ్రాముల వెండి కొనుగోలు చేయాల్సి ఉంటుందని చెప్పారని త్రినాథ్ మీడియా కు వివరించారు. ఆర్థికంగా అంత అమౌంట్ సమకూరుతుందా? లేదా? అనే మీమాంస లో పడినప్పటికీ సత్యమైన తల్లి తమ కుటుంబ దైవం శ్రీ పైడి తల్లమ్మ ఆశీస్సులతో సమయానికి అన్ని సమకూరయానిని ఆయన తన సతీమణి తో కలిసి చెప్పారు. ఈ మొక్కు బడి సందర్భంగా గ్రామం పురవీధుల్లో అమ్మ వారి ఆలయానికి. ఘటాల ఊరేగింపు డీజే సౌండ్స్, మహిళల కోలాటాల , దాండియా, భారీ ఎత్తున బాణా సంచా తో భజభజం త్రీలతో అంగరంగ వైభవంగా ఆలయానికి భక్తులతో త్రినాథ్ కుటుంబం తరలివెళ్లారు. మొక్కులు తీర్చుకున్న అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు, పంపిణీ చేశారు. భారీ అన్న సమారాధన కార్య క్రమం ఏర్పాటుచేశారు. చుట్టూ పక్కల గ్రామాలప్రజలు, ప్రజా ప్రతినిధులు, త్రినాథ్ స్నేహితులు,బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఇచ్ఛాపురం నుండి తిరుపతికి దివ్యాంగుడు సైకిల్ యాత్ర

**ఎస్. రాయవరం , మార్చి 17 (మనసులో మాట) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తిరుపతి కి సైకిల్ పై వస్తానంటూ దివ్యాంగ యువకుడు తనమొక్కు తీర్చుకునేందుకు చేపట్టిన ట్రై సైకిల్ యాత్ర మంగళవారం ఎస్. రాయవరం మండలం అడ్డరోడ్డుకు చేరుకుంది. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బోరుగంల కుచెందిన నెయ్యిల ప్రసాద్ టిడిపిఅధికారంలోకి వస్తే తిరుపతి వెంకన్న సన్నిధికి సైకిల్ యాత్రచేస్తానంటూ మొక్కుకోవటంతో దివ్యాంగుడైన ప్రసాద్ సైకిల్ పైతనయాత్ర ఇచ్ఛాపురం నుండి తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య సన్నిధి వరకు మొక్కుచెల్లింపుతో యాత్ర ప్రారంభించారు. దివ్యాంగుడు నెయ్యిల ప్రసాద్ ను అడ్డరోడ్డు వద్ద పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి ఎస్ సి సెల్ అధ్యక్షులు ఆపా గోవిందు తెలుగు దేశం పార్టీ కండువా వేసి సత్కరించారు. మధ్యాహ్నం భోజనం అందించి,ఆర్థిక సహాయం అందచేశారు.

## పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించాలి

గ్యాస్ బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి : సిపిఎం నిరసన





**కంచరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్పై చేస్తున్న యుద్ధం కారణంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలు భారీగా పెంచడాన్ని తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ (విశాఖ ఈస్ట్) కమిటీ కార్యదర్శి వి. కృష్ణారావు డిమాండ్ చేసారు. దేశంలో గ్యాస్ సిలండర్ కొరత సృష్టించి వినియోగదారులకు గ్యాస్ అందకుండా బ్లాక్ మార్కెట్ ద్వారా దళారీలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలు రద్దుచేయాలని, గ్యాస్ బ్లాక్ మార్కెట్ అరికట్టాలని, యుద్ధం ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ నిరసన ప్రదర్శన పిఠాపురం కాలనీలో ఉన్న జిల్లా ఆఫీస్ నుండి మద్దిలపాలెం బస్ స్టాప్ వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ దేశంలో గ్యాస్ కొరత లేదని మోడీ పార్లమెంట్లోనూ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రకటనలు చేస్తున్నారని వాస్తవంగా బుకింగ్ చేసిన గ్యాస్ రాక చిరువ్యాపారస్తులు తమ వ్యాపారాలను మూసివేస్తున్న సంఘటనలు రోజూ సోషల్ మీడియా, మీడియాలో వస్తున్నాయన్నారు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ గూండాయిజం, యుద్ధం ఆపకపోతే అయిల్ దిగుమతికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రష్యా నుండి చవకగా ఆయిల్ దిగుమతికి ఒప్పందాలున్నా ట్రంప్ ఆదేశాలివ్వడమేమిటని ప్రశ్నించారు. దీనిపై మోడీ ట్రంప్ స్నేహితుడా వ్యవహరించడం భారతదేశ విదేశాంగ విధానానికే ప్రమాదకరమన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్ను అదానీ లాభాలుకోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించాలని డిమాండ్ చేసారు. ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ గ్యాస్ దేశానికి 3 షిప్లు వచ్చాయని కేంద్ర చెపుతున్నా ఒక షిప్లో వచ్చే గ్యాస్ మూడు రోజులకు మాత్రమే మన భారతదేశానికి సరిపోతుందన్నది పాలకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. మరోవైపు మన విశాఖ స్టీల్ ప్లాంట్ కు గ్యాస్ నిలవలు వారంరోజులకు సరిపడ నిల్వలు మాత్రమే ఉన్నాయని దీనిపై మోడీ, చంద్రబాబు నోరుమెదకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణమే గ్యాస్ సిలండర్లు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే మన దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు అయ్యే పరిస్థితులున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు వి.సరేంద్రకుమార్, పి.వెంకటరావు, ఎం.చంటి, కె.కుమారి, పి.శంకరరావు, చలపతి, మోహన్రావు, భూలోకరావు, సన్యాసమ్మ, ఎం. లక్ష్మి, ఎం.వి.త్రినాథ్, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కురసా కన్నబాబు ను మర్యాదపూర్వకంగా కలిసిన గండి రవి కుమార్



**సబ్బవరం , మార్చి 17 (మనసులో మాట) :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ మరియు మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గండి రవికుమార్ చోడవరం నియోజకవర్గం వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకులుగా పార్టీ గుర్తించి ఆయనను నియమించిన శుభసందర్భంగా కురసాల కన్నబాబు ను కాకినాడ ఆయన క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది ఆయనతో ఉప సర్పంచ్ సిరపరపు వాసు , ఉపాధ్యక్షులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సబ్బవరం మండలం యడ్ల నాయుడు , అధ్యక్షులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం గుల్లేపల్లి గ్రామం పాటూరి రవి , అధ్యక్షులు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టూడెంట్ వింగ్ సిరపరపు సాయి లు ఉన్నారు.

## లింగ సమానత్వం మరియు గిరిజన సమాజాలపై జాతీయ సదస్సు





**విజయనగరం , మార్చి 17 (మనసులో మాట) :** కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో "ఆధునిక భారతదేశంలో లింగం మరియు గిరిజన సమాజం: సమస్యలు, వాస్తవాలు మరియు ఉద్భవిస్తున్న దృక్పథాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. ఈ జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమానికి ఒడిశా రాష్ట్రం బర్హంపూర్ కు చెందిన పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. దమయంతి బేశ్రా ముఖ్య అతిథిగా హాజరై గిరిజన సమాజ అభివృద్ధి, మహిళా సాధికారత మరియు విద్యా విస్తరణపై తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమానికి విజయనగరం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీ ఎ. కృష్ణ ప్రసాద్ గౌరవ అతిథిగా హాజరై గిరిజన ప్రాంతాలలో చట్టపరమైన అవగాహన, మహిళల హక్కులు మరియు సామాజిక న్యాయం అంశాలపై ప్రసంగించారు. ముందుగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా గిరిజన సమాజాల సమస్యలు, లింగ సమానత్వం మరియు సామాజిక మార్పు దిశగా పరిశోధనలకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ జాతీయ సదస్సులో వివిధ విశ్వవిద్యాలయాలు మరియు సంస్థల నుండి ప్రముఖ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు. వీరిలో ఇందిరా గాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ డా. సౌభాగ్య రంజన్ పాఢి, హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ కు చెందిన డా. బిజు కొర్రా, సీటీయూఏపీ బయోటెక్నాలజీ విభాగంకు చెందిన డా. పార్వతీపాడ ఇందు, సోషియాలజీ మరియు సోషల్ ఆంథ్రపాలజీ విభాగంకు చెందిన డా. జయంత్ కుమార్ బెహెరా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అలాగే హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ మరియు ట్రాన్స్‌జెండర్ సమాజానికి చెందిన బిద్దిక రమ మరియు షహీరా హస్సేన్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక మరియు మానసిక సమస్యలను వివరించారు. ఈ సమస్యలను ధైర్యంగా అధిగమిస్తూ విద్య, ఉపాధి మరియు సామాజిక సేవ ద్వారా ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు ఎలా విజయశిఖరాన్ని చేరుకుంటున్నారో తమ అనుభవాల ద్వారా వివరించారు. సమాజంలో అవగాహన పెంపొందించడం ద్వారా ట్రాన్స్‌జెండర్‌లకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని వారు ప్రస్తావించారు. సోషియాలజీ విభాగ ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీ డా. ప్రమా చటర్జీ కార్యదర్శిగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో డా. దివ్య, డా. లత కల్యంపూడి, డా. తారకేశ్వరరావు, ఇతర విభాగాధిపతులు, అతిథి అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో విద్యార్థులు గిరిజన నృత్యాలతో అతిథులను ఆహ్వానించారు.

## కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం

- టీడీపీ పార్టీ అంటే తెలుగు దాడుల పార్టీ
- టీటిడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడుని తొలగించి, తమ కార్యకర్తలపై పెట్టిన కేసులను తొలగించాలి : ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



**కంచరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** కూటమి పాలనలో రెడ్ బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో అమలు జరుగుతుందని, టీడీపీ పార్టీ అంటే తెలుగు దాడుల పార్టీ అని ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. ఓ మహిళతో టి.టి.డి ఛైర్మన్ బీఆర్ నాయుడు జరిపిన కామక్రీడలకు వ్యతిరేకంగా తిరుపతిలో శాంతియుత నిరసన తెలియజేస్తున్న మహిళలపై టీడీపీ దాడి, అరెస్టులు, పీడీ యాక్ట్ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం డాబా గార్డెన్స్, ఎల్ఐసి బిల్డింగ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద వైసీపీ శ్రేణులు ధర్నా చేపట్టారు. అనంతరం కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు చేసిన క్రామ క్రీడలకి వ్యతిరేకంగా తిరుపతిలో నిరసన తెలియజేసిన మహిళా కార్యకర్తలపై దారుణంగా దాడి చేసి వారిపై ఎస్సి, ఎస్టీ అక్రమ కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో కూటమి పాలనలో ప్రజాస్వామ్య ఉందా అని ప్రజలు భయపడి పోతున్నారని తెలిపారు తిరుమల క్షేత్రానికి బి.ఆర్. నాయుడు ఛైర్మన్ గా ఉండకూడదని రాష్ట్ర ప్రజలు కోరుతుండగా, సనాతన ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్ గా చెప్పుకునే పవన్ కళ్యాణ్ ఈ వ్యవహారంపై స్పందించడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల టీడీపీ ఎంపీ, డ్రగ్స్ వ్యవహారంలో దొరికిపోయారని ఆమె గుర్తు చేశారు. సాక్షాత్తు తిరుమల వెంకటేశ్వర స్వామి సాక్షిగా కూటమి నాయకుల అరాచకాలు బయటపడుతున్నాయని తెలిపారు. వెంటనే టీటీడీ ఛైర్మన్ గా ఉన్న బి.ఆర్.నాయుడును తొలగించి, తమ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆమె డిమాండ్ చేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కేకే రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షుడు బోణి శివరామకృష్ణ, జాన్ వెస్లీ, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొండ రాజీవ్, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## "ఒకరు వద్దు - ముగ్గురు ముద్దు నినాదం"

### జనాభా పెరిగి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తుంది : రౌండ్ టేబుల్ సమావేశంలో మహిళా సంఘాల నేతలు




**కంచరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** "ఒకరు వద్దు - ముగ్గురు ముద్దు" అనే ప్రభుత్వ నినాదం (పిల్లలు కనడంపై) అమలు జరిగితే జనాభా పెరిగి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తుందని మహిళా సంఘాల నేతలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ నినాదం ప్రగతిశీలమైనదేనా అంటూ మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పౌర గ్రంథాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో మహిళా నేతలు మాట్లాడుతూ యువతకు ఇప్పటికే ఉద్యోగాలు లేవని "ముగ్గురు పిల్లలు కనండి, రూ.25,000 ఇస్తాం" అని చెప్పి, ఆ పిల్లల్ని పోషించడానికి ఉద్యోగాలు, వృత్తి నైపుణ్యాలతో ఆదాయ వనరులు సమకూర్చలేక పోతున్న తరుణంలో ఈ పథకంతో జనాభా పెరుగుదలతో పాటు కొత్త యువతను ఉద్యోగ రహితులుగా, రుణాల్లో కూరుకుపోయే తరంగా చేయడమేనన్నారు. ఫలితంగా వారంతా పేదరికంలోకి నెట్టివేయబడి, చెడు వ్యసనాలకు బానిసలగా మారి వారి జీవితాలను దుర్భిక్షం చేసుకునే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ విధానం ద్వారా సామాజిక పరివర్తన చేయాలనుకోవడం అసాధ్యం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర జనాభా 5.37 కోట్లు దాటిందని దీంతో మెజారిటీ ప్రజలు ఉన్నత విద్య, కుటుంబ ఖర్చులు, జాబ్ ఇన్సెక్యూరిటీ లాంటి పలు సమస్యలను ఇప్పటికే ఎదుర్కొంటున్నారని తెలిపారు. పిల్లలను కనడం కోసం కేవలం నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి మూల సమస్యలు పరిష్కరించకపోతే, ఇది తాత్కాలిక మందుగా మాత్రమే పనిచేస్తుందని అభిప్రాయపడ్డారు. డబ్బు ఇచ్చి మార్చడం సాధ్యం కాదని నేటికి పసి పిల్లలకు, వృద్ధుల సంరక్షణకు సరిపడ వనరులు లేవన్నారు. కొందరు ఇది "హిందూ జనాభా పెంచే పాలసీ" అని, మరికొందరు "దక్షిణ రాష్ట్రాలు డీలిమిటేషన్లో సీట్లు కోల్పోకుండా చేసే రాజకీయ తంత్రం" అని ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు. జనాభా పెంచాలనుకుంటే ముందుగా ప్రజలకు కావల్సిన మౌలిక సదుపాయాలతో పాటు యువతకు అవసరమైన విద్య, ఉద్యోగ భద్రత, ఉపాధి, ఆరోగ్య భద్రత, వృత్తి నైపుణ్యాలు ఆర్థిక భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. ప్రోత్సాహకాలు ఇవ్వడంతో పాటు పిల్లల పౌష్టికాహారం, డే కేర్ సెంటర్స్, మహిళల సాధికారత, వనరుల నిర్వహణ, తదితర వాటితో కలిపి సమగ్ర విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలు ద్వారా ఎదురయ్యే ఈ కష్టాలను ఎలా అధిగమించాలి అనే దాని మీద సమగ్ర జరిపి, మెజారిటీ ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వ నిర్ణయం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా సంఘాల ఐక్యవేదిక నేతలు ఎం లక్ష్మి, ఏ విమల, సిహెచ్ లలిత, వెంకటలక్ష్మి, బాలనాగమ్మ, బేగం, పరమేశ్వరి, వనజాక్షి, మాధవి, సత్యవతి, వివిధ మహిళా సంఘాల నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధర ఉపసంహరించాలి

### - గ్యాస్ బ్లాక్ మార్కెట్ను అరికట్టాలి : సిపిఎం నిరసన




**కంచరపాలెం , మార్చి 17 (మనసులో మాట) :** అమెరికా, ఇజ్రాయిల్ కలిసి ఇరాన్పై చేస్తున్న యుద్ధం కారణంగా కేంద్ర బిజెపి ప్రభుత్వం గ్యాస్ ధరలు భారీగా పెంచడాన్ని తక్షణమే ఉపసంహరించాలని సిపిఎం మద్దిలపాలెం జోన్ (విశాఖ ఈస్ట్) కమిటీ కార్యదర్శి వి. కృష్ణారావు డిమాండ్ చేసారు. దేశంలో గ్యాస్ సిలండర్ కొరత సృష్టించి వినియోగదారులకు గ్యాస్ అందకుండా బ్లాక్ మార్కెట్ ద్వారా దళారీలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. పెంచిన గ్యాస్ ధరలు రద్దుచేయాలని,గ్యాస్ బ్లాక్ మార్కెట్ అరికట్టాలని, యుద్ధం ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం మద్దిలపాలెం జోన్ కమిటీ నిరసన ప్రదర్శన పిఠాపురం కాలనీలో ఉన్న జిల్లా ఆఫీస్ నుండి మద్దిలపాలెం బస్ స్టాప్ వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు పి.మణి మాట్లాడుతూ దేశంలో గ్యాస్ కొరత లేదని మోడీ పార్లమెంట్లోనూ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రకటనలు చేస్తున్నారని వాస్తవంగా బుకింగ్ చేసిన గ్యాస్ రాక చిరువ్యాపారస్తులు తమ వ్యాపారాలను మూసివేస్తున్న సంఘటనలు రోజూ సోషల్ మీడియా, మీడియాలో వస్తున్నాయన్నారు. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ గూండాయిజం, యుద్ధం ఆపకపోతే అయిల్ దిగుమతికి తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రష్యా నుండి చవకగా ఆయిల్ దిగుమతికి ఒప్పందాలున్నా ట్రంప్ ఆదేశాలివ్వడమే మిటని ప్రశ్నించారు. దీనిపై మోడీ ట్రంప్ స్నేహితుడా వ్యవహరించడం భారతదేశ విదేశాంగ విధానానికే ప్రమాదకరమన్నారు. కృష్ణా-గోదావరి బేసిన్ గ్యాస్ను అదానీ లాభాలు కోసం కాకుండా రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగించాలని డిమాండ్ చేసారు. ఆర్.కె.ఎస్.వి. కుమార్ మాట్లాడుతూ గ్యాస్ దేశానికి 3 షిప్లు వచ్చాయని కేంద్ర చెపుతున్నా ఒక షిప్లో వచ్చే గ్యాస్ మూడు రోజులకు మాత్రమే మన భారతదేశానికి సరిపోతుందన్నది పాలకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. మరోవైపు మన విశాఖ స్టీల్ ప్లాంట్ కు గ్యాస్ నిలవలు వారంరోజులకు సరిపడ నిల్వలు మాత్రమే ఉన్నాయని దీనిపై మోడీ, చంద్రబాబు నోరుమెదకపోవడం దురదృష్టకరమన్నారు. తక్షణమే గ్యాస్ సిలండర్లు అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే మన దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలు అయ్యే పరిస్థితులున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జోన్ కమిటీ సభ్యులు వి.సరేంద్రకుమార్, పి.వెంకటరావు, ఎం.చంటి, కె.కుమారి, పి.శంకరరావు, చలపతి, మోహన్రావు, భూలోకరావు, సన్యాసమ్మ, ఎం. లక్ష్మి, ఎం.వి.త్రినాథ్, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ తో ఉపాధి ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు



**మునగపాక , మార్చి 17 (మనసులో మాట) :** మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించినట్లే స్కిల్ డెవలప్మెంట్ లోను ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా సంపాదించ వచ్చని స్థానిక ఎంపీడీవో ఉషారాణి గుర్తు చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణ లో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె ఇందిరా దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎంపీపీ మల్ల జయలక్ష్మి, స్థానిక ఎంపీడీవో ఉషారాణి, స్థానిక ఎస్సై పి ప్రసాదరావు, ఐకెపి ఎఫ్ పి ఓ అనురాధ పాల్గొన్నారు. మహిళలు సమైక్య సంఘాల ద్వారా పొందే రుణాలను సకాలంలో చెల్లించి అభివృద్ధి సాధించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వివిధ శాఖలలో ప్రతిభ కనబరిచిన వారికి మహిళా సాధికారత లో భాగంగా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ ఎం జయలక్ష్మిని, ఎంపీడీవో ఉషారాణి, ఐకెపి ఎఫ్ పి ఓ అనురాధాలు గ్రామ ఐక్య సంఘంలోని మహిళలను ఘనంగా సత్కరించారు.

## ఉపాధి హామీ పథకంపై కేంద్రం కక్ష సాధింపు



**నెల్లిమర్ల , మార్చి 17 (మనసులో మాట) :** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తూట్లు పడుతున్నాయని, తక్షణమే 'వికసిత భారత్ గ్రామీణ రోజ్ గార్ అజీవికా మిషన్' ని రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం కొండగుంపాం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. రామారావు మాట్లాడుతూ, 2005లో వామపక్షాల పోరాట ఫలితంగా ఏర్పడిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కార్మికులకు 'పని పొందే హక్కు'ను కల్పించిందని గుర్తు చేశారు. అయితే, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలహీనపరిచి, దాని స్థానంలో కొత్త పథకాన్ని తీసుకురావడం వల్ల కార్మికులు తమ చట్టబద్ధమైన హక్కును కోల్పోయి, కేవలం ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త పథకం వల్ల కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు కేటాయించకుండా, రాష్ట్ర ప్రభుత్వాలపై 40% నిధుల భారం వేయడం వల్ల పథకం అమలు కుంటు పడే ప్రమాదం ఉందన్నారు. ఈ-కేవైసీ వంటి కఠినమైన సాంకేతిక నిబంధనల వల్ల అమాయక కార్మికులు పనికి దూర మవుతారని చెప్పారు. కొత్త నిబంధనల వల్ల పని దినాలు తగ్గి, కార్మికుల సంఖ్యను భారీగా తగ్గించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. తక్షణమే పాత చట్టాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

## మారనున్న కొవ్వాడ రూపురేఖలు

- ఎమ్మెల్యే మాధవమ్మ సహకారం:గ్రామంలో మౌలిక విప్లవం
- రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు
- రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం : సర్పంచి కోట్ల రఘు



**పూసపాటిరేగ , మార్చి 17 (మనసులో మాట) :** పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడ అగ్రహారం గ్రామం అభివృద్ధిలో సరికొత్త మైలురాళ్లను అందుకుంటోంది. నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రత్యేక చొరవతో, సుమారు రూ. 2 కోట్ల భారీ నిధులతో గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక 'ఆదర్శ గ్రామం'గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలకవర్గం అడుగులు వేస్తోంది.

**ఎమ్మెల్యే సహకారంతో 'మౌలిక' విప్లవం:**

ఎమ్మెల్యే లోకం మాధవి మంజూరు చేసిన నిధులతో గ్రామంలో దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోంది. గ్రామమంతటా అత్యాధునిక సిమెంట్ రోడ్లు, శాస్త్రీయ పద్ధతిలో కాలువల నిర్మాణం వంటి పనులు చేపట్టారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోయే సమస్యకు చెక్ పెడుతూ, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తూ ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి.

**ముగింపు దశలో కీలక పనులు:**

ప్రస్తుతం జనసేన నాయకులు, గ్రామ సర్పంచి కోట్ల రఘు ఆధ్వర్యంలో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన పనులు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. రామాలయం వీధి నుండి ఎల్లమ్మ తల్లి గుడి మీదుగా వీర్ని సత్తిబాబు ఇంటి వరకు సిమెంట్ రోడ్డు మరియు కాలువ నిర్మాణం. చేపడుతున్నారు. ఈ పనులు ప్రస్తుతం ముగింపు దశకు చేరుకున్నాయి. త్వరలోనే వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

**రాష్ట్రంలో ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం:**

ఈ సందర్భంగా సర్పంచి కోట్ల రఘు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే లోకం మాధవి అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు.

"గ్రామ ప్రజల చిరకాల స్వప్నమైన మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను ఈ నిధులతో పూర్తి చేస్తున్నాం. కొవ్వాడ అగ్రహారాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే అండతో మరిన్ని నిధులు రాబట్టి, గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు**

గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ నిధులతో పనులు జరగడంపై కొవ్వాడ అగ్రహారం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బురద రోడ్ల బాధ తప్పిందని, డ్రైనేజీ కాలువల వల్ల రోగాలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, సర్పంచికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

కోస్తాంధ్ర

| | | |
|---|---|---|
| తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా |
| గుంటూరు | ప్రకాశం | నెల్లూరు |

బుధవారం 18 మార్చి 2026


## టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు

# రాజీనామా చేయాలి

**- తిరుపతిలో ఆందోళన చేస్తున్న వైసీపీ మహిళలపై దాడి.. పై పెచ్చు తప్పుడు కేసులా?!**

**- రాజమహేంద్రవరంలో వైసీపీ శ్రేణుల నిరసన**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** తిరుపతి గ్రాండ్ రిడ్జ్ హోటల్ దగ్గర శాంతియుతంగా నిరసన చేస్తున్న వైఎస్సార్ సీపీకి చెందిన మహిళలపై దాడి చేసి తిరిగి వారి పైనే తప్పుడు కేసులు పెట్టడాన్ని ఖండిస్తూ రాజమహేంద్రవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన నిర్వహించారు. టీటీడీ చైర్మన్ పదవికి బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని డిమాండు చేస్తూ స్థానిక మోరంపూడి జంక్షన్ వద్ద, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ మంత్రి, తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైసీపీ నేతలు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు చెల్లుబోయిన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానన్నీ, స్వామి వారినీ కోట్లాది మంది భక్తులు ఆరాధ్య దైవంగా భావిస్తారన్నారు. సీఎం చంద్రబాబు లడ్డులో కల్తీ జరిగిందని టీటీడీ కి మచ్చ తీసుకొచ్చారన్నారు. ఎంతోమంది గొప్ప వ్యక్తులు టీటీడీ చైర్మన్ లుగా పనిచేసి మంచి చేశారని..కానీ బీఆర్ నాయుడు రుణం తీర్చుకోవటానికి ఆయనకు పదవి ఇచ్చారని అన్నారు. నాయుడు ఛైర్మన్ అయినప్పటి నుంచి దర్శనాల్లో ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మహిళల పట్ల అతని ప్రవర్తన సమాజం తలదించుకునేలా ఉందన్నారు. భక్తులు ఎంతోమంది అతన్ని చైర్మన్ పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నా.. చంద్రబాబు తన సొంత మనిషి కాబట్టి విలేకరులు, ఎవరు ఎన్నిసార్లు అడిగినా స్పందించటం లేదన్నారు. నా దైవం వెంకటేశ్వర స్వామి అని చెప్పే చంద్రబాబు టీటీడీలో సమస్యలు వస్తే బీఆర్ నాయుడును ఎందుకు తప్పించటం లేదని ప్రశ్నించారు. టీటీడీనీ ప్రక్షాళన చేసి నాయుడు పై చర్యలు తీసుకోవాలని అక్కడ శాంతియుతంగా ధర్నా చేస్తే వారిపై దాడి చేయించారని చెల్లుబోయిన మండిపడ్డారు. తిరిగి వారిపై కేసులు పెట్టి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు టీడీపీ కండువా కప్పుకుని పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్ని పాలిస్తున్న నాయకులకి మంచి బుద్ధి ప్రసాదించాలని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించామన్నారు. స్వయంగా టీడీపీ ఎంపీ డ్రగ్స్ కేసులో ఇరుక్కున్నాడని, ఆయనపై కూడా చర్యలు తీసుకోపోగా వెనకేసు కొస్తున్నారు.. ఇదేమి ధర్మం, ఇదేమి న్యాయమని ప్రశ్నించారు. బీఆర్ నాయుడిని వెంటనే ఆ పదవి నుంచి తొలగించాలని వైసీపీ తరపున డిమాండుబి చేస్తున్నామని చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, మాజీ ఎమ్మెల్యేలు గెద్దం శ్రీనివాస నాయుడు, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, రాజమండ్రి పార్లమెంట్ వైసీపీ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడపాటి షర్మిళ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మాజీలే

**- పుర 'పాలకుల' పెత్తనానికి తెర - అధికారుల చేతుల్లోకి అజమాయిషీ**

**- బుధవారం నుంచి ప్రత్యేక అధికారుల రాక**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** పుర 'పాలకుల' పెత్తనం నీటితో ముగిసింది. ఆ అజమాయిషీ అధికారుల చేతుల్లోకి బదిలీ అయింది. పట్టణ స్థానిక సంస్థల పరిపాలనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలోని పుర పాలక సంఘాలు, కార్పొరేషన్లలో పాలన సాగిస్తున్న ప్రజా ప్రతినిధుల పదవీ కాలం ఈ నెల 17వ తేదీ (మంగళవారం)తో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ కాలం ముగిసిన తర్వాత పరిపాలనలో ఎలాంటి అవాంతరాలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ నిర్ణయం ప్రకారం రాష్ట్రంలోని చాలా పట్టణ సంస్థలు త్వరలో ప్రత్యేక అధికారుల పాలనలోకి రానున్నాయి. ప్రస్తుత మున్సిపల్ చైర్మన్లు, నగర కార్పొరేషన్ మేయర్లు తమ పదవీ కాలం ముగిసిన తర్వాత వారి స్థానంలో కొత్త అధికారులను నియమించి పరిపాలనా బాధ్యతలు స్వీకరిస్తారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లకు ఐఏఎస్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే మున్సిపాలిటీలకు ఆర్డీఓ కేడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. నేటి (18వ తేదీ) నుంచి ఈ అధికారులు ఆ పట్టణ సంస్థల బాధ్యతలు స్వీకరిస్తారని ప్రభుత్వం స్పష్టం చేసింది. **నేటి నుంచి ప్రత్యేక అధికారులు రాక..** రాష్ట్రంలో అన్ని పురపాలక సంఘాలలో ప్రత్యేక అధికారులు నేటి (బుధవారం) నుంచి కొలువుదీరనున్నారు. మున్సిపాలిటీలు,నగర పంచాయతీల కాల పరిమితి మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో నేటి (బుధవారం) నుంచి ఈ స్థానాల్లో ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. తిరిగి ఎన్నికలు జరిగే వరకు లేదా గరిష్ఠంగా ఆరు నెలల పాటు అధికారుల పాలనలోనే పురపాలన కొనసాగుతుంది. పదవీ కాలం పూర్తిచేసుకున్న ప్రజాప్రతినిధులంతా ఇకపై 'మాజీలు'గా మారనున్నారు.



### ఆహారం నాణ్యత విషయంలో

# రాజీ పడవద్దు

**- ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రాజమహేంద్రవరం నగరంలోని 46వ డివిజన్ రామదాసు పేట లోని మున్సిపల్ స్కూల్లో మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు పెట్టే ఆహారం విషయంలో ఎలాంటి లోపం చూపవద్దని, నాణ్యత విషయంలో అసలు రాజీ పడొద్దని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక టీడీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.



## వైఎస్ జగన్‌ను కలిసిన కొప్పన శివనాథ్..

**పిఠాపురం( మనసులో మాట) మార్చి 17:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిశీలకులు పిఠాపురం వాస్తవ్యులు కొప్పన శివ నాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి కొప్పన మోహనరావు కుమారుడైన శివ నాథ్ ,ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, ప్రస్తుత రాజకీయ పరిణామాలపై జగన్‌తో చర్చించినట్లు సమాచారం.

### మృతుల కుటుంబాలకు

# అండగా ఉంటామని భరోసా

**- దురదృష్టవశాత్తు మరణించిన బాధితుల కుటుంబాలకు మంత్రి కందుల దుర్గేష్ పరామర్శ**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం గ్రామానికి చెందిన బర్రి పైడారావు విద్యుత్తు షాక్‌కు గురై ప్రమాదవశాత్తు మృతి చెందిన వార్త వినగానే రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పైడారావు భౌతిక కాయానికి ఘన నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మనో ధైర్యం కల్పించారు. అదే విధంగా, ధవళేశ్వరం శాంత రామ్ హాస్పిటల్ సమీపంలో ఆర్టీసీ బస్సు, మోటార్ సైకిల్‌ను ఢీకొన్న దుర్ఘటనలో మద్దూరు లంక గ్రామానికి చెందిన దంపతులు యర్రంశెట్టి శ్రీనివాసు, యర్రంశెట్టి బేబీ అక్కడికక్కడే మృతి చెందడంపై మంత్రి దుర్గేష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వారి భౌతిక కాయాలను సందర్శించి నివాళులర్పించిన మంత్రి దుర్గేష్ ఆ కుటుంబానికి తీరని లోటు పట్ల ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. అనంతరం నిడదవోలు పట్టణ 10వ వార్డు కౌన్సిలర్ ఆరుగొల్లు వెంకటేశ్వర రావు సతీమణి ఆరుగొల్లు అన్నపూర్ణ (72) మరణించారన్న విషయం తెలుసుకుని మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేశారు.

# వివాహ వేడుకకు, హాజరు కావాలని..

**ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కుమార్తె సనాతని శుభలేఖను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విద్యాశాఖ మంత్రి లోకేష్ కి అందజేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి**





**అనపర్తి (మనసులో మాట) మార్చి 17:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ జే ఆర్ సి కన్వెన్షన్ లో ఏప్రిల్ 2 వ తేదీన జరగబోయే అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల కుమార్తె డాక్టర్ నల్లమిల్లి సనాతని, పాణ్యం శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి వెంకటరెడ్డి దంపతుల కుమారుడు జనార్దన్ రెడ్డి ల వివాహ వేడుకకు, హాజరు కావాలని వుండవల్లి నివాసశీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,విద్యా మరియు ఐటిశాఖమంత్రి శ్రీనారాలోకేష్ ను కోరుతూ శుభలేఖలను అందించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘరెడ్డి, వధువు డాక్టర్ నల్లమిల్లి సనాతని, పాణ్యం శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి వెంకటరెడ్డి దంపతులు, వరుడు గౌరు జనార్దన్ రెడ్డి.



## రాజమహేంద్రవరంలో

# ఉగాది పురస్కార మహోత్సవం

**- కవులు, కళాకారులకు ఘన సన్మానం**

**- ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రాజమహేంద్రవరం లోక్ సభ నియోజక వర్గంలోని కవులు, పండితులు, కళాకారులను సముచిత రీతిలో గౌరవించేందుకు "శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార మహోత్సవం" ఈ నెల19 వ తేదీ గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు లోక్ సభ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉగాది పురస్కార మహోత్సవం గురువారం ఉదయం 8.30 గంటలకు రాజమహేంద్రవరం నగరంలోని జేకే గార్డెన్స్, జవహర్ లాల్ నెహ్రూ నగర్ రోడ్డు (జేఎన్ రోడ్డు) వద్ద నిర్వహించడానికి ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ప్రతిభావంతులైన కవులు, పండితులు, కళాకారులను సన్మానించనున్నట్లు ఆమె తెలిపారు. సాంస్కృతిక రంగ అభివృద్ధికి ఈ పురస్కారాలు ప్రోత్సాహకరంగా నిలుస్తాయని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. అందువల్ల సంబంధిత వర్గాల వారు, సాహితీ సాంస్కృతికాభిమానులు, ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి కోరారు.

# వైసీపీ ముఖ్య నాయకుల సమావేశం

**- జిల్లా నలుమూలల నుండి హాజరైన కీలక నేతలు**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీ జిల్లా ప్రముఖ నేతలు సమావేశం అయ్యారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు గ్రామంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు, మాజీ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వజ్ర భాస్కర్ రెడ్డి విచ్చేసి డిజిటలైజేషన్ ప్రక్రియ గురించి, దాని విధి విధానాలు పూర్తి వివరించి ముఖ్య నాయకులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తానేటి వనిత, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్, మాజీ శాసన సభ్యులు గెద్దం శ్రీనివాస నాయుడు, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, తలారి వెంకట్రావు, పార్లమెంట్ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శులు గోందేశీ శ్రీనివాస రెడ్డి, నక్కా రాజబాబు, గిరజాల బాబు, యాదల స్టాలిన్, అంగాడ సత్యప్రియ, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## టీ టీ. డి చైర్మన్ బి ఆర్ నాయుడు పై వచ్చిన ఆరోపణలపై

# శాంతియుత నిరసనకు కేసులా

**జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షుడు దాడిశెట్టి రాజా**




**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** ఓ మహిళతో టీటీడీ చైర్మన్ బి ఆర్ .నాయుడు జరిపిన కామక్రీడలకు వ్యతిరేకంగా నిన్న తిరుపతిలో శాంతి యుత నిరసన తెలియజేస్తున్న మహిళలపై టీడీపీ వాళ్ళతో దాడి చేయించి, అనంతరం పోలీస్ కేసులు పెట్టి అరెస్టు చేసి,పీడీ యాక్ట్ పెట్టడానికి వ్యతిరేకంగా మంగళవారం కాకినాడ లో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షులు దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ పార్టీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో రూరల్ కోఆర్డినేటర్ మాజీ మంత్రి కురసాల కన్నబాబు జగ్గంపేట కో ఆర్డినేటర్ మాజీ మంత్రి తోట నరసింహశీ పిఠాపురం కో ఆర్డినేటర్ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ ,పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు విప్పర్తి వేణుగోపాల్ మహిళ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించండి

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని గౌతమీ జీవకారుణ్య సంఘం పాలక మండలి సభ్యులకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) సూచించారు. గోదావరి గట్టున ఉన్న గౌతమీ జీవకారుణ్య సంఘం భవనం ప్రస్తుతం శిధిల స్థితికి చేరడంతో అక్కడ ఆశ్రయం పొందుతూ చదువుకుంటున్న విద్యార్థులకు లాలా చెరువు రోడ్డులోని ఆర్టీఓ కార్యాలయం సమీపంలో ఉన్న వృద్ధుల శరణాలయంలో తాత్కాలికంగా వసతి కల్పించారు. సదరు వసతి గదిని శాసన సభ మాజీ సభ్యురాలు ఆదిరెడ్డి భవాని, గౌతమీ జీవ కారుణ్య సంఘం చైర్మన్ వర్రే శ్రీనివాసరావు లతో కలసి ఎమ్మెల్యే వాసు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గోదావరి గట్టు ఉన్న భవనం ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నందున దాని స్థానంలో నూతన భవనాన్ని నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పుష్కర నిధుల నుంచి రూ. 2.8 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఆ భవనంలో వసతి, భోజన సౌకర్యాలు పొందుతున్న అనాధ బాలలకు తాత్కాలికంగా లాలా చెరువు రోడ్డులోని ఈ వృద్ధుల శరణాలయంలో వసతి సౌకర్యాలు, వారు చదువుకు నేందుకు రీడింగ్ రూమ్, ఇతర ప్రత్యేక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఇంకేమైనా సౌకర్యాలు కావాల్సి వస్తే సమకూర్చాలని పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. అనంతరం వృద్ధులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి దంపతులు మధ్యాహ్నం భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు మిస్కా జోగినాయుడు, కందికొండ అనంతరావు, పోలాకి శ్రీదేవి, కడియాల శ్రీలత, పాలక సత్యనారాయణ, ముమ్మిడి భాగ్యలక్ష్మి, గూటాల సంజీవరావు, సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# నేడు “దివ్యాంగశక్తి” దివ్యాంగులకి ఉచిత బస్సు సౌకర్యం

- జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో శాసన సభ్యులచే ప్రారంభం
- దివ్యాంగులతో సహా పంక్తి భోజనం
- తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ‘దివ్యాంగశక్తి‘ పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని నేడు (బుధవారం) ఉదయం 11.30 గంటలకు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళ వారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో ‘దివ్యాంగశక్తి‘ పథకం పై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి, దివ్యాంగులతో కలసి బస్సులో ప్రయాణించనున్నారని వెల్లడించారు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాల్లో స్థానిక శాసన సభ్యులు సూచించిన ప్రదేశాల నుంచి బస్సులు ప్రారంభమై దివ్యాంగులతో ప్రయాణం నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 60 నుంచి 80 మంది దివ్యాంగులను గుర్తించి రెండు విడతలుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బస్సు ప్రయాణం పూర్తి చేసిన తరువాత దివ్యాంగులకు తగిన భోజన సదుపాయం కల్పించాలన్నారు. అదే విధంగా మరో బృందంలోని దివ్యాంగులతో స్థానిక శాసన సభ్యులు వారి నివాస ప్రాంతాల్లో లేదా సూచించిన ప్రదేశాల్లో సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొననున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందుకు నియోజక వర్గం ప్రత్యేక అధికారులు, శాసన సభ్యులతో కార్యక్రమం యొక్క పూర్తి వివరాలు తెలియజెయ్యాలని ఆదేశించారు. దివ్యాంగశక్తి ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో కూడా దివ్యాంగులతో కలసి సహపంక్తి భోజనం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను గుర్తించి జాబితాలు సిద్ధం చేయాలని, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, డీఆర్‌డీఏ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శాసన సభ్యులు సూచించిన మేరకు అవసరమైన బస్సులను ఆయా ప్రాంతాల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.బఈ టెలి కాన్ఫరెన్స్ లో వికలాంగుల సంక్షేమ శాఖ, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, మెప్మా, మున్సిపల్, మండల అభివృద్ధి, పోలీసు, విద్యా, సమాచార శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమం విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

# జల్సాలు మరిగి.. ఆపై బైకు చోరీలు

- ఏడు బైకులు స్వాధీనం



**గోకవరం (మనసులో మాట), మార్చి 17 :** జల్సాలకు అలవాటుపడి..కష్టపడకుండా సొమ్ములు సంపాదించాలనే దుర్బుద్ధితో చోరీలు చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో బైక్ దొంగతనాలు చేస్తూ పోలీసులు కళ్ళు కప్పి తిరుగుతున్న వ్యక్తిని గోకవరం పోలీసులు అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసు స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సత్యనారాయణమూర్తి ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు. సీఐ మాటల్లో.. రాజవొమ్మంగి మండలం వతంగి పంచాయతీ పెద్ద రేలంగిపాడు గ్రామానికి చెందిన కాకురి స్వామిరెడ్డి అలియాస్ స్వామి మద్యం తాగడం, పేకాట, కోడి పందాలు తదితర జూదాలకు, వ్యసనాలకు అలవాటు పడ్డాడు. వీటన్నిటికీ బానిస అయిన స్వామిరెడ్డి వ్యవసాయం, కూలి పనులు చేసుకుని వచ్చే డబ్బులు అతని చెడు అలవాట్లకు, జల్సాలకు సరిపోక అవసరం అయినప్పుడల్లా మోటార్ సైకిళ్ళను చోరీ చేసి వాటిని ఏజెన్సీ ప్రాంతానికి తీసుకువెళ్లి వేరే వ్యక్తులకు విక్రయించి, ఆ వచ్చిన డబ్బులతో మద్యం సేవించి పేకాట, కోడి పందాలు ఆడుతూ జల్సా చేయటం అలవాటుగా మారింది. ఇతను చోరీ చేసిన ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సత్యనారాయణ మూర్తి, ఎస్సై పవన్ కుమార్ తెలిపారు.

# డీ ముప్పవరంలో మంత్రి కందుల దుర్గేష్ ఆకస్మిక తనిఖీ

- పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన
- విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనంపై ఆరా..కూటమి ప్రభుత్వ విద్యా సంస్కరణలను వివరించిన మంత్రి





**నిడదవోలు (రాజమహేంద్రవరం), మనసులో మాట, మార్చి 17:** నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం డీ ముప్పవరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సందర్శనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సరదాగా గడిపారు. స్వయంగా పాఠ్య పుస్తకాన్ని చేత బూని విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. “కందుల దుర్గేష్ అంటే ఎవరు? ఈ నియోజకవర్గానికి ఆయన ఏమవుతారు?“ అని చమత్కరిస్తూ విద్యార్థుల్లో స్నేహ పూర్వక వాతావరణాన్ని నింపారు. తాను కూడా సామాన్యంగా చదువుకుని పైకి వచ్చిన వాడినేనని, ఎవరూ కంగారు పడకుండా బాగా చదువుకోవాలని హితబోధ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. వంట గదిని తనిఖీ చేసి, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతోందా? రాగి జావ రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన మెనూలో ఏవైనా పదార్థాలు తక్కువైతే ధైర్యంగా అడిగి తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం విద్యా శాఖకు ఇస్తున్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వివరించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో విద్యా వ్యవస్థలో వస్తున్న విప్లవాత్మక సంస్కరణలను ప్రస్తావించారు. ‘తల్లికి వందనం‘ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సాయంపై విద్యార్థుల తల్లిదండ్రులతో ఆరా తీశారు. విద్యార్థి మిత్ర కిట్ ను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణపై వివరాలు ఆరా తీసిన మంత్రి దుర్గేష్ తక్షణమే సొంత భవనంలోకి మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఐసీడీఎస్ పీడీని ఫోన్ ద్వారా ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల నూతన భవన నిర్మాణాలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయుల బోధనా తీరుపై విద్యార్థుల నుంచి సానుకూల స్పందన రావడంతో వారిని మంత్రి దుర్గేష్ వారిని అభినందించారు. డీ ముప్పవరం ప్రజలతో మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా మాట్లాడారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. డీ ముప్పవరం గ్రామ అభివృద్ధికి దాదాపు కోటి రూపాయలు ఖర్చు చేశామన్నారు. గ్రామానికి అంతర్గత రోడ్లు, వాటర్ ట్యాంక్ కావాలని ప్రజలు అడిగారు. వీధి దీపాల సమస్యలను ప్రస్తావించారు. ప్రభుత్వంతో చర్చించి స్థానికంగా పదవ తరగతి వరకు ఉండేలా మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా మార్పు చేశామన్నారు. విద్యార్థుల బాగోగులే తమకు ముఖ్యమన్నారు. ఉగాది నాటికి రోడ్డు పనులు ప్రారంభమవుతాయన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యా శాఖ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# నన్ను అభిమానించిన ప్రజలకు ఎంత చేసినా తక్కువే

- 44 సంవత్సరాల రాజకీయ జీవితం ప్రజల వల్లే సాధ్యమైంది.. - దీర్ఘకాలిక సమస్యలెన్నో పరిష్కరించా
- గత ప్రభుత్వ నిర్వాకం వల్ల ఆగిపోయిన జల జీవన్ మిషన్ చంద్రబాబు కృషి వల్ల మంజూరు అయింది
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయాలలో మనగలగినంటే అది ప్రజల అభిమానం వల్లేనని, వారికి ఎంత చేసినా తక్కువేనని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గోరంట్ల తన ‘మనసులో మాట‘ వ్యక్తం చేశారు. తన 44 సంవత్సరాల రాజకీయ జీవితం ప్రజల వల్లే సాధ్యమయ్యిందన్నారు. 40 సంవత్సరాలుగా మంచి నీటి కోసం అల్లదేవారని, నేను ఎమ్మెల్యే అయిన తరువాత దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కరించానని చెప్పారు. ప్రస్తుతం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో సైతం చాలా సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు.

గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఆగిపోయిన ‘జల జీవన మిషన్‘ మళ్ళీ చంద్రబాబు కృషి వల్లే మంజూరు అయ్యిందన్నారు. రూ.196.55 కోట్లతో జల జీవన్ మిషన్ పథకం నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఇంటింటికీ ఉచిత కుళాయి రూరల్ నియోజకవర్గం నుండే మొదలు అవుతుందన్నారు.

రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడు, కాతేరు, కొంతమూరు, ధవళేశ్వరంలో తీవ్ర నీటి ఎద్దడి ఉందని చెబుతూ వచ్చే పుష్కరాలకు ముందు కడియం మండలం, రాజమండ్రి రూరల్ ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేయటం ఖాయమన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అర్హులకు కచ్చితంగా అందిస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 391 లబ్ధిదారులకు రూ.4 కోట్లకు పై బడి ఇచ్చామని, మరో వంద మందికి ఇవ్వడానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. నిజమైన బాధితులకు సహాయం చేస్తామని చెప్పారు. ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు చాలా ఉన్నా ఇచ్చిన వాగ్దానాలు మేరకు లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామని తెలిపారు.

రైతులు కూటమి ప్రభుత్వం వల్ల చాలా సంతోషంగా ఉన్నారన్నారు. ఆధునిక వ్యవసాయ యంత్రాలు, ఇంటికి సోలార్ పవర్, వంటి పథకాలు దిగ్విజయంగా అమలవుతున్నాయని చెప్పారు. దేశమంతా విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీలు పెరిగితే రాష్ట్రంలో ట్రూ డౌన్ ఛార్జీలు డౌన్ అవుతున్నాయన్నారు.

పోలవరం నిర్మాణం 2027 పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని ఎమ్మెల్యే గోరంట్ల వెల్లడించారు. మన రాష్ట్రానికి మంచి పరిశ్రమలు వస్తున్నాయని, రాజధాని పనులు వేగంగా సాగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వం అనర్హులకు ఇవ్వటం వల్ల రాష్ట్రం అన్ని రంగాలలో వెనుకబడిందన్నారు. రానున్న

పుష్కరాల నేపథ్యంలో ఆర్ అండ్ బీ, ఇరిగేషన్ పనులు ప్రారంభం అవుతున్నాయని చెప్పారు. బై పాస్ రోడ్ 35 కిలో మీటర్ల అనుసంధానంతో రహదారి వెయ్యాలని,

మురుగునీటి వ్యవస్థ బాగు పడుతుందని, ట్రాఫిక్ సమస్య పరిష్కరించబడుతుందని చెప్పారు. పుష్కరాలను కుంభమేళా తరహాలో చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోందని, అందరూ విజయవంతం చెయ్యాలన్నారు. ధార్మిక సంస్థలను కలుపుకుని వెళ్తామన్నారు. పుష్కరాలలో గతంలోలాగా ఎటువంటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఘాట్లు అన్ని సిద్ధం అవుతున్నాయన్నారు. రోల్ మోడల్ చెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నామని, రూ.50 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. వేస్ట్ మేనేజ్‌మెంట్ సమస్యను అధిగమిస్తామని తెలిపారు.

పుష్కరాల పేరుతో అభివృద్ధి జరగాలి, ఊరికి ఏమి జరిగింది అన్నది ప్రధానం అన్నారు. రాళ్ల బండ మ్యూజియం, గౌతమి లైబ్రరీ, సైన్స్ సెంటర్ ఉపయోగించుకోవలసిన అవసరం ఉందని గోరంట్ల తెలిపారు. నగరంలోని పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు అయ్యాయని, కాటన్ దొర ఇల్లు, మ్యూజియం ఆధునికరిస్తామని తెలిపారు.

**గత జిల్లా కలెక్టర్ మాధవీలతపై విచారణ జరపాలి..**

గత జిల్లా కలెక్టర్ మాధవీ లతపై విచారణ జరపాల్సిన అవసరం ఉందని, కనీసం ఎమ్మెల్యేగా నన్ను ఆమె గౌరవించలేదని గోరంట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రూ.250 కోట్ల రూపాయల భూమి రాజమండ్రిలో దోచుకున్నారని ఆరోపించారు.

గత ప్రభుత్వంలో దోచుకున్న వారిని తిరుమలలో చైర్మన్ గా పెట్టారని, నెయ్యి కల్తీ అవ్వడం ఏమిటి దుర్మార్గం కాకపోతే అని మండిపడ్డారు.

బియ్యం, మద్యం ఇలా అన్నిటిలోనూ గత ప్రభుత్వంలో దోచుకున్నారని ఆరోపించారు. నాటి ప్రభుత్వం నాసి రకం మద్యం సరఫరా చేశారు, ఇప్పుడు ఇటువంటి ఫిర్యాదులు లేవు, రాష్ట్ర ఆదాయం పెరిగిందన్నారు. ఏలూరు ఎంపీ పై పార్టీ క్రమశిక్షణ చర్య తీసుకుని పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండమని ఆదేశించారని, నిజా నిజాలు తెలుసుకుని చర్యలు చేపడతామని ఒక ప్రశ్నకు సమాధానంగా ఎమ్మెల్యే గోరంట్ల తెలిపారు. డ్రగ్ రహిత, గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చి దిద్దటమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లక్ష్యం అన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పండూరి అప్పారావు, శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి నివారణపై అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి

- జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం వసుంధర



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది క్షయ రోగుల సంఖ్య తగ్గిందని, వ్యాధిని పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు వార్డు, గ్రామ, పట్టణ ప్రాంతాలు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నివారణా అధికారిణి డాక్టర్ ఎం వసుంధర సూచించారు. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులకు టీబీ నివారణపై పోస్టర్ ప్రదర్శన, రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్ వసుంధర మాట్లాడుతూ క్షయ వ్యాధి నియంత్రణ కోసం జిల్లాలో 54 మైక్రోస్కోప్ కేంద్రాలు, 25 అధునాతన వ్యాధి నిర్ధారణ ‘నాట్‘ (ఎన్ఏఏటీ) యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్షయ రోగుల కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్త మందులు (టీపీటీ) అందిస్తున్నామని తెలిపారు. టీబీ అనుమానితులకు అత్యాధునిక సాంకేతిక ల్యాబ్ యంత్రాలు, పోర్టబుల్ ఎక్స్-రే యంత్రాల ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్షయ వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. క్షయ బాధితులకు అదనపు పోషకాహారం అందించేందుకు కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంస్థలు ‘నిక్షయ్ మిత్ర’లుగా ముందుకు రావాలని ఆమె కోరారు. అనంతరం పోటీలను ముఖ్య అతిథులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిణి డాక్టర్ శ్రీదేవి, రెడ్ క్రాస్ కన్వీనర్ రవితేజ, డీఎన్ఎంఓ డాక్టర్ హారిక, ఎంఓడీటీసీ డాక్టర్ సౌమ్య తదితరులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ లక్ష్మీ సుందరి, ఆర్ట్స్ కళాశాల, సాయి నర్సింగ్, ప్రియదర్శిని నర్సింగ్ కళాశాలల విద్యార్థులు, ఎన్‌టీఈపీ సిబ్బందిపాల్గొన్నారు.



# శుభ్రం చేస్తే.. అక్కడే చెత్త వేస్తారా?!

- ఇటువంటి పరిస్థితులు పునరావృతం అయితే కఠిన చర్యలు
- కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరిక

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** పరిశుభ్రంగా మార్చిన ప్రాంతాల్లో మళ్లీ చెత్త వేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ రాహుల్ మీనా హెచ్చరించారు. పారిశుధ్య పనుల క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మంగళవారం ఉదయం నారాయణపురం పరిసర ప్రాంతంలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు చోట్ల రోడ్ల వెంబడి చెత్త కుప్పలు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి రోజూ పారిశుద్ధ్య కార్మికులు శ్రమిస్తున్నారని, అలాంటి కృషిని వృథా చేసేలా ప్రవర్తించే వారిని ఏ మాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇప్పటికీ చాలా చోట్ల రోడ్ల వెంబడి కొబ్బరి బోండాలు, బిల్డింగ్ నిర్మాణ వ్యర్థాలు, ఇతర చెత్త వేస్తున్నారని ఆయన ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు కొనసాగితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర షాపుల యజమానులు తప్పని సరిగా చెత్త బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచటం ప్రతి పౌరుడి బాధ్యత అని.. కనుక చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు మాత్రమే అందజేసి, స్వచ్ఛ రాజమహేంద్రవరం సుందర నగర నిర్వహణకు సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట ఎంహెచ్ఓ వినూత్న, ఇతర పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

# అభివృద్ధి పనులపై రాజమండ్రి కమిషనర్ తో చర్చించిన రుడా చైర్మన్ బొడ్డు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలో దివాన్ చెరువు పలు అభివృద్ధి పనులు కోసం కమిషనర్ తో రూడా చైర్మన్, తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి చర్చించారు. ఈ కార్యక్రమంలో దివాన్ చెరువు గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు క్లీనింగ్ కిట్స్ పంపిణీ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** స్థానిక వై జంక్షన్ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఉన్న కంబాలపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఫైలేరియా సబ్ యూనిట్ కార్యాలయం నిర్వాహకులు అందించిన ఫైలేరియా క్లీనింగ్ కిట్స్ (ప్లాస్టిక్ టబ్, మగ్గు, టవల్, డెట్టాల్, సబ్బులు, ఆయింట్మెంట్, మందులు) ను ఫైలేరియా వ్యాధి గ్రస్తులకు హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య మల్లాది, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అనుసూరి శ్రీనివాస్ ల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనుసూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఫైలేరియా వ్యాధి గ్రస్తులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా సూపర్వైజర్ మధు, హాస్పిటల్ సూపర్ వైజర్ డీడీ భవాని, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# పర్మనెంట్ లోక్ అదాలత్ ద్వారా అనేక సమస్యలు పరిష్కారం

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** ప్రజా ప్రయోజన సేవలకు సంబంధించిన వివాదాలను ‘పర్మనెంట్ లోక్ అదాలత్‘ ద్వారా పరిష్కరించుకోవచ్చునని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ (ప్లాపస్) పై హై లెవెల్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ సీహెచ్ రాజ్ గోపాల్ రావు, డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్తు సరఫరా, త్రాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సేవలు, వైద్య సేవలు, తపాలా, టెలిఫోన్, బ్యాంకింగ్ తదితర ప్రజా ప్రయోజన సేవలకు సంబంధించిన వివాదాలను పర్మనెంట్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ తరహా వివాదాలలో కోర్టు ఫీజు లేకుండా రాజీ మార్గం ద్వారా వేగవంతమైన పరిష్కారం పొందవచ్చని తెలిపారు. సంబంధిత సంస్థలు, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన ప్రజా ప్రయోజన సేవల వివాదాలు రాజమహేంద్రవరంలోని జిల్లా ప్రధాన న్యాయ స్థానంలో ఏర్పాటు చేసిన పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ (ప్లాపస్) ద్వారా పరిష్కరించ బడతాయని వివరించారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# యానాం లో గ్యాస్ కంపెనీల మాయాజాలం..!


- గ్యాస్ బుక్ చేసిన వారు ఒకరైతే... మరొకరికి డెలివరీ
- బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్న గ్యాస్ సిలిండర్లు..
- కృత్రిమ గ్యాస్ కొరతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్న వైనం
- యానాంలో గ్యాస్ కంపెనీల నిర్వాకం - ఆందోళన వ్యక్తం చేస్తున్న వినియోగదారులు






**యానాం (మనసులో మాట) మార్చి 16:** ఇరాన్ అమెరికా ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో ఏర్పడిన గ్యాస్ సమస్యను కొందరు అక్రమార్కులు తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు.

యానాంలో గ్యాస్ కంపెనీ లు చేస్తున్న మాయాజాలాన్ని సామాజిక కార్యకర్త సుంకర కార్తీక్ బయటపెట్టారు. స్థానిక హెచ్ పి గ్యాస్ కంపెనీ గ్యాస్ సిలండర్ల కొరతను అదునుగా చూసుకుని గ్యాస్ సిలండర్లును బుక్ చేసిన వారికి కాకుండా బ్లాక్ లో వేరొకరికి అధిక మొత్తానికి అమ్ముకుంటున్నారని సోమవారం స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. యానాం పట్టణ పరిధిలో వంకాయల వారి వీధిలో హెచ్ పి గ్యాస్ కంపెనీ ఉంది. అయితే ఈ కంపెనీ ద్వారా పట్టణ పరిధిలో వినియోగదారులు గ్యాస్ ను బుక్ చేసుకుంటున్నారు. అయితే గ్యాస్ బుక్ చేసుకున్నవారికి కంపెనీనుంచి ఒటిపిలు వస్తుండటంతో పాటు దానికి సంబంధించి అమౌంట్ కూడా చెల్లిస్తున్నట్లు మొబైల్ ఫోన్ కు మెసేజ్ లు వస్తున్నాయి. అయితే ఈ గ్యాస్ సిలండర్లు గ్యాస్ బుక్ చేసుకున్నవారికి కాకుండా వేరొకరికి బ్లాక్ మార్కెట్లో అధికమొత్తానికి అమ్ముతున్నట్లు తెలిసింది. దీంతో విషయం తెలుసుకున్న కొంతమంది గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కంపెనీని ముట్టడించి యాజమన్యాన్ని నిలదీశారు. తాము గ్యాస్ బుక్ చేస్తుంటే ఒటిపి చెప్పమంటున్నారని అనంతరం గ్యాస్ సిలండర్ డబ్బులు కూడా చెల్లించినట్లు మెసేజ్ లు ఎందుకు వస్తున్నాయని వారు ప్రశ్నించారు. దీంతో కంపెనీ సిబ్బందికి వినియోగదారులకు వాగ్వాదం చోటుచేసుకుంది.



దీంతో డీలర్కు హెచ్చి గ్యాస్ కంపెనీ మోసాన్ని స్థానిక ఆర్ఎఒ, ఎల్జీ కి దృష్టికి తీసుకువెళతామని, సుంకర స్వామినాయుడు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు సుంకర కార్తీక్ హెచ్చరించారు. ఇప్పటికే గ్యాస్ కొరత కారణంగా అనేక మంది ప్రజలతో పాటు హోటల్స్ లో కట్టెల పొయ్యలపై వంటలు చేసుకుంటూ అవస్థలు పడుతున్నారు. ఇలా ఉండగా వినియోగదారులకు గ్యాస్ లేదని చెబుతూ వ్యాపార సంస్థలకు సిబ్బంది విక్రయిస్తున్నారు వెలువెత్తుతున్నాయి. గ్యాస్ సమస్యతో ప్రజలు అనే ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి సమయంలో గ్యాస్ కృత్రిమ కొరతను సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# గ్యాస్ కోసం పెద్దాపురంలో పోటెత్తిన జనం



**పెద్దాపురం ( మనసులో మాట) మార్చి 17;** పెద్దాపురంలో గ్యాస్ కోసం ప్రజలు ఏజెన్సీలకు పోటెత్తారు. ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ల కోసం తిప్పలు తప్పని పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. గ్యాస్ కోసం ఆందోళన వద్దు, పూర్తిస్థాయిలో అందిస్తామని ప్రభుత్వం, జిల్లా స్థాయి అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు బుకింగ్ చేస్తున్న పద్ధతిలోనే గ్యాస్ బుకింగ్ చేపట్టినప్పటికీ బుకింగ్ జరగడంలేదని, బుకింగ్ యాప్ నుండి ఎటువంటి సమాధానం రాకపోవడం, రెండు మూడు రోజులు ప్రయత్నించిన తర్వాత మాత్రమే బుకింగ్ ప్రక్రియ జరుగుతున్నట్లు ప్రజలు వివరిస్తున్నారు. గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రజల పరిస్థితి ఇలా ఉంటే, గ్యాస్ కనెక్షన్ లేని అనేకమంది పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఎటువంటి గ్యాస్ కనెక్షన్ లేకున్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీలు, గ్యాస్ డెలివరీ సిబ్బంది సహకారం, రెండు సిలిండర్లు కలిగిన వినియోగదారుల సహకారంతో వేలాదిమంది పేదలు ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను వినియోగించడం జరుగుతున్న విషయం బహిరంగ రహస్యమే. కానీ ఇప్పుడు గ్యాస్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు, గ్యాస్ కనెక్షన్ లేని ప్రజలు ఎల్పిజి సిలిండర్ల కోసం ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం పెద్దాపురంలోని గ్యాస్ ఏజెన్సీలకు జనం భారీగా తరలివచ్చారు. బుకింగ్ సక్రమంగా జరగకపోవడం, ఇతర కారణాలతో గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని వినియోగదారులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సక్రమ గ్యాస్ పంపిణీకి జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలకు కోరుతున్నారు

# కాండ్రేగుల నూకాలమ్మ తల్లి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు



**పెదపూడి, (మనసులో మాట) మార్చి 17;** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రసిద్ధి చెందిన పెదపూడి మండలం కాండ్రేగుల నూకాలమ్మ తల్లి జాతర తీర్థ మహోత్సవాలకు విస్తృత ఏర్పాటు చేపట్టినట్లు ఉత్సవ కమిటీ నేతలు పేకేటి వెంకట శివ, సర్పంచ్ కుడిపూడి సత్యనారాయణ, కమిటీ నేతలు పేపకాయల శివ, పేకేటి సుబ్బారావు తదితరులు తెలిపారు. మంగళవారం రాత్రి నూకాలమ్మ తల్లి జాతర వేడుకలను నిర్వహించగా, బుధవారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నూకాలమ్మ తల్లి ఉత్సవ ఏర్పాట్లను వివరించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు, భక్తుల సహకారంతో నూకాలమ్మ అమ్మవారి ఉత్సవాలను ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 200 సంవత్సరాల క్రితం అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడగా నూకాలమ్మ తల్లి రక్షణ కల్పించడంతో అప్పటినుండి అమ్మవారి జాతర ఉత్సవాలను భక్తులు గ్రామస్తులు నూకాలమ్మ తల్లి కుటుంబాల సభ్యులు చేపట్టినట్లు సొసైటీ చైర్మన్ పేకేటి మాధవరావు, యూత్ కన్వీనర్ పేకేటి శివ తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద ఉత్సవ ఏర్పాట్లను సిద్ధం చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు టిబిరిశెట్టి వీరన్న, దేవాదాయ శాఖ ప్రతినిధి దొరబాబు, శివా తదితరులు పాల్గొన్నారు. నూకాలమ్మ తల్లిని ఒక్కసారి దర్శిస్తే చాలు వివాహం, సంతాన ప్రాప్తి, ఆ కుటుంబాలకు ఆయురారోగ్యాలు ఐశ్వర్యాలు లభిస్తాయని ఆలయ ఆసాధి సత్యనారాయణ వివరించారు. వేలాదిమంది భక్తులు అమ్మవారి దర్శనాలకు బుధవారం తరలిరానున్నారు.

## పి ఎం ఎం ఎస్ వై పథకం ద్వారా
# లబ్ధిదారులకు మూడు చక్రాల ఆటోల పంపిణీ



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుంది అని జిల్లా టిడిపి అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో జగ్గంపేట మండలం మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి కార్యాలయ పరిధిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పి ఎం ఎం ఎస్ వై) లో లబ్ధిదారులైన జగ్గంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొత్తపల్లి మోహన్ రావు కి (ఎస్సీ)60 శాతం సబ్సిడీతోను జగ్గంపేట మండలం జే కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు సాయిరాం (బిసి) 40% సబ్సిడీతోనే మంజూరైన మూడు చక్రాల ఆటోలు, ఐస్ బాక్సులు లబ్ధిదారులకు కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు , జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై) కింద మత్స్యకారులకు ఐస్ బాక్సులతో కూడిన ఆటోలు (మూడు చక్రాల) సబ్సిడీపై పంపిణీ చేయబడుతున్నాయని,ఈ పథకంలో భాగంగా, ఆటోలపై వెనుకబడిన వర్గాలకు 60 శాతం జనరల్ కేటగిరీకి కు 40 శాతం ఆర్థిక సహాయం అందుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బురి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి తుమ్మల కిషోర్, చింతల కన్నారావు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు ఎం లావణ్య , మత్స్యశాఖ తనిఖీ అధికారి కర్రీ రామకృష్ణ, మత్స్య శాఖ సహాయకురాలు కె పద్మ, పీలా మహేష్, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ కొనలేక మహిళలకు కన్నీళ్లు

## కాకినాడ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరి ఆరోపణ


**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** కాకినాడ నగరంలో నిత్యావసర వస్తువు అయిన గృహవసర గ్యాస్ సిలిండర్లయినా కొరత కారణంగా ప్రధానంగా ప్రతీ ఇంట ఉన్నా మహిళ కన్నీరు కార్చే దుస్థితి ఏర్పడేందుకు కూటమి ప్రభుత్వం అవగాహనా లేమి, పరిపాలనే కారణమని రాష్ట్రం అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరీ కూటమి ప్రభుత్వం పై తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం సామర్లకోట లో విలేకరులతో మాట్లాడుతూ ఒక పక్క అధికార యంత్రాంగం గ్యాస్ లభ్యత పై ప్రకటిస్తున్న సమాచారానికి శీత్రస్థాయిలో గ్యాస్ కోసం వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఎక్కడా పొంతన లేదని ఆమె ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ల బుకింగ్ చేద్దామంటే ఏ గ్యాస్ ఏజన్సీ ల ఫోన్ నంబర్లు పనిచేయడం లేదన్నారు. దీంతో స్వయంగా గ్యాస్ ఏజన్సీ ల వద్దకు బుకింగ్ కోసం వెళ్లినా డీలర్ల నుంచి స్పందన లేదని ఆక్షేపించారు. దీంతో గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్ కు తరలిపోతున్నాయని ఆరోపించారు. ఈ సమయంలో తనికీలు నిర్వహించాలిసిన సివిల్ సప్లయ్ అధికారులు మొక్కుబడి గా తనికీలు నిర్వహిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

ఎటువంటి బ్లాక్ మార్కెట్ లేకుండా నిత్యావసర వస్తువు అయిన గ్యాస్ సిలిండర్ల సరఫరా పై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 20 లక్షల 12 వేల 985 కనెక్షను ఉండగా రోజు వారీ వినియోగం 38. వేల సిలిండర్ల వరకూ ఉందని పేర్కొన్నాడు. అయితే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోజుకి 10 వేల సిలిండర్ల ను మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవలను మరుగునపెట్టి గ్యాస్ కొరత లేదంటూ అమాయకపు మహిళలను మభ్యపెట్టే ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. ఇంటి వంట కోసం మహిళలు పడుతున్న గ్యాస్ కష్టాలను సత్వరం స్పందించి అందరికీ సమృద్ధిగా గ్యాస్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోకుంటే మహిళలతో పెద్ద ఎత్తున గ్యాస్ ఉద్యమం చేపట్టనున్నట్లు రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఆవాల రాజేశ్వరీ లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు.

# డగ్స్ సప్లై కి ఆధ్యుడు తెలుగుదేశం పార్టీ ఎంపీ పుట్ట మహేష్ ను సస్పెండ్ చేయాలి

**- తెన్నేటి కిషోర్**




**రాజోలు మార్చి 17 మనసులోమాట:** రాష్ట్రంలో సప్లై అవుతున్న డ్రగ్స్, గంజాయికి బాధ్యుడు ఏలూరు పార్లమెంట్ సభ్యుడు పుట్ట మహేష్ ని తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ డిమాండ్ చేశారు. రాజోలు లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమావేశంలో తెన్నేటి కిషోర్ మాట్లాడుతూ ఒక పార్లమెంట్ సభ్యుడిగా ఉంటూ డ్రగ్ సేవించడాన్ని ఏ విధంగా చూడాలో అర్థం కావట్లేదని డ్రగ్స్ సేవిస్తూ అడ్డంగా దొరికిందే కాకుండా విచారణ నిమిత్తం వచ్చినటువంటి పోలీస్ అధికారుల పైన కాల్పులకు తెగబడటం ఎంతవరకు సమంజసం అని అన్నారు. డ్రగ్స్ సేవిస్తూ ఉన్నటువంటి వ్యక్తులు గంజాయిని సప్లై చేస్తున్నటువంటి వ్యక్తులు తెలుగుదేశం పార్టీ ఎంపీలుగా, ప్రజా ప్రతినిధులుగా ఉండడం దురదృష్టమని అన్నారు. పుట్ట మహేష్ ను తెలుగుదేశం పార్టీ నుంచి సస్పెండ్ చేసి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎవరైతే డ్రగ్స్ కి తెలుగుదేశం పార్టీలో డ్రగ్ సప్లై చేస్తూ ఉన్నటువంటి వ్యక్తులు వివిధ కేసుల్లో ఉన్నారో వాళ్లందర్నీ పార్టీ నుంచి సస్పెండ్ చేసి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధి నిరూపించుకోవాలని అన్నారు. ఎన్నికల ముందు డ్రగ్స్ ని, గంజాయిని రాష్ట్రంలోకి రానివ్వకుండా అడ్డుకుంటానని మాట్లాడిన పెద్దమనిషి ఈరోజు డ్రగ్స్ విచ్చలవిడిగా తమ పార్టీ నాయకులే సేవిస్తూ సప్లై చేస్తూ ఉంటున్నా .. పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోకపోవడం దురదృష్ట కారమని కిషోర్ అన్నారు. రాష్ట్రంలో వంటగ్యాస్ కొరత ఉన్నప్పటికీ గ్యాస్ ఏజెన్సీలు వద్ద మహిళలు రాష్ట్ర ప్రజలు వందలాది మంది క్యూ లైన్ లో ఉంటూ ఇబ్బందులు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం బ్లాక్ మార్కెట్ ను అరికట్టి ప్రజలకి వంటగ్యాస్ ని అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.



# కావలిపురంలో రైతన్నా.. మీకోసం

**తణుకు (మనసులో మాట) మార్చి 17..** "రైతన్నా మీకోసం" కార్యక్రమాన్ని ఇరగవరం మండలం కావలిపురం గ్రామంలో తణుకు నియోజకవర్గ శాసనసభ్యుడు ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, రైతుల జీవితాలకు కొత్త దిశనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కార్యక్రమం రైతులకు ఎంతో మేలు చేయనుందన్నారు. ఇందులో భాగంగా పంచ సూత్రాలైన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు లాంటి అంశాలకి అధిక ప్రాధాన్యత కల్పించి రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పని చేయనుందని రైతులకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలియజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామాభివృద్ధిలో భాగంగా రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్డు మరియు డ్రైనేజీ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కే.జీ.ఆర్.ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ




**భీమవరం, (మనసులో మాట) మార్చి 17 :** ఆంధ్ర రాష్ట్ర సాధనలో అహర్నిశలు పోరాడి, తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని కే.జీ.ఆర్.ఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కళాశాల డైరెక్టర్ డా.కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.డి.రాఘవ మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు గారి త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయన ఆత్మీయత, పట్టుదల, నిబద్ధత వంటి గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలు దేశభక్తి భావాలను పెంపొందించడంతో పాటు, మహానుభావుల త్యాగాలను గుర్తు చేసేలా జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.కవల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.డి రాఘవ వైస్ ప్రిన్సిపాల్ డా.కె.నిర్మల ,చీంం కోఆర్డినేటర్ ా.లోకేష్, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోలాహలంగా మున్సిపల్ కౌన్సిల్
# చిట్టచివరి సమావేశం



**పెద్దాపురం (మనసులో మాట) మార్చి 17;** పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ చిట్టచివరి సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి నిర్వహించారు. పెద్దాపురం మున్సిపల్ పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన నాటినుండి చివరి వరకు సుమారు 50 కోట్ల రూపాయలకు పైగా అభివృద్ధి పనులు సాధించినట్లు చైర్పర్సన్ తులసి మంగతాయారు తెలిపారు. పాలకవర్గ సభ్యులు తమ తమ పదవీకాలంలో వార్డుల వారిగా చేపట్టిన అభివృద్ధి వివరాలను కౌన్సిల్కు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది అందించిన సహకారం వల్లే అభివృద్ధి సాధ్యపడిందని మున్సిపల్ వైస్ చైర్మన్లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి తెలిపారు. అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చైర్మన్ తులసి మంగా తాయారు తెలిపారు. వివరించారు. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ తులసి, వైస్ చైర్మన్ లు నెక్కంటి సాయిప్రసాద్ కనకాల మహాలక్ష్మితో సహా కౌన్సిలర్లను కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మేనేజర్ జ్యోతి రాణి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి పాలకవర్గ ముగింపు సమావేశాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో విందు భోజనాన్ని అందించారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా
# నూకాలమ్మ ఆలయంలో ఏర్పాట్లు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** కాకినాడలోని పెద్ద మార్కెట్లో ఉన్న శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ చింతలపూడి రవికుమార్ మంగళ వారం తెలిపారు. బుధవారం జరిగే ఈ వేడుకలకు అమ్మవారు ఆలయంలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తున్నట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అమ్మవారి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎం. మురళీ వీరభద్రరావు మాట్లాడుతూ ఫిబ్రవరి 19 నుంచి ఏప్రిల్ 4వ తేదీన వరకు జాతర ఉత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. బుధవారం తెల్లవారుజాము నుండి అమ్మవారి దర్శనం కలుగుతుందని రాత్రి సిరి బొమ్మ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరిగి శనివారం అమ్మవారి దర్శన భాగ్యం జరుగుతుందని వీరభద్రరావు చెప్పారు.




## మనసులో మాట వార్తకు స్పందన

- అంధకారంలో జగ్గంపేట ఎస్. సి కాలనీ
- కథనానికి స్పందించిన పంచాయతీ సెక్రటరీ
- ఈరోజు ఎస్.సి కాలనీలో వీధి లైట్లు రిపేర్ చేయించిన వైనం
- వెలిగిన విద్యుత్ దీపాలు




జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17.. అంధకారంలో జగ్గంపేట ఎస్.సి కాలనీ కథనానికి అధికారులు స్పందించారు. వారం రోజులుగా వీధీలైట్లు వెలగక కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను మన వార్త ద్వారా కళ్ళకు కట్టినట్లు తెలియజేయడం జరిగింది. స్పందించిన పంచాయతీ సెక్రటరీ మంగళవారం ఉదయం ఎస్. సి కాలనీ కి చేరుకొని వీధి లైట్లను మరమ్మత్తులు చేయించడం జరిగింది.దవీధి లైట్లు వెలగడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. మన కథనానికి స్పందించిన పంచాయతీ సెక్రటరీ కి ఈ సందర్భంగా ప్రజల తరపున, పత్రికా తరపున ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## ఘనంగా బిల్వార్చన



ఐ. పోలవరం, మహి న్యూస్, మార్చి 17.. మురమళ్ల లో నిత్యకళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయంలో ఫాల్గుణ మాసం మాస శివరాత్రి మహా పర్వదినం పురస్కరించుకుని మంగళవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణ మూర్తి ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ కార్యక్రమాలు జరిగాయి. తొలుత గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం అనంతరం బియవార్చన కార్యక్రమం జరిగింది. లక్ష పత్రి పూజలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణం రాజు, సహాయ కమీషనర్ కార్యనిర్వాహణాధికారి వి సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## నూకాలమ్మ అమ్మ వారికి సారి సమర్పించిన రౌతులపూడి గ్రామ మహిళలు..



రౌతులపూడి, ( మనసులో మాట) మార్చి 17: రౌతులపూడి గ్రామంలో వేంచేసి ఉన్న నూకలఅమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా రౌతులపూడి గ్రామ మహిళలు బారి స్థాయిలో సారీ సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గ్రామ దేవత అయిన నూకలమ్మ వారికి మా గ్రామ ఆడపడుచు గా సారి సమర్పించామని ఆమె దయతో గ్రామం అంతా సస్యశ్యామలంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు

# పశువుల కు గాలి గుంట వ్యాధి సోకకుండా నివారణకు చర్యలు ఎమ్మెల్యే గిడ్డి



అయినవిల్లి( మనసులో మాట) మార్చి 17 : పశువులకు గాలిగుంట వ్యాధి సోకకుండా ముందస్తుగా పాడి రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మంగళవారం అయినవిల్లి మండలం అయినవిల్లి లంక గ్రామంలో పశు వులకు గాలిగుంట వ్యాధి శాఖ కుండా పశు వైద్యులు సమక్షంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ టీకాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పశువులకు టీకా కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రతి ఒక్క పాడి రైతు పశువులకు ప్రమాదకరమైన గాలిగుంట వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. అనంతరం కే జగన్నాధపురం లో అయినవిల్లి మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీను ఇంటివద్ద డ్రైనేజీ ఇరిగేషన్ కు సంబంధించిన భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. గత ఎమ్మార్వో ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయించు కోడానికి సహకరించడంతో అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని అధికారులు ఎమ్మెల్యే దృష్టి కి తీసికొచ్చారు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని అయినవిల్లి ఎస్సై జ్యోతి కి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశించారు. తక్షణమే ఈ కట్టడం తొలగించి ప్రభుత్వ భూమి అన్యక్రాంతం కాకుండా అధికారులు చూడాలని ఆదేశించారు .అనంతరం చింతనలంక గ్రామంలోమండల పరిషత్ నిధులతో నిర్మించే రోడ్డుకు అడ్డంకులు పరిష్కరించడానికి ఎమ్మెల్యే స్వయంగా రోడ్డు నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే అక్కడ నివాసం ఉండే కుటుంబాలతో ఎమ్మెల్యే మాట్లాడి ఇక్కడ రోడ్డు నిర్మించడానికి మీరు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించి మీకు సంబంధించిన భూమిలో ఎటువంటి రోడ్డు నిర్మాణం జరగదని ప్రభుత్వం భూలోనే రోడ్డు నిర్మిస్తారని దీనికి మీరు అడ్డంకులు సృష్టించవద్దని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఇక్కడ మీకు సంబంధించిన భూమి డాక్యుమెంట్లు తీసుకొస్తే దానిలో ఎటువంటి భూమి పోకుండా మిగిలిన భూముల రోడ్డు నిర్మిస్తారని వారికి ఎమ్మెల్యే సర్ది చెప్పారు. తాహసిల్దార్ విద్యాపతి నలుగురు సర్వేయర్లను తీసుకువచ్చి ఇక్కడ భూమిని కొలిపించి ఇరిగేషన్ సంబందించిన భూమి ఉంటే వారి అనుమతితో రోడ్డు నిర్మాణానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేగా తెలిపారు. గ్రామంలో ఉన్న సవరపు సత్యనారాయణ వెంకటేశ్వరసవు అనే వికలాంగులు తమ గోడు ఎమ్మెల్యే కు విన్నవించుకున్నారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడి వారికి మూడు చక్రాల మోటార్ వాహనాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని వారికి ఎటువంటి పెన్షన్లుకు అర్హులో వాటిని ఇద్దరికీ వర్తించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సరోవర్ ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే తన పర్సు నుండి ఇద్దరు వికలాంగులకు రెండు వేలు చొప్పున నగదును అందజేశారు. ఆయన వెంట అంబాజీపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్ అయినవిల్లి నీటిసంఘం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పలు చర్యలు



కాకినాడ (మనసులో మాట) మార్చి 17.. కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పలు చర్యలు చేపట్టినట్లు నగరపాలక సంస్థ ఎన్వివి సత్యనారాయణ మంగళవారం చెప్పారు. కాకినాడ నగరాన్ని పారిశుధ్య లోటు లేకుండా ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే నగరపాలక సంస్థకు తెలపాలని కమిషనర్ ఎన్ వివి సత్యనారాయణ విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఉదయం జగన్నాధపురం 5వ సర్కిల్ పరిధిలో ఉన్న మస్తార్ కేంద్రాన్ని కమిషనర్ ఆకస్మితంగా తనిఖీ నిర్వహించి విధులకు హాజరు కాని వర్కర్ల అటెండెన్స్ లను పరిశీలించి సానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మరాజును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం 16, 17 డివిజన్లో ఏటి మొగ ప్రాంతాలను కూటమి నాయకులతో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. అక్కడి సమస్యలను కూటమి నాయకులు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడిన కమిషనర్ సత్యనారాయణ ఇంటి వద్ద ఉత్పత్తి అయ్యే తడి చెత్త పొడి చెత్తలను వేరువేరుగా వేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు ప్రతిరోజు కాలువలు శుభ్రపరిచే పనులు జరుగుతున్నాయా లేదా అని సంబంధిత అధికారులను ఆరా తీశారు. త్రాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా లేదా అని ప్రజలను ప్రశ్నించి నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు.

త్రాగినటి ప్రాథమిక సాంద్రత పరీక్షలపై కూడా ప్రజలు అవగాహన కలిగి ఉండాలనిఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా ఈ డివిజన్లో ప్రజల స్వచ్ఛతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజల్లో మార్పు రావాలని సూచించారు .ఇప్పటికే కొంతమంది ప్రజలు రోడ్లపై కట్టెల పొయ్యిలు , రోడ్డుపైనే అన్నం పారబోస్తున్నట్లు గుర్తించి వాటిని కూడా ప్రజల చేత్తోనే తీయించి డస్ట్ బిన్ లో వేయించారు. రోడ్లపై ఆహార పదార్థాలు వేయకూడదని అలాంటి చర్యలు పునారవత్తమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే. టీ.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్ ఈఈ కనకారావు కూటమి నాయకులు కె ఎస్ చంద్రమౌళి, జనసేన పార్టీ ఇంచార్జ్ బడే కృష్ణ, 17వ వార్డు ఇంచార్జ్ గిరి, సానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు

### జి.జి.హెచ్ ఆర్.ఎం.సి సెక్యూరిటీ గార్డ్స్ కి

# ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు ఇవ్వాలి

- గార్డ్స్ ను అక్రమంగా విధులకు దూరం చేస్తున్న కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ యాజమాన్యం...
- ప్రిన్సిపాల్ ఎంప్లాయ్ గా సూపరింటెండెంట్ జోక్యం చేసుకోవాలని సిఐటియు విజ్ఞప్తి...
- మార్చి 25 నుండి సిఐటియు ఆధ్వర్యంలో నిరవధిక నిరహార దీక్షలు




కాకినాడ, (మనసులో మాట) మార్చి 17.. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి మరియు రంగరాయ వైద్య కళాశాలలో సెక్యూరిటీ గార్డ్స్ గా సేవలు అందిస్తున్న కార్మికులకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం జీతాలు చెల్లించాలని, క్యాజువల్ లీవులు అమలు చేయాలని, కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ వారు సెక్యూరిటీ గార్డ్స్ ను అక్రమంగా విధులకు దూరం చేసే పద్ధతులు ఆర్.ఎం.సి. సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ డిమాండ్ చేసింది. మంగళవారం మధ్యాహ్నం కాకినాడ సిఐటియు కార్యాలయంలో సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మీడియాతో మాట్లాడుతూ 2025 జూన్ 1 నుండి జి.జి.హెచ్. - ఆర్.ఎం.సి. లలో సెక్యూరిటీ నిర్వహణ నిమిత్తం కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ కాంట్రాక్టు పొందడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పిఎఫ్ , ఈఎస్ఐ చెల్లింపులు కాకుండా సెక్యూరిటీ గార్డ్స్ కి నెలకు 13,960 రూపాయలు అందాల్సి ఉండగా, ప్రస్తుతం నెలకు 12,099 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. గతంలో 13 క్యాజువల్ లీవ్స్ అమలు చేయగా, ప్రస్తుత కాంట్రాక్ట్ సంస్థ క్యాజువల్ లీవులు రద్దుచేసి కార్మికుల జీతాల్లో కోత విధిస్తున్నారని తెలిపారు. ఇటీవల కొంతమంది సెక్యూరిటీ గార్డ్స్ సిఐటియు కి అనుబంధంగా యూనియన్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సెక్యూరిటీ కాంట్రాక్ట్ స్థానిక ఇంచార్జ్ శ్రీనివాస్ సిఐటియు అనుబంధ నాయకులను అక్రమంగా విధులకు దూరం చేయడం జరుగుతుంద న్నారు. ఈ విషయమై శ్రీనివాస్ ను వివరణ కోరగా ఆసుపత్రి యాజమాన్యం ఆదేశాల మేరకే సెక్యూరిటీ గార్డ్స్ ను విధులకు దూరం చేశామని చెబుతున్నారని తెలిపారు. అయితే ఆసుపత్రి అధికారులను సంప్రదించగా సెక్యూరిటీ గార్డ్స్ విధులకు సంబంధించిన చర్యలు తమ పరిధిలో లేవని, అవి పూర్తిగా ఏజెన్సీ వారే చూసుకుంటారని చెబుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వారు ప్రిన్సిపాల్ ఎంప్లాయ్ హోదాలో జోక్యం చేసుకుని సెక్యూరిటీ గార్డ్స్ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులతో కార్మికుల డిమాండ్స్ పై రాతపూర్వకంగా అందించి రెండు దఫాలు చర్చలు జరిగినా ఫలితం రాలేదన్నారు. ఈ నేపథ్యంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించాల్సి వస్తుందన్నారు. మార్చి 25 వ తేదీ నుండి జిజిహెచ్ లో గల సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహారదీక్ష చేపడతామని వీరబాబు తెలిపారు. జిజిహెచ్ లో గల వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల వారు సెక్యూరిటీ గార్డ్స్ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో పలివెల వీరబాబు తో పాటు సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణ, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మ, భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

# ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం బి ప్రమాదాలను నివారిద్దాం

### - ట్రాఫిక్ ఎస్సై బివి సత్యనారాయణ



కాకినాడ (మనసులో మాట) మార్చి 17.. రహదారులపై ప్రయాణాలు చేసేటప్పుడు కుటుంబసభ్యులను బాధ్యతలను గుర్తుంచు కోవాలని వాహనాలను జాగ్రత్తగా నడపాలని వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ బివి సత్యనారాయణ మంగళవారం సూచించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని లక్ష్యంతో కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ రమేష్ పర్యవేక్షణలో స్థానిక ఎం ఎస్ ఎన్ చార్జెస్ ప్రాంతంలో ప్రత్యేక తనిఖీలను చేపట్టి తల్లిదండ్రులు వాహన యాజమానాలకు చట్టపరమైన నిబంధనలు విధించే శిక్షలపై వాహన దారులకు అవగాహన కల్పించారు. మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరి వద్ద తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్సై మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణ నష్టం ప్రమాదాలపై వాహనదారులకు ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు, హెల్మెట్లు, సీటు బెల్ట్‌లు ధరించకుండా వాహనాలు నడిపే వారికి తొలుత అవగాహన కల్పించాలని తర్వాత కూడా నిబంధనలను ఉల్లంఘన చేస్తే తప్పనిసరిగా జరిమాన వేసి చలానాలు వేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అసలు ప్రమాదాలు మానవ తప్పిదాలు వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, యువత రోడ్డు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు



### లయన్స్ విజన్ ఆధ్వర్యంలో

# నిత్యవసర సరుకులు పంపిణీ

కాకినాడ (మనసులో మాట ) మార్చి 27.. కాకినాడ లోని రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యురాలు మీనాక్షి సౌజన్యంతో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ జరిగింది.

ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి రెడ్డి మాట్లాడుతూ సమాజానికి ఏదైనా సేవ చేయాలనే ఆశయంతో మహిళలంతా లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మీనాక్షి మాట్లాడుతూ సేవ అంటే ప్రతిపలాపేక్ష లేకుండా పరులకు సేవ చేయడమని అన్నారు. పరులకు సహాయం చేయడంలో కలిగే తృప్తి ,సంతోషం ఎలాంటివారికైనా ఎంతో ఆనందా న్నిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి శ్రీవాణి ,మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్ ,శిరీష, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, చింతపల్లి సుబ్బారావు, పిడుగు సూర్యనారాయణ మూర్తి, రాజా ,ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ( ఎస్ డి జి ఎస్) స్థానిక స్థాయిలో

# అమలుపై శిక్షణ...

### ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి




ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 17.. ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యం పి టి సి, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షుడు కాకినాడ జిల్లా ఎంపీపీ ల సంఘం అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ అభివృద్ధి సుస్థిర లక్ష్యాలను ( ఎస్ డి జి ఎస్) స్థానిక స్థాయిలో అమలు చేయడానికి ఎంపీటీసీ వార్డు, ప్రజా ప్రతినిధులకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, లక్ష్మణరావు, సాదే లోవరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు రామరాజు వర్మ, సి హెచ్ ఏస్ సత్యనారాయణరాజు, పాలక వర్గ సభ్యులు పసల సూరిబాబు, విజ్జినగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జి, పసల సూర్యనారాయణ,వివిధ గ్రామల ప్రజా ప్రతినిధులు, వార్డ్ సభ్యులు, గ్రామ అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### బద్రవరం గ్రామం లో పశువులకు గాలికుంటు వ్యాధి కి...

# టీకాలు పాల్గొన్న జాయింట్ డైరెక్టర్ శ్రీధర్



ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 17.. ఏలేశ్వరం మండలం బద్రవరం గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమం పశువర్ధక శాఖ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాటి పశువులకు స్థానిక నాయకుల సమక్షంలో వ్యాధి సంరక్షణ దిశగా గాలికుంటు టీకాలు వేశారు. జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పాడి పశువులకు వేయించాలని, పాడి రైతులకు సూచించారు. గాలికుంటు టీకాల యెక్క ప్రాముఖ్యతను వివరించారు. పాడి రైతులకు పశువర్ధక శాఖ సూచనలతో తమ పాడిపశులను సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలచంద్ర యోగేశ్వర్ ,భద్రవరం గ్రామ సర్పంచ్ కునపరెడ్డి సుబ్బారావు, టిడిపి నాయకులు జగటాపు సూరిబాబు, బిజెపి నాయకులు పోలినాటి బుజ్జి, గ్రామ నాయకులు పశు వైద్య సిబ్బంది ,పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల హాస్పిటల్ ని సందర్శించిన కాయకల్ప బృందం...

### ఆసుపత్రి ని క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిన బృందం



రంపచోడవరం (మనసులో మాట) మార్చి 17.. అడ్డతీగల ప్రభుత్వం ఆసుపత్రి ని కాయాకాల్ప బృందం మంగళవారం ఆకస్మికంగా సందర్శించింది. ఈ సందర్భంగా వారు హాస్పిటల్ ఉన్న శానిటేషన్ విధానం, పరిసరాల పారిశుధ్య పరిశుభ్రత గూర్చిపరిశీలించి రోగులకు అందిస్తున్న సేవలు గూర్చి కూడా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రత,వార్డుల నిర్వహణ రోగులకు అందిస్తున్న సేవలు వారు క్షుణ్ణంగా పరిశీలించి రోగులను అడిగి తెలుసు కున్నారు. ప్రతి విషయాన్ని ఆ బృందం పరిశీలించి, ప్రతి వార్డు తిరిగి, ఇక్కడ జరుగుతున్న సేవల పట్ల వారు సంతృప్తి వక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి అరుణ కుమారి,స్టేట్ పిపిఎం కోఆర్డినేటర్ సబితా సుధా లలిత,డిస్టిక్ క్వాలిటీ ఆషురెన్స్ కన్సల్టెన్సీ, డాక్టర్స్ మహేష్ రెడ్డి, హర్ష, అనూష, రేష్మ, మస్తాన్ వలి హాస్పిటల్ స్టాఫ్ శానిటేషన్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా బీ.హెచ్ భవానీ శంకర్

**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్ గా బీహెచ్.భవాని శంకర్ పదవి బాధ్యతలను మంగళవారం స్వీకరించారు.అనంతరం ఆయన జిల్లా కలెక్టర్ సన్మోహన్ సగిలి ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్గా రాష్ట్ర ప్రభుత్వం బిహెచ్.భవాని శంకర్ నియమించినట్లు ఉత్తర్వులు వెల్లడించింది. పాడా కార్యాలయం లో బాధ్యతలు స్వీకరించారు.

## ఔషధ మొక్కల సాగులో ఆంధ్రప్రదేశ్ ముందంజ..

### - ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం వెల్లడి



**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** రాజ్యసభలో సభ్యుడు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇస్తూ, ఆంధ్రప్రదేశ్ ఔషధ సుగంధ మొక్కల సాగులో దేశవ్యాప్తంగా ముందంజలో నిలిచినట్లు తెలిపారు.జాతీయ ఆయుష్ మిషన్ (ఎన్ ఏ ఎం ) రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రం గణనీయ పురోగతి సాధించిందని తెలిపారు. 202526 ఆర్థిక సంవత్సరంలో 15,682 హెక్టార్లలో సాగు జరగగా, 1,51,000 క్వింటాళ్ల ఉత్పత్తి నమోదై, .312.79 కోట్ల రూపాయలు విలువ సాధించబడిందని వెల్లడించారు.నన్నారి, సింధూర, అశ్వగంధ, ఘృతకుమారి, పిప్పలి, తులసి వంటి పంటలు ప్రధానంగాసాగవుతున్నాయని మంత్రి తెలిపారు.

అలాగే 20152020 మధ్య 9,785 మంది రైతులు సబ్సిడీలు పంట అనంతర మౌలిక సదుపాయాల ద్వారా లబ్ధి పొందారని, 12 పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఔషధ మొక్కల ఎగుమతులు 202021లో 2,796 కోట్ల రూపాయలు నుంచి 202425లో 4,508 కోట్ల రూపాయలకు పెరిగినట్లు కేంద్రం తెలిపింది.

## జవాన్ భూమిని ఆక్రమించిన వారిపై తాసిల్దార్ ఫిర్యాదు



**ముమ్మిడివరం (మనసులో మాట)మార్చి 17..** జవాన్ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని జవాన్ భార్య బూల దుర్గ ముమ్మిడివరం మండలం తసిల్దార్ కి ఫిర్యాదు చేశారా.ముమ్మిడివరం నగర పంచాయతీ 3వ వార్డు నివాసి బూల దుర్గ మా భూమిని అక్రమంగా ఆక్రమించుకునీ ఇల్లు నిర్మాణం చేస్తున్న నేలపాటి పాపమ్మ ఆమె మనవడు వడ్డీ దుర్గా రావుల పై చర్యలు తీసుకోవాలని వ్యాధుల పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పల్లి పాలెం గ్రామంలో 3వార్డు లో సర్వే నెంబర్.876/1 గల మా ఇల్లు స్థలమును ప్రక్కనే ఉన్న ననేలపాటి పాపమ్మ ఆమె మనవడు వడ్డీ దుర్గారావు వీరు ఇద్దరు మా స్థలమును అక్రమీశీచుకుని ఇల్లు నిర్మాణం చేస్తున్నారని నా భర్త బూల వెంకట సుబ్బారావు( బి ఎస్ ఎఫ్ )బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ లో ఇండియన్ బోర్డల్లో పని చేస్తున్నారు. మా కుటుంబాన్ని వేధింపులు గురి చేస్తున్న పై తెలిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనీ అక్రమ నిర్మాణాన్ని ఆపాలని జవాన్ భార్య దుర్గ కోరారు.జవాన్ కుటుంబానికి సిపిఎం పార్టీ అండగా ఉంటుందని ముమ్మిడివరం మండలం కార్య దర్శి సకిలే సూర్యనారాయణ అన్నారు.

# బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం

### పోలవరం ద్వారా అన్ని రంగాలు అభివృద్ధి - దేశ అభివృద్ధిలో కీలక స్థానం...

### రాష్ట్ర ప్రభుత్వ కృషి స్లాఘనీయం - కాకినాడ రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యుల బృందం కితాబు





**కాకినాడ (మనసులో మాట మార్చి 17 ..** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిన ఆవశ్యకత ఉందని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి అన్నారు. ప్రాజెక్టు సందర్శన తమ జీవితాల్లో ఒక మధురమైన ఘట్టంగా నిలిచిపోతుందని అన్నారు. భారతదేశ అభివృద్ధిలో ఆంధ్ర అగ్రస్థానంలో నిలబడుతుందన్న ఆత్మ విశ్వాసాన్ని కృష్ణకుమారి వ్యక్తం చేశారు. ఈ పోలవరం ప్రాజెక్టు ఎంతో సహకరిస్తుంద ని భవిష్యత్ తరాలకు ఆధునిక దేవాలయం గాను జాతీయ స్థాయిలో ప్రత్యేక ప్రాజెక్టుగా నిలబడే పోలవరాన్ని నిర్మించడంలో జాతీయ అంతర్జాతీయ ఇంజనీర్ల ప్రతిభను మనం స్వయంగా దర్శించుకునే అవకాశం ఉంటుందని ఆమె అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యుల బృందం ఒకేషనల్ టూర్ లో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు సెక్రటరీ డాక్టర్ సానా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగింది.

పోలవరం ప్రాజెక్టు యొక్క ఆవశ్యకతను మరియు బహుళ ప్రయోజనాలను ప్రాజెక్టు పూర్వపు విశ్రాంతి సీనియర్ ఇంజనీర్ సానా నాగేశ్వరరావు సభ్యుల బృందానికి వివరించడమే కాక ఆయా విభాగాల తాలూకు లక్ష్యాలను, నిర్మాణ శైలి మరియు ప్రయోజనాలను కట్టడాలను చూపిస్తూ విశ్లేషించారు .వచ్చే సంవత్సరం ఈ ప్రాజెక్టు పూర్తి అవడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమే కాక కేంద్ర ప్రభుత్వంతో ఎప్పటికప్పుడు ప్రాజెక్టు నిర్మాణ ప్రగతిని వివరిస్తూ.ముఖ్యమంత్రి చేస్తున్న కార్యక్రమాలు తప్పక పలుస్తాయని ఇంజనీర్ సానా నాగేశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇటువంటి ప్రాజెక్టు చూసే భాగ్యం ఈ తరానికి మాత్రమే కలిగిందని రానున్నవారికి వాటి ప్రయోజనాలు అందుతాయి అన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ మోడల్ హౌస్ చూపిస్తూ గోదావరి నీటి ప్రవాహానికి పోలవరం నిర్మాణ కార్యక్రమాలను దృశ్య రూపంలో నాగేశ్వరరావు చూపిస్తూ వివరించారు . తొలిగా హెలిపాడ్ వ్యూ పాయింట్ నుండి పోలవరం ప్రాజెక్టును చూశారు. తరువాత ప్రాజెక్టు ఇంజనీర్ల సహకారంతో ఆంధ్రుల జీవనాడి ప్రపంచంలోనే అతి పెద్దదైన పోలవరం ప్రాజెక్టు మీదకు వెళ్లి హైడ్రాలిక్ గేట్లు నీటి నిలువ సామర్థ్యం ఎన్ని లక్షల ఎకరాలు పంట భూములకు నీరు అందుతుంది ఎంత విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది దేశవ్యాప్త జల రవాణా ఏ రకంగా అనుసంధానించబడుతుంది మొదలగు విషయాలు అన్నీ వివరించారు. ఈ ఆనకట్ట కుడి కాలువలు రెండు టన్నుల్స్ నుండి కొండ దాటి అనేక భూములను సస్యశ్యామలం చేసుకుంటూ కృష్ణా నదిలో కలుస్తాయి అలాగే ఎడమ కాలువ టన్నల్ లేకుండా ఓపెన్ గా రవాణా కోసం లాకులు ఏర్పాటు చేయబడింది.

ఈ కాలువ విశాఖపట్నం వరకు ప్రవహించి పంట భూములను సస్యశ్యామలం చేయడమే కాకుండా పరిశ్రమల అవసరాలను ప్రజలకు తాగునీటిని అందిస్తుంది పర్యావరణ హితం అయిన ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఎడమవైపు చేపలకు ఎగువకు ఎగబాకే ఫిష్ లేడార్ అనే సన్నని అంచలంచలా మార్గమును ఏర్పాటు చేసినారు. ఇది దిగువ ప్రాజెక్టు గోదావరి నుండి ఎగువ ప్రాజెక్టు రిజర్వాయర్ కు చేపలు చేరుకొనడానికి సహజసిద్ధమైన ఏర్పాటు తద్వారా మత్స్య సంపద ఎగువ రిజర్వాయర్లు అపరిమితంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది

చివరగా రిజర్వాయర్ నుండి టన్నెల్స్ ద్వారా దిగువ గోదావరిలోకి నీరు ప్రవహించే మధ్యలో 12 విద్యుత్ ఉత్పత్తి చేసే టర్బైన్లు ఏర్పాటు చేయుచున్నారు వీటి ద్వారా 960 మెగావాట్ల నిరంతర జలవిద్యుత్తు ఆంధ్ర ప్రదేశ్కు లభించనుంది .ఈ ప్రాజెక్టు సుమారుగా 80 శాతం పూర్తి అయినదని మరొక 20 సాతం 2027 లో పూర్తి అవుతుందని అన్నారు. ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఆంధ్రుల 80 సంవత్సరాల కల అని అక్కడి ఉద్యోగులు తెలియజేశారు .తప్పక చూడదగిన ఒక ఇంజనీరింగ్ అద్భుతం. ఈ బృందానికి కాకినాడలో రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చిరంజీవి రెడ్డి ,డి ఏ ఎన్ ప్రసాద్ వర్మ ,చెలికాని సూర్యారావు ,జోగాచందర్రావు (చందు) మోహన్ రావు, ధన సాగర్ ప్రసాద్, గోవిందరాజులు, సత్యమూర్తి ,వై ఎస్ ఎన్, సుబ్రహ్మణ్యేశ్వర రావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో పురుషులుతో వంట కార్యక్రమం



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** జగ్గంపేట ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కేంద్రాలలో మార్చి 02 నుండి 20 వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు.అందులో భాగంగానే జగ్గంపేట మండలం జె.కొత్తూరు అంగన్వాడి కేంద్రంలో మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం సిడిపిఓ ఏం.పూర్ణిమ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పుడూ మహిళలు వంటలు చేస్తారు. ఈ సారి ఇంటి వంటల్లో పురుషలను భాగస్వామ్యం చేయాలనీ విభిన్నంగా మగవాళ్ల తో వంటలు చేయించినట్లు తెలిపారు.ఈ వంటల కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం మహిళల భాద్యతలను భర్త ప్రేమ గా పంచుకోవాలి. తద్వారా సత్సంబంధాలు మెరుగు పడతాయి.ఈ కార్యక్రమం నిర్వహణ లో అంగన్వాడీ కేంద్రం కీలకం అంగన్వాడీ టీచర్ ఇంటింటికి తిరిగి వంట చేసేందుకు మగవాళ్ళను ఆహ్వానించడం జరిగింది. తమ అంగన్వాడీ కేంద్రం లో వంట చేసేందుకు సామాగ్రి తో సహా వంటకు ఏర్పాట్లు చేసారు.బాలల రక్షణ, మహిళల భద్రత, బాలికా విద్య ప్రాధాన్యం, బేటీ బచావో -భేటీ పడావో, గర్భస్థ లింగ నిర్ధారణ కి పాల్పడితే తీసుకునే చర్యలు,చట్టాల పై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో అడ్వాకేట్ లు పెదపాటి శ్రీనుబాబు, బాలాజీ గునిపే, మహిళలు, పురుషులు, సూపరవైజర్ అమ్మాజీ, అంగన్వాడీ టీచర్ లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం పరిశీలన



**కాజులూరు, (మనసులో మాట) మార్చి 17..** కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న "రైతన్న మీకోసం" కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సలపాక, కోలంక, కుయ్యేరు, దుగ్గుదుర్రు, జగన్నాథగిరి గ్రామాల్లో వ్యవసాయ శాఖ సహాయకులు కూటమి నాయకులు అమలు చేస్తున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి అశోక్ మాట్లాడుతూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు మరియు రైతుల జీవితాలకు కొత్త దిశనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. రైతుల సంక్షేమం కోసం నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి పంచ సూత్రాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. కాజులూరు మండలంలోని 8,864 మంది రైతులకు "అన్నదాత సుఖీభవ" పథకం కింద రూ. 3.55 కోట్లు, 7,730 మంది రైతులకు "పీఎం కిసాన్" పథకం కింద రూ. 1.55 కోట్లు వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పలువురు రైతుల ఖాతాల్లో నిధులు జమ అవుతున్నాయని, మిగతా రైతులకు కూడా త్వరలోనే నిధులు అందనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాల రాజు మాజీ నీటి సంఘం అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు కోలంక సహకార సంఘం అధ్యక్షుడు బొండా వెంకట నరసింహనాయుడు వ్యవసాయ విస్తున్న అధికారులు ప్రశాంత్, శ్రీనివాస్ వర్మ , వ్యవసాయ శాఖ సహాయకులు సాయి ప్రసన్న , రాజేష్ , అనివిళ్ళ ప్రకాష్ , ధనకుమారి తులసీరావు స్థానిక రైతులు పాల్గొన్నారు.

### దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల మాదిరిగా ప్రేమతో పెంచి,

## వారికి మంచి విద్య, ఉన్నత భవిష్యత్తు కల్పించాలి

### - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం, (మనసులో మాట) మార్చి 17 :** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ బంగ్లాలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా ఆడపాప దత్తత ప్రక్రియను పూర్తి చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో శిశు గృహం స్థాపన అనంతరం మొట్ట మొదటిసారిగా ఒక ఆడ శిశువును జిల్లాలోని ప్రత్యేక దత్తత విభాగం ఆధ్వర్యంలో చట్టబద్ధంగా దత్తత ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా శిశు గృహంలో ఆశ్రయం పొందుతున్న 6 నెలల వయస్సు గల "సుమ" అనే ఆడపాపను కర్ణాటక రాష్ట్రానికి చెందిన శివానంద, మానస దంపతులు దత్తతగా స్వీకరించడం జరిగిందన్నారు. ఈ దంపతులు 2022 సంవత్సరంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 2026 మార్చి నెలలో వారికి దత్తత అవకాశం లభించిందన్నారు. దత్తత తీసుకున్న పిల్లలను కన్నబిడ్డల మాదిరిగా ప్రేమతో పెంచి, వారికి మంచి విద్యతో పాటు ఉన్నత భవిష్యత్తు కల్పించాలని సూచించారు. పిల్లలు లేని దంపతులు దేశవ్యాప్తంగా జూ=కూ పోర్టల్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. దత్తత ప్రక్రియ దేశవ్యాప్తంగా సమర్థవంతంగా కొనసాగుతోందని, ఈ కార్యక్రమం ద్వారా అనాధ పిల్లలకు మంచి కుటుంబ వాతావరణం లభించడంతోపాటు, ఉజ్వల భవిష్యత్తు కల్పించబడుతోందని తెలిపారు. అదేవిధంగా, ఇటీవల చట్టవ్యతిరేకంగా పిల్లలను కొనుగోలు చేయడం, అమ్ముకోవడం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో, ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టబద్ధమైన దత్తతను ప్రోత్సహించాలని తెలిపారు. దత్తత అనంతరం పిల్లల యోగక్షేమాలను తెలుసుకోవడానికి పోస్ట్ అడాప్షన్ ఫాలోఅప్ ప్రక్రియ అమలు చేయబడుతోందని, ఫాలోఅప్ నివేదికలను సంబంధిత పోర్టల్‌లో అప్లోడ్ చేస్తున్నామని వివరించారు. ఇద్దరూ ఉద్యోగాలలో ఉన్న ఈ దంపతులు, పాపను దత్తతగా పొందడం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.



## రామచంద్రపురం నూకాలమ్మ జాతర ప్రారంభం

### - ముఖ్య అతిధిగా హాజరైన తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి (మనసులో మాట) మార్చి 17..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో నూకాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన జాతర ఉత్సవాల్లో పాల్గొని కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ ప్రజలతో కలిసి భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువతతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, నూకాలమ్మ కటాక్షం నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంసుఖసంతోషాలతోఆరోగ్యంతో, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామాల్లో ఇలాంటి సాంప్రదాయ జాతరలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని,యువత తమ సంప్రదాయాలను కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణ శేఖర్, ఎంపీటీసీ బందారు ప్రసాద్,వైస్ ప్రెసిడెంట్ రేవూరి శ్రీను, బండారు చక్రధర్,కామ్మయ్య, పాదాలరావు, గంధం శ్రీను,స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మహిళా నేతలపై దాడిని ఖండిస్తూ గర్జించిన వైఎస్ ఆర్సిపి నాయకులు





**అమలాపురం (మనసులోమాట) మార్చి 17:** తిరుపతి గ్రాండ్ రిడ్జ్ హోటల్ వద్ద టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు రాజీనామా డిమాండ్‌తో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్సార్సీపీ మహిళా నేతలపై జరిగిన అమానుష దాడిని ఖండిస్తూ అమలాపురం లో వైఎస్ఆర్ సిపి నాయకులు నిరసన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం అమలాపురం నియోజకవర్గం, బుద్ధవిహార్ వద్ద జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ సమక్షంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మహిళా నేతలపై భౌతిక దాడులకు పాల్పడటమే కాకుండా, బాధితులపైనే తప్పుడు కేసులు పెట్టడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇశ్రాయేల్ పాముల రాజేశ్వరి, పిల్లి సూర్యప్రకాశ్, మాజీ ఎంపీ చింతా అనురాధ, గన్నవరపు శ్రీనివాసరావు జక్కంపూడి విజయలక్ష్మి జిన్నూరి బాబీ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు కటకంశెట్టి ఆదిత్య ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు అనుబంధ విభాగాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ క్యాంటీన్లో అన్నదానం



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** జగ్గంపేట టౌన్ పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మరియు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ కాంటీన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ జనసేన నాయకులతో కలిసి హాజరయ్యి పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని ఆదర్శం గా తీసుకుని డొక్కా సీతమ్మ క్యాంటీన్ పేరుతో నిరుపేద ప్రజలకు భోజనాన్ని అందించే కార్యక్రమం గత రెండు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్నానని,పేదవాడి ఆకలి తీర్చడంలో ఉన్న సంతృప్తి ఏ పని లో లేదని తుమ్మలపల్లి రమేష్ అన్నారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ను స్ఫూర్తి గా తీసుకుని మా నాయకుడు తుమ్మలపల్లి రమేష్ తన సొంత ఖర్చులతో ప్రతి మంగళవారం నిర్విరామంగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారని, సేవా కార్యక్రమాలను చేస్తున్నారని అన్నారు.డొక్కా సీతమ్మ కాంటీన్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో జగ్గంపేట నియోజకవర్గం జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

మనసులో మాట — సంచలన తెలుగు దిన పత్రిక — KANCHARLA

## బ్యాంకర్లు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవటం ద్వారా
# సమాజ ఉన్నతికి కృషి చేయాలి

**- కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని రైతులు స్వయం సహాయక సంఘాలు, యువతకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ బ్యాంకు అధికారులను కోరారు.

మంగళవారం కాకినాడ కలెక్టరేట్ లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాలు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వివిధ రంగాలకు, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు రుణాల కల్పనను సమీక్షించి, తదుపరి త్రైమాసాలలో అనుసరించాల్సిన ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చించారు.

ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికంగా వివిధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు చేరుకోవడంతోపాటు అవసరతంలో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు విరివిగా రుణాలు అందించి సమాజ ఉన్నతికి కృషి చేయాలన్నారు. గత మాసంత్రానికి జిల్లాలో రుణా ప్రణాళిక కింద 26,408 కోట్లు టార్గెట్ గా నిర్ణయించుగా ఇప్పటివరకు 26,074.5 కోట్ల రుణాలు ఇచ్చారని 98.73 శాతం టార్గెట్ పూర్తి చేయడం జరిగింది అన్నారు. వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రణాలు కింద 13,733 కోట్లు టార్గెట్ గాను 12,632 కోట్ల రుణాలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు.

రానున్న త్రైమసాల్లో పంట రుణాలు మరింత వేగవంతం చేయాలని బ్యాంకర్లకు జేసీ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 10186 డ్వాక్రా సంఘాలకు 1298.71 కోట్ల రుణాలు పంపిణీ చేయగా మెప్మా ద్వారా2,737 పట్టణ సంఘాలకు 420.52 కోట్లు బ్యాంకు రుణాల పంపిణీ చేశారన్నారు. అదేవిధంగా 3,526 మంది మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు 55.55 కోట్ల రుణాలు అందించడం జరిగిందని జేసీ తెలిపారు.

పీఎంఈజీపీ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 122 యూనిట్లు టార్గెట్ కాగా ఇప్పటివరకు 180 యూనిట్లకు 850 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన (ముద్రా) రుణాల కింద 386 మందుకి 170 కోట్లు మంజూరు చేసినట్లు జేసీ తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఉపాధి ఆర్థిక ప్రోత్సాహక కార్యక్రమాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమే తెలిపారు.

అనంతరం నాబార్డ్ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి వివిధ రంగాల ఆర్థిక అభివృద్ధికి 23598 కోట్ల రుణ ప్రణాళికను జేసీ..ఎమ్మెల్సీ, ఎల్డీఎం, నాబార్డ్ ఎల్డీఎం తదితరులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఎల్డీఎం వై. సోమనాయుడు మాట్లాడుతూ.. 500 మంది మహిళా పారిశ్రామిక వేత్తల ను ప్రోత్సహించడానికి నాబార్డ్ దేశంలో మొట్టమొదటి సరిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాని ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 9 వ్యాపారాలలో 150 యూనిట్స్ ఏర్పాటుకు బ్యాంకర్స్ కమిటీ సుమారు 5 కోట్ల రుణాలు మంజూరుకు అనుమతి చేసిందని, దీని ద్వారా 500 నుండి 800 మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ బీజీఆర్. నాయుడు, ఆర్బిఐ ఎల్డిఓ గిరిధర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎస్వి ప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్ గణపతి, డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## మస్కట్ దేశంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న
# మహిళను స్వదేశానికి తీసుకొచ్చిన మైగ్రేషన్ అధికారులు



**అమలాపురం(మనసులో మాట) మార్చి 17:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలో పేరాయిచెరువు గ్రామానికి చెందిన గెడ్డం దుర్గ మస్కట్ దేశంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ సహాయంతో సురక్షితంగా స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దుర్గ తన కుటుంబ సభ్యులను కలుసుకుని, తమను భారతదేశానికి తీసుకురావడంలో సహకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి ని,కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ ప్రతినిధులను సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, విదేశాలకు ఉపాధి కోసం వెళ్తున్న కోనసీమ ప్రజలకు ఈ సెంటర్ ఒక ఆపద్బాంధవులా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే అనేకమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయం చేస్తూ, విదేశాలలో మరణించిన వారి మృతదేహాలను స్వదేశానికి తీసుకురావడం, ఇబ్బందుల్లో ఉన్న వారిని సురక్షితంగా స్వగ్రామాలకు చేర్చడంలో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. ఇలాంటి సెంటర్ ఏర్పాటు జిల్లా కలెక్టర్ దూరదృష్టికి నిదర్శనమని తెలిపారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఈ మోడల్‌ను ప్రస్తావించగా, ఇతర జిల్లాల కలెక్టర్లు కూడా దీనిని అభినందిస్తూ, సమస్యలకు తాత్కాలిక పరిష్కారాలకంటే శాశ్వత పరిష్కార మార్గాలను సూచించే ఉత్తమ విధానమని అభిప్రాయపడ్డారని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఇలాంటి సెంటర్లు ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. ఈ కేసుకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అయితబత్తుల శ్రీనివాసరావు అనే నకిలీ ఏజెంట్ ద్వారా గెడ్డం దుర్గ 2023 జూన్ నెలలో మస్కట్ దేశానికి వెళ్లారు. అక్కడ బొంతు లక్ష్మీ అనే ఏజెంట్‌కు అప్పగించబడిన దుర్గ, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రెండు సంవత్సరాల పాటు పనిచేశారు. అనంతరం ఇంటికి తిరిగి రావాలనుకున్న సమయంలో మరో ఏడాది ఒప్పందం పెంచి, ఆరోగ్యం బాగోలేకపోయినా బలవంతంగా పని చేయించారు. ఆమె ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినడంతో, భర్త ఆమెను తిరిగి తీసుకురావడానికి ప్రయత్నించగా, ఏజెంట్ డబ్బులు చెల్లిస్తేనే పంపిస్తామని చెప్పి బెదిరించారని తెలిపారు. అయితే ఏజెంటుకు కొంత మొత్తం చెల్లించినప్పటికీ మరింత డబ్బు డిమాండ్ చేసిన పరిస్థితుల్లో, పరిచయస్తుల సలహాతో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌ను సంప్రదించారు. దీంతో కెసిఎం ప్రతినిధులు భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించి, మస్కట్‌లో ఉన్న అసోసియేషన్ సభ్యుడు బొంతు నాగరాజు ఎంబసీలో ఉన్న తెలుగు వర్గాల సహకారంతో గెడ్డం దుర్గను సురక్షితంగా భారతదేశానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో గోళ్ళ రమేష్, కడియాలసత్తిబాబు, షేక్ బీబీ సఫియాపాల్గొన్నారు.

# మాతృశ్రీ గుబ్బాలమ్మ జాతర మహోత్సవాలకు జ్యోతుల నవీన్ కు ఆహ్వానం



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** గోకవరం గ్రామంలో జరగబోవు గ్రామ దేవత మాతృశ్రీ గుబ్బాలమ్మ జాతర మహోత్సవాలకు హాజరుకావాలని, చల్లని దేవత గుబ్బాలమ్మ ఆశీస్సులు పొందాలని ఆలయ చైర్మన్ ఆచంట ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కు మంగళవారం నాడు జగ్గంపేటలో పార్టీ కార్యాలయం నందు ఆహ్వానాలు అందించారు. నిత్యం దైవ చింతనతో నడయాడే నియోజవర్గ అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ సారథ్యంలో కమిటీ సభ్యులందరూ కలిసి ఆలయ ప్రతిష్టను మరింత ముందుకు తీసుకు వెళ్తున్నామని జ్యోతుల నవీన్ కు చైర్మన్ రాజు తెలిపారు. ఈనెల 18 నుండి 23 వరకు జాతర మహోత్సవం ఘనంగా జరప నున్నామని,26వ తారీఖున గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో, సమన్వయంతో ఎంతో సంతోషంగా జరుపుకునే గ్రామ దేవత జాతరలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కమిటీ సభ్యులు కోరారు. ఉగాది పర్వదినాన అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని ఈ కార్యక్రమంలో అతిరథ మహారదులతో పాటు , నాయకులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆచంటరాజు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యకుడు కందుల చిట్టిబాబు ఆలయ వైస్ చైర్మన్ గన్రెడ్డి సన్యాసిరావు, వైస్ చైర్మన్ ముప్పిడి నాగేశ్వరరావు, వెన్ను వీరబాబు, టిడిపి మండల మీడియా కోఆర్డినేటర్ కొంగరపు రాజు తదితరులు పాల్గొన్నారు.

# పంచ సూత్రాలతో వ్యవసాయం పండగ

## కూటమి ప్రభుత్వంలో అన్నదాతలకు మేలు - రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు




**కొత్తపేట మనసులో మాట మార్చి 17..** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, పంచ సూత్రాలతో వ్యవసాయం పండగలా మారుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట మండలం పలివెల సేరిపాలెంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతన్నా మీకోసం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందని. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలు మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేసామన్నరు. రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని నీటి భద్రత కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పోలవరం వెలిగొండ తదితర ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని. అగ్రిటెక్ లో భాగంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు మొదలైనవి సబ్సిడీపై అందిస్తుందన్నారు. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆ అవగాహన పెంచుకోవాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, వ్యవసాయధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులను నిలువునా మోసం చేశారన్నారు. ఏడాదికి రూ.7500 మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లుగా రూ.20 వేలను పీఎం కిసాన్ పథకంతో కలిపి రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణ నగదు రైతులకు జమ కావడానికి ఆరు నెలల వరకు సమయం పట్టేది అన్నారు. ఇప్పుడు ధాన్యం అమ్మిన వెంటనే 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదు జమవుతుందన్నారు. అన్నదాతల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది .ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మార్చి 18 నుండి ఇంద్రధనస్సు పేరుతో రాష్ట్రంలోని విభిన్న ప్రతిభా వంతులకు ఉచిత బస్సు సౌకర్యం

**జిల్లా టిడిపి విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర**




**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** విభిన్న ప్రతిభా వంతులకు(దివ్యాంగులకు) ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది.వారికి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి తెచ్చిందని మార్చి 18వ తేదీ నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభా వంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగశక్తి ఇంద్రధనస్సు పేరుతో దివ్యాంగులకు ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది అని 40% వికలాంగత్వం పైబడిన దివ్యాంగులందరికీ పల్లె వెలుగు, ఆర్డినరీ, ఎక్స్ బస్సు, సిటీ ఆర్డినరీ, బస్సులలో ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందని మార్చి 18వ తేదీ బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని. జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఉదయం 11 గంటలకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దివ్యాంగులకు ఉచిత బస్సు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.కావున జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి దివ్యాంగులందరూ రావాలని ఆయన పిలుపునిచ్చారు. దివ్యాంగులను అన్ని విధాల ఆదుకుంటూ 6000, 10,000, 15,000 పింఛన్ పెంచడమే కాకుండా ఈరోజు దివ్యాంగులకు ఉచిత బస్సులు కూడా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని కూటమి సర్కార్ నిర్ణయంపై విభిన్న ప్రతిభావంతుల తరుపున హర్షం వ్యక్తం చేస్తున్నామని కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభవంతుల అధ్యక్షుడు మండపాక అప్పన్న దొర తెలియజేశారు.

# మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి**

**- వి కేశవరావు వెల్లడి**

**కాకినాడ (మనసులో మాట( మార్చి 17..**కాకినాడ జిల్లాలో ఈ రోజు నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్2026 (డే19) పరీక్షలు ప్రశాంత వాతావరణం లో ఎటువంటి అంతరాయాలు లేకుండా సక్రమంగా నిర్వహించబడినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి. కేశవ రావుమంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం కెమిస్ట్రీ పరీక్ష నిర్వహించబడింది. కాకినాడ జిల్లాలో మొత్తం 17,104 మంది విద్యార్థులు కేటాయించబడగా వారిలో 16,675 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై పరీక్ష రాశారని తెలిపారు. 429 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలలో పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో కట్టుదిట్ట మైన భద్రతా ఏర్పాట్ల మధ్య నిర్వహించ బడినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే మాల్‌ప్రాక్టీస్‌కు సంబంధించిన ఎటువంటి ఘటనలు నమోదు కాలేదని కేశవరావు తెలిపారు.పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పరిశీలకులు (స్టేట్ అబ్సర్వర్ ) జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించి నట్లు తెలిపారు . అదేవిధంగా జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు డా. జె. రాంబాబు (డి ఈ సి 1), వి. శ్రీనివాస్ (డిఈసి2),డి.వి.కె. వర్మ (డిఈసి 3) కూడా పర్యవేక్షణ నిర్వహించినట్లు తెలిపారు. మొత్తంగా జిల్లా లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రశాంతంగా క్రమబద్ధంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి తెలిపారు.



# వాడపల్లి వెంకన్న ఆలయ అన్నదాన పథకానికి రూ లక్ష విరాళం

**కొత్తపేట మనసులో మాట మార్చి 17..** కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే నిత్య అన్న దాన పథకానికి కృష్ణాజిల్లా మచిలీపట్నం చెందిన దేవన బోయిన రామ్మోహన్ రావు, వాణి కుటుంబ సభ్యులు రూ,1 లక్ష 116 విరాళం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్ల సూర్య చక్రధర్ రావు లకు అందజేశారు. దాతలకు అర్చకులు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, స్వామి చిత్రపటం,అందజేశారు.

# పేకాట రాయుల్లా పై పోలీస్ దాడి

**- పది మంది అరెస్ట్ ఐదువేల నాలుగు వందలు...**

**- ఏడు మొబైల్స్, రెండు బైక్స్ 52 కార్డ్స్ స్వాధీనం..**

**- రంపచోడవరం ఎస్ ఐ వెంకటరావు వెల్లడి...**



**రంపచోడవరం (మనసులో మాట) మార్చి 17..** పోలవరం జిల్లా ఎస్. పి.అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఇంచార్జ్ ఎస్ డి పి ఓ బి . హేమంత్ పర్యవేక్షణలో రంపచోడవరం సిఐ సన్యాసి నాయుడు సూచనల మేరకు ఎస్ఐ వెంకటరావు,తో పాటు సిబ్బంది సహాయం తో ఖచ్చితమైన సమాచారంతో రంపచోడవరం లోని చెరువూరు గ్రామ శివారు లో మంగళవారం పేకాట ఆడుతున్న వారిపై డ్రోన్ సహాయంతో దాడి నిర్వహించడం జరిగింది. ఈ దాడి లో పేకాట ఆడుతున్న పది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 5400 నగదును, ఏడు మొబైల్ ఫోన్స్ ను, రెండు మోటర్ బైక్స్ ను 52 కార్డ్స్ ను సీజ్ చేయడం జరిగిందని ఎస్ ఐ వెంకటరావు తెలిపారు .ఈ దాడి లో మరి కొంత మంది పారిపోవడం జరిగిందన్నారు. త్వరలో వారిని కూడా అరెస్ట్ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రంపచోడవరంలో డ్రోన్ సహాయంతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా పెట్టడం తుందని అలాంటి వారిని గుర్తుంచి వారి పై కఠిన చర్యలు తీసుకొంటామని ఆయన హెచ్చరించారు. ఎవరైనా ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటే వారిపై కఠినమైన చర్యలు తీసుకొంటమని ఎస్సై వెంకటరావు తీవ్రంగా హెచ్చరించారు.

# దివ్యాంగులకు ఉగాది కానుక

**- నేటి నుంచి దివ్యాంగులకు ఆర్టీసీ బస్సు ల్లో ఉచిత ప్రయాణం**



**అమలాపురం (మనసులోమాట) మార్చి 16:** రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉగాది కానుకను ప్రకటించారు. దీనిలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ కోనసీమ జిల్లా ప్రజా రవాణాధికారి శ్రీ నివాస్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలోని అమలాపురం, ముమ్మిడివరం, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట, రామచంద్రపురం నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యే లు ప్రజాప్రతినిధులచే ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ పథకంలో 40 శాతం వైకల్యం దాటాలని 4 నుంచి 21 వర్గాల దివ్యాంగులకు 'దివ్యాంగ శక్తి' విస్తరణ వెంట వచ్చే సహాయకులకు ఛార్జీల్లో 50 శాతం రాయితీ ఇవ్వనున్న ట్లు ఆయన తెలిపారు. ఈ పథకం వలన 12.76 లక్షల మంది దివ్యాంగులు, సహాయకులకు లబ్ది చేకూరుతుందని ఉగాది కానుకగా ఈ పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పథకానికి బుధవారం అమరావతిలో శ్రీకారం చుడతారన్నారు. 'స్త్రీశక్తి' బస్సులే 'దివ్యాంగ శక్తి'కి వర్తిస్తాయని ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు, 100 శాతం కంటి చూపు కోల్పోయిన వారికి, 100 శాతం మూగ, చెవిటి వారికి, అలాగే 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులకు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం ఉందని పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వీరికి 50 శాతం రాయితీ లభిస్తోందన్నారు. 100 శాతం అంధత్వం, మానసిక వైకల్యం ఉన్నవారితో వచ్చే సహాయకులకు 50 శాతం రాయితీ లభిస్తోంది. అయితే 'దివ్యాంగ శక్తి' పథకం కింద దివ్యాంగులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. 'స్త్రీశక్తి' పథకం కింద వర్తించే బస్సుల్లో అంటే సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా రాష్ట్రమంతా ప్రయాణించవచ్చునన్నారు. ఇప్పటివరకు కేవలం 4 వర్గాల దివ్యాంగులకు మాత్రమే ఉచిత ప్రయాణ సౌకర్యం ఉండేది. ఇకపై 21 వర్గాల దివ్యాంగులకు ఈ సౌకర్యం వర్తిస్తుందన్నారు. ప్రస్తుతం 1.71 లక్షల దివ్యాంగులకే లబ్ది చేకూరుతుండగా, ఈపథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మంది దివ్యాంగులకు ప్రయోజనం కలుగుతుంది. వీరిలో పురుషులు 6.86 లక్షల మంది ఉన్నారు. అలాగే ఇప్పటివరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా, ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో మొత్తం లబ్దిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరిగింది. నేటి నుండి డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 'స్త్రీశక్తి' పథకం వర్తించే 194 బస్సుల్లో దివ్యాంగులు కూడా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీలో సుమారు 55 శాతం బస్సులకు ఈ పథకాన్ని వర్తింప చేశారు. ఇప్పటికే దివ్యాంగులు, వారి సహాయకులకు 3 సంవత్సరాల కాలానికి జారీ చేసిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణానికి ఉపయోగపడతాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్లలోని బస్ పాస్ కౌంటర్లలో దివ్యాంగులకు బస్ పాస్ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదు..

## - ప్రజల్లో ఉంటేనే మానసిక ప్రశాంతత - మంత్రి కందుల దుర్గేష్

**-నిడదవోలు పురపాలక సంఘం 60 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ ఆవిష్కరణ**

**-పదవీ కాలం ముగిసిన మున్సిపల్ పాలక వర్గానికి అభినందనలు - వివిధ సంఘాలకు కమ్యూనిటీ హాళ్ల స్థలాల పట్టాల పంపిణీ**

**- వేసవి దృష్ట్యా ఆర్టీసీ డిపో వద్ద చలివేంద్రం ప్రారంభం**



**నిడదవోలు (రాజమహేంద్రవరం), మనసులో మాట, మార్చి 17:** నిడదవోలు పట్టణ మున్సిపల్ కౌన్సిల్ హాలులో నేడు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. నిడదవోలు పురపాలక సంఘం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, కేంద్ర పోస్టల్ శాఖ రూపొందించిన ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంపును మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు.

**పదవీ విరమణ కాదు.. కేవలం విరామం మాత్రమే:మంత్రి కందుల దుర్గేష్..**

నేటితో నిడదవోలు మున్సిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “ఉద్యోగులకు రిటైర్మెంట్ ఉంటుంది కానీ రాజకీయ నాయకులకు ఉండదు. ఇది పదవీ విరమణ కాదు, కేవలం ఒక చిన్న విరామం మాత్రమే“ అని అన్నారు. గత ఐదేళు ్లగా పట్టణాభివృద్ధికి కృషి చేసిన మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణను, వైస్ ఛైర్మన్లను, అన్ని పార్టీల కౌన్సిలర్లను ఆయన అభినందించారు. ప్రజల్లో నిత్యం ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కౌన్సిలర్లు తమ పదవీ కాలం ముగిసినా ప్రజల్లోనే ఉండి సేవ చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో పదవుల్లో ఉండటం, కోల్పోవడం సాధారణ అంశం అన్నారు. భవిష్యత్తు జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదిస్తూ శుభాభినందనలు తెలిపారు.

**అభివృద్ధికి చిరునామాగా నిడదవోలు:మంత్రి**

గడిచిన 20 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వ సహకారంతో సుమారు 140 కోట్ల రూపాయల నిధులతో నిడదవోలును అభివృద్ధి పథంలో నడిపించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గడిచిన రెండేళ్లలో పలువురు అధికార పార్టీలోకి రావడం వల్ల ఈ మున్సిపాలిటీ జనసేన వశం అయిందని, కూటమిలో జనసేన భాగస్వామ్యం కావడం వల్ల తాను మంత్రిగా ఉండటం వల్ల అభివృద్ధి వేగవంతం చేశామన్నారు. మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ టీంను భవిష్యత్తులో ఇలాగే నడిపించాలని సూచించారు. నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో సర్వతోముఖంగా అభివృద్ధి చేయడానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సమస్యలేమైనా ఉంటే తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ సహకారంతో నిధులు వెల్లువలా తెచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేశానన్నారు. నిడదవోలుకు స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ హోదా సాధించామన్నారు. రాబోయే రోజుల్లో వారి సహకారంతో మరిన్ని నిధులు రాబట్టి, పట్టణాన్ని సర్వతోముఖాభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.




**పట్టాల పంపిణీ..**

అనంతరం పురపాలక కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. నాయి బ్రాహ్మణ సంఘం, పండ్లు, పూల వర్తకుల సంఘం, పట్టణ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘాల వారికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల పట్టాలను మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిడదవోలు పట్టణం 10వ వార్డులో రజకుల కమ్యూనిటీ హాల్ మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షల నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కందుల దుర్గేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రజాసేవలో చలివేంద్రం ప్రారంభం..**

పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. స్వయంగా ప్రజలకు మజ్జిగ, చల్లని తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు, అధికారులు, వివిధ పార్టీల నేతలు, కూటమినాయకులు,పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం వెంటనే వేతన సవరణ సంఘాన్ని ప్రకటించాలి

## - ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

**పిఠాపురం, (మనసులో మాట) మార్చి 17:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వేతన సవరణ సంఘాన్ని నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలని పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పిఠాపురంలోని బాదం మాధవరావు మున్సిపల్ హైస్కూల్లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా కొత్త వేతన సవరణ ఊసే లేకపోవడం దారుణమన్నారు. 30 వేల కోట్ల రూపాయల ఆర్థిక బకాయిలు, పెండింగ్ కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల విలీనం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, రకరకాల యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురిచేయడం తగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పప్పు శ్రీనివాస్, దడాల ప్రవీణ్ కుమార్, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోలేకుర్రు పోలేరమ్మ ఆలయ 20వ వార్షికోత్సవం

## - అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పాలాభిషేకం



**తాళ్ళరేవు (మనసులో మాట) మార్చి 17:** మండల పరిధిలోని పోలేకుర్రు గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు కొండవీటి చందు, మర్ల హరిబాబులచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, పాలాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పోతుల చక్ర శేషారావు( చినబాబు) మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారికి 20వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించామన్నారు. అదేవిధంగా ప్రతి ఏటా ఆషాడ మాసం మొదటి ఆదివారం నాడు అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని చినబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పుప్పాల శ్రావణ్ కుమార్, పోతుల సత్యప్రసాద్, ఉంగరాల వెంకటేశ్వరరావు, ఏరుపల్లి వీరన్న యాదవ్, సమనాసి సుబ్బారావు, ఏడిద సూరిబాబు, చరణ్ పాల్గొన్నారు.



# వైభవంగా ఇంజరం పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు

**తాళ్ళరేవు (మనసులో మాట) మార్చి 17:** ఇంజరం గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీన ప్రారంభమైన ఉత్సవాలు నాలుగు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నారు. వీటిలో భాగంగా మూడు రోజులపాటు జాతర అనంతరం ఈనెల 18వ తేదీ బుధవారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి పెద్దజాతరను గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్ ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు సమర్పించుకుంటున్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఉన్న 42 ఆశ కార్యకర్తలు ఉద్యోగాలు భర్తీ



**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 42 ఆశా కార్యకర్తల ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి 2025 జులై 3 వ తేదిన 302 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ వారి ఆదేశాలు మేరకు జిల్లా హెల్త్ సొసైటీ కమిటీ వారు గత ఫిబ్రవరి 25 తేదిన దరఖాస్తు చేసుకున్న వారి అందరిని ఇంటర్వ్యూకు ఆహ్వానించి వారి యొక్క కమ్యూనికేషన్ స్కిల్స్, జెనరల్ నాలెడ్జ్ సామాజిక ఆరోగ్య మరియు అవగాహన పైన ఇంటర్వ్యూ చేయడం జరిగిందనీ డిస్టిక్ హెల్త్ సొసైటీ కమిటీ రాష్ట్ర కమ్యూనిటీ ప్రాసెస్ వారి గైడ్లైన్స్ ప్రకారం ఈ యొక్క ఆశ కార్యకర్తలను ఇంటర్వ్యూ మార్కులు మరియు ,మెరిట్ ఆధారంగా ఎశీపిక చేసి, కాకినాడ జిల్లా అర్బన్ పరిదిలో 3 కాకినాడ జిల్లా రూరల్ పరిదిలో 28, వెరసి మొత్తం 41 ఆశా కార్యకర్త పోస్ట్ లను ఎశీపిక చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి టి. తిప్పే నాయక్ తెలిపారు.ఎంపికైన అబ్యర్ధులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వారి నుండి నియామక ఉత్తర్వులు జారీ చేస్తారని తెలియజేసారు .

## ముగిసిన పిఠాపురం కౌన్సిల్ కొలువు

# ఆఖరి సమావేశంలో వాడివేడి చర్చలు!

- ‘పుర మిత్ర యాప్’ ద్వారా నాపై కసి తీర్చుకోండి.. జవాబుదారీతనానికి అదే మార్గం: కమిషనర్ నామ కనకారావు
- భార్య రూపంలో ఆ కుర్చీలో కూర్చున్నా.. కో-ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి
- నేటితో ముగిసిన పదవీకాలం.. రేపటి నుండి ప్రత్యేక అధికారి పాలన



**పిఠాపురం (మనసులో మాట ) మార్చి 17:** పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ ఐదేళ్ల పదవీకాలం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన జరిగిన ఆఖరి అత్యవసర సమావేశం ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. సభ్యులందరూ గత ఐదేళ్లలో తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు . రేపటి నుండి మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానున్న నేపథ్యంలో, కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలపై గళం విప్పారు.

సమావేశంలో 40 మంది శానిటేషన్ సిబ్బంది నియామకంపై టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్ అధికారులను నిలదీశారు. దీనిపై కమిషనర్ నామ కనకారావు స్పందిస్తూ.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అత్యంత పారదర్శకంగా నియామకాలు జరిగాయని, ఎటువంటి అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. అలాగే, ఆస్తి పన్ను డబుల్ అసెస్మెంట్లు 316కు పెరగడంపై సభ్యులు అల్లవరపు నగేష్, బొజ్జా జగదీశ్వరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని పరిష్కరించి పిఠాపురాన్ని ‘స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ‘గా మార్చాలని కౌన్సిల్ ముక్తకంఠంతో తీర్మానించింది. సీనియర్ సభ్యుడు బొజ్జా రామయ్య మాట్లాడుతూ.. 20 మీటర్ల పైపులైన్ కోసం ఆరు నెలలుగా నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేయగా, కుళాయిలు లేకపోయినా పన్నులు వస్తున్నాయని సభ్యులు బోను దేవా, లలితాదేవి అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ.. అధికారులపై ఏవైనా ఫిర్యాదులు ఉంటే ‘పురమిత్ర యాప్‘ ద్వారా తెలియజేసి మీ కసి తీర్చుకోవచ్చని, అది జవాబుదారీతనాన్ని పెంచుతుందని వ్యాఖ్యానించారు. తాము అడిగేది కేవలం ప్రజల సమస్యల కోసమేనని సభ్యులు తలిశెట్టి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. చైర్‌పర్సన్ సూర్యావతి మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో రూ. 21 కోట్ల అభివృద్ధి పనులు చేశామని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో పట్టణానికి మరిన్ని నిధులు అందుతాయని తెలిపారు. కో-ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి ఉద్వేగభరితంగా మాట్లాడుతూ.. “రిజర్వేషన్ల వల్ల నేను చైర్మన్ కాలేకపోయినా, నా భార్య ద్వారా ఆ స్థానంలో కూర్చోవడం మధుర క్షణం“ అని వ్యాఖ్యానించారు. కొత్త కౌన్సిల్ వచ్చే వరకు తమను వార్డుల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయాలని కోరారు. అనంతరం, ఐదేళ్ల పాలన గుర్తుగా కౌన్సిల్ సభ్యులందరినీ అధికారులు సాలువాలతో ఘనంగా సన్మానించారు. కౌన్సిల్ సభ్యులందరూ చివరిగా అజెండాలోని అన్ని అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# లబ్ధిదారులకు అండగా సీఎం సహాయనిధి

## మాజీ ఎమ్మెల్యే వర్మ



**పిఠాపురం (మనసులో మాట) మార్చి 17:** పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక సంజీవనిలా పనిచేస్తుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పేర్కొన్నారు. మంగళవారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు, గొల్లప్రోలు పట్టణానికి చెందిన లబ్ధిదారులకు 2.లక్షల 50 వేల రూపాయలు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు పెద్ద కొడుకుగా అండగా ఉంటున్నారని కొనియాడారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ, శీరం మాణిక్యం, మడికి ప్రసాద్, మల్లిపూడి వీరబాబు, నేమాల బాబీ, ఓరుగంటి వీరబాబు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొద్దాం

## - యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పీ జయకర్




**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** ఈ వేసవిలో ఉపాధ్యాయులు విస్తృతంగా ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేసి ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొద్దామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పీ జయకర్ పిలుపునిచ్చారు. మంగళవారం రాజమండ్రి యూటీఎఫ్ హోమ్ లో జిల్లా యూటీఎఫ్ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు కల్పిస్తున్న సౌకర్యాలను ఉపాధ్యాయులు ఆయా ఆవాస ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఇందు కోసం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ అందిస్తున్న కరపత్రాలను ఉపయోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టుకునే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి జయకర్ మాట్లాడుతూ ఈ ఏడాది పిల్లలను భారీ ఎత్తున ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు యూటీఎఫ్ రాష్ట్ర స్థాయిలో కార్యాచరణ ఏర్పాటు చేసుకుని అమలు చేస్తూ ఉందన్నారు. ఈ మేరకు గత నెల రాజమండ్రిలో ఆరు జిల్లాల ప్రాంతీయ రీజనల్ సమావేశం విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆవాస ప్రాంతం నుంచి పాఠశాల, గ్రామాలు, మండలాలు జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో ఏరోజుకారోజు ఎన్రోల్మెంట్ డ్రైవ్ వివరాలు తెలుసుకుని సమీకరిస్తున్నామని జయకర్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడినప్పుడే సమాజంలోని అన్ని వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు దక్కుతాయని ఈ సందర్భంగా జయకర్ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన కోట్లాది రూపాయలు నిధులు ప్రభుత్వం దగ్గర నిలిచి పోయాయని దీని కోసం రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు రణభేరి పేరిట ఆందోళన కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వంలో స్పందన లేదన్నారు. ఈ నెల 24 నుంచి రణభేరి-3.0 పేరుతో నియోజకవర్గ స్థాయి నుంచి నాలుగు దశల్లో యూటీఎఫ్ ఆందోళన కార్యక్రమం చేపడుతుందని ఆయన తెలిపారు. అప్పటికీ ప్రభుత్వంలో కదలిక లేకపోతే ఏప్రిల్ 28న వేలాది మంది ఉపాధ్యాయులతో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. దీనిలో ఉపాధ్యాయులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని షరీఫ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వీ వెంకటరమణ, ఉపాధ్యక్షులు జే రూపస్ రావు, ఎం విజయ గౌరీ, కోశాధికారి పీ శ్రీనివాస్ మూర్తి, జిల్లా కార్యదర్శులు ఈ శ్రీమణి, ఎన్ భవాని తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది



**అనపర్తి (మనసులో మాట) మార్చి 17:** అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం ఉలపల్లిగ్రామంలో, రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఏఎంసీ ఛైర్మన్ జుత్తుక సూర్య కుమారి, కాకినాడజోన్ ఆత్మ కమిటీ ఛైర్మన్ రావాడా నాగు ఆధ్వర్యంలో, రైతు లబ్ధిదారులు ఇంటింటికి వెళ్లి రైతుల కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కుటమీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తుందని సూపర్ సిక్స్ హామీలో భాగంగా ఏదైతే రైతులకు 20వేల రూపాయలు అన్నదాత సుఖీభవా, పీఎం కిసాన్ కార్యక్రమంలో మూడు విడతలగా రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని, అలాగే నియోజకవర్గ అభివృద్ధికి వ్యవసాయ రంగ అభివృద్ధికి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, రైతులకు నీరు అందించడంలో గాని యూరియా విషయంలో గాని కొరత లేకుండ కృషి చేశారని, ఏదైతే రైతు సీఎంఆర్ అమ్మిన ధాన్యం డబ్బులు 24 గంటలలోగా, రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని రైతులందరూ కూడా సేంద్రియ వ్యవసాయానికి మొగ్గు చూపాలని కోరారు. ఈసందర్భంగా రైతులు ప్రభుత్వం రైతుల కోసం చేస్తున్న కృషికి ఆనందం వ్యక్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిక్కవోలు మండలం జనసేన పార్టీ అధ్యక్షులు అనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇందల వీరబాబు, ఉల్లపల్లి గ్రామ కుటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# ఎక్సెస్ అమౌంట్ వేసిన టెండర్లు ఆమోదించాలా..?

## - హాట్ హాట్‌గా అఖరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం - కౌన్సిలర్‌లకు ఘనంగా వీడ్కోలు



**రామచంద్రపురం (మనసులోమాట) మార్చి 17..** పురపాలక పరిధిలో పలు అభివృద్ధి పనులకు సంబందించి వివిధ వార్డుల్లో చేపట్టని పనులకు వేసిన టెండర్లలో కాంట్రాక్టర్‌లు ఎస్టిమేషన్ కన్నా ఎక్సెస్ అమౌంట్ వేసి టెండర్లు వేస్తే వాటిని ఆమోదించాలా అని పలువురు కౌన్సిలర్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పురపాలక కార్యాలయంలో గల మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం కౌన్సిల్ అఖరి సమావేశం చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తొలుత జరిగిన సాధారణ సమావేశంలో మొత్తం 52 అంశాలను కౌన్సిల్ ఆమోదం కొరకు ప్రవేశపెట్టారు. అందులో మొత్తం 13 అంశాల్లో పొందుపరిచిన వివిధ అభివృద్ధి పనులకు సంబందించిన టెండర్లను ఎస్టిమేషన్ కన్నా ఎక్సెస్ అమౌంట్‌తో కాంట్రాక్టర్లు వేసిన టెండర్లను కౌన్సిల్ ఆమోదం కొరకు సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనికి కౌన్సిల్ వైఎస్ఆర్‌సీపీ విప్ వాడ్రేవు సాయిప్రసాద్, కౌన్సిలర్ పెంటపాటి శ్రీదేవి, తదితరులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గత కౌన్సిల్ సమావేశంలో ఇదే టెండర్లను లెస్‌కు వేస్తే తిరస్కరించగా ప్రసుతం అవే పనులకు సంబందించి తరిగి ఎక్సెస అమౌంట్‌లో టెండర్లు వేసే ఎలా ఆమోదించాలని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ఎక్సెస్ అమౌంట్ వేసిన టెండర్లను వెంటనే రద్దు చేసి తిరిగి టెండర్లు పిలవాలని లేదా ఎస్టిమేషన్ వేసిన అమౌంట్‌కు పనులు చేపట్టాలని సూచించారు. దీంతో చైర్ పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ ఎక్సెస్ అమౌంటు వేసిన టెండర్లు అన్నింటిని తిరిగి ఎస్టిమేషన్ అమౌంటుకు వేశాలా కాంట్రాక్టర్లతో మాట్లాడాలని, అలా చేయని పిదప ఆయా టెండర్లను రద్దు చేయాలని కమీషనర్ రాజును ఆదేశించారు. ఈమేరకు కౌన్సిల్ మినిట్స్ బుక్‌లో వాటిని పొందుపర్చాలని కౌన్సిలర్ సాయిప్రసాద్ కోరారు. అనంతరం 44వ అంశంగా పట్టణంలోని పలు వార్డుల్లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ఈ ప్రొక్రూర్‌మెంట్ టెండర్లు తక్కువకు వేసి పలు చేపట్టని కాంట్రాక్టర్లను తొలగించి తిరిగి టెండర్లు పిలిచి పనులు చేయాలని దీనికి సంబందించిన కాంట్రాక్టర్లను తొలగించేందుకు కౌన్సిల్ ఆమోదం కొరకు ప్రవేశపెట్టారు. ఈ అంశంలో ముగ్గురు కాంట్రాక్టర్లు మొత్తం 9 పనులకు గాను గత ఏడాది ఏప్రియల్‌లో టెండర్లు వేసి పనులను ప్రారంభించలేదు. దీంతో వారిని వెంటనే తొలగించి అభివృద్ధి పనులు చేపట్టాలని కౌన్సిలర్‌లు కోరటంతో దీనికి కౌన్సిలర్‌లు ఆమోదం తెలిపారు. అనంతరం చేపట్టిన అత్యవసరం సమావేశంలో మొత్తం12 అంశాలకు సంబందించి వివిధ అభివృద్ధిపనులు ఆమోదం కొరకు కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు. అయితే ఆయా టెండర్లు కూడా ఎక్సెస్ అమౌంట్‌కు కాంట్రాక్టర్లు వేయటంతో వాటిని కూడా ప్రతిపాదించిన అమౌంట్‌తోనే పనులు చేసే విధంగా మార్చాలని కౌన్సిలర్‌లు సూచించారు. అయితే ప్రస్తుతం ఇసుక కంకర వంటి రేట్లు పెరగటంతో ఎక్సెస్ అమౌంట్‌కు కాంట్రాక్టర్లు వేశారని అధికారులు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చి నప్పటికీ, ఎస్టిమేషన్ అమౌంట్‌కు ఎవరైతే పనులు చేపడతారో వారికే ఇవ్వాలని తిరిగి సూచించారు. ఈమేరకు సవరణ చేసిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కౌన్సిల్ ఏర్పడిన తరువాత 202021,2022 సంవత్సరాల్లో కరోనా మహ్మారి కారణంగా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టలేక పోయామని, ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి కౌన్సిల్‌ను మరో ఏడాది పాటు పొడిగించే విధంగా చేయాలని ఈమేరకు చేసిన తీర్మాణాన్ని ప్రభుత్వానికి అందించాలని కౌన్సిలర్‌లు అందరూ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. మరో అంశంలో వార్డు సభ్యుడుగా ఉన్న మున్సిపాలిటీలోని పదాన్ని తొలగిచి వార్డు కౌన్సిరల్‌గా మార్చాలని కోరుతూ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. అనంతరం కౌన్సిలర్‌లను అధికారులు ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. వైఎస్ చైర్మన్‌లు చింతపల్లి నాగేశ్వరరావు, కోలమూరి శివాజీ, కౌన్సిలర్‌లు పాలపర్తి శ్వేతపావని, పోతంశెట్టి శ్యామల, కేతా శ్రీను, కేతా సుజాత, కుడిపూడి లలిత, బొక్కా సత్యనారాయణ, కోటిపల్లి లక్ష్మీ, కో అప్షన్ సభ్యులు గుబ్బల గణ, మస్తాన్, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# ఆర్టీసీలో ఉగాది కానుకగా దివ్యాంగ శక్తి పథకం ప్రారంభం

## - ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీ.వి సత్యనారాయణ వెల్లడి

**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 17..** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఉగాది కానుకగా మార్చి 18వ తేదీ నుండి ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబడిందని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవి సత్యనారాయణ ఒక ప్రకటన లో మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ క్రింది విషయాలను పేర్కొన్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు , సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ అనే ఐదు రకాల బస్సులలో ఈ దివ్యంగా శక్తి పథకం వర్తిస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యంగులకు, 100 శాతం, కంటి చూపు లేని వారికి 100 శాతం, మూగ చెవిటి వారికి 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ప్రెస్ బస్సులలో వీరికి 50 శాతం రాయితీ లభిస్తుందని ఇక మీదట ఈ దివ్యంగా శక్తి పథకం ద్వారా దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని, అలాగే వారి సదరం సర్టిఫికెట్ లో ఉన్న సహాయకులకు కూడా ఈ బస్ లలో 50 శాతం రాయితీ లభిస్తుందని ఈ సందర్భంగా డిపో మేనేజర్ జీ.వి. సత్యనారాయణ పేర్కొన్నారు . ఈ దివ్యాంగ శక్తి పథకం 18వ తేది బుధవారం నాడు ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజక వర్గల్లో ప్రారంభించ డానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా డిపో మేనేజర్ జీ.వి సత్యనారాయణ తెలిపారు.

# పశువులకు గాలికుంటు వ్యాధిటీకాలు పాల్గొన్న జాయింట్ డైరెక్టర్ శ్రీధర్



**ఏలేశ్వరం (మనసులో మాట) మార్చి 27..** ఏలేశ్వరం మండలం బద్రవరం గ్రామంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు కార్యక్రమం పశువర్ధక శాఖ అధికారులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీధర్, ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాటి పశువులకు స్థానిక నాయకుల సమక్షంలో వ్యాధి సంరక్షణ దిశగా గాలికుంటు టీకాలు వేశారు. జాయింట్ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ గాలికుంటు టీకాలను రైతులు తప్పనిసరిగా పాడి పశు వులకు వేయించాలని, పాడి రైతులకు సూచించారు. గాలికుంటు టీకాల యెక్క ప్రాముఖ్యతను వివరించారు. పాడి రైతులకు పశువర్ధక శాఖ సూచనలతో తమ పాడిపశులను సంరక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ అంబేద్కర్, అసిస్టెంట్ డైరెక్టర్ బాలచంద్ర యోగేశ్వర్ ,భద్రవరం గ్రామ సర్పంచ్ కునపరెడ్డి సుబ్బారావు, టిడిపి నాయకులు జగటాపు సూరిబాబు, బిజెపి నాయకులు పోలినాటి బుజ్జి,, గ్రామ నాయకులు పశు వైద్య సిబ్బంది ,పాడి రైతులు, తదితరులు పాల్గొన్నారు

# డ్వాక్రా యానిమేటర్ చేతివాటం

## - కృప మహిళా శక్తి సంఘం గ్రూపు నుండి 7లక్షల 75వేల రూపాయలు స్వాహా
## - డ్వాక్రా యానిమేటర్ పై చర్యలకు డిమాండ్
## - సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం



**జగ్గంపేట (మనసులో మాట) మార్చి 17..** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూడి గ్రామం లో కృప మహిళా శక్తి సంఘం గ్రూపు 2022లో 15 లక్షల రూపాయలు లోన్ తీసుకోవడం జరిగింది. తీసుకున్నప్పటినుంచి 32 నెలలు ఒక్కొక్కరు 3,100/- చొప్పున నెలకు 31,000/- రూపాయలు కట్టి త్వరగా తీరిపోతుందని నెలకు 4,100/- చొప్పున నెలకు 41,000 ప్రెసిడెంట్ తీసుకువెళ్లి యానిమేటర్ హైమావతి కి ఇవ్వడం జరిగింది. కానీ గత 20 నెలల నుంచి లోను కట్టడం మానివేసి సుమారు 7 లక్షల 75 వేల రూపాయలను మాయంచేసి ఇప్పుడు ఏమి చేసుకుంటారో చేసుకోండి అని అంటే ఈరోజు గ్రూప్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు కలిసి ఈరోజు జగ్గంపేట ఏపిఎం కు వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకురాలైన దళిత మహిళ (డ్వాక్రా ప్రెసిడెంట్)ను యానిమేటరు నమ్మించి మొత్తం డ్వాక్రా సొమ్మును కాజేసిందంటే అధికారులు ఏ విధంగా డ్వాక్రా సంఘాలను పర్యవేక్షిస్తున్నారో తెలుసుకోవాలని ఆయన విమర్శించారు. కృప మహిళా డ్వాక్రా సంఘం ప్రెసిడెంట్ ని యానిమేటరు మాయమాటలు చెప్పి బ్యాంకు మేనేజర్ కాలు పట్టించడం అంటే వివక్షత ఎంతలా ఉందో అధికారులు తెలుసుకోవాలని ఆయన తెలిపారు. తక్షణమే డ్వాక్రా సంఘాలలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు చేపట్టి, రాజపూడి యానిమేటర్ హైమావతిపై చర్యలు తీసుకొని, వారికి సహకరించిన సిసి, ఏపిఎం, బ్యాంక్ మేనేజర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని, అలాగే 7 లక్షల 75 వేల రూపాయలను రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో మా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు వారి బంధువులు పి డి యస్ యు (వి) రాష్ట్ర కార్యదర్శి కే సతీష్, బిజెపి నాయకులు అచ్యుతరామయ్య పాల్గొన్నారు.

# టిడ్కో గృహాలను జూన్ నెలలో అందజేస్తాం: బడేటి



**ఏలూరు, మార్చి 17(మనసులో మాట)..** గత వైసిపి ప్రభుత్వ విధ్వంసకర పాలనలో తీవ్రంగా మోసపోయిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో న్యాయం చేస్తుందని, వచ్చే జూన్ నెలాఖరికి టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి భరోసా ఇచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు మేలు చేయలేని వారికి ఇప్పుడు మాట్లాడే నైతిక హక్కు ఎక్కడిదని ఆయన ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తున్న ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పోణంగి రోడ్ లో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను శరవేగంగా పూర్తి చేయించి లబ్ధిదారులకు అందించి వారి కళల్లో ఆనందాన్ని చూడాలని తాపత్రయ పడుతున్నారు. దీనిలో భాగంగానే టిడ్కో గృహాల పనులను పరుగులు పెట్టేలా అధికారులకు పలు సూచనలు చేస్తూ వస్తున్నారు. మంగళవారం స్వయంగా ఎమ్మెల్యే బడేటి చంటి పోణంగి రోడ్డు లోని టిడ్కో గృహాలను పరిశీలించారు. పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మీడియాతో మాట్లాడుతూ 2014-19 మధ్యకాలంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం పేద ప్రజలు సుఖశాంతులతో జీవించడానికి నాణ్యమైన గృహాలను అందించాలని నిర్ణయించి పోణంగి , కొత్తూరు, మాదే పల్లిలో దాదాపు 6486 టిడ్కో గృహాలకు శంకుస్థాపన చేసిందని తెలిపారు. ఈ గృహాల నిర్మాణం పురోగతిలో ఉండగా, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాలను నిర్వీర్యం చేసే విధంగా చర్యలు తీసుకుందని ధ్వజమెత్తారు. కేవలం విధ్వంసం తప్ప ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తి చేయకపోగా చివరకు లబ్ధిదారులను కూడా మోసం చేశారని ఆరోపించారు. ఈ ఇళ్లను కూడా తాకట్టు పెట్టి రుణాలు తీసుకుని లబ్ధిదారులను నిలువు దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. డీడీలు కట్టిన పాపానికి లబ్ధిదారులు బ్యాంకు నోటీసులు అందుకోవాల్సిన పరిస్థితితోపాటు సిబిల్ స్కోర్ పడిపోయి వారికి మళ్ళీ రుణాలు వచ్చే అవకాశం లేకుండా పోయిందని ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. వచ్చే నెల ఏప్రిల్ లో డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి ఆ మొత్తాన్ని తిరిగి వారి ఖాతాల్లో జమ చేయడం జరుగు తుందని ఆయన హామీ ఇచ్చారు . అలాగే పోణంగి , కొత్తూరు ల్లో నిర్మిస్తున్న టిడ్కో గృహాలను జూన్ నెలకి లబ్ధిదారులకు అందించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి విజయవాడ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాస్, కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చోడే వెంకటరత్నం, నగర ప్రధాన కార్యదర్శి రెడ్డి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ పైడి వెంకట్రావు, కో క్లస్టర్ ఇంచార్జ్ మెరుగుమాల శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గొంగాడి సాంబశివరావు, తెర్లి వెంకన్న, ఆర్నేపల్లి తిరుపతి, పూజారి నిరంజన్,=చీ= నాగేశ్వరరావు, టిడ్కో గృహాల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణరావు, ప్రాజెక్టు మేనేజర్ కృష్ణమూర్తి, ఏఈలు పూర్ణచంద్ర కుమార్, సాయిబాబా మరియు బిజెపి నాయకులు నడపన భాస్కరరావు, జనసేన నాయకులు వీరంకిపండు మరియు వివిధ హోదాలలో ఉన్న కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



# సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో విథన్ స్కూలు ఉపాధ్యాయులకు భాగవత గ్రంథాల పంపిణీ

**గోకవరం (మనసులో మాట), మార్చి 17 :** మండల కేంద్రం గోకవరం లోని సూర్య పీఠం ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం విదన్ స్కూల్ ఉపాధ్యాయులకు భాగవత గ్రంథాలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఫౌండర్ ట్రష్టి తోట సాయిబాబు మాట్లాడుతూ ఎదుటి మనిషి కష్టాన్ని చూసి స్పందించడం, ఎదుటివారికి ఉపకారం చేయడం, మనవలె మన తోటి వారు ఆనందంగా ఉండాలి అని కోరుకోవడమే నిజమైన మానవత్వమని అటువంటి మానవత్వాన్ని పెంపొందించేదే హిందూ తత్వం అని అన్నారు. హిందూ మత అస్తిత్వంలో లోకశాంతి తప్ప పరమత ద్వేషం మచ్చుకు కూడా ఉండదన్నారు. హిందూ మతం అనే జ్యోతి యొక్క కాంతి శాంతి మార్గాన్ని చూపిస్తుందన్నారు

# 175 మంది యువతకు ఉద్యోగం అందజేశాం: బడేటి



**ఏలూరు, మార్చి 17(మనసులో మాట)..** అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ యువత తమ జీవితాలను ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. అందుకు అవసరమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెండుగా కల్పించేందుకు కూటమి ప్రభుత్వాధినేతలు విశేషంగా కృషిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఏలూరు అశోక్ నగర్ కేపిడిటి హైస్కూల్ ఆడిటోరియంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లోని 21 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ జాబ్‌మేళాలో అభ్యర్థుల ఎంపికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత ఆయనకి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఇచ్చిన హామీలో భాగంగా 20లక్షల మంది యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం శ్రమిస్తోందన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ధ్యేయంతో ముందడుగు వేస్తున్నారన్నారు.
గతంలో అర్హులు ఉద్యోగాలను వెతుక్కుంటూ వెళ్ళేపరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హతకలిగిన అభ్యర్థులను వెతుక్కుంటూ ఉద్యోగావకాశాలే క్యూ కడుతున్నాయన్నారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, అర్హతలకు తగ్గ అనుభవాన్ని గడించిన అనంతరం సొంత ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తే బావుంటుందని ఆయన హితవు పలికారు. జాబ్‌మేళాల్లో ఉద్యోగాలు పొందిన వారంతా ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఎమ్మెల్యే చంటి ఆకాంక్షించారు. మొత్తం 14 96 ఉద్యోగాలకు అవకాశం కల్పిస్తే 352 మంది తమ వివరాలు పోర్టర్లో నమోదు చేయించుకున్నారని,వారిలో 175 మందికి ఈరోజు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని తెలిపారు. అనంతరం ఆయన ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు.

# భీమేశ్వర స్వామికి భారీ ఆదాయం



**సామర్లకోట (మనసులో మాట) మార్చి 17;** దేశంలో పంచారామ క్షేత్రముగా ప్రసిద్ధి చెందిన సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. చైర్మన్ కంటే జగదీష్ మోహన్, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఫణింద్ర కుమార్ ఆధ్వర్యంలో అక్టోబర్ 9 నుండి మార్చి 17 వరకు 160 రోజులకు సంబంధించి హుండీల లెక్కింపు నిర్వహించారు. స్వామివారికి 18 లక్షల 23వేల194 రూపాయల ఆదాయం లభించినట్లు ఈవో బల్ల నీలకంఠం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో కోలాహాలంగా ఆలయ కమిటీ సభ్యులు చీమల కొండ ప్రసాదరావు తాటిపూడి సత్య అరుణ వంశీ గుల్తి సత్యనారాయణ తాతపూడి పవన్ కుమార్ అలోక్ చంద్ర జైన్ కంచర్ల సుష్మా మోహిని కొండపల్లి సత్యవాణి మందపల్లి భాను వెంకట పద్మ బాడితమాని లక్ష్మీ గోనిపాటి బుల్లెమ్మ ఉండూరు జగ్గంపేట సామర్లకోట ప్రాంతాలకు చెందిన భక్తమండలి సభ్యులు అర్చకులు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు. పూర్తి భద్రత నడుమ హుండీల లెక్కింపు పూర్తి చేసినట్లు ఈవో బల్ల నీలకంఠం తెలిపారు. ఆలయ అభివృద్ధికి, శ్రీ భీమేశ్వర స్వామి నిత్య అన్నదాన పథకానికి దాతలు సహకరించాలని ఈఓ నీలకంఠం కోరారు.

# దడాలకు పలువురు పరామర్శ



**తాళ్లరేవు (మనసులో మాట) మార్చి 17:** అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావును మంగళవారం పలువురు పరామర్శించారు. జార్జీపేటలో జగదీశ్వరరావు స్వగృహానికి వైఎస్సార్సీపీ రాష్ట్ర నాయకుడు చింతలపాటి శ్రీనివాసరాజు తదితరులు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసారు. ఆయన వెంట వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, నాయకులు రెడ్డి నాగేశ్వరరావు. పేర్ని ఆదినారాయణమూర్తి, నీలపాల శ్రీను, కోరుకొండ చంటి. శీలి రాజు తదితరులు ఉన్నారు.



## 22ఏ భూ సమస్యలపై సర్వే నెంబర్ల వారిగా పరిష్కార చర్యలు

### - కలెక్టర్

**ఏలూరు, మార్చి , 17 (మనసులో మాట)..** కైకలూరు నియోజకవర్గంలో 22ఏ భూ సమస్యలపై సర్వే నంబర్ల వారీగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ కు తెలిపారు. జిల్లాలో 22 ఏ భూ సమస్యల పరిష్కారాలపై మంగళవారం భూపరిపాలన శాఖ ముఖ్య కమీషనర్ జి. జయలక్ష్మి తో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో 22 ఏ భూ సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో సర్వే నెంబర్ల వారీగా పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన సమయంలో కైకలూరు నియోజకవర్గం ఉమ్మడి కృష్ణా జిల్లా నుండి ఏలూరు జిల్లాలో చేరిందన్నారు.కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, మండవల్లి మండలాల్లో 22 ఏ భూ సమస్యలకు సంబంధించి ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సిఎస్ కి తెలియజేసారు.

# అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు

### - ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు






**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరం లోని స్థానిక పందిరి ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో సభాధ్యక్షుడు ఆదిరెడ్డి శ్రీనివాస్, కలెక్టర్ కీర్తి చేకూరి కలసి ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనార్టీ సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై ఆధ్యాత్మిక వాతావరణంలో ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. మైనార్టీల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందు నిర్వహించడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులపై అల్లా కృప ఉండాలని ఆకాంక్షించారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల సంరక్షణతో పాటు మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజమహేంద్రవరం నియోజకవర్గ ప్రజా ప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తున్నట్లు, అదే విధంగా తమ ట్రస్టు ద్వారా పలు కార్యక్రమాలను అందజేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఆధ్యాత్మికత, నియమనిష్ఠలకు ప్రతీక అని తెలిపారు. ఉపవాస దీక్షల అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు శాంతి, సామరస్యాలతో ప్రార్థనలు నిర్వహించడం సమాజానికి మంచి సందేశమన్నారు. జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

జేసీ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఆత్మపరిశుద్ధి, దైవభక్తికి ప్రతీక అన్నారు. ఉపవాసం మనలో నియమ నిష్ఠలను పెంపొందించి సేవా భావాన్ని పెంచుతుందన్నారు. పరస్పర గౌరవం, ప్రేమ, దాతృత్వం వంటి మానవ విలువలను బలపరిచే ఈ పవిత్ర మాసాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సౌభ్రాతృత్వం, సామరస్యానికి ప్రతీక అని తెలిపారు. ఇఫ్తార్ విందులు పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని చెబుతూ జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్ చెంచు రెడ్డి, ఇంచార్జి ఆర్డీవో కే భాస్కర్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ అఫ్సరి, మైనార్టీ మత పెద్దలు మహమ్మద్ అబ్దుల్లా, మహమూద్ జానీ, భాషా నిమ్రా, రెఫిక్ రాజా, షేక్ బషీర్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ముస్లిం సోదర సోదరీమణులు, పలు శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

# ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసి కిర్లంపూడి మండల కమిటీ ఎన్నిక

### - జేఏసీ చైర్మన్ గా కిర్లంపూడి తహసీల్దార్ కె సాయికిరణ్



**కిర్లంపూడి (మనసులో మాట) మార్చి 17..** ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ కిర్లంపూడి మండలం కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ చైర్మన్ గా మండల తహశీల్దార్ కూన సాయికిరణ్,కో చైర్మన్ గా మండల రెవెన్యూ అధికారిణి కె వి సత్యదేవి, మండల కన్వీనర్ గా ఎం.గుర్రయ్య సెక్రటరీ జనరల్ గా సర్వేయర్, జి అనిల్ కుమార్,ట్రెజరర్ గా వి ఆర్ ఓ,ఎస్.జాన్ బాబు,వైస్ చైర్మన్లుగా జి సతీష్ కుమార్,బి శివరామకృష్ణ, బి సాయి ప్రకాష్,బి వి ప్రసాదరావు,జాయింట్ సెక్రెటరీలుగా కె డి ప్రసాద్, ఎం అచ్యుత్ రావు,జి వెంకన్న పలువురు తహశీల్దార్ కార్యాలయం సిబ్బందిని కార్యవర్గ సభ్యులుగా ప్రజాస్వామ్య బద్ధంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో జేఏసీ చైర్మన్ గాఎన్నికైన కిర్లంపూడి తహశీల్దార్ కూన సాయికిరణ్ మాట్లాడుతూ ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ కి అన్ని విధాలా సహకరిస్తానని తెలియజేసారు. జిల్లా కమిటీ తరుపున రాష్ట్ర వీఆర్వోల సంఘం రాష్ట్ర జాయింట్ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ,ఏపీ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జెఏసి వైస్ చైర్మన్ మల్లేష్ అల్లాడి, కాకినాడ జిల్లా జాయింట్ కార్యదర్శి అవసరాల కిషోర్,కాకినాడ డివిజన్ అధ్యక్షుడు మెడిశెట్టి కిషోర్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వీఆర్వోలు, వీఆర్ఏలు, సర్వేయర్లు ,తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# రైతుల ఇళ్ళకు..కలెక్టర్!

### రైతన్న 'మీ కోసం' కార్యక్రమం ద్వారా..
### రైతుల సమస్యలకు ఇంటి వద్దనే పరిష్కారం

**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "రైతన్న మీ కోసం" కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కడియం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడి పంటల పరిస్థితి, సాగు విధానాలు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ అధికారులు, అనుబంధ శాఖల సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని తక్షణ పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. క్లస్టర్ల వారీగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు గ్రామాలను సందర్శిస్తూ రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తున్నారని తెలిపారు. పీఎం-కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాల వివరాలను రైతులకు వివరిస్తూ ప్రభుత్వ సహాయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. నీటి భద్రత, పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతికత వినియోగం, ఆహార ప్రాసెసింగ్, వ్యవసాయాభివృద్ధి అనే ఐదు సూత్రాల వ్యూహంతో రైతన్న మీ కోసం కార్యక్రమం అమలు జరుగుతోందని తెలిపారు. పంట మార్పిడి విధానం, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే లాభాలను రైతులతో కలెక్టర్ కీర్తి చేకూరి చర్చించారు. లాభసాటిగా ఉన్న పద్ధతులను నిరంతరం కొనసాగించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధానాలను అనుసరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం మీ మీ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం (ఆర్బీకే)లో అందుబాటులో ఉంటుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

## జిల్లా పరిషత్ సిబ్బందికి 12 కంప్యూటర్స్ అందజేసిన ఉమ్మడి జిల్లా చైర్ పర్సన్ పద్మశ్రీ



**ఏలూరు మార్చి 17(మనసులో మాట)..** ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో కార్యాలయ నిర్వహణ సౌలభ్యం కోసం జిల్లా పరిషత్ నిధులతో కొనుగోలు చేసిన 12 కంప్యూటర్లను అన్ని సెక్షన్‌లకు సెక్షన్‌కు రెండు చొప్పున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మ శ్రీ ప్రసాద్ మంగళవారం పంపిణి చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఘంటా పద్మ శ్రీ ప్రసాద్ మాట్లాడుతూ... ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగంతో జిల్లా పరిషత్ కార్యాలయ పనులు మరింత వేగవంతంగా, సమర్థవంతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కంప్యూటర్లు అందజేయడంతో జిల్లా పరిషత్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది తరపున చైర్ పర్సన్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్య కార్యనిర్వాహణ అధికారి భీమేశ్వర్ పాల్గొన్నారు.

## జార్జిపేట చేరుకున్న సీతారాముల విగ్రహాలు



**తాళ్ళరేవు (మనసులో మాట) మార్చి 17:** మండల పరిధిలోని జార్జిపేట గ్రామంలో రెడ్డిపేటలో పునః నిర్మించిన శ్రీ సీతారామా బాలాలయం విగ్రహాలు మంగళవారం గ్రామానికి చేరుకున్నాయి. తిరుపతి నుంచి గ్రామానికి త్వరితగతిన రావడానికి పిల్లంక శ్రీనురాజు కృషి చేసినట్లు తెలిపారు. బాలాలయం విగ్రహాలు గ్రామానికి వచ్చిన శుభ ముహూర్తంలో చింతలపాటి శ్రీను రాజు, కుడిపూడి శివన్నారాయణ, పెంకె ఏడుకొండలు, అబ్బిరెడ్డి సుందరం, పేర్ని ఆదినారాయణ మూర్తి, రెడ్డి నాగు, గుత్తుల గోవింద్, కడలి సింహాద్రి, శీలి రాజు కమిటీ సభ్యులు పరిశీలించారు.

# యానాంలో రెండవ రోజూ.. నామినేషన్లు నిల్

### పుదుచ్చేరిలో కొలిక్కిరాని కూటమి సర్దుబాట్లు

**యానాం (మనసులో మాట) మార్చి 17:** యానాం శాసనసభా నియోజకవర్గంకు జరుగుతున్న ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు నామినేషన్లు బోనీ కొట్టలేదు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా రెండోరోజు మంగళవారం సైతం నామినేషన్లు దాఖలు కాలేదని రిటర్నింగ్ అధికారి, ఆర్ఎఒ శివరాజీమీనా పేర్కొన్నారు. అయితే ఈనెల 20, 22 తేదీల్లో పబ్లిక్ హాలిడేస్ కావడంతో నామినేషన్లు స్వీకరించబడవని తెలిపారు. అభ్యర్థులు తమ నామినేషన్లును ఈనెల 23లోగా దాఖలు చేయాల్సివుంది. ఈ నేపథ్యంలో పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమి, ఇండియా కూటమిల్లో సీట్లు సర్దుబాటు ఒక కొలిక్కి రాకపోవడంతో పోటీచేసే అభ్యర్థుల జాబితా విడుదల కాక నామినేషన్లు దాఖలు చేయడం జరగడం లేదు. అభ్యర్థులు తమ నామినేషన్ల పత్రాలను స్వీకరించే ఆర్ఎఒ ఆఫీసు వద్ద పారామిలటరీ బలగాలతో భారీభద్రతను ఏర్పాటు చేశారు.

## జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి బాటలో నిలిపేందుకు

# ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

- ప్రభుత్వ సేవలపట్ల ప్రజలకు మరింత మేలు జరిగేలా, ప్రజల సంతృప్తి స్థాయి మరింత పెంచడంపై ప్రత్యేక దృష్టి
- జిల్లాలో టెంపుల్ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు - ఏలూరు కార్పొరేషన్ లో పారిశుద్ధ్యానికి అదనంగా 50 మంది సిబ్బంది
- రాష్ట్రంలో గృహ వినియోగదారులకు గ్యాస్ పంపిణీలో ఎటువంటి కొరతా లేదు - పీడీఎస్ రైస్ బ్లాక్ మార్కెట్ కు తరలించే వారిపై కేసులు
- నియోజకవర్గ స్థాయిలలో 'సదరం' క్యాంపుల నిర్వహణ - పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్





**ఏలూరు, మార్చి , 17(మనసులో మాట)** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాను అన్ని రంగాలలోనూ అభివృద్ధి బాటలో నిలిపేందుకు ప్రజాప్రతినిధులందరూ కలిసికట్టుగా ఒక ఖచ్చితమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళతామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో మంగళవారం జిల్లాలోని ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, అధికారులతో జిల్లా అభివృద్ధికి తీసుకోవలసిన అంశాలపై సమీక్షించిన అనంతరం పాత్రికేయుల సమావేశంలో మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ జిల్లా పరిస్థితులకు అనుకూలమైన ఉద్యానవన పంటలపై ప్రత్యేక దృష్టి కేంద్రేకరించి వాటి అభివృద్ధి ద్వారా రాష్ట్రంలో జిల్లాను అభివృద్ధిలో 5 నుండి 3వ స్థానంలో నిలిపామన్నారు జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అమలు జరిగేలా, ప్రభుత్వ పథకాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుండి ఐవిఆర్ఎస్ విధానం ద్వారా అభిప్రాయాలను తెలుసుకుంటున్నదన్నారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు జిల్లా అభివృద్ధిపై సమీక్షించనున్న దృష్ట్యా ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచేందుకు, ప్రజలకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు తీసుకోవలసిన చర్యలపై అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా తీసుకోవలసిన చర్యలు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, పంచాయతీ రోడ్లు, ఆర్ అండ్ బి రోడ్లు, ఆర్టీసీ బస్టాండ్లు, అన్న కేంటీన్ల నిర్వహణ, పెన్షన్ నమోదు, పాఠశాలలు, వసతి గృహాలలో మెరుగైన వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులతో చర్చించామన్నారు. జిలాల్లో ప్రజల సంతృప్తి స్థాయి తక్కువగా ఉన్న ప్రభుత్వ సేవల విభాగంలో ప్రజల సంతృప్తి స్థాయిని మరింత పెంచడంపై తీసుకోవలసిన చర్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామన్నారు. రైతాంగానికి అవసరమైన సాగునీటికి సంబంధించి పంట కాల్వలు మరమ్మత్తులు, నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు, పాఠశాలల నిర్మాణాలను పూర్తి చెంసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి సమాన ప్రాధాన్యతను ఇస్తున్నారని, జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి బాటలో నిలిపేందుకు పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నామని, పరిశ్రమలు ఏర్పాటుచేసే పారిశ్రామికవేత్తలు భూములు గుర్తించడం, వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు, ఎంఎస్ఎంఈ పార్కులు, యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు ఆ ప్రాంత యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందుతాయన్నారు. అదేవిధంగా జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు "టెంపుల్ టూరిజం సర్క్యూట్" ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. పాపికొండల ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి, ఐ.ఎస్. జగన్నాథపురంలోని లక్ష్మి నరసింహస్వామి కి వెళ్లే రహదారిని 2 లైన్ల నుండి 4 లైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య అందేందుకు ఆసుపత్రులకు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏలూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందేలా వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ తో చర్చించామన్నారు.

వంట గ్యాస్ కొరత లేదు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం- మంత్రి నాదెండ్ల మనోహర్

రాష్ట్రంలో గృహ వినియోగదారులకు వంట గ్యాస్ సరఫరాకు ఎటువంటి కొరతా లేదని, ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి గ్యాస్ బుక్ చేసుకుంటున్నారని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. రాష్ట్రంలో సగటున 2. 8 లక్షల వంట గ్యాస్ బుకింగ్లు నమోదైతే, ప్రస్తుతం 3 లక్షల వరకు బుకింగ్లు జరుగుతున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో సగటున 12 వేల నుండి 14 వేల వంట గ్యాస్ బుకింగ్లు ఉంటె, 50 వేల వరకు గ్యాస్ బుకింగ్ నమోదయ్యాయన్నారు. ఈనెల 20వ తేదీన విశాఖపట్టణం నకు పోర్ట్ నకు వంట గ్యాస్ నౌక చేరుకుంటున్నదన్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నపై మంత్రి స్పందిస్తూ పీడీఎస్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసేవారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలలో కూడా మార్పు రావాలని, ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ప్రభుత్వం రేషన్ బియ్యం ప్రజలకు అందించేందుకు కేజీకి 52 రూపాయల వరకు ఖర్చు చేస్తున్నదని, ప్రజలు ఆ బియ్యాన్ని వినియోగించుకోవాలని, అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో వంట నూనె, టీ పొడి వంటి ఆహార పదార్ధాల కల్తీలపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నలపై మంత్రి స్పందిస్తూ ఇప్పటికే విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలలో ఆహార పదార్థాలు కల్తీలపై దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న 59 ఫుడ్ ఇన్స్పెక్టర్ పోస్టులను భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కేంద్రాలకు వ్యయప్రయాసలతో రానవసరం లేకుండా జిలాల్లో నియోజకవర్గాల స్థాయిలో సదరం క్యాంపులు నిర్వహించి విభిన్న ప్రతిభావంతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పెన్షన్లు, ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు.

## క్షేత్ర స్థాయి నుంచి వైసీపీని

# మరింత బలోపేతం చేయాలి

### - సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు



**కాకినాడ (మనసులో మాట) మార్చి 17..** వైఎస్సార్ సీ.పీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పరిశీలకుల సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. కాకినాడ జిల్లా వైసీపీ కార్యాలయంలో.. పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుల కీలక సమావేశం జరిగింది. పార్టీని సంస్థాగతంగా గ్రాస్ రూట్ లెవల్ నుంచి మరింత బలోపేతం చేయడం, భవిష్యత్ ఎన్నికలకు సిద్ధం కావడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ప్రసంగించిన ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 15 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణాన్ని పూర్తి చేసుకుని 16వ ఆవిర్భావ దినోత్సవంలోకి అడుగుపెట్టిందని పేర్కొన్నారు. పార్టీ ప్రారంభం నుంచి ప్రజలతో కలిసి, ప్రజల కొరకే పనిచేస్తూ విలువలు మరియు విశ్వసనీయతను కాపాడుకుంటూ ముందుకు సాగిందన్నారు. పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ స్వయంగా ఆ విలువలను ఆచరించి చూపడమే కాకుండా, ప్రతి నాయకుడు అదే మార్గంలో నడిచేలా దిశానిర్దేశం చేశారని తెలిపారు. జగన్ వెంట నడిచే ప్రతి కార్యకర్త గర్వంగా చెప్పుకునే స్థాయిలో పార్టీ నిలిచిందని, ప్రజల్లో వైఎస్సార్‌సీపీపై విశ్వాసం మరింత పెరిగిందన్నారు. పార్టీ భవిష్యత్ విజయానికి సంస్థాగత బలోపేతం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో సమన్వయం పెంచి, గ్రాస్‌రూట్ స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసి, వాటి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించాలని, పరిశీలకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు సపోర్టింగ్ సిస్టమ్‌లా పనిచేయాలని ఆదేశించారు. అధికారంలో ఉన్న సమయంలో ప్రజలకు అందించిన సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, అదే సమయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత విధానాలను ప్రజలకు వివరించాలని ఆయన పిలుపునిచ్చారు. టీడీపీ చేస్తున్న ఫేక్ ప్రచారం, పెయిడ్ క్యాంపెయినింగ్‌ను వాస్తవాలతో ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేయడం అత్యంత కీలకమని పేర్కొంటూ, క్రియాశీలకంగా పనిచేస్తున్న కార్యకర్తలను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాలని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు కమిటీలలో ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

ఎన్నికల విజయానికి బూత్ స్థాయి నిర్మాణం కీలకమని ఆయన స్పష్టం చేశారు. బూత్ లెవల్ ఏజెంట్ల నియామకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన చోట టాస్క్ ఫోర్స్‌లను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండి, పార్టీ ఓట్లు ఎక్కడా తొలగించబడకుండా జాగ్రత్త పడాలని అన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు ఒక్క తాటిపైకి రావడం పార్టీ బలమని పేర్కొంటూ, భవిష్యత్ రాజకీయ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షుడు జగన్ కమిటీల నియామకంపై నిరంతరం సమీక్ష చేస్తున్నారని తెలిపారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేసి ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లడం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త బాధ్యత అని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. జగన్ అడుగులు ప్రభంజనంగా మారాయి. పరిశీలకులు కీలక పాత్ర పోషించాలి. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పిలుపు నిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల నుంచి అపార స్పందన లభిస్తున్నదని, ఆయన ఎక్కడికి వెళ్లినా జనసంద్రం కనిపిస్తోందని ఎమ్మెల్సీ, పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించాల్సిన బాధ్యత ఉందని ఆయన పేర్కొన్నారు. పరిశీలకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లను గెలిపించేందుకు ప్రధానంగా పనిచేయాల్సిన వ్యక్తులని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులను నిరంతరం గమనిస్తూ, స్థానిక నాయకులతో సమన్వయం కలిగి పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయి కమిటీల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ నిర్మాణం బలోపేతం అయిందని, సుమారు 16 లక్షల మంది కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా సిద్ధంగా ఉందన్నారు. ఈ సైన్యాన్ని మరింత క్రియాశీలంగా మార్చడం పరిశీలకుల బాధ్యత అని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ, స్థానిక సంస్థల ఎన్నికలు వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ ఓటు బలం కాపాడుకోవడంలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉంటే కూటమి పార్టీలకు ఎదుర్కొనే ధైర్యం, సామర్థ్యం ఉండదని ఆయన వ్యాఖ్యానించారు. సమన్వయం, క్రమశిక్షణతో పనిచేస్తే పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడం సాధ్యమని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులుగా పార్టీ అధినేత జగన్ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. రాబోయే ప్రతి ఎన్నికను సవాలుగా స్వీకరించి పార్టీ అభ్యర్థులను గెలిపించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవాలని పిలుపు నిచ్చారు. ఈ రాజకీయ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేయాలని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి కోరారు.





## గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదు

**పల్నాడు, మార్చి 17, (మనసులో మాట):** గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని గ్రామంలో ఏ చిన్న సమస్య ఉన్న పోలీసు వారి దృష్టికి తీసుకురావాలని గొడవలు సృష్టించే వారి మీద జిల్లా ఎస్పీ ఆదేశానుసారం కఠిన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి డి.ఎస్.పి ఎం హనుమంతరావు హెచ్చరించారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో సత్తెనపల్లి డిఎస్పి హనుమంతరావు ఆధ్వర్యంలో పెదకూరపాడు రూరల్ సర్కిల్ సిఐ పి సురేష్, బెల్లంకొండ ఎస్ఐ పి గోపి నేతృత్వంలో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు సామాన్య ప్రజలకు ఇబ్బందులు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు మేము ఉన్నామని భరోసా కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం నందు రౌడీ షీటర్లు ట్రబుల్ మ్యాంగర్స్ పాత కేసుల్లోనే నిందితులపై ప్రత్యేక నిఘా ఇల్లు పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీలలో గ్రామం నందు సరైన ఆధార పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 25, ఆటో, పలుగులు 3, కత్తులు 3 స్వాధీనం చేసుకున్నారు. ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం గురించి డీఎస్పీ అవగాహన కల్పిస్తూ గ్రామంలోని ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రజలు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. పాత కేసుల నిందితులతో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సీఐ పి శ్రీనివాసరావు, సిఐలు 5, ఎస్సైలు 7, ఏ ఎస్ఐలు 2, హెడ్ కానిస్టేబుల్ 15, పీసీలు 30 మంది, ఉమెన్ పీసీలు 2, హోంగార్డులు 16 మంది తో కలిపి 81 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విదేశాంగ నీతిని అర్థం చేసుకోవడంలో తప్పటడుగులు..

### - బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణంరాజు



**రాజమహేంద్రవరం (మనసులో మాట), మార్చి 17:** "నీరు కొలది తామర సుమ్మీ" అంటారు. దీని అర్థం మనం ఎంత వరకు అర్థం చేసుకోగలమో అంతే విషయం ఉందని భావిస్తామని భావన అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణంరాజు అన్నారు. మంగళవారం ఆయనొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. దేశ ప్రయోజనాలే పరమావధిగా దేశ విదేశాంగ విధానం కాలానుగుణంగా మారుతూ ఉంటుందని పేర్కొన్నారు. నెహ్రూఇందిరా కాలంలో అలీన విధానం అవసరమైందని, కానీ నేటి గ్లోబల్ పరిస్థితుల్లో.. ఆర్థిక శక్తులు, భద్రతా సవాళ్లు, సాంకేతిక పోటీలు, ఉగ్రవాదం, వాతావరణ మార్పులు వంటి అంశాలు కొత్త దౌత్య దిశగా ఆలోచించాలానే పరిస్థితిని కల్పించాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రయోజనాత్మకమైన వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి కలిగిన విదేశీ విధానం ద్వారా దేశానికి సరైన భవితను నిర్ధారిస్తున్నారు అన్నారు. ఇటీవల కాలంలో మన పొరుగు దేశాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక పెను సవాళ్ళను ఎదుర్కొంటున్నాయని, విదేశీ ప్రయోజనాలు, బాహ్య ప్రాబల్యం, బలమైన శక్తుల స్వప్రయోజనాల నీలిఛాయలో కొట్టు మిట్టాడుతుండటం మన గమనిస్తూనే ఉన్నాం అన్నారు. కొందరు విమర్శకులు "నైబర్ హుడ్ ఫస్ట్" విధానం కాస్తా.. "నైబర్ హుడ్ ఫర్గెట్"గా మారిందని వాపోతున్నారు కానీ వాస్తవం ఏమిటంటే, కోవిడ్ సమయంలో భారత్ పొరుగు దేశాలకు టీకాలు, ఔషధాలు, ఆహార సహాయం అందించిందని.. నేపాల్, శ్రీలంక, మాల్దీవులకు విపత్తుల సమయంలో సహాయం చేసిందని చెప్పారు. బంగ్లాదేశ్‌లో చైనా ప్రభావం పెరగటం, గ్లోబల్ జియోపాలిటిక్స్ కారణం, అది భారత్ వైఫల్యం కాదన్నారు. పూర్వపు అమెరికా రక్షణ కార్యదర్శి హెన్రీ కిస్సింగెర్ 70వ దశకంలో వియత్నాం యుద్ధ సమయంలో అన్న మాట "అమెరికా శత్రువుగా ఉండటం ప్రమాదం..అమెరికా మిత్రుడిగా ఉండటం ప్రాణాంతకం." అంటే అగ్రరాజ్యం తన ప్రయోజనాల కోసం ఏ రీతినైనా మారుతుందని దాని ఉల్లేఖనం అన్నారు. ఏ దేశ దౌత్య నీతి అయినా ఆ దేశ ప్రజల భద్రత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలనుగూణంగా నూతన రూపును సంతరించుకుంటుందని అన్నారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం లో భారత్ స్పష్టత చూపలేదని విమర్శలు చేసే మేధావులు, భారత్ తటస్థ వైఖరిని కొనసాగిస్తూ, రష్యా నుంచి చమురు కొనుగోలు చేసి దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూ అదే సమయంలో ఉక్రెయిన్‌కు మానవతా సహాయం అందించిందన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఈ ద్వంద్వ విధానం వల్ల భారత్ "బాలెన్సర్"గా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు.

ఇజ్రాయెల్ పర్యటనలో పాలస్తీనాకు మోదీ సానుభూతి చూపలేదని విమర్శల దాడి చేసే వారు మోదీ ప్రభుత్వం ఇజ్రాయెల్‌తో రక్షణ, వ్యవసాయ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యంతో కదులుతూ అదే సమయంలో పాలస్తీనాకు కూడా ఆర్థిక సహాయం అందించింది అనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు. ఇరు దేశాలకు అధికారిక పర్యటన చేసిన దేశ అధినేత మోదీ ఒక్కరేనని, ఇరాన్ యుద్ధ భీబత్సంలో కూడా చమురు ధరలను పెంచకుండా రెండవ అతి పెద్ద జనాభా గల దేశాన్ని ఇంధన భద్రతతో ధరల భారం ప్రజలపై పడకుండా కాపాడిన వైనం మోదీ సొంతం అన్నారు. ఇది సమతుల్య దౌత్యమని శివరామకృష్ణంరాజు అభివర్ణించారు. భారత్ ప్రతిష్ఠ పై మాట్లాడే మేధావులు యూపీఏ కాలంలో అంతర్జాతీయ వేదికలపై ఆనాటి పరిస్థితులను గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. మోదీ నవ శఖంలో జీ20 అధ్యక్షత, బీఆర్ఐసీఎస్ విస్తరణ, సీఓపీ సమావేశాల్లో భారత్ కీలక పాత్ర పోషించిందన్నారు. యోగాకి అంతర్జాతీయ గుర్తింపు "వసుధైవ కుటుంబకం" అనే భారతీయ దృక్కోణాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది అన్నారు.

పొరుగు దేశాలు చైనాకు దగ్గరయ్యాయని విమర్శించే మేధావులు గల్వాన్ ఘర్షణ తర్వాత భారత్ చైనాకు ఎదురుగా నిలబడి, క్వాడ్ కూటమిలో అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాతో కలసి ఇండోపసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక సమీకరణాలు బలపరిచిందని గ్రహించాలని అన్నారు. ఇది భారత భద్రతా ప్రయోజనాలను కాపాడే దిశలో కీలక అడుగుగా చెప్పారు. "హిందీ చీనీ భాయ్ భాయ్" అని యుద్ధం వరకు తెచ్చుకుని ఆ తరువాత ఆక్రమించిన భూమిలో మొక్క కూడా మొలవదు కనుక మనకెందుకని పలికిన "విఫలమైన రాజనీతిజ్ఞుని" మార్గం ఉత్తమమైనదని తాము నమ్మి స్వప్రయోజనాల త్రాసులో కాసుల వైపు తూగి ప్రజలపై సొంత అభిప్రాయాలు రుద్దడం నేటి ఆధునిక సమాచార యుగంలో సాధ్యం కాదన్న విషయాన్ని వయసు నిండిన, గుర్తింపు తగ్గిన, నాయకులు అవగతం చెసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మోదీ విదేశాంగ విధానం "ఏకపక్షం" కాదు. ఒకవైపు దేశ ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూ, మరోవైపు అంతర్జాతీయ వేదికలపై భారత ప్రతిష్ఠను పెంచుతూ, పొరుగు దేశాలతో సహకారం కొనసాగిస్తూ, భారత్‌ను ప్రపంచ శక్తిగా నిలబెట్టే ప్రయత్నం జరుగుతోందనే విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ విషయం అర్థం కావాలంటే మన విదేశాంగ మంత్రి జయశంకర్ వ్రాసిన పుస్తకం 'ది ఇండియా వే: స్ట్రాటజీ ఫర్ ఎన్ అన్సర్టెన్ వరల్డ్ (2020)' చదివితే అర్థం అవుతుందన్నారు. అంటే ప్రతిఘటన లేకుండా చెట్టు కాని మనిషి కానీ ఎత్తుగా నిలబడలేడు, అలాంటిది దేశం రాబోయే దశాబ్దం మనది అని ముందుకు బాటలు వేస్తుంటే బలమైన శక్తులు వాటి కుయుక్తులతో తలపడటం సహజం అన్నారు. అగ్రరాజ్య అధినేత ప్రతిష్ఠ ఇటీవల కాలంలో ఏ స్థాయికి ట్రంప్ దిగాజార్చారో ప్రపంచం మొత్తం తిలకిస్తుంటే, ఆయన పబ్లిసిటీ కోసం ఇచ్చే స్టేట్మెంట్లపై ప్రతీసారి ప్రభుత్వమో, అధినేతనో స్పందించాలని కోరడం దేనికి సంకేతం? అని ప్రశ్నించారు. ప్రజల మదిలో విష బీజాలు నాటి చివరకు వాటిని శత్రువులకు వట వృక్షాలుగా మార్చి శత్రువుకు ఆవాసాన్ని ఏర్పరిచే వారితో జాగర్తగా ఉండాలని హెచ్చరించారు. అటువంటి వాటిని గుర్తించి మన దేశ నాయకత్వంపై విశ్వాసంతో తోడుగా నిలబడటం పౌరులుగా మన కర్తవ్యమని శివరామకృష్ణంరాజు అన్నారు.



## గ్రామాల అభివృద్ధే

# లక్ష్యంగా పనిచేయాలి

- స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- గ్రామ ప్రజల సూచనలు పాటించాలి
- గ్రామాల్లో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల అవసరాలు నేరవేర్చాలి
- మైనింగ్ బ్లాసింగ్‌తో ఇంటి గోడలు నెర్రలు బారుతున్నాయి: మాశెట్టి
- ఆంధ్రాసిమెంట్ ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే, కలెక్టర్
- సున్నపురాయి ఉత్పాధనను సాదరంగా ఆహ్వానించిన గ్రామస్తులు



**దాచేపల్లి, మార్చి 17 (మనసులో మాట):** పరిశ్రమదారులు వ్యాపార ప్రయోజనాలే కాకుండా ఆయా ప్రాంత గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని గురజాల ఎమ్మెల్యేల యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రాసిమెంట్ సున్నపు రాయి గనుల ఉత్పాదనకు సంబంధించి మంగళవారం పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలోని రామాపురం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ బోర్డు ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న గురజా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివారావు, కలెక్టర్ కృతికాశుక్లా, పర్యావరణ అధికారి నజీనబేగం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడులో పరిశ్రమలు రావటం ఆనందదాయకమన్నారు. 1983లో స్థాపించిన ఆంధ్రాసిమెంట్ కర్మాగారం కారణంగా గ్రామాలు వ్యాపార పరంగా అభివృద్ధి సాధించినట్లు తెలిపారు. ఈ పరిశ్రమ కష్ట కాలంలో ఉన్నప్పుడు దానిని రన్నింగ్‌లో పెట్టడానికి అనేక విధాలుగా కృషి చేశానన్నారు. అనేక ఒడిదిడుగులు తట్టుకుని పరిశ్రమ ప్రస్తుతం ఈ స్థాయికి వచ్చిందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తే ప్రజలు ఎదురు తిరుగుతారన్నారు. ఈ విషయంలో నేను ప్రజల పక్షానే నిలబడతానిని ఎమ్మెల్యే యరపతినేని స్పష్టం చేశారు. పల్నాడు అభివృ ద్ధిలో పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. ఒక వైపు ఉద్యోగ అవాకాశలు వస్తున్నాయన్నారు. పరిశ్రమలు దినదినాభివృద్ధి చెందితే ప్రజల జీవన పరిణామాలు పెరుగుతాయన్నారు. అయితే కొందరు పల్నాడు భూములు సేకరించి పరిశ్రమలను నిర్మించకపోవడం కారణంగా రైతులు రైతు కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. భూములను సేకరించిన పరిశ్రమదారులు వెంటనే వాటిని నిర్మిస్తే పల్నాడు లో నిరుద్యోగ సమస్య తగ్గుతుందన్నారు. ఇదిఇలావుండగా, ఈ అభిప్రాయ సేకరణలో ప్రజలు అనేక విషయాలు ప్రస్తావించారని అవి తీరని కోర్కెలు కావన్న విషయాన్ని పరిశ్రమదారులు గుర్తించాలన్నారు. సాగునీటి కోసం సుమారు రూ.4 వేల కోట్లతో ఇక్కడే దండివాగు లిఫ్ట ఇరిగేషన్ ఏర్పాటు చేశామన్నారు. దాని నిర్వాహనను పరిశ్రమ చూసుకోవాలని కోరారు. ఉద్యోగాల విషయంలో స్థానికులకే మెదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇప్పటి వరకు సాగర్ సిమెంట్స్‌కు సంబంధించి ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. అయితే ఇటీవల వేతనాల విషయంలో కార్మికులు ఆందోళన్ చేశారన్నారు. వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కలెక్టర్ కృతి కాశుక్లా మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామ ప్రజలు వెలుబుచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చూస్తానన్నారు.

**ప్రజాభిప్రాయాలు:**

పగిలిన గృహాలకు నష్ట పరిహారం చెల్లించాలి: మాశెట్టి వెంకటేశ్వర్లు(బుజ్జి)పరిశ్రమల మైనింగ్ కారణంగా దాని పరిధిలో ఉన్న లనేక గృహాలు నెర్రలిచ్చాయన్నారు. పరిశ్రమలు స్థాపన సమయంలో చెప్పఇన విధంగా గ్రామాలకు ఏవిధంగా నష్టం కలగకుండా చూసుకుంటామని చెప్పిన పరిశ్రమదారులు వాటిని ఏ విధంగా పట్టించుకొకుండా మైనింగ్ చేస్తున్నారన్నారు. దెబ్బతిన్న గృహాలు నష్ట పరిహారం అందజేయాలన్నారు. రామాపురం గ్రామానికి చెందిన మందా బెంజిమన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. నా గృహ మైనింగ్ బ్లాస్టింగ్ కారణంగా దెబ్బతిన్నదన్నారు. గతంలో నేను ప్యాక్టరీ పనిచేశానన్నారు. ప్యాకింగ్ కాంట్రాక్ట చేసిన దరిమిల ఆఇప్పటి వరకు నాకు బిల్లులు ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని మీ ముంఉకు తీసుకొస్తున్నానన్నారు.

**మేకల ఆహారానికి కలిగించవద్దు : యాదవులు**

రెండు గ్రామాలకు చెందిన యాదవులు ఈ సందర్భంగా ప్యాక్టరీ యాజమాన్యం, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును కలుసుకుని తమ సమస్యలు విన్నవించారు. ఇప్పటి వరకు ఆయా భూములలో పశువులు, గొర్రెలను మేపుకునే విధంగా ఉంది. ఇప్పుడు పరిశ్రమదారులు వ్యతిరేకించే అవకాశముందన్నారు. మేకలను మేపుకునే విధంగా చూడాలని కోరారు.

**గ్రామాల్లో అభివృద్ధి క్యాంపులు పెట్టాలి: ఎన్‌జీవోస్**

పరిశ్రమల కారణంగా గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా పరిశ్రమదారులు కృషి చేయాలన్నారు. గ్రమాల్లో పర్యావరణ, పరిరక్షణ క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గ్రామాలను సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని సూచించారు. మెడికల్ క్యాంపులను ఏర్పాటు ఏర్పాటు చేయాలన్నారు. అంతర్గత రహదారుల నిర్మాణంలో ఆర్థికంగా గ్రామస్తులకు సహకరించాని పరిశ్రమదారులను కోరారు. ఈ సందర్భంగా పరిశ్రమ విపి సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలును యాజమాన్యంకు తెలియజేసి వాటిని పరిష్కరించే విధంగా చూసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాసయాదవ్, ప్యాక్టరీ ఏజిఎం రామకృష్ణ , తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
రాయలసీమ
కర్నూలు | అనంతపురం
చిత్తూరు | కడప
బుధవారం 18 మార్చి 2026



# జిల్లాలో గ్యాస్ కొరత లేదు

## - జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా



**కడప జిల్లా...** గ్యాస్ సరఫరాపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులు నమ్మవద్దని, అందులో ఏ మాత్రం వాస్తవం లేదని, జిల్లాలో ఎలాంటి గ్యాస్ కొరత లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా తెలిపారు.

సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలు నందు సంభందిత అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెసి డా. నిధి మీనా మాట్లాడుతూ.. జిల్లాలోని 58 గ్యాస్ ఏజెన్సీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. అలాగే సంభందిత డివిజనల్ అధికారులను పర్యవేక్షణాధికారులుగా నియమించమన్నారు. జిల్లా మరియు డివిజనల్ స్థాయిలో కంట్రోల్ రూములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అసత్య ప్రచారాలు నమ్మి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా యల్.పి.జి. నిల్వలు అందుబాటులో ఉండేలా పటిష్ట చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలో గృహ అవసరాల వినియోగ గ్యాస్ కొరత ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉండదన్నారు. గ్యాస్ కంపెనీల ద్వారా సరఫరా సాధారణంగానే కొనసాగుతుందని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్యాస్ కొరత వస్తుందనే ఉద్దేశంతో వెంట వెంటనే ఆన్లైన్లో గ్యాస్ బుకింగ్ చేయడానికి వెబ్ పోర్టల్ అనుమతించదని కేవలం 25/45 రోజులు (పట్టణ/గ్రామీణ వినియోగదారులు) గడువులో మాత్రమే గ్యాస్ బుకింగ్ చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు. గృహ అవసరాలు, సంక్షేమ వసతి గృహాలు మరియు ఇతర అత్యవసర సేవలకు గ్యాస్ సరఫరాలో నిలుపుదల ఉండదని స్పష్టం చేశారు.

అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల ను నిల్వ చేయడం లేదా కొనుగోలు చేయడం చేయరాదన్నారు. ప్రభుత్వం మరియు జిల్లా పాలన యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తున్నాయన్నారు. ప్రజలు అపోహలను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలన్నారు. గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను (14.21 ఖస్త్ర) వాణిజ్యఅవసరాల కోసం తరలించిన/ వినియోగించిన అట్టి వారిపై నిత్యావసరాల చట్టం 1955, ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ధర్మవరంలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయండి

## మంత్రికి వినతి పత్రం అందించిన ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు

**ధర్మవరం మార్చి 17 (మనసులో మాట)..** ధర్మవరం పోతుకుంట రోడ్డులో నిర్మించిన ఆసుపత్రి భవనంలో బ్లడ్ బ్యాంక్ ను ఏర్పాటు చేయవలసినదిగా ధర్మవరం ఎమ్మెల్యే, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ సోనియా, పుల్లయ్య, సూపర్డెంట్ తిపేంద్ర నాయక్ మాట్లాడుతూ ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం తరఫున దాదాపు కోటి రూపాయలతో పాటు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి నుండి 67 లక్షల రూపాయలు విలువ చేసే యంత్ర సామాగ్రిని సరఫరా చేయడం పట్ల మంత్రికి ప్రభుత్వ ఆసుపత్రి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అంతేకాకుండా పోతుకుంట రోడ్డు లోని నిర్మించిన ఆసుపత్రి భవనమును సంపూర్ణముగా పూర్తి చేసి, అందులో 50 పడకల స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన మాత శిశు ఆసుపత్రిని ప్రారంభించుటకు చర్యలు తీసుకోవాలని వారు తెలిపారు. తదుపరి మంత్రి ను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ త్వరలోనే మీ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని వారు హామీ ఇచ్చారు.





## రైతన్నల సంక్షేమం కోసం అండగా..

# రైతన్నా మీకోసం

కడప నియోజకవర్గంలోని పాలంపల్లె గ్రామంలో నిర్వహించిన "రైతన్నా మీకోసం" కార్యక్రమంలో ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డెప్ప మాధవి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతు పక్షపాతి అని, రైతన్నలకు అవసరమైన సాయం అందించడంలో తాము ఎప్పుడూ ముందుంటామని ఆమె హామీ ఇచ్చారు. రైతు సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఈనెల 22న ఉగాది పురస్కారాల ప్రదానం

**పలమనేరు మార్చి 17 ( మనసులో మాట):** ఈనెల 22వ తేదీ ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి మరియు జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.తులసినాథం నాయుడు, ధనంజయ తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 16 మందికి ఉగాది పురస్కారాలు అందించడంతోపాటు జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన మరియు పద్యాల పోటీలలో ప్రతిభ చూపిన 50 మంది విద్యార్థులకు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా భువన విజయం నాటకం తో పాటు విద్యార్థులచే సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విద్యుత్, రహదారులు, సాగునీటిపై

# సమగ్ర సమీక్ష సమావేశం..

## - మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం మార్చి 17 (మనసులో మాట)..** పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ,ధర్మవరం నియోజకవర్గ శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్, వివిధ కీలక శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం అభివృద్ధి దిశగా ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఆర్ అండ్ బి, నేషనల్ హైవేస్, ఏపీ ఎస్పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్కో, ఇరిగేషన్, హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ వంటి కీలక శాఖల అధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి లోతైన చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన మౌలిక వసతులను పునరుద్ధరించడం, కొత్త ప్రాజెక్టులను వేగవంతంగా అమలు చేయడం తమ ప్రాధాన్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ ఉండదని, గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ కేంద్రాల వరకు నాణ్యమైన రోడ్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. నేషనల్ హైవేస్ , ఆర్ అండ్ బి శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతర విద్యుత్ అందించేందుకు ఏపీ ఎస్పీడీసీఎల్ మరియు ట్రాన్స్కో అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రత్యేకించి వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాను ప్రాధాన్యతగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఇరిగేషన్ రంగంపై మంత్రి ప్రత్యేక దృష్టి సారిస్తూ హెచ్ఎల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువల పునరుద్ధరణ, మరమ్మత్తులు, నీటి సరఫరా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు సమయానికి సాగునీరు అందించడం ద్వారా పంట దిగుబడులు పెరగడం మాత్రమే కాకుండా రైతుల ఆర్థిక స్థితి కూడా మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మంత్రి, ప్రతి శాఖ పనితీరును సమీక్షిస్తూ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## నగర పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు

# సమగ్ర చర్యలు



కడప నగరపాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్ర నేడు నగర శివారులోని డంపింగ్ యార్డ్ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన ఎనిమిది ఎకరాల స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అదేవిధంగా, సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేపట్టనున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్కు సంబంధించిన ప్రాంతాన్ని కూడా పరిశీలించి, పనుల పురోగతి, ప్రణాళికలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విండ్రో కంపోస్టు నిర్వహణ విధానాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్జిటి మార్గదర్శకాలు మరియు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రకారం కడప నగరంలో ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలని కమిషనర్ గారు అధికారులకు ఆదేశించారు. నగర పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు సమగ్ర చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

## పాత బకాయిలకు

# 50 శాతం మాఫీ

## మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య



ధర్మవరం మార్చి 17 (మనసులో మాట) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆస్తి, కాళీ జాగా పన్నుల విషయంలో 2025-26 సంవత్సరముతో సహా పాత బకాయిలను ఏక మొత్తములో మార్చి 31వ తేదీలోగా చెల్లించిన వారికి వడ్డీలో 50 శాతము మాఫీ ఉంటుందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. కావున పన్ను చెల్లింపుదారులు పై తెలిపిన సదావకాశమును వినియోగించుకొని పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడవలనని తెలిపారు. పన్ను చెల్లింపు కేంద్రములలో అన్ని వార్డు సచివాలయము నందు గాని, మున్సిపల్ ఆఫీస్ కలెక్షన్ కౌంటర్ నందు గాని, ఆన్లైన్ నందు గాని చెల్లించవచ్చునని తెలిపారు. ప్రభుత్వ సెలవు దినములలో కూడా పన్నులు చెల్లించ వచ్చునని తెలిపారు. పన్ను చెల్లింపు కేంద్రాలలో ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు స్వీకరించబడునని తెలిపారు.

# మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను కోల్పోవద్దు

## - ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సి.ఐ లు చంద్రమణి, హరికృష్ణ



**ధర్మవరం మార్చి 17 (మనసులో మాట)..** పట్టణం ఎల్. పి సర్కిల్ లోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో నేడు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ధర్మవరం ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సి.ఐ చంద్రమణి ,అనంతపురం సి.ఐ హరికృష్ణ ,ఎస్.ఐ చాంద్ బాషా , చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కొండప్ప , కళాశాల ప్రిన్సిపాల్ డా జి మల్లికార్జున ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు అనంతరం సి.ఐ చంద్రమణి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో నేటి యువత ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని విద్యార్థినులకు సూచించారు. రాష్ట్రంలో 2020 సంవత్సరం నుండి మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా ఎక్సైజ్ శాఖ ద్వారా జిల్లాలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సి.ఐ హరికృష్ణ మాట్లాడుతూ జీవితం ఒక బహుమతి అని,మాదక ద్రవ్యాల కోసం దానిని వృథా చేసుకోవద్దని, తల్లి తల్లిదండ్రులు వ్యయప్రయాసలకు గురై పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో ఉన్నత చదువులు చదివించేందుకు కళాశాలకు పంపుతున్నారని తెలిపారు. అలాగే ఈ డ్రగ్స్ బారిన పడిన వారికి కౌన్సిలింగ్ ఇవ్వడానికి ప్రభుత్వ ఉచిత డి-అడిక్షన్ సెంటర్ కు పంపి వారికి తగిన వైద్యం అందిస్తామన్నారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు తెలియజేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా జి. మల్లికార్జున మాట్లాడుతూ... మాదక ద్రవ్యాలు వినియోగించిన, అమ్మినా,నిల్వ ఉంచినా, రవాణా చేసిన నేరంగా పరిగణింపబడు తుందని దీనికి 10 సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. డ్రగ్స్ బారిన పడి వేలమంది జీవితాలు నాశనం అవుతున్నాయని, ఆర్థికంగా వెనకపడటం జరుగుతుందని తెలిపారు. కొంతమంది యువత తెలిసి తెలియని వయసులో డ్రగ్స్ బారిన పడి నష్టపోతున్నా రన్నారు. చివరలో అధికారులు మాదక ద్రవ్యాల దుర్వినియోగం పై ప్రతిజ్ఞ చేయించారు. ఇందుకుగాను కళాశాల యాజమాన్యం హర్షం తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## కడప ఎంపీ అవినాష్ రెడ్డి వ్యాఖ్యలపై తీవ్రస్థాయిలో

# మండిపడ్డ టిడిపి జిల్లా అధ్యక్షులు భూపేష్ రెడ్డి

## వివేకా కుమార్తె సునీతను అడ్డం పెట్టుకుని టిడిపి లబ్ధిపొందాలని చూస్తోందని అవినాష్ వ్యాఖ్యలపై ఆగ్రహం



11 సీట్లు వచ్చిన బుద్ధి మారలేదని, దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాలుగోసారి అధికారంలో ఉన్నారని, మహిళను అడ్డం పెట్టుకుని రాజకీయలు చేయాల్సిన దౌర్భాగ్య స్థితిలో టిడిపి లేదన్నారు. 2019 ఎన్నికల్లో వివేకా హత్యను అడ్డం పెట్టుకుని లబ్ధిపొందింది ఎవరో అందరికి తెలుసన్నారు. అధికారం కోసం టిడిపి ప్రాకులాడదని హితవు పలికారు. హత్యారాజకీయాలకు టిడిపి దూరమని పేర్కొన్నారు. ప్రజల్లో వైకాపా రోజు రోజుకు చులకన అవుతోందని దాని నుండి బయట పడేందుకు టిడిపి పై చేస్తున్న బురదజల్లే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. వివేకా హత్య గురించి ప్రజలందరికి తెలుసన్నారు. ప్రజలు వాస్తవాలు గ్రహిస్తున్నారని, మీ మాయ మాటలు విశ్వసించే పరిస్థితి లేదన్నారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి, సంక్షేమం అమలు దిశగా పని చేస్తోందన్నారు. ప్రభుత్వం రాయలసీమలో 30 వేల కోట్లతో హార్టికల్చర్ అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందించి పని చేస్తోందన్నారు. జిల్లాలో స్టీల్ ఫ్యాక్టరీ, కొప్పర్తి ఇండస్ట్రియల్ అభివృద్ధి ద్వారా ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. టీడీపీ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా బురదజల్లే కార్యక్రమం చేయడాన్ని ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో టీడీపి జిల్లా ఉపాధ్యక్షులు జయసుబ్బారెడ్డి, డా. నజీరుద్దీన్ షేక్, బొమ్మిశెట్టి చంద్ర, పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ జనార్ధన్, టీడీపి నాయకులు దాసరి వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక
KANCHARLA

# అనంతపురం సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం





**ఉమ్మడి అనంతపురం, మార్చి 17 ( మనసులో మాట) :** అనంతపురం సర్వజన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశం స్థానిక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ మరియు చైర్మన్ ఓ. ఆనంద్ ఈ సమావేశమునకు కమిటీ ఉపాధ్యక్షుడు స్థానిక శాసనసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ హాజరయ్యారు. సమావేశానికి ముందుగా సూపర్డెంట్ డా. మల్లేశ్వరి ఆస్పత్రి ప్రగతి మరియు పనితీరును సమావేశంలో వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ఏసీలను మరమ్మత్తులు చేసి అందుబాటులోకి తేవాలని, ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు ప్రాణ నష్టం జరగకుండా నిబంధనల మేరకు అన్ని పనులు చేపట్టాలని, అందుబాటులో అన్ని రకాల మందులను ఉంచాలని, ప్రస్తుతం జరుగుతున్న సివిల్ పనులను వెంటనే పూర్తి చేయాలని, ఆసుపత్రి ప్రాంగణంలో క్షయ నివారణ కేంద్రాన్ని జాయింట్ ఇన్స్ట్రక్షన్ చేసి సి.డి .హాస్పిటల్ కు మార్చాలని, అందుబాటులో ఉన్న రూ.86 లక్షల బడ్జెట్ ను ఆసుపత్రికి కావలసిన పరికరాల కొనుగోలుకు తగిన అనుమతినిస్తూ పలు తీర్మానాలు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవలు నామమాత్రంగా కాకుండా మరింతగా మెరుగు పరుచుకోవాలని అలా జరగని పక్షంలో మెరుగుపరచకపోతే ఏజెన్సీని మార్చాలన్నారు. కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ సి ( ఎస్ ఆర్ ఫండ్స్) క్రింద విరాళం ఇచ్చిన హుండై మోల్డిస్ సంస్థ వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాసన సభ్యులు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నదని ఆ మేరకు అవసరమైన సేవల అదనపు బడ్జెట్ కోసం ఆరోగ్య శాఖ మంత్రి గారికి ప్రత్యేక లేఖ వ్రాస్తానని అవసరమైన మేరకు నిధుల మంజూరుకు ప్రయత్నం చేస్తానన్నారు. అలాగే ఆసుపత్రి పారిశుధ్యం మెరుగుపడాలనీ తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లేశ్వరి, హాస్పిటల్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా.శంకర్, అడ్మినిస్ట్రేటర్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున రెడ్డి, ఆర్ ఎం ఓ డా. హేమలత, సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపర్డెంట్ డా. బెన్డిక్ట్, డిఎంహెచ్ఓ ఈ బి దేవి, డి సి హెచ్ ఎస్ డా.డేవిడ్ సెల్వ రాజ్, డా. శ్రీనివాస్ సౌరి, ఈ.ఈ నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, కమిటీ సభ్యులు ఓ.రత్నమయ్య, మిద్దుల నరసింహులు, కొప్పుల వెంకటరమణయ్య మరియు అన్ని విభాగాల శాఖధిపతులు పాల్గొన్నారు.

# గంగవరంలో ఓ వ్యక్తి వీరంగం పరుగులు తీసిన ప్రజలు







**పలమనేరు మార్చి 17 ( మనసులో మాట) :** పలమనేరులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించిన సంఘటన గంగవరంలో మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా.... బెంగళూరు నగరానికి చెందిన రత్న దర్( 38) చెన్నై బెంగళూరు జాతీయ రహదారి కి ఆనుకుని ఉన్న పంట పొలాలు వద్ద కొద్దిసేపు రైతులతో ప్రజలతో వాగ్వాదం చోటుచేసుకుంది. అతని ఒంటిపై నా నూలు పోగు కూడా లేదు. అనంతరం వైయస్ విగ్రహం వద్ద హైవే పెట్రోలింగ్ వాహనం ఆపి ఉన్నరు అక్కడికి వచ్చిన సైకో మొదట పోలీసు వాహనాన్ని డోరులాగి లోపల కూర్చోవడం జరిగింది. డ్రైవర్ అతనిని దిగమని ఎంతసేపటికి బ్రతిమాలిన కూడా వినలేదు. కోపోద్రికుతుడైన సైకో పోలీస్ కానిస్టేబుల్ ధనుంజయ పై దాడి చేయడం జరిగింది. పోలీస్ కానిస్టేబుల్ కూడా గాయాలు అయ్యాయి. అప్పటికే సైకో గత రెండు రోజులుగా వారి నివాసంలో గొడవల కారణంగా గంజాయి..? లేదా మద్యం పూటుగా సేవించి పోలీసు వాహనాన్ని ఎత్తుకొని దండపల్లి రోడ్డు మార్గం గుండా పట్టణంలోకి ప్రవేశించినాడు. రోడ్డుపై అటు ఇటు పోలీసు వాహనాన్ని తిప్పుతూ వస్తున్నాడు.పోలీస్ వాహనాన్ని మదనపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న కియా కేఏ51 ఎం.వి7196 గల కారును సైడ్ గుద్దడంతో పూర్తిగా దెబ్బ తిన్నది. మరో అప్పి ఆటో టమోటాలు రోడ్డుతో ఉన్న వాహనాన్ని ఢీకొట్టాడు. రోడ్డుపై టమోటాలు చిందర బందరుగా పడి ఉన్నాయి. ఆటో డ్రైవర్ కు కాలు విరిగిపోవడం జరిగింది. అనంతరం పోలీసు వాహనానికి ముందరన్న చక్రం విరిగి పడడం జరిగింది. అక్కడ వాహనాన్ని ఆపి పరుగెత్తుకుంటూ ప్రక్కలో ఉన్న చెరువులోకి దూకి ఈత కొడుతూ ఉన్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన పలమనేరు సిఐ మోహన్ రెడ్డి, ఎస్సై లోకేష్ అక్కడికి వెళ్లి అతనిని పట్టుకోవడానికి సాహసించారు. వారి వల్ల కాకపోవడంతో అగ్నిమాపక అధికారులకు సమాచారాన్ని అందించారు. వెంటనే వారు వచ్చి చాకచక్యంగా పట్టుకోవడం జరిగింది. అతన్ని చెరువులో నుండి తాడుతో కట్టి పైకి లాక్కోవడం జరిగింది. అనంతరం ఆ వ్యక్తిని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ముస్లిం సోదరి, సోదరీమణులకు 11 నిత్యవసర సరుకులతో కూడిన రంజాన్ తోఫా

**ఉమ్మడి అనంతపురం, మార్చి 17 (మనసులో మాట)..** శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండలోని మంత్రి కార్యాలయంలో మూడు వెల మంది ముస్లిం సోదరి, సోదరీమణులకు 11 నిత్యవసర సరుకులతో కూడిన రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు మంత్రి సవితమ్మ. ప్రతి సంవత్సరము ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా అందించేవారు. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు ఉన్న ప్రతి ఒక్కరికి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముస్లింలకు ప్రభుత్వ పరంగా ఇఫ్తార్ తోఫాను అందిస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో ముస్లింలను జగన్మోహన్ రెడ్డి ఓటు బ్యాంకుగా వాడుకొని వదిలేసారు అన్నారు. రంజాన్ అంటే ముస్లింలు ఎంతో గొప్పగా జరుపుకునే పండుగ అన్నారు. రంజాన్ మాసంలో పేదలందరికీ దాన,ధర్మాలు చేయాలని మహమ్మద్ ప్రవక్త ప్రకటించారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ముస్లిం ఇమామ్ లకు, మౌసన్లకు, గౌరవ వేతనం ఇస్తున్నటువంటి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని అన్నారు.

## గతంలో ఎప్పుడూ లేని విధంగా

# పేదల వైద్యానికి ప్రభుత్వం ఖర్చు చేస్తోంది

### - సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన పరిటాల శ్రీరామ్



**ధర్మవరం మార్చి 17 (మనసులో మాట)..** గతంలో ఎప్పుడూ లేని విధంగా పేదల వైద్యానికి కూటమి ప్రభుత్వం ఖర్చు చేస్తోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజవర్గంలోని మొత్తం 27మందికి గాను రూ.36లక్షల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు శ్రీరామ్ తో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ గతంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా చాలా కొంత మందికి మాత్రమే సాయం అందేదన్నారు. కానీ ఇప్పుడు పేదల ఆరోగ్యానికి ఖర్చు చేసి ఇబ్బందులు పడ్డారని చెప్పగానే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి.. సాయం చేస్తున్నారన్నారు. ఈ 21నెలల్లోనే నియోజకవర్గంలో మా వైపు నుంచి 360మందికి రూ.2.55కోట్ల రూపాయల సాయం అందిందన్నారు. ఆపద సమయంలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ఇది ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ధర్మవరం నియోజకవర్గ ప్రజల తరుపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు శ్రీరామ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఏఐ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్స్ పై శిక్షణ



**పలమనేరు మార్చి 17 (మనసులో మాట) :** స్థానిక ఎస్ వి సి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పి ఎం ఉషా పథకంలో భాగంగా ఎస్ కే పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అనంతపురం వారి సహకారంతో ఏ ఐ - ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్స్ పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేసులు ఆధ్వర్యంలో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్జెడి రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ... నేటి డిజిటల్ యుగంలో ఏఐ సాంకేతికతకు విశేష ప్రాధాన్యత ఉందని తెలిపారు. విద్యార్థులు ఇలాంటి నైపుణ్యాలను అర్జంచటం ద్వారా భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు సులభంగా పొందగలుగుతారని తెలిపారు. ఏఐ అనేది కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాదని ఇది సమస్యలను పరిష్కరించే ఒక శక్తివంతమైన సాధనమని తెలిపారు. ఇలాంటి టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించి విద్యార్థులు ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రిన్సిపల్ వెంకటేశులు మాట్లాడుతూ.... ఏఐ లాంటి సాంకేతిక పరిజ్ఞానం నేటి తరంలోని విద్యార్థులకు చాలా అవసరమని తెలిపారు. సమస్యల్ని వృధా చేయకుండా ఏ ఐ లాంటి కృత్రిమ మేధస్సును ఉపయోగించి అన్ని రంగాలలో దూసుకుపోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ నందీశ్వరయ్య, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ షేక్ బెనజీర్, సుభాష్ చంద్రబోస్, కీర్తన తోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



# మెరుగైన విద్యుత్ అందించండి

### - ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్

**పెనుమూరు, మార్చి 17 (మనసులో మాట):** విద్యుత్ వినియోగదారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, మెరుగైన విద్యుత్ ను అందించాలని విద్యుత్ శాఖ చిత్తూరు ఎస్ ఈ ఇస్మాయిల్ అహ్మద్ అన్నారు.మంగళవారం పెనుమూరు విద్యుత్ సబ్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేసవి కాలం వచ్చేసింది విద్యుత్ వినియోగం పెరుగుతోంది, తదన నుగుణంగా విద్యుత్ సేవలం దించాలని అయన అన్నారు. గ్రామాలలో విద్యుత్ వినియోగం గూర్చి ప్రజలకు వివరించాలి, పాత బకాయిలు వసువులు చేయలన్నారు.సబ్ స్టేషన్ రికార్డ్స్ పరిశీలించి తగు సూచనలిచ్చారు.ఈయన వెంట చిత్తూరు రూరల్ ఈ ఈ సురేష్ కుమార్, పెనుమూరు ఏ ఈ తులసీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



చెన్నూరు జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల(బాయ్స్) స్కూల్ లో ఆకస్మిక తనిఖీలు చేసిన కమలాపురం శాసనసభ్యులు పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి విద్యార్థులతో ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.



కడప జిల్లా : రాజంపేటలోని హెచ్ పి గ్యాస్ గోడౌన్ ను పరిశీలించిన సబ్ కలెక్టర్ ఎ. వా.భావన. హెచ్ పి గ్యాస్ ఆఫీసు లోనికి వెళ్లి రికార్డుల పరిశీలించారు ఈ తనికీల్లో పాల్గొన్న తహసీల్దార్ పీర్ మున్ని.

# బాధితులకు న్యాయం జరిగేలా చూస్తాం

### -డి.ఎస్.పి దేగల ప్రభాకర్



పలమనేరు మార్చి 17 ( మనసులో మాట): బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని సబ్ డివిజన్ డీఎస్పీ దేగల ప్రభాకర్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ పరిణామాలు కారణం అయిన వ్యక్తి పేరు రత్నాధర, వయస్సు (36 )సంవత్సరాలు, తండ్రి పేరు మునిరాజ్, నారసంద్ర గ్రామము, హెస్సారగట్ట, ఎళహంక తాలూకా, బెంగళూరు నార్త్, కర్ణాటక రాష్ట్రం అని, సదరు వ్యక్తి అతిగా మద్యం త్రాగుడుకు బానిస అవడం వలన అతనిని కుటుంబ సభ్యులు ఆదరించేవారు కారని, ఈ మద్య కాలంలో త్రాగిన మత్తు లో తన భార్య ను కూడా విపరీతం గా కొట్టి ఆసుపత్రి పాలు చేసినట్లు సమాచారం. అదే విధంగా నిన్నటి దినం 16.03.2026 రాత్రి కూడా వివిధ రకాల మద్యం త్రాగి, ఆ మైకం లో సైకో లాగ మారిన సంఘటనకు కారణం అయినాడు. సోమవారం ఉదయం జరిగిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి చట్ట ప్రకారంగా అతని పై కేసు నమోదు చేసి బాదితులకు న్యాయం జరిగేలా చూస్తాము. డి.ఎస్.పి దేగల ప్రభాకర్, తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

# అగ్రరాజ్యం అంచనాలు తారుమారు

## పశ్చిమ ఆసియాలో యుద్ధం మరింత తీవ్రం

- 18 రోజులు గడిచిన ఆగని యుద్ధమేఘాలు
- ఇరాన్ దేశానికి వెన్నుదన్ను ఎవరు ?
- ఇరాన్ దేశం టార్గెట్ ఏమిటి ?
- యుద్ధంతో చమురు సంస్థలు దీనస్థితిలోకి !
- భారతదేశానికి ఇంధన ముప్పు ఉన్నదా...?
- ఇంధనానికి ఎటువంటి కొరత లేదంటూ భారత ప్రభుత్వం ప్రకటనలు
- రోజురోజుకు పెరుగుతున్న వంట గ్యాస్ కొరత !
- పలు ప్రాంతాల్లో  మూసివేస్తున్న హోటల్స్... హాస్టల్స్ !

> పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. అగ్రరాజ్యం అమెరికా, ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై జరిపిన మెరుపు దాడులు వికటించాయి. యుద్ధం మొదలైన మూడు రోజులకే ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు మరణించారని వార్తలు వచ్చినప్పటికీ, ఇరాన్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ యుద్ధం ముగిసిందని భావిస్తున్న తరుణంలో, ఇరాన్ తాత్కాలిక పాలకుడిని ప్రకటించుకుని ఊహించని రీతిలో ఎదురుదాడికి దిగింది. ఈ అనూహ్య పరిణామాలతో ప్రపంచ దేశాలకు చమురు సరఫరాలో అత్యంత కీలకమైన 'హార్మోజ్ జలసంధి' ని ఇరాన్ మూసివేయడంతో ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ జలసంధి గుండా భారీ నౌకల రాకపోకలను ఇరాన్ అడ్డుకుంటోంది. దీంతో చమురు నౌకలకు రక్షణ కల్పించాలని అమెరికా అధ్యక్షుడు బ్రిటన్, యూరప్ దేశాలను కోరారు. ఈ ఉద్రిక్తతల వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలే ప్రమాదం కనిపిస్తోంది.

(ప్రత్యేక ప్రతినిధి కె. ఉదయ్ కుమార్ )

మల్కాపురం: మార్చి  (మనసులో మాట) అగ్రరాజ్యం అమెరికా తో పాటు ఇజ్రాయిల్ కలిసి ఉమ్మడిగా ఇరాన్ దేశంపై యుద్ధం ప్రకటించడం వరుస బాంబులతో ఇరాన్ దేశంపై విరుచుకుపడడంతో యుద్ధం మొదలైన మూడు రోజులకే అక్కడి రాజు ఆలీ కమీన్ తోపాటు కుటుంబ సభ్యులు చనిపోవడం జరిగింది. అయితే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్ రాజును తుద ముట్టించాము అనుకున్న ది సాధించాం అనుకోని యుద్ధాన్ని ఆపివేయాలన్నా సమయంలో ఇరాన్ దేశం దానికి విరుద్ధంగా తాత్కాలిక రాజును ప్రకటించుకుని కేవలం అమెరికానే దృష్టిలో పెట్టుకుని పచ్చిమా ఆసియాలో కువైట్, ఖతార్ సౌదీ అరేబియా, దుబాయ్, షార్జా తదితర ప్రాంతాలలో అమెరికా యుద్ధ స్థావరాలపై డ్రోన్ల వర్షం కురిపిస్తూ అమెరికాకు చెమటలు పట్టించింది. దీంతో యుద్ధం మరింత ముదిరి సంయుక్తంగా యుద్ధంలోకి దిగిన ఇజ్రాయిల్ అమెరికా కలిసి ఇరాన్ పై మరింత యుద్ధ తీవ్రతను పెంచి క్షిపణుల తో బాంబుల వర్షం కురిపిస్తూ నేటికి 18 రోజులు గడిచిన కూడా ఇంకా యుద్ధ మేఘాలు మరింత తీవ్రతరమయ్యాయి. దీంతో అమెరికా అంచనాలు తారుమారయ్యాయి. తాజాగా ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడడంతో దుబాయ్ లో గల చమురు నిలువవుంచే ప్రదేశాల్లో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

**18 రోజులు గడిచినా ఆగని యుద్ధం**

ఉమ్మడి ఇజ్రాయిల్ అమెరికా దేశాలు కలిసి ఇరాన్ పై యుద్ధ బాంబర్లతో విరుచుకుపడడంతో ఒకవైపు అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో పాటు ఇరాన్ దేశానికి కూడా కొన్ని ట్రిలియన్ డాలర్లు యుద్ధ సామాగ్రి ఖర్చు అయ్యాయని గంట పదంగా చెప్పవచ్చు, అయినా కూడా ఇరాన్ దేశం ఎక్కడ వెనుకంజ వేయకుండా తమ సత్తా చూపుతామంటూ నిజంగానే తన సత్తాను చూపుతూ ఇప్పటివరకు ఒక లెక్క, ఇకనుంచి ఒక లెక్క అంటూ ఇరాన్ దేశం మరింత దూకుడు పెంచి అమెరికా యుద్ధ స్థావరాలపై టార్గెట్ చేస్తూ బాంబర్లను కురిపిస్తూ అమెరికాను వణికిస్తున్న తరుణం వచ్చిందంటే ఇరాన్ దేశానికి ఏ దేశాలు మద్దతు పలుకుతున్నాయో ఆలోచింపదగ్గ విషయం.

**ప్రపంచ చమురు సంస్థల పరిస్థితి**

ప్రపంచానికి ఏ నలుమూలలకైనా చమురు సముద్ర యానం ద్వారా సరఫరా జరగాలంటే ఇరాన్ దేశానికి ఆనుకొని ఉన్న హార్మోజ్ జల సంధి నుంచే అతి భారీ నౌకల ద్వారా రవాణా జరగాల్సిన పరిస్థితి ఉండడంతో అక్కడ ఈ యుద్ధ తీవ్రత తో జలసందిని ఇరాన్ దేశం మూసి వేయడం జరిగింది. ఆ జల సంధి ద్వారా ఏ దేశానికి కూడా చమురు ఉత్పత్తులను రవాణా చేయకుండా ఇరాన్ దేశం కట్టడి చేసి నిలిపివేయడంతో చమురు ఉత్పత్తి మరింత కష్టతరం మౌతుంది. దీంతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకవైపు యునైటెడ్ కింగ్డమ్, యూరప్ దేశాలను అభ్యర్థిస్తూ తమ తమ దేశాల యుద్ధనౌకలను హార్మోజ్ జల సంధి దగ్గర మోహరించి రక్షణతో చమురు నౌకలను తమ తమ దేశాలకు రవాణా జరిగేటట్లు చూడాలని కోరడం జరిగింది. దీనికి పై దేశాలు ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి. ఈ యుద్ధం వలన ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులతో పాటు చమురు ఉత్పత్తుల్లో తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నాయి.

**యుద్ధ ప్రభావం తో భారత్లో గ్యాస్ సంక్షోభం**

భారతదేశంలో చమురుకు గ్యాస్ కు ఎటువంటి ఇబ్బందులు లేవు అంటూ పదేపదే భారత దేశ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ ప్రజల్లో మాత్రం గ్యాస్ కొరత అలజడి మరింత ఉధృతం అవుతుంది. ఒకవైపు గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు క్యూలు కడుతూ గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేయాలంటూ గగ్గోలు పెడుతున్నారు.

**పెద్ద పెద్ద హోటల్స్ మూసివేత !**

ఎల్పిజి గ్యాస్ సంక్షోభంతో పెద్దపెద్ద హోటల్స్ తో పాటు హాస్టల్స్ లో కూడా గ్యాస్ నిల్వలు లేకపోవడంతో సంస్థల యాజమాన్యాలు పలు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కొన్ని ప్రాంతాలలో కట్టెల పొయ్యిలనే ఆశ్రయించి హాస్టల్లో విద్యార్థిని విద్యార్థులకు భోజన సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరి ఒకవైపు భారత ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో కూడా గ్యాస్ కానీ చమురుకు గాని ఎటువంటి ఇబ్బందులు లేవంటూ నెల రోజులకి తగ్గ చమురు నిల్వల తోపాటు వంటగ్యాస్ కూడా నిల్వలు ఉన్నాయి అంటూ ప్రకటిస్తుంది. ఒక వైపు చూస్తే బహిరంగంగా వంటగ్యాస్ కొరత సుస్పష్టంగా కనబడుతుంది.

**శాంతి చర్చలకు భారత్ కీలకం**

రోజురోజుకు గల్ఫ్ దేశాల లో యుద్ధమేఘాలు మరింత ఉధృతం అవుతున్న ఈ తరుణంలో భారత్ కీలకంగా వ్యవహరించాలంటూ సోషల్ మీడియాలో ప్రపంచ శాంతిని కోరే పలువురు మేధావులు తమ సూచనలను ఇస్తున్నారు. భారత్ కు రాజనీతజ్ఞత తో పాటు యుద్ధ సందిని కోరే నైతికత్వం సత్తా ఉన్నదని పలువురు ప్రపంచ మేధావులు అభిప్రాయపడుతున్నారు. మరి ఇటువంటి సమయంలో ప్రపంచ దేశాలతో కలిపి ఇరాన్, ఇజ్రాయిల్ అమెరికా దేశాల మధ్య సంధిని కోరి అంతర్జాతీయ చర్చలు జరిపినట్లైతే యుద్ధం ఆపగల సత్తా భారతదేశానికి ఉందని ప్రపంచ శాంతిని కోరే పలువురు ప్రపంచ మేధావులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఇరాక్‌లోని భారతీయులకు హెచ్చరిక**

మరోవైపు, ఇరాక్‌లో ఉన్న భారత పౌరులను భారత హైకమిషన్ అప్రమత్తం చేసింది. యుద్ధ తీవ్రత దృష్ట్యా ఎవరూ సరిహద్దుల వైపు రావద్దని, సైరన్ మోగిన వెంటనే సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని హెచ్చరికలు జారీ చేసింది.

# డౌనూరు పీహెచ్‌సీపై ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

## సిబ్బంది లేకపోవడంపై ఆగ్రహం - మందుల కొరతపై అసంతృప్తి



కొయ్యూరు మార్చి 17 (మనసులో మాట):మండలంలోని డౌనూరు గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో స్వయంగా ఆసుపత్రికి చేరుకున్న ఆయన అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అయితే, ఆ సమయంలో ఆసుపత్రిలో కేవలం ఒకే ఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే విధుల్లో ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎప్పుడైనా అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది లేకపోవడం పట్ల మండిపడ్డారు.అదేవిధంగా స్థానికుల ద్వారా మందుల కొరత ఉందని, మలేరియా నిర్ధారణ కిట్లు కూడా లేవని తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా వైద్య ఆరోగ్య అధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ)తో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.దీనికి స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ రేపే డౌనూరు పీహెచ్‌సీని స్వయంగా తనిఖీ చేసి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

బుధవారం 18 మార్చ్ 2026



# దరఖాస్తు కట్టలతో అసెంబ్లీకి బీజేపీ ఎమ్మెల్యేలు..గేటు వద్ద ఉద్రిక్తత

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద బీజేపీ ఎమ్మెల్యేలు భారీ ఎత్తున నిరసనకు దిగారు. ప్రజాపాలన దరఖాస్తుల కట్టలతో లోపలికి వెళ్లడానికి ప్రయత్నించిన బీజేపీ ఎమ్మెల్యేలను గేటు వద్దే భద్రతా సిబ్బంది నిలిపివేశారు. పేపర్ కట్టలు లోపలికి అనుమతించబోమని వారు అడ్డుచెప్పడంతో ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ప్రజల సమస్యల దరఖాస్తులను తీసుకెళ్లనివ్వరా అని ఎమ్మెల్యేలు ప్రశ్నించడంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. చివరకు సిబ్బంది ఆ బండిల్స్ తమ ఆధీనంలోకి తీసుకున్నాక బీజేపీ ఎమ్మెల్యేలను లోపలికి అనుమతించారు. మరోవైపు రైతు ఇబ్బందులపై బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆందోళన బాట పట్టారు. ఈ నెల 7 నుండి 15 వరకు ఆదిలాబాద్ చుట్టుపక్కల పర్యటించి పంట బీమా కోసం దరఖాస్తులను సేకరించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటే తక్షణమే బీమా పథకాన్ని అమలు చేయాలని ఆయన పట్టుబట్టారు. నిలిచిపోయిన రైతుబంధు నిధులను త్వరగా విడుదల చేయడంతో పాటు పూర్తిస్థాయిలో రుణమాఫీ



చేయాలని పాయల్ శంకర్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు.

# మాయమైన సీఎం సంతకం ఫైల్ కోసం సిట్ వేయండి

- అసెంబ్లీలో కేటీఆర్ సంచలన డిమాండ్
- 420 వరల్డ్ కప్ పెడితే కాంగ్రెస్ దే ప్రథమ స్థానం: మాజీ మంత్రి ఎద్దేవా
- గ్యారంటీలకు, సీఎం సంతకానికి విలువ లేదని ధ్వజం



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):**
తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాటల యుద్ధం సాగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల హామీ దస్త్రంపై సీఎం సంతకం చేశారని గత గవర్నర్ ప్రసంగంలో ఉందని, కానీ ఇప్పటికీ ఆ ఫైల్ ఎక్కడుందో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. సీఎం సంతకం చేసిన ఫైల్ కే దిక్కు లేకపోతే కాంగ్రెస్ మాటలను ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. ఆ మాయమైన దస్త్రం కోసం వెంటనే సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎవరు ధన్యవాదాలు చెప్పాలని ఆయన నిలదీశారు. రైతులు, వితంతువులు, వృద్ధులు, నిరుద్యోగులు అందరినీ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు.

## కాంగ్రెస్ విఫల పాలన

గ్యారంటీ కార్డులను భద్రపరచుకోవాలని చెప్పి ప్రజలను మోసం చేశారని, ఆ కార్డులకు ప్రస్తుతం జీరో వాల్యూ ఉందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇండియా క్రికెట్ లో టీ20 వరల్డ్ కప్ గెలిస్తే, కాంగ్రెస్ పార్టీ 420 వరల్డ్ కప్ గెలుస్తుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేతలు ఢిల్లీ నుంచి నిధులు తీసుకురావాల్సింది పోయి, ఇక్కడి నిధులను అక్కడికి ఇచ్చి వస్తున్నారని విమర్శించారు. తెలంగాణ సొమ్మును పక్క రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రచారం కోసం వాడుకుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు దానకర్ణుడిలా మాట్లాడి ఇప్పుడు కుంభకర్ణుడిలా నిద్రిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం డిజాస్టర్ పాలన సాగిస్తోందని, కూలగొట్టడం, ఎగ్గొట్టడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు.

## ఐటీ రంగం, నిరుద్యోగుల గోస

ఐటీ రంగంలో ఉద్యోగాలు పెరగాల్సింది పోయి తగ్గుముఖం పట్టాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఏడు వేల ఐటీ ఉద్యోగాలు తగ్గాయని, దీనికి బాధ్యులైన ఐటీ సెక్రటరీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఇస్తామన్న జాబ్ క్యాలెండర్ ఏమైందని, రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ఊసే లేదని మండిపడ్డారు. రెండున్నరేండ్లలో రెండున్నర లక్షలు అందుకున్న ఒక్క కుటుంబాన్ని చూపించాలని నిలదీశారు. ప్రభుత్వం కేవలం మాటలతో కాలక్షేపం చేస్తోందని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడంలో విఫలమైందని విమర్శించారు.

## ఉద్యోగుల సమస్యలు, భట్టికి సవాల్

ప్రభుత్వ ఉద్యోగుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. పీఆర్సీ అమలులో జాప్యం, ఐదు పెండింగ్ డీఏల వల్ల ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన సొమ్ము అందక దాదాపు 80 మంది రిటైర్డ్ ఉద్యోగులు మరణించారని సభ దృష్టికి తెచ్చారు. వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక వారు ప్రాణాలు వదులుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక మహిళా సంఘాలకు రూ.57 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై కేటీఆర్ సవాల్ విసిరారు. దానికి సంబంధించిన జీవో చూపించండి.. ఇక్కడే రాజీనామా చేసి వెళ్లిపోతాను అంటూ స్పష్టం చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించవద్దని డిప్యూటీ సీఎంకు సూచించారు.

# గత వైఫల్యాలు మరచి మాట్లాడొద్దు

- కేటీఆర్ విమర్శలను తిప్పికొట్టిన మంత్రులు
- ఏమేం చేశామో లెక్కలతో సహా వివరిస్తామన్న భట్టి విక్రమార్క
- సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు అండగా ఉంటున్నామని స్పష్టీకరణ



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):**
శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రులు తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ మాట్లాడుతున్నంత సేపు పలు అంశాల్లో ఆయన విమర్శలను తిప్పికొట్టారు. గత హయాంలో చేసిన తప్పులను మరచి, కేవలం ప్రభుత్వాన్ని తప్పుపట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అభినందించి, తగిన సూచనలు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. కేటీఆర్ దారి తప్పి మాట్లాడుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మహిళా సాధికారతను గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర మహిళల గౌరవంపై చిన్నచూపు చూడటం తగదని, రాష్ట్రాన్ని అభాసుపాలు చేయాలనే ఆలోచన మంచిది కాదని హితవు పలికారు. తమ ప్రభుత్వం హామీలు నెరవేర్చడం లేదనే బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని, ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ది చేకూరుతుందో త్వరలోనే లెక్కలతో సహా చెబుతామని సభలో స్పష్టం చేశారు.

## గత వైఫల్యాల చిట్టా

గత ప్రభుత్వ హయాంలో అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి ఎంతమందికి ఇచ్చారని భట్టి విక్రమార్క ప్రశ్నించారు. తాము మాత్రం రూ.22,500 కోట్లతో ప్రతి నియోజకవర్గంలో 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. 'మీలా మేము ఇంటికో ఉద్యోగం ఇస్తామని మోసం చేయలేదు.. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని తప్పించుకోలేదు.. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని మాట తప్పలేదు' అంటూ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు.. వడ్డీలు కడుతూనే ప్రజల కోసం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. రాష్ట్రం తెచ్చిన అప్పుల భారం ఉన్నా సరే అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు.

## అమలు చేస్తున్న పథకాల వివరాలు

ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను భట్టి విక్రమార్క ఈ సందర్భంగా వివరించారు. అర్హులైన 53 లక్షల మందికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 1.06 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని.. రైతు భరోసా కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తున్నామని గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగానికి కనీసం ధన్యవాదాలు కూడా చెప్పకుండా కేవలం రాజకీయ విమర్శలు చేయడమే పనిగా పెట్టుకోవడం సరికాదని మండిపడ్డారు.

# రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళ్తున్నాం

- కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్
- అభివృద్ధి ఎజెండాగా కేంద్రంతో సంప్రదింపులు.. మాది జాతీయ పార్టీ అని స్పష్టీకరణ
- మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడటం సరికాదని హితవు



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** కేటీఆర్ వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ.. ఈ విషయాన్ని కేటీఆర్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. టెక్నికల్ గా మాట్లాడితే బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదన్నారు. మహిళలంటే ఎందుకు చులకన అని మంత్రి శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సాధికారతపై కేటీఆర్ హేళనగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'మీరు పావలా వడ్డీ ఇవ్వలేదు.. మేము ఇస్తున్నాం. గోబెల్స్ ప్రచారంలో బీఆర్ఎస్ ను మించిన వారు ఈ ప్రపంచంలోనే ఎవరూ లేరు. కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వకపోతే మీరు ఎక్కడ ఉండేవారు. ఈరోజు కాంగ్రెస్ పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు' అంటూ కేటీఆర్ పై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగంలో ఎంఓయూ, పెట్టుబడులపై ఆయన వివరణ ఇచ్చారు.

## ఢిల్లీ పర్యటనలపై వివరణ

సీఎం పదేపదే ఢిల్లీకి వెళ్తున్నారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మంత్రి తిప్పికొట్టారు. కేంద్రంతో కొట్లాడి అయినా నిధులు తెచ్చి రాష్ట్రాన్ని బాగు చేస్తామని అన్నారు. ప్రధాన మంత్రిని కలవడంలో తప్పేముందని అన్నారు. గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇస్తారని ఆశించామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ అని.. ఢిల్లీకి ఎన్నిసార్లయినా వెళ్తామని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తున్నామన్నారు. ప్రాంతీయ పార్టీగా ఉన్నప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నోసార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టారని వ్యాఖ్యానించారు.

## కేటీఆర్ పై విమర్శలు

ప్రభుత్వానికి కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తారని అనుకున్నామని.. ఎవరో రాసిన స్క్రిప్ట్ ను చదువుతున్నారని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఊకదంపుడు ఉపన్యాసం ఇస్తున్నారంటూ విమర్శించారు. ప్రధాన మంత్రి దగ్గరకు కేటీఆర్ ఎన్నిసార్లు వెళ్లారో లెక్క తీయాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎన్నిసార్లయినా ఢిల్లీకి వెళ్తామని.. ప్రధానిని, మంత్రులను కలుస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికి బీఆర్ఎస్ లా తాము ఢిల్లీకి వెళ్లడం లేదని అన్నారు. కేటీఆర్ సత్యదూరమైన మాటలు మాట్లాడుతున్నారన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, పార్లమెంట్ ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో ఫ్లాప్ అయింది బీఆర్ఎస్ అంటూ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.

# అబద్ధాలు, సెటైర్లు వేయడం మానుకో

## కేటీఆర్ కు సీతక్క కౌంటర్

## మహిళల పట్ల మాజీ మంత్రికి చిన్నచూపు అని విమర్శ

## మహిళా సంఘాల బారికేడ్లను తొలగిస్తున్నామని వెల్లడి

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** మహిళలంటే మాజీ మంత్రి కేటీఆర్ కు చిన్నచూపని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కేటీఆర్ పై ఆమె విరుచుకుపడ్డారు. కుటుంబ సభ్యులైనా, బయట మహిళలనైనా ఎదగనీయాలంటూ కేటీఆర్ కు చురకలంటించారు. ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ సెటైర్లు, తప్పుడు ప్రచారం చేశారని



మండిపడ్డారు. ఆయన సత్యదూరమైన మాటలు, ఎగతాళి మాటలు బంద్ చేయాలని కోరారు. పదేళ్లు మంత్రిగా మహిళల కోసం కేటీఆర్ ఏం చేశారని సీతక్క ప్రశ్నించారు.

## మహిళా సంఘాల బలోపేతం

మహిళా సంఘాలు ఐదు లక్షల కంటే ఎక్కువ తీసుకోకుండా గత ప్రభుత్వం బారికేడ్లు పెట్టిందని, ఇప్పుడు ఆ బారికేడ్లను తాము తొలగిస్తున్నామని చెప్పారు. ఎవరి హయాంలో మహిళా సంఘాలు బాగా నడుస్తున్నాయో వెళ్లి మహిళలను అడగాలని మంత్రి సవాల్ చేశారు. అభయ హస్తం డబ్బులను కూడా గత ప్రభుత్వం వాడుకుందని సీతక్క ఆరోపించారు. శ్రీనిధి ద్వారా వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇస్తున్నామని వివరించారు. మహిళలకు చెందిన అభయ హస్తం డబ్బులను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వాడుకుందని ఆమె ఆరోపించారు. కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తాము పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మహిళా సంఘాలపై రూ.3000 కోట్ల భారం పెట్టి పోయిందని విమర్శించారు. కేటీఆర్ ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని సీతక్క పేర్కొన్నారు.

# వరి వేస్తే ఉరి అన్న వారు ఇప్పుడు రైతుల పాట పాడుతున్నారా?

## విప్ ఆది శ్రీనివాస్ విమర్శలు

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** బీఆర్ఎస్ హయాంలో రైతులు వరి వేస్తే ఉరి అన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పుడేమో వారే రైతుల పాట పాడుతున్నారని ఎద్దేవా చేశారు. సన్న బియ్యం పండించే రైతులకు రూ.500 బోనస్ తో పాటు యంత్ర పరికరాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన అన్నారు.



ఈ నెల 22 నుండి రైతు భరోసా నిధులు పంపిణీ చేయనున్నట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలో 60 లక్షల మందికి పైగా రైతులకు ఈ నిధులు జమ చేస్తామన్నారు. తెలంగాణ శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం చర్చలో ఆయన మాట్లాడారు.

## రైతుల మద్దతుతో విజయాలు

రైతులు, ప్రజల మద్దతుతో మున్సిపల్, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ కు విజయం దక్కిందని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు ఆడి తప్పుదోవ పట్టిస్తే ప్రజలు అస్సలు విశ్వసించరని పేర్కొన్నారు. కాళేశ్వరం నుండి చుక్క నీరు తీసుకోకపోయినా 71.86 లక్షల టన్నుల ధాన్యం పండించామని వివరించారు. ఎల్లంపల్లి నీటితో పెద్ద ఎత్తున వరి పండిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో మోటార్లకు కూడా బిల్లులు పెండింగ్ లో పెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని, ఇందిరమ్మ రాజ్యంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ సేవలందిస్తున్నాయని ఆది శ్రీనివాస్ అన్నారు.

# మేం చేస్తున్న పనులకు ధన్యవాదాలు చెప్పాలి: కోమటిరెడ్డి

- రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం ఇస్తున్నందుకు కృతజ్ఞత తెలపాలి
- బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీ కడుతున్నందుకు థాంక్స్ చెప్పాలి



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ధీటైన కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అందరూ ధన్యవాదాలు చెప్పాలని ఆయన అన్నారు. రేషన్ కార్డు ఇచ్చినందుకు, యంగ్ ఇండియా స్కూల్ కట్టినందుకు, ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ఇచ్చినందుకు, ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు ధన్యవాదాలు చెప్పాలని స్పష్టం చేశారు. కేటీఆర్ ఓపికగా ఉండాలని మంత్రి హితవు పలికారు. ఈ ప్రభుత్వం కేవలం పేదల కోసమే ఉందని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసిందని, ఆ అప్పులకు ప్రస్తుతం తాము వడ్డీలు కడుతున్నామని మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. కనీసం ఆ విషయంలోనైనా తమకు ధన్యవాదాలు చెప్పాలంటూ కేటీఆర్ కు ధీటైన జవాబిచ్చారు.

## ప్రేమించి పెళ్లి చేసుకుని భార్య ప్రాణం తీసిన భర్త

**నాలుగు నెలల గర్భిణిని కత్తితో పొడిచి హతమార్చిన హరిబాబు**

**జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్‌లో దారుణం**



**జగిత్యాల, మార్చి 17 (మనసులో మాట):** జగిత్యాల జిల్లాలో దారుణం జరిగింది. నాలుగు నెలల గర్భవతిగా ఉన్న భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. కోరుట్ల మండలం మాదాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు ప్రాథమికంగా తెలిపిన వివరాల ప్రకారం ఎనిమిది నెలల క్రితం కోరుట్లకు చెందిన చిత్తరి హరిబాబు, మాదాపూర్‌కు చెందిన వైష్ణవి (19) ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుండి అతను మాదాపూర్‌లోనే నివాసముంటున్నాడు. హరిబాబు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒప్పంద పద్ధతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైష్ణవి రీల్స్ చేస్తూ యూట్యూబ్ ఛానల్ నడిపిస్తోంది. గత కొద్దిరోజులుగా వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వేకువజామున 4 గంటలకు వైష్ణవిపై హరిబాబు కత్తితో దాడి చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి రక్తపు మడుగులో వైష్ణవి పడి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. విద్యార్థి మృతి

**గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం**

**మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం**

**గద్వాల, మార్చి 17 (మనసులో మాట):** జోగులాంబ గద్వాల జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలో బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఒక విద్యార్థి మృతిచెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాము (17)గా గుర్తించారు. గాయపడిన మరో ఇద్దరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. బాధితులను హైదరాబాద్‌లోని చైతన్య కాలేజీ విద్యార్థులుగా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## మియాపూర్ వద్ద ఫార్మా కంపెనీ బస్సు బోల్తా.. ఒకరికి తీవ్ర గాయాలు

**యూటర్న్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న వాహనం..**

**క్రేన్ సాయంతో బస్సును తొలగించి ట్రాఫిక్ పునరుద్ధరించిన పోలీసులు..**

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** హైదరాబాద్ మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఫార్మా కంపెనీకి చెందిన బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలవ్వగా మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. లీ ఫార్మా కంపెనీకి చెందిన మినీ బస్సు మంగళవారం ఉదయం 8 గంటలకు 10 మంది ఉద్యోగులతో కేపీహెచ్ బీ నుంచి గడ్డిపోతారం బయల్దేరింది. 8.30 గంటల సమయంలో మియాపూర్ చౌరస్తా నుంచి బాచుపల్లి వెళ్లే మార్గంలో బీకే ఎన్ క్లేవ్ సమీపంలో యూటర్న్ వద్ద రెండు బస్సులు సమాంతరంగా వెళ్తున్నాయి. ఈ క్రమంలో మరో బస్సును ఆకస్మికంగా కుడి వైపునకు తిప్పడంతో లీ ఫార్మాకు చెందిన బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు సీటులో కూర్చున్న వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన వారు స్వల్పంగా గాయపడ్డారు. రహదారిపై బస్సు బోల్తా పడటంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు స్తంభించాయి. వెంటనే మియాపూర్ ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్రేన్ సాయంతో బస్సును పైకి లేపి పక్కకు తీసుకెళ్లారు. అనంతరం నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి.. రాజీవ్ రహదారిపై విషాదం

**కుమార్తెను చూసి వస్తుండగా కల్వర్టును ఢీకొట్టిన కారు**

**అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాస్, రజిత**




**పెద్దపల్లి, మార్చి 17 (మనసులో మాట):** పెద్దపల్లి - రామగుండం రాజీవ్ రహదారిపై పాలకుర్తి మండలం బసంత్ నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు, బసంత్ నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ (47), రజిత (40) దంపతుల కుమార్తె హైదరాబాద్ లో చదువుకుంటోంది. ఆమెను చూసేందుకు వారు కారులో వెళ్లారు. కుమార్తెను కలిసి తిరిగి స్వస్థలానికి వెళుతున్న క్రమంలో బసంత్ నగర్ గ్రామ శివారు వద్ద కారు అదుపు తప్పి కల్వర్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శ్రీనివాస్, రజిత అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# కాంగ్రెస్‌లో చిచ్చు పెడుతున్నదే సంజయ్

- జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- తనతో కలిసి పనిచేయాలనడానికి ఆయన ఎవరు?
- నాలుగు దశాబ్దాల కాంగ్రెస్ బంధాన్ని తెంపే కుట్ర జరుగుతోందని ఆగ్రహం

**జగిత్యాల, మార్చి 17 (మనసులో మాట):** తనను కాంగ్రెస్ నుండి బయటకు పంపేందుకు బీ ఆర ఎస్ ఎమ్మెల్యే సంజయ్ ను ఎవరో వెనుక ఉండి ప్రోత్సహిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ అసెంబ్లీ లాబీల్లో చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తనతో కలిసి పనిచేయాలని ఆయన ఆఫర్ ఇవ్వడంపై మండిపడ్డారు. అసలు సంజయ్ ఏ పార్టీలో ఉన్నారో ముందు తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ప్రస్తుతం కాంగ్రెస్ లోనే ఉన్నానని, ఒకవేళ పార్టీని వీడాల్సి వస్తే దానికి సంజయ్ మాత్రమే కారణమని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారం అవుతుందని తాను అనుకోవడం లేదని, తనకు కార్యకర్తల అభిప్రాయాలే ముఖ్యమని వెల్లడించారు.




**పార్టీ మార్పుపై స్పష్టత**

సంజయ్ బీ ఆర ఎస్ లో ఉన్నారని స్పీకర్ అంటుంటే, ఆయన మాత్రం కాంగ్రెస్ లో కలిసి పనిచేద్దామని అంటున్నారని జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. తనకు ఆఫర్ ఇవ్వడానికి సంజయ్ ఎవరు అని ప్రశ్నించారు. నాలుగు దశాబ్దాల అనుబంధాన్ని తెంచుకోవడం ఎంతో బాధగా ఉంటుందని, ఎంత ఇబ్బంది ఉంటే ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందో అర్థం చేసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ లోకి వచ్చిన పది మంది ఎమ్మెల్యేలను దూరం పెట్టడమే ఈ సమస్యకు సరైన పరిష్కారమని ఆయన సూచించారు. ఆరు గ్యారంటీల అమల్లో జాప్యం పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉందని, తాను ఒక్కడిని పోతే పార్టీ ఆగదని పేర్కొన్నారు.

**స్థానిక అభివృద్ధిపై ప్రశ్నలు**

జగిత్యాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని చెప్పుకుంటున్న సంజయ్, గత 20 నెలలుగా యావర్ రోడ్డు విస్తరణను ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదని ఆరోపించారు. బలహీన వర్గాల మహిళను చైర్మన్ పదవి నుండి దించేసిన సంజయ్ తనకు నీతులు చెప్పడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లోకి ఉడుము వస్తే ఇల్లు వదిలేసినట్లుగా, సంజయ్ కాంగ్రెస్ లోకి ఉడుములాగా వచ్చి చేరాడని ఘాటుగా విమర్శించారు. రాజ్యాంగాన్ని గౌరవించని వ్యక్తి చేసే వ్యాఖ్యలను తాను పట్టించుకోనని, ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించని వారు ఆ పదవికి అనర్హులని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు.

# రోహిత్ రెడ్డి వ్యవహారంపై బీఆర్ఎస్ సీరియస్

**షోకాజ్ నోటీసులు జారీ**

**వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం.. లేదంటే క్రమశిక్షణా చర్యలు తప్పవు**

**డ్రగ్స్ కేసు ఆరోపణల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాలకు దూరం**

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ గట్టి షాక్ ఇచ్చింది. డ్రగ్స్ కేసులో ప్రమేయం ఉన్నట్లు మీడియా ద్వారా వార్తలు రావడం, పోలీస్ కేసు నమోదు కావడంతో పార్టీ అధిష్టానం ఆయనకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారం వల్ల పార్టీ ప్రతిష్టకు భంగం కలుగుతుందని భావించిన నాయకత్వం, ఈ అంశంపై ఏడు రోజుల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అప్పటి వరకు పార్టీ అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా సంతృప్తికరమైన సమాధానం రాకపోతే, ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే పార్టీ నియమావళి ప్రకారం కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.




**కేసీఆర్ ఆగ్రహం**

ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరిగిన ఒక సమావేశంలో మాదకద్రవ్యాల వినియోగం జరిగిందని, అక్కడ రోహిత్ రెడ్డి ఉన్నట్లు వివిధ మీడియా నివేదికలు, విశ్వసనీయ సమాచారం ద్వారా పార్టీ నాయకత్వానికి తెలిసింది. ఈ వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగించడంతో పాటు పార్టీకి అపకీర్తి తెచ్చాయని నోటీసుల్లో పేర్కొన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్ ఈ షోకాజ్ నోటీసును పంపారు.

**నైతిక విలువలకే ప్రాధాన్యం**

బీఆర్ఎస్ ఒక బాధ్యతాయుతమైన రాజకీయ పక్షమని, నైతిక విలువలు, చట్టపరమైన నిబంధనలను పాటించడంలో ఎప్పుడూ ముందుంటుందని నోటీసులో స్పష్టం చేశారు. అక్రమ కార్యకలాపాలు, ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని పార్టీ ఏమాత్రం సహించదని తెలిపారు. ఈ ఆరోపణలు పార్టీ విశ్వసనీయతను దెబ్బతీసేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే నోటీసు అందిన తేదీ నుంచి వారం రోజుల్లోగా లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని, పార్టీ తీసుకునే తుది నిర్ణయం వరకు అన్ని రకాల పార్టీ కార్యక్రమాల నుంచి తప్పుకోవాలని ఆదేశించారు.

# రోహిత్ రెడ్డి డ్రగ్స్ కేసులో కీలక మలుపు

**సిట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశం**

**చేవెళ్ల డీ సీ పీ యోగేశ్ గౌతమ్ నేతృత్వంలో విచారణా బృందం**

**దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందాపై లోతైన దర్యాప్తుకు డీజీపీ ఉత్తర్వులు**

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ లోని బీఆర్ఎస్ నేత పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసులో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. దీనికి చేవెళ్ల డీ సీ పీ యోగేశ్ గౌతమ్ నేతృత్వం వహిస్తారని స్పష్టం చేస్తూ తెలంగాణ డీ జీ పీ శివధర్ రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ లో జరిగిన పార్టీ వ్యవహారంతో పాటు దుబాయ్ లింకులు, డ్రగ్స్ దందా, నమిత్ శర్మ రియల్ వ్యాపారాలు తదితర అంశాలపై ఈ బృందం విచారణ జరపనుంది.

**సమగ్ర విచారణకు ప్రభుత్వం మొగ్గు**

ఈ డ్రగ్స్ కేసులో మత్తు పదార్థాలను ఎక్కడి నుండి తీసుకువచ్చారు? ఈ పార్టీలో పాల్గొన్న వ్యాపారులు ఎవరు? వారికి ఉన్న సంబంధాలు, ముఖ్యంగా దుబాయ్ లింకులపై అన్ని కోణాల్లో నిజాలను రాబట్టేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదికను ప్రభుత్వానికి అందించాలని సిట్ ను ఆదేశించారు.




**ఫామ్ హౌస్ లో అసలేం జరిగింది?**

మొయినాబాద్ లోని రోహిత్ రెడ్డికి చెందిన ఫామ్ హౌస్ పై ఆదివారం పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఆ సమయంలో న్యూఢిల్లీకి చెందిన నమిత్ శర్మ కాల్పులు జరపగా, అప్రమత్తమైన పోలీసులు వారిని చుట్టిముట్టారు. ఈ సందర్భంగా 11 మందిని అదుపులోకి తీసుకుని పరీక్షలు నిర్వహించగా, పలువురికి పాజిటివ్ వచ్చింది. వారిలో ఏలూరు ఎం పీ పుట్టా మహేశ్ కుమార్ తో పాటు పైలట్ రోహిత్ రెడ్డి కూడా ఉన్నట్లు తేలింది. డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ రావడంతో వీరిద్దరికీ ఆయా పార్టీల నుండి నోటీసులు అందాయి. ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని, అప్పటి వరకు పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉండాలని అధిష్టానాలు స్పష్టం చేశాయి. ప్రభుత్వ నిర్ణయంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# ఆశ్రయమిచ్చిన ఇంటికే కన్నం

- మత్తు మందు ఇచ్చి బంధువు దోపిడీ
- మణికంఠశర్మ దంపతులను అపస్మారక స్థితిలోకి నెట్టి నగలు ఊడ్చుకెళ్లిన కిలాడీ లేడీ
- కేవలం 24 గంటల్లోనే ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** బంధువే కదా అని ఆశ్రయమిస్తే రాబందులా మారి దోచుకుంది. ఇంట్లో చోటిచ్చిన పాపానికి బంగారు నగలు, నగదు అంతా ఊడ్చుకెళ్లింది. ఆ కిలాడీ లేడీ పక్కాగా వేసిన పథకాన్ని పసిగట్టలేకపోయిన ఆ దంపతులు సొమ్ము పోయాక పోలీసులను ఆశ్రయించారు. అయితే పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కేవలం 24 గంటల్లోనే నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ లో చోటుచేసుకుంది. బీహెచ్ ఈ ఎల్ కాలనీ పరిధిలోని ఆదర్శనగర్ లో నివసించే పురోహితులు యర్రవల్లి మణికంఠశర్మ, హేమబిందు దంపతుల ఇంటికి చెరకుపల్లి లక్ష్మీస్వరాజ్ అనే మహిళ వచ్చింది. తాను తీవ్రమైన ఆర్థిక కష్టాల్లో ఉన్నానని, ఉండటానికి చోటు లేక ఇబ్బంది పడుతున్నానని ప్రాధేయపడింది. బంధుత్వంపై ఉన్న గౌరవం, ఆమె పరిస్థితిపై ఉన్న జాలితో ఆ దంపతులు ఆమెకు తమ ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. కొన్ని రోజులు ఆ దంపతుల నమ్మకాన్ని గెలుచుకున్న లక్ష్మీస్వరాజ్ వారి ఇంట్లో ఒక మనిషిగా మెదిలింది.

**నమ్మించి వంచించిన వైనం**

లక్ష్మీస్వరాజ్ నమ్మకంగా ఉంటూనే ఇంట్లోని విలువైన ఆభరణాలపై కన్నేసింది. మార్చి 13న వాటిని కొట్టేసేందుకు ప్లాన్ చేసింది. పథకం ప్రకారం ఆ దంపతులకు నిమ్మరసంలో మత్తు మందు కలిపి ఇచ్చింది. ఆ పానీయం తాగిన కొద్దిసేపటికే మణికంఠశర్మ, హేమబిందు ఇద్దరూ స్పృహ కోల్పోయారు. వారు అపస్మారక స్థితిలోకి వెళ్లగానే లక్ష్మీస్వరాజ్ తన ముఠా సభ్యులైన పర్వతం కిరణ్ కుమార్, కోనపర్తి యశ్వంత్, భారడి దీపక్, శివను ఆ ఇంటికి రప్పించింది. అందరూ కలిసి ఇంట్లోని అల్మారాలను బద్దలు కొట్టి దాదాపు 30 తులాల బంగారం, 2.3 కిలోల వెండి, మూడు ఖరీదైన సెల్ ఫోన్లను ఎత్తుకెళ్లారు. బాధితులు స్పృహలోకి వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లో సామాన్లు చిందరవందరగా పడి ఉండటం, లక్ష్మీస్వరాజ్ కనిపించకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు వెంటనే బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**24 గంటల్లోనే నిందితుల అరెస్ట్**

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. కాలనీలోని సీసీ కెమెరాల ఫుటేజీ,



నిందితులు వాడిన వాహనాల నంబర్లు, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా దర్యాప్తును ముమ్మరం చేశారు. కేవలం 24 గంటల వ్యవధిలోనే ప్రధాన నిందితురాలు లక్ష్మీస్వరాజ్ తో పాటు మిగిలిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి దోచుకెళ్లిన పూర్తి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. బంధువులైనా, తెలిసిన వారైనా సరే ఇంటికి వచ్చినప్పుడు పూర్తి జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ఆర్థిక స్థితిగతులు, బంగారం ఎక్కడ దాస్తారో వంటి వ్యక్తిగత విషయాలను ఎవరికీ వెల్లడించవద్దని కోరారు.

# అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం

- ఎమ్మెల్సీ మహేశ్ గౌడ్ సవాల్
- సీఎం రేవంత్ రెడ్డిని నేను తీసుకువస్తా.. కేసీఆర్ ను మీరు తీసుకురండి
- గంజాయి, కొకైన్ అరికట్టడంలో బీఆర్ఎస్ విఫలమైందన్న మహేశ్ గౌడ్



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** అందరికీ డ్రగ్స్ టెస్ట్ చేద్దాం.. అందుకు మీరు సిద్ధమేనా అంటూ శాసన మండలిలో కాంగ్రెస్ ఎంఎల్ సీ, తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ చేశారు. మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు సిగ్గుచేటని, బీఆర్ఎస్ నేతలు సిగ్గుపడాలని కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. గత పదేళ్లలో గంజాయి, కొకైన్ వంటి మత్తు పదార్థాలు విస్తృతంగా వ్యాపించాయని పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాప్రతినిధులందరూ డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తాను డ్రగ్ టెస్టుకు సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తానని, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిద్ధమా? అని మహేశ్ గౌడ్ సవాల్ విసిరారు. 'మీరు మీ నాయకుడిని డ్రగ్స్ టెస్టుకు తీసుకురండి.. నేను మా సీఎం రేవంత్ రెడ్డిని తీసుకువస్తాను' అంటూ మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు.

### డ్రగ్స్ నియంత్రణకు కఠిన చర్యలు

రాష్ట్రంలో గత రెండేళ్లుగా డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇటీవల డ్రగ్స్ కేసులో బీఆర్ఎస్ కు చెందిన ఒక నాయకుడు పట్టుబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఆ పార్టీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకుందో ప్రశ్నించారు. ప్రజలకు, ముఖ్యంగా యువతకు సరైన సందేశం ఇవ్వాల్సిన బాధ్యత నాయకులపై ఉందని అన్నారు. డ్రగ్స్ సమస్యపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూడా కోరారు. డ్రగ్స్ కేసుల్లో ఎంత పెద్దవారైనా వదిలే ప్రసక్తే లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇచ్చే ముందు డ్రగ్స్ టెస్టులు చేయాలని సూచించారు. కొందరు నాయకులు డ్రగ్స్ వ్యాపారంలో నేరుగా పాల్గొంటున్నారనే ఆరోపణలు కూడా చేశారు.

### అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసిందని తెలిపారు. గాంధీ విగ్రహం అంశంపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. మూసీ నది పరిస్థితిపై కూడా స్పందిస్తూ.. అభివృద్ధి లేకపోతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్రానికి, దేశానికి సేవ చేసిన మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం తాత్కాలికమేనని, ప్రజలు వాస్తవాలను గుర్తిస్తారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో వంద సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

# రాజకీయాల్లో నిఖార్సయిన నేత ఓంకార్

- శతజయంతి ఉత్సవాల్లో మంత్రి సీతక్క
- ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర అజరామరం.. విలువలకు నిలువుటద్దం
- ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటుకు సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, కమ్యూనిస్ట్ దిగ్గజ నేత మద్దికాయల ఓంకార్ ఉన్నత విలువలు కలిగిన నాయకుడని, ప్రజా ఉద్యమాల్లో ఆయన పాత్ర విశేషమని మంత్రి సీతక్క గుర్తుచేశారు. అండర్ గ్రౌండ్ నుంచి ఓవర్ గ్రౌండ్ వరకు ఆయన సాగించిన పోరాటం అపార అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. రవీంద్ర భారతిలో నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ శత జయంతి వార్షికోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై నివాళులర్పించారు. ఉద్యమాలు, క్రమశిక్షణ, ప్రజాసేవ వంటి విలువలను ఓంకార్ నుంచి నేర్చుకున్నానని ఈ సందర్భంగా సీతక్క వెల్లడించారు.

### రాజకీయ దురంధరుడు ఓంకార్

ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన ఓంకార్ లేని లోటు నర్సంపేటకే కాకుండా యావత్ తెలంగాణకే తీరని లోటుగా మిగిలిందని సీతక్క అన్నారు. ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎలాంటి ఒత్తిడులకు లొంగకుండా రాజకీయాలకు విలువలు అద్దిన రాజకీయ దురంధరుడని కొనియాడారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ చట్టసభల్లో గళం వినిపించిన నిస్వార్థ ప్రజాసేవకుడిగా ఆయన నిలిచారని చెప్పారు. అలాంటి గొప్ప నాయకుడి చరిత్రను భవిష్యత్తు తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సురవరం ప్రతాప్ రెడ్డి, గద్దర్, అందెశ్రీ వంటి ప్రముఖుల చరిత్రను ప్రజలకు తెలియ చేస్తున్నామని, అదే విధంగా ఓంకార్ సేవలను కూడా రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై ఓంకార్ విగ్రహం ఏర్పాటు చేయాలని అభిమానులు కోరుతున్నారని, ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

### అంతర్జాతీయ పరిణామాలపై ఆందోళన

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై దాడులు చేస్తున్నాయని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. ఒక దేశాధినేతను హతమార్చే హక్కు అమెరికాకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఇరాన్ మీద దాడిని కూడా ఖండించలేని పరిస్థితుల్లో మన దేశ ప్రభుత్వం ఉందని విమర్శలు గుప్పించారు. ఇలాంటి పరిస్థితుల్లో మన దేశం మౌనం వహించడం సరైంది కాదని, కేంద్ర ప్రభుత్వం అమెరికా యుద్ధోన్మాదాన్ని ఖండించాలని డిమాండ్ చేశారు.

# ఫిరాయింపుల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై స్పీకర్ ఫైర్

**తీర్పు చదవకుండా మాట్లాడొద్దని హితవు**

**స్పీకర్‌ను తప్పుపడతారా అంటూ మండిపడ్డ మంత్రి పొంగులేటి..**

**దానం నాగేందర్ అనర్హత పిటిషన్ తీర్పుపై అసెంబ్లీలో మాటల యుద్ధం..**

**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** పార్టీ ఫిరాయింపుల అంశంపై అసెంబ్లీలో మాజీ మంత్రి కేటీఆర్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మధ్య మాటల యుద్ధం సాగింది. ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ ఇచ్చిన తీర్పును కేటీఆర్ సభలో ప్రస్తావించారు. బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన దానం కాంగ్రెస్ బీ ఫామ్ పై ఎంపీగా పోటీ చేసినా, ఆయన పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ చెప్పడాన్ని తప్పుబట్టారు. దీనిపై స్పీకర్ స్పందిస్తూ కేటీఆర్ జడ్జిమెంట్ కాపీని పూర్తిగా చదవకుండా మాట్లాడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఉన్నత పదవిలో ఉన్న తనను అవమానించడం సరికాదని, ప్రతి విమర్శకు తాను మీడియా ముందుకు వచ్చి సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తీర్పును పూర్తిగా చదివి మాట్లాడాలని కేటీఆర్ కు సూచించారు.

### పొంగులేటి ఆగ్రహం



అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేటీఆర్ అహంకారంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జడ్జి స్థానంలో ఉన్న స్పీకర్ నే ప్రశ్నించడం ఏంటని నిలదీశారు. బీఆర్ఎస్ నిజాయితీగా ఉంటే ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయిందని ప్రశ్నించారు. గతంలో పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే బీఆర్ఎస్ అని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం కేటీఆర్ కే చెల్లుతుందని ఎద్దేవా చేశారు.

### ఎంపీ చామల కిరణ్ కౌంటర్

ఈ వ్యవహారంపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కూడా ఘాటుగా స్పందించారు. మీడియాలో మాట్లాడిన ఆయన పార్టీ ఫిరాయింపుల గురించి కేటీఆర్ తన తండ్రి కేసీఆర్ ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. తెలంగాణలో గతంలో ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేసిన విధానాన్ని అడిగి తెలుసుకోవాలని వ్యాఖ్యానించారు.

# పులిగుండాల ప్రాజెక్టు నీటి విడుదలకు మంత్రి తుమ్మల ఆదేశం

**ఎండిపోతున్న పంటలకు ఊరట**

**వేయి ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం**

**రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సమన్వయంతో అడ్డంకులు తొలగించాలని స్పష్టీకరణ**

**ఖమ్మం, మార్చి 17 (మనసులో మాట):** పెనుబల్లి మండలంలోని పులిగుండాల ప్రాజెక్టు పరిధిలోని బ్రహ్మలకుంట గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల ఆవేదనపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. పరిస్థితి తీవ్రతను గుర్తించిన మంత్రి, ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి సుమారు 1000 ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

### అధికారులతో సమీక్ష, సమన్వయం



ఈ మేరకు మంత్రి తుమ్మల ప్రాజెక్టు పరిస్థితులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి, రెవెన్యూ, ఫారెస్ట్ శాఖల సమన్వయంతో వాటిని అత్యవసరంగా పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీ ఎఫ్ ఓ సిద్ధార్థతో మంత్రి నేరుగా ఫోన్ లో మాట్లాడి ఏవైనా ఇబ్బందులు ఉంటే తక్షణమే పరిష్కరించాలని సూచించారు. సాగునీటి విడుదలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని, రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని ఆయన స్పష్టం చేశారు.

### యుద్ధ ప్రాతిపదికన చర్యలు

నీటిపారుదల శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పరిస్థితి అత్యవసరంగా ఉన్నందున ఫీల్డ్ స్థాయిలో ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతుల పంటలను ఎండిపోకుండా కాపాడటం ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు. ప్రతి రైతుకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పులిగుండాల ప్రాజెక్టు నుంచి నీటి విడుదలతో ఆయకట్టు పరిధిలోని వేలాది ఎకరాలకు ప్రాణాధారం లభించనుందని పేర్కొన్నారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు వేగంగా స్పందించి నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కలెక్టరేట్ ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

**న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నిరసన**

**48 గంటల దీక్షకు పూనుకున్న కార్యకర్తల తరలింపు**

**నాగర్‌కర్నూల్, మార్చి 17 (మనసులో మాట):** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముందు ఆశ కార్యకర్తలు ధర్నాకు దిగారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అయితే ధర్నా చేస్తున్న ఆశలను పోలీసులు అరెస్టు చేశారు. వారిని బలవంతంగా పోలీస్ వ్యాన్ లో ఎక్కించుకుని స్టేషన్ కు తరలించారు. దీంతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ తమకు అనేక హామీలు ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చాక పట్టించుకోవడం లేదని ఆశ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే 48 గంటల ధర్నాకు పూనుకున్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం నుండి ఈ నిరసన చేపట్టగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. మంగళవారం కూడా ధర్నా కొనసాగించగా పోలీసులు వారిని అరెస్టు చేశారు.

# వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి**



**వికారాబాద్, మార్చి 17 (మనసులో మాట):** తెలంగాణ ప్రభుత్వ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయం వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వాటర్ స్పోర్ట్స్ అకాడమీ (క్రీడా పాఠశాల) ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి ఆశ్రమ ఉన్నత పాఠశాల బోయినపల్లి నందు కాయకింగ్, కేనోయింగ్, సేయిలింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్ నందు గిరిజన బాలబాలికలకు ప్రతిభ ఆధారంగా 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం నందు ప్రవేశాలు కల్పిస్తారు. ఇందులో 10 మంది బాలికలకు, 10 మంది బాలురకు అవకాశం ఉంటుంది.

### ఉచిత శిక్షణ, వసతి

ఈ పాఠశాలలో ప్రవేశానికి ఐ టీ డీ ఏ మైదాన ప్రాంత జిల్లాలకు (ఐ టీ డీ ఏ ప్లెయిన్ ఏరియా) సంబంధించిన బాలబాలికలు అర్హులు. వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ పొందు బాలబాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, షూస్ తో పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఆసక్తి కలిగిన గిరిజన విద్యార్థులు 4వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 23 వరకు సమీప కార్యాలయాల్లో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలి. మర్పల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఇన్ ఛార్జ్ అధికారి టి.కుమార్ (9542972094), కుల్కచెర్ల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఇన్ ఛార్జ్ ఆర్.రాజేందర్ (9959293604) వద్ద దరఖాస్తులు సమర్పించవచ్చని జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి తెలిపారు.

# జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**

**ఖాజిపల్లి ఎల్లమ్మ తల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్**

**ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని వెల్లడి**




**పటాన్‌చెరు (జిన్నారం), మార్చి 17 (మనసులో మాట):**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం, జాతర మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే, ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీలు బాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, గద్దె నరసింహ, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీనియర్ల వేధింపులతో కేయూ విద్యార్థిని ఆత్మహత్య

**హాస్టల్‌లో దాడికి గురై మనస్తాపంతో తనువు చాలించిన శ్రీవిద్య**

**ఎలుకల మందు తాగి నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి**



**భీమారం, మార్చి 17 (మనసులో మాట):** కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) పద్మాక్షి హాస్టల్‌లో సీనియర్ల దాడికి గురైన విద్యార్థిని శ్రీవిద్య (20) చికిత్స పొందుతూ మృతి చెందింది. ఖమ్మం జిల్లాకు చెందిన ఆమె ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ రెండో సంవత్సరం చదువుతోంది. హాస్టల్‌లో ఆరుగురు సీనియర్లతో వివాదం తలెత్తగా, వారు ఆమెపై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీవిద్య ఏపీలోని గంపలగూడెంలో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించగా సోమవారం కన్నుమూసింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# యాలాల జామే మసీదులో ఘనంగా ఇఫ్తార్ విందు



**యాలాల, మార్చి 17 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా యాలాల మండల కేంద్రంలోని జామే మసీదులో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందును ఘనంగా నిర్వహించారు. రెండో వార్డు సభ్యులు జిలానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ విందులో గ్రామ సర్పంచ్ సీహెచ్ శివయ్య, ఉపసర్పంచ్ శోభా రాజు రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కో–ఆప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబా, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి మల్కయ్య, ఆరో వార్డు సభ్యులు శేఖర్ హాజరయ్యారు. వీరితో పాటు ఏడో వార్డు సభ్యులు మాలిగేరి నర్సింహులు, 12వ వార్డు సభ్యులు ఉమేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు రాపోల్ నాగయ్య, కార్యదర్శి హైమద్, సహాయ కార్యదర్శి గొల్ల చందు పాల్గొన్నారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ నాయి, మైను, వార్ల సులేమాన్, బుర్ణపూరి పాపయ్య, బుర్ణపూరి నర్సింహులు, గడ్డం వెంకటయ్య గౌడ్, రాములు గౌడ్, బషీర్, హన్మంతు, మౌలానా, బాగాని రాజు, బోయ హన్మంతు తో పాటు ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేవెళ్లలో ఘనంగా ఇఫ్తార్ విందు

## పాల్గొన్న ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, మార్చి 17 (మనసులో మాట):**

నవాబుపేట మండల కేంద్రంలోని లక్ష్మారెడ్డి గార్డెన్‌లో ప్రభుత్వం తరఫున మైనార్టీ సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య పాల్గొన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలో ఆయన మైనార్టీ సోదరులతో కలిసి ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు. అనంతరం మైనార్టీలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, మైనార్టీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించిన ఈ ఇఫ్తార్ విందులో అందరూ కలిసికట్టుగా పండుగ విశిష్టతను చాటారు. మైనార్టీల అభివృద్ధి కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

# యువజనోత్సవాలను జయప్రదం చేయండి

## ఎస్ఎఫ్ఐ పిలుపు




**చేవెళ్ల, మార్చి 17 (మనసులో మాట):**

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది. విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ 95వ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న భగత్ సింగ్ స్మారక యువజనోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరంలో యువతకు మార్గదర్శకులుగా నిలిచిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సామాజిక న్యాయం, లౌకికత్వం, సమానత్వం కోసం వారు చేసిన త్యాగం భారత యువతకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్యారంగంపై దాడులు, ప్రజాస్వామ్య హక్కుల అణిచివేత వంటి ప్రస్తుత పరిస్థితుల్లో భగత్ సింగ్ ఆలోచనలు మరింత ఆవశ్యకమని పేర్కొన్నారు. యువత సమాజ మార్పు కోసం చైతన్యవంతంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న గంజాయి, డ్రగ్స్, బెట్టింగ్ యాప్స్ వంటి చెడు వ్యసనాల వల్ల యువత పెడదోవ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా విద్యార్థి లోకం, యువత నడుం బిగించాలని సూచించారు. రాబోయే రోజుల్లో నిర్వహించనున్న ఈ యువజనోత్సవాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సెమినార్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చా వేదికలు, యువజన ర్యాలీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# హ్యామ్ రోడ్ల పేరుతో రూ. 18 వేల కోట్ల కుంభకోణం

- మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు
- కమిషన్ల కోసం 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్స్‌ల చెల్లింపు
- కాంగ్రెస్ ఎన్నికల ఖర్చు కోసమే రేవంత్ రెడ్డి సర్కార్ సన్నాహాలు



**హైదరాబాద్, మార్చి 17 (మనసులో మాట):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మాజీ మంత్రి హరీష్ రావు సంచలన ఆరోపణలు చేశారు. అసెంబ్లీలో జరిగిన చిట్‌చాట్ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యామ్ రోడ్ల పేరిట సుమారు రూ. 18 వేల కోట్ల భారీ కుంభకోణం జరుగుతోందని మండిపడ్డారు. ఆనాడు మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తే రేవంత్ రెడ్డి వద్దు అని గొడవ చేశారని, ఇప్పుడు అదే ప్రభుత్వం 10 శాతం మొబిలైజేషన్ ఇస్తోందని ధ్వజమెత్తారు. రోడ్లు భవనాల శాఖలో రూ. 12 వేల కోట్లు, పంచాయతీ రాజ్ విభాగంలో రూ. 6 వేల కోట్లు కలిపి ఈ భారీ అవకతవకలకు తెరలేపారని ఆరోపించారు.

### ఎన్నికల ఖర్చు కోసమే స్కామ్

ఈ టెండర్ల ద్వారా కమిషన్లు తీసుకుని ఎన్నికల ఖర్చు కోసం పంపబోతున్నారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం పెద్ద స్థాయి స్కామ్ గా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కనీసం సీఓటీ అనుమతి కూడా అవసరం లేకుండా డిపార్ట్‌మెంట్ స్థాయిలోనే పర్మిషన్లు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని మండిపడ్డారు. మొత్తం 34 టెండర్ ప్యాకేజీలలో ఇప్పటికే 24 ఓపెన్ చేశారని, కాంట్రాక్టర్ల మధ్య కుమ్మక్కుతో 20 నుండి 30 శాతం వరకు అధిక ధరలకు టెండర్లు వేయించారని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి ప్రజల సొమ్మును కాపాడాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# కేంద్ర నిధుల కోసం పోరాడండి

- ఎంపీలకు ఏపీ జితేందర్ రెడ్డి దిశానిర్దేశం
- విభజన హామీల అమలు కోసం కేంద్రంపై పట్టుబట్టాలని సూచన
- ఢిల్లీలో అందుబాటులో ఉన్న ఎంపీలతో ప్రత్యేక సమావేశం




**న్యూఢిల్లీ, మార్చి 17 (మనసులో మాట):** ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి అందుబాటులో ఉన్న ఎంపీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఎంపీలు కేంద్రం నుంచి నిధులు రాబట్టేలా కృషి చేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అద్వైత్ కుమార్ సింగ్ (ఐఏఎస్) నూతనంగా సెక్రటరీ కోఆర్డినేషన్ హోదాలో నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణ భవన్ గురజాడ కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం సాయంత్రం ఈ సమావేశం జరిగింది.

### విభజన హామీలపై చర్చ

కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముఖ్యంగా విభజన హామీల అమలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఏపీ జితేందర్ రెడ్డి ఎంపీలకు వివరించారు. ఎంపీల అభిప్రాయాలు తెలుసుకుని వారి నుంచి సలహాలు స్వీకరించారు. వీలైనంత వరకు తెలంగాణ ప్రజలకు మేలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి పట్టుబట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, కడియం కావ్య పాల్గొన్నారు. వీరితో పాటు రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ శశాంక్ గోయల్, సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, తెలంగాణ భవన్ అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని జితేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

# మెనూ వంద శాతం అమలు కావాలి

- కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశం
- విద్యార్థులతో కలిసి అధికారులే భోజనం చేయాలి.. నాణ్యతలో రాజీ పడొద్దు
- హాస్టళ్లలో భద్రతపై కఠినంగా ఉండాలని జిల్లా యంత్రాంగానికి దిశానిర్దేశం




**నారాయణపేట, మార్చి 17 (మనసులో మాట):**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ శాఖల వసతి గృహాలలో మధ్యాహ్న భోజన పథకం మెనూను కచ్చితంగా వంద శాతం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యం, ఇతర వంట సరకులు పూర్తి స్థాయిలో నాణ్యతతో ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా అధికారులతో తాను తీసుకుంటున్న తొలి సమావేశం విద్యపైనే అని, చదువుకు ప్రాధాన్యత ఇవ్వడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీసీ హాల్ నుంచి జిల్లా అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు.

### అధికారుల పర్యవేక్షణ - నివేదికలు

ఈ నెల 17 నుంచి 21 లోపు నోడల్ అధికారులు తమకు కేటాయించిన పాఠశాలలు, హాస్టళ్లను పర్యవేక్షించి విజిట్ రిపోర్ట్ ను గూగుల్ ఫామ్ లో నివేదించాలని కలెక్టర్ సూచించారు. దీనిని అత్యంత ప్రాధాన్యతగా భావించి గడువులోపు పూర్తి చేయాలన్నారు. ఇకపై ప్రతి మండలానికి ఒక తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఎస్ఐ తో కూడిన అధికారుల బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కమిటీ వారంలో రెండుసార్లు తమ పరిధిలోని పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి మౌలిక వసతులతో పాటు భోజన నాణ్యతను పరిశీలించాలని ఆదేశించారు. అంతేకాకుండా అధికారులు కచ్చితంగా విద్యార్థులతో కలిసి వారంలో రెండుసార్లు భోజనం చేసి రుచిని చూడాలని స్పష్టం చేశారు.

### హాస్టల్ భద్రత - పదో తరగతి పరీక్షలు

వసతి గృహాల లోపలికి అపరిచితులను అనుమతించరాదని, మరీ ముఖ్యంగా బాలికల హాస్టళ్ల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైతే బయటి వ్యక్తులకు అనుమతి లేదనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ గోడలు లేని పాఠశాలల జాబితా సిద్ధం చేయాలని కోరారు. ఆర్ బీ ఎస్ కే బృందాలు క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పరీక్షలను సజావుగా నిర్వహించాలని, ఇన్విజిలేటర్లు పరీక్షా కేంద్రాల లోపలికి సెల్ ఫోన్లు తీసుకువెళ్లకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీను, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డీఈఓ గోవింద రాజులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, మైనార్టీ సంక్షేమ అధికారి రషీద్, ఏఎంఓ విద్యాసాగర్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ ఎన్ఎస్ఎస్ శిబిరంలో కొడంగల్ కళాశాల సత్తా

**కొడంగల్, మార్చి 17 (మనసులో మాట):**

కర్ణాటక రాయచూరులో జరిగిన జాతీయ సమైక్యతా శిబిరంలో కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రతిభ చాటింది. కంటింజెంట్ అధికారిగా వెళ్ళిన డాక్టర్ ఇస్లావత్ సోమ్లా 5 కే పరుగులో ప్రథమ బహుమతిని జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అందుకున్నారు. కళాశాల విద్యార్థి ఐ. ప్రవీణ్ జానపద గాన పోటీల్లో తృతీయ బహుమతి సాధించారు. అధ్యాపకుడు, విద్యార్థి ఒకేసారి జాతీయ స్థాయికి వెళ్లి బహుమతులు సాధించడం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ బీ. శ్రీనివాస్ రెడ్డి అభినందించారు. ఈ శిబిరంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కేరళ వాలంటీర్లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.



# భారత మార్కెట్లోకి కొత్త రెనో డస్టర్







- అద్భుత ఫీచర్లతో అదిరిపోయే రీ ఎంట్రీ
- రూ.10.49 లక్షల ప్రారంభ ధరతో అందుబాటులోకి..
- పటిష్టమైన భద్రత, సరికొత్త ఫీచర్లతో మిడ్ సైజ్ ఎస్ యూ వీ మార్కెట్ లో సందడి..

బిజినెస్ డెస్క్ - మనసులో మాట

గతంలో వాహనదారులను విశేషంగా ఆకట్టుకున్న రెనో డస్టర్ సరికొత్త హంగులతో మళ్లీ మన ముందుకు వచ్చేసింది. మంగళవారం రోజున మిడ్ సైజ్ ఎస్ యూ వీ విభాగంలో ఈ కొత్త మోడల్ లాంచ్ అయింది. ఈ కారు ధరలు రూ.10.49 లక్షల నుండి మొదలవుతాయి. అయితే ముందస్తు బుకింగ్ చేసుకున్న ఆర్-పాస్ వినియోగదారులకు మాత్రం ప్రత్యేకంగా రూ.10.29 లక్షలకే దీనిని అందించనున్నారు. ఆన్ లైన్ లేదా షోరూమ్ లలో బుకింగ్ ప్రక్రియ ఇప్పటికే మొదలవగా త్వరలోనే వాహనాల అప్పగింత కూడా ప్రారంభం కానుంది. ఈ సరికొత్త రాకతో హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ విక్టోరిస్, కియా సెల్టోస్ లాంటి ఇతర కార్లకు గట్టి పోటీ ఎదురుకానుంది.

## వివిధ వేరియంట్లు, ప్రత్యేకతలు

ఈ కారు అథెంటిక్, ఎవల్యూషన్, టెక్నో, టెక్నో ప్లస్, ఐకానిక్ అనే వేరియంట్లలో అందుబాటులో ఉంది. అత్యుత్తమ ఫీచర్లు ఉండే టాప్ ఎండ్ మోడల్ ధర రూ.18.09 లక్షలుగా సంస్థ నిర్ధారించింది. విదేశాల్లో విడుదలైన డిజైన్ తో పోల్చితే భారతీయ వర్షన్ లో కొన్ని ప్రత్యేక మార్పులు చేశారు. హెడ్ ల్యాంప్ డిజైన్ పూర్తిగా కొత్తగా తీర్చిదిద్దారు. కనుబొమ్మ ఆకారంలో ఉండే డీఆర్ఎల్ఎస్ ఇందులో అమర్చారు. వాహన చక్రాలు 18 అంగుళాల అల్లాయ్ వీల్స్ తో రానున్నాయి.

## లోపలి సౌకర్యాలు

భారతీయుల అభిరుచికి తగినట్లుగా కారు లోపలి భాగాన్ని అత్యంత ప్రీమియం అనుభూతినిచ్చేలా డిజైన్ చేశారు. డ్యూయల్ స్క్రీన్ ఏర్పాటు, మూడు స్పోక్స్ ఉన్న స్టీరింగ్ వీల్ ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. 10.1 అంగుళాల ఇన్ఫోటైన్మెంట్ సిస్టమ్ తో పాటు 10.25 అంగుళాల డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ను ఏర్పాటు చేశారు. క్యాబిన్ లోపల యాంబియంట్ లైటింగ్, ముందు సీట్లకు వెంటిలేషన్, రెండు జోన్ల క్లైమేట్ కంట్రోల్, ఇంజిన్ స్టార్ట్ స్టాప్ కోసం పుష్ బటన్ లాంటి అధునాతన సదుపాయాలు ఉన్నాయి.

## పటిష్టమైన భద్రత

ప్రయాణికుల భద్రతకు ఏమాత్రం రాజీపడకుండా ఇందులో ఆరు ఎయిర్ బ్యాగులు కల్పించారు. వీటితో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఏబీఎస్ విత్ ఈబీడీ, చుట్టూ చూడగలిగే 360 డిగ్రీల కెమెరా, వెనక వైపు పార్కింగ్ సెన్సర్లు, నాలుగు చక్రాలకు డిస్క్ బ్రేకులు, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, లెవల్ 2 ఏడీఏఎస్ వంటి అత్యుత్తమ భద్రతా ప్రమాణాలు ఇందులో పొందుపరిచారు.

## ఇంజిన్ సామర్థ్యం

వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త డస్టర్ కారు పలు ఇంజిన్ ఆప్షన్లతో లభిస్తుంది. ముందుగా స్ట్రాంగ్ హైబ్రిడ్ విషయానికి వస్తే 1.8 లీటర్ల నాలుగు సిలిండర్ల డైరెక్ట్ ఇంజెక్షన్ పెట్రోల్ ఇంజన్ తో వస్తుంది. ఇది 160 బీహెచ్ పీ పవర్ తో పాటు 172 ఎన్ ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. అలాగే టర్బో పెట్రోల్ విభాగంలో 1.3 లీటర్ల ఇంజిన్ 160 బీహెచ్ పీ పవర్, 280 ఎన్ ఎం టార్క్ అందిస్తుంది. ఇది సిక్స్ స్పీడ్ మాన్యువల్ తో పాటు డ్యూయల్ క్లచ్ ఆటోమేటిక్ గేర్ బాక్స్ తో వస్తుంది. ఇక బేస్ మోడల్ లో 1.0 లీటర్ మూడు సిలిండర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్ ఏర్పాటు చేశారు. ఇది 100 బీహెచ్ పీ పవర్, 160 ఎన్ ఎం టార్క్ జనరేట్ చేస్తూ సిక్స్ స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్ తో రానుంది. ఈ కారు కొనుగోలుపై సంస్థ ఏడేళ్ల అద్భుతమైన వారెంటీని సైతం అందిస్తోంది.

# వరుసగా రెండో రోజు లాభాల కళ

**568 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్, 23,550కి పైగా ఎగబాకిన నిఫ్టీ**

### ఆటో, మెటల్ రంగాల షేర్లకు మదుపరుల మద్దతు..
### తగ్గిన ముడి చమురు ధరల సానుకూల ప్రభావం




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ఎంతో ఉత్సాహంగా ముగిశాయి. వరుసగా రెండో రోజు సూచీలు లాభాల బాట పట్టాయి. గ్లోబల్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో పాటు ముడి చమురు ధరలు కాస్త దిగిరావడం మదుపరులలో ఆశలు నింపింది. ఉదయం నుంచే లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు రోజంతా ఒడిదుడుకుల మధ్యే సాగినా చివరకు భారీ లాభాలతోనే ముగిశాయి. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 567.99 పాయింట్లు లాభపడి 76,070.84 వద్ద స్థిరపడింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 172.35 పాయింట్లు ఎగబాకి 23,581.15 వద్ద ముగిసింది. మధ్య తరహా, చిన్న తరహా కంపెనీల షేర్లు కూడా ఈ లాభాల ర్యాలీలో ఉత్సాహంగా పాలుపంచుకున్నాయి.

## మార్కెట్లకు కలిసొచ్చిన అంశాలు

పశ్చిమాసియాలో ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా గత వారం మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే ప్రస్తుతం ఈ ఉద్రిక్తతలు నెమ్మదించే అవకాశాలు కనిపిస్తుండటం సానుకూల ప్రభావం చూపింది. నిన్నటి వరకు బ్యారెల్ కు 120 డాలర్ల వైపు పరుగులు తీసిన ముడి చమురు ధరలు ప్రస్తుతం 103 డాలర్లకు దిగిరావడం మార్కెట్లకు భారీ ఊరటనిచ్చింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అనగా ఎఫ్ ఐ ఐ లు భారీగా షేర్లను విక్రయిస్తున్నప్పటికీ స్థానిక సంస్థాగత పెట్టుబడిదారులు అయిన డీ ఐ ఐ లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం మార్కెట్లకు దన్నుగా నిలిచింది. డీ ఐ ఐ లు నిన్న ఒక్కరోజే మార్కెట్లో సుమారు రూ.12,593 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసి మార్కెట్ పతనాన్ని అడ్డుకున్నారు. జపాన్, దక్షిణ కొరియా లాంటి ఆసియా మార్కెట్లు లాభాల్లో ట్రేడ్ అవ్వడం మన దేశీయ సూచీలకు బాగా కలిసివచ్చింది.

## రాణించిన, నష్టపోయిన రంగాలు

మార్కెట్లో రంగాల వారీగా విశ్లేషిస్తే ఆటో, మెటల్, రియాల్టీ రంగాలు అద్భుతమైన పనితీరు కనబరిచాయి. ముఖ్యంగా ఇటర్నల్ కంపెనీ షేర్లు సుమారు 5.68 శాతం లాభంతో అందరికంటే ముందు నిలవగా ఆ తర్వాతి స్థానాల్లో టాటా స్టీల్ 4.55 శాతం, ఎం అండ్ ఎం 3.06 శాతం వృద్ధితో నిలిచాయి. హెచ్ డీ ఎఫ్ సీ లైఫ్, బీ ఈ ఎల్, భారతీ ఎయిర్ టెల్, ఎల్ అండ్ టీ, ఐసీఐసీఐ బ్యాంక్ లాంటి దిగ్గజ సంస్థల షేర్లు కొనుగోలుదారులను ఆకర్షించి భారీ లాభాలను నమోదు చేశాయి. దీనికి విరుద్ధంగా ఐటీ, ఎఫ్ ఎం సీ జీ రంగాలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. విప్రో అత్యధికంగా 1.95 శాతం మేర నష్టపోగా సిప్లా, ఇన్ఫోసిస్, టాటా కన్స్యూమర్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలతో సరిపెట్టుకున్నాయి. ఐటీ షేర్లలో నెలకొన్న ఈ అమ్మకాల ఒత్తిడి మార్కెట్ లాభాలను కొంతమేర పరిమితం చేసింది.

## కరెన్సీ, బులియన్ మార్కెట్ల తీరు

కరెన్సీ మార్కెట్లో మాత్రం రూపాయి విలువ మరింత క్షీణించి సరికొత్త కనిష్ట స్థాయికి పడిపోయింది. అమెరికన్ డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 12 పైసలు క్షీణించి 92.40 వద్ద ముగిసింది. అటు బులియన్ మార్కెట్లో బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. ఎం సీ ఎక్స్ లో ఏప్రిల్ కాంట్రాక్టుల కోసం పది గ్రాముల బంగారం ధర సుమారు రూ.1,56,200 పైగా పలికింది. స్టాక్ మార్కెట్లలో అనిశ్చితిని సూచించే ఇండియా విక్స్ ఇండెక్స్ దాదాపు 8.39 శాతం మేర పడిపోయి 19.79 కి చేరడం మార్కెట్ వర్గాలకు ఉపశమనం కలిగించే పరిణామం. రాబోయే రోజుల్లో వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ తీసుకునే నిర్ణయాలు, గ్లోబల్ ట్రెండ్స్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశిస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఈపీఎఫ్ పెన్షనర్లకు ఊరట

### కనీస పెన్షన్ పెంచాలని పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు

- ప్రస్తుతం అందుతున్న వెయ్యి రూపాయల పెంపుపై కేంద్రానికి ప్రతిపాదనలు
- ఈఎస్ఐసీ వేతన పరిమితి సవరణతో పాటు కాంట్రాక్టు కార్మికులకు భరోసా




బిజినెస్ డెస్క్ - మనసులో మాట

ఉద్యోగ విరమణ తర్వాత ఈపీఎఫ్ చందాదారులు పొందే పెన్షన్ విషయంలో పార్లమెంటరీ ప్యానెల్ కేంద్ర ప్రభుత్వానికి కీలక సూచనలు చేసింది. ఎంప్లాయీ పెన్షన్ స్కీమ్, 1995 (ఈపీఎస్, 1995) కింద ప్రస్తుతం ఇస్తున్న వెయ్యి రూపాయల కనీస పెన్షన్ మొత్తాన్ని పెంచాలని కమిటీ స్పష్టం చేసింది. ఈ మొత్తం ప్రస్తుత కాలానికి అనుగుణంగా, లబ్ధిదారులకు గౌరవప్రదంగా ఉండాలని లేబర్, టెక్స్ టైల్స్, స్కిల్ డెవలప్మెంట్ అంశాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 15వ నివేదికలో పేర్కొంది.

## పెన్షనర్ల ఏళ్ల నాటి డిమాండ్

ఈపీఎస్ కనీస పెన్షన్ పెంచాలని పెన్షనర్లు ఎప్పటి నుంచో కోరుతున్నారు. ఇప్పుడు అందుతున్న వెయ్యి రూపాయలు ఏమాత్రం సరిపోవడం లేదని, ఆ మొత్తాన్ని రూ.7,500కు పెంచాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఈ సమస్యపైనే ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మూడు రోజుల పాటు ధర్నా కూడా నిర్వహించారు. ఈ పరిణామాలపై స్పందించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం.. ద్రవ్యోల్బణం, ఆరోగ్య సంరక్షణ ఖర్చులు, జీవన వ్యయాలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత పెన్షన్ అస్సలు సరిపోదని అభిప్రాయపడింది. అందుకే ఈ పథకాన్ని పునఃసమీక్షించి, నిధులు కేటాయించి పెన్షన్ పెంచాలని ప్రతిపాదించింది.

## లేబర్ కోడ్ల అమలు.. ప్రత్యేక బోర్డు ఏర్పాటు

కార్మికులకు సంబంధించిన లేబర్ కోడ్ల అమలును కమిటీ స్వాగతించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులతో ఒక శాశ్వత కో-ఆర్డినేషన్, ఇంటరాక్షన్ బోర్డును నెలకొల్పాలని సూచించింది. ప్రభుత్వం అందించే వివిధ పథకాలు ఏ మేరకు అమలవుతున్నాయో ఈ బోర్డు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తన నివేదికలో వెల్లడించింది.

## కార్మికులకు సామాజిక భద్రత

పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు రెగ్యులర్ వర్కర్లతో పోలిస్తే కాంట్రాక్టు వర్కర్లకు పరిహారం అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని కమిటీ గుర్తించింది. వారికి కూడా సత్వరమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే ఎంప్లాయీ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) ద్వారా అందే సామాజిక భద్రత ప్రయోజనాలను మరింత మందికి విస్తరించాలని సూచించింది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న రూ.21వేల వేతన పరిమితిని తక్షణమే సవరించాలని అభిప్రాయపడింది.

# భారీ బ్యాటరీతో వివో టీ5ఎక్స్ 5జీ విడుదల

- 7,200ఎంఏహెచ్ సామర్థ్యం, 44డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ వంటి ప్రత్యేకతలు
- రూ.18,999 ప్రారంభ ధరతో మార్చి 24 నుంచి లభ్యం



బిజినెస్ డెస్క్ - మనసులో మాట

చైనాకు చెందిన ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో తన టీ సిరీస్ లో సరికొత్త స్మార్ట్ ఫోన్ వివో టీ5ఎక్స్ 5జీని మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ ఫోన్ లో ప్రధానంగా 7,200ఎంఏహెచ్ భారీ బ్యాటరీతో పాటు 44డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయాన్ని కల్పించారు. మీడియాటెక్ డైమెన్సిటీ 7400 టర్బో ప్రాసెసర్ పై నడిచే ఈ మొబైల్ కు ఐపీ68, ఐపీ69 రేటింగ్ లు ఉండటం విశేషం. ఇది ఇటీవల వివో సబ్ బ్రాండ్ ఐకూ విడుదల చేసిన జెడ్11ఎక్స్ మోడల్ ను పోలి ఉంటుంది. కేవలం 219 గ్రాముల బరువు ఉండే ఈ ఫోన్ అత్యున్నత నాణ్యతతో కూడిన ఫీచర్లను తక్కువ ధరలోనే అందిస్తోంది.

## అద్భుతమైన డిస్ ప్లే, కెమెరా ఫీచర్లు

ఈ స్మార్ట్ ఫోన్ లో 6.67 అంగుళాల ఫుల్ హెచ్ డీ ప్లస్ ఎల్ సీ డీ డిస్ ప్లేను అమర్చారు. ఇది 120హెర్ట్జ్ రిఫ్రెష్ రేటు, 1200 నిట్స్ గరిష్ట ప్రకాశాన్ని కలిగి ఉంటుంది. ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఆరిజిన్ ఓఎస్ 6 సాఫ్ట్ వేర్ తో పనిచేసే ఈ ఫోన్ లో కెమెరా పరంగా వెనుక వైపు 50ఎంపీ సోనీ అల్ట్రా హెచ్ డీ ఏఐ ప్రధాన కెమెరా, 2ఎంపీ బొకే కెమెరా ఉన్నాయి. సెల్ఫీల కోసం ముందు భాగంలో 32ఎంపీ కెమెరా ఇచ్చారు. వినియోగదారుల కళ్ల భద్రత కోసం ఐ కంఫర్ట్ మోడ్ తో పాటు టీయూవీ రైన్ లాండ్ సర్టిఫికేషన్, ఎస్ జీ ఎస్ సర్టిఫికేషన్ కూడా పొందింది.

## తిరుగులేని బ్యాటరీ సామర్థ్యం

బ్యాటరీ విషయానికి వస్తే 7,200ఎంఏహెచ్ సామర్థ్యం గల బ్యాటరీ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 14.5 గంటల నావిగేషన్, 40 గంటల వీడియో ప్లేబ్యాక్ లేదా 93 గంటల మ్యూజిక్ ప్లేబ్యాక్ అందిస్తుంది. 44డబ్ల్యూ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం వల్ల బ్యాటరీ వేగంగా ఛార్జ్ అవుతుంది. దుమ్ము, నీటి నుంచి రక్షణ కోసం అత్యున్నత ఐపీ68, ఐపీ69 రేటింగ్ లతో రావడం వల్ల ఈ ఫోన్ ఎంతో పటిష్టంగా ఉంటుంది.

## ధర, లభ్యత వివరాలు

వివో టీ5ఎక్స్ మూడు వేర్వేరు వేరియంట్లలో లభిస్తోంది. 6జీబీ ప్లస్ 128జీబీ మోడల్ ధర రూ.18,999 కాగా, 8జీబీ ప్లస్ 128జీబీ ధర రూ.20,999 అలాగే 8జీబీ ప్లస్ 256జీబీ ధరను రూ.22,999గా నిర్ణయించారు. మార్చి 24 నుంచి ఫ్లిప్ కార్ట్, వివో స్టోర్లలో సైబర్ గ్రీన్, స్టార్ సిల్వర్ రంగుల్లో ఇవి కొనుగోలుకు అందుబాటులో ఉంటాయి. హెచ్ డీ ఎఫ్ సీ, యాక్సిస్, ఎస్ బీ ఐ కార్డుల ద్వారా కొంటే రూ.2 వేల వరకు తగ్గింపు లభిస్తుంది. ఆరు నెలల నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. అలాగే రూ.1,199 జియో ప్రీపెయిడ్ ప్లాన్ తో ఆరు నెలల పాటు 10 ఓటీటీ ప్లాట్ ఫాంల ప్రీమియం సదుపాయాన్ని కంపెనీ అందిస్తోంది.

# ఆరోగ్యం.. కాపాడుకుందాం!

## తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో దంచికొడుతున్న ఎండలు



- మార్చి సగంలోనే 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- రామగుండం, ఖమ్మం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో తీవ్ర స్థాయికి వేడి
- వడదెబ్బ బారి నుంచి రక్షించే చలువ పానీయాలు, పండ్లు
- మసాలాలు, వేపుళ్లకు పూర్తిగా దూరంగా ఉండాలంటున్న నిపుణులు
- జీవనశైలిలో చిన్నపాటి మార్పులతో వేసవిని సులభంగా జయించే మార్గాలు

రెండు తెలుగు రాష్ట్రాలను ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భానుడు తీవ్ర ప్రతాపం చూపుతున్నాడు. రామగుండం, ఖమ్మం, నల్గొండ, భద్రాచలం, విజయవాడ, గుంటూరు, కర్నూలు లాంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అమాంతం పెరిగిపోతున్నాయి. మార్చి నెల సగంలోనే ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటి నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. భానుడి భగభగలకు శరీరం త్వరగా అలిసిపోతుంది. చెమట రూపంలో శరీరంలోని నీరంతా బయటకు వెళ్లిపోయి తీవ్రమైన నీరసం ఆవహిస్తుంది. ఇలాంటి ఎండాకాలంలో కేవలం బయట తిరగకుండా ఉండటమే కాదు.. మనం తీసుకునే ఆహారం విషయంలోనూ ఎన్నో జాగ్రత్తలు పాటించాలి. సరైన ఆహార నియమాలతోనే వడదెబ్బ బారి నుంచి ప్రాణాలను కాపాడుకోగలం.







**ఫీచర్స్ డెస్క్ - మనసులో మాట**

ఎండాకాలంలో గొంతు ఎండిపోకుండా చూసుకోవడం అత్యంత ప్రధానం. దాహం వేసినా వేయకపోయినా ప్రతి అరగంటకోసారి గుక్కెడు నీళ్ల తాగుతూ ఉండాలి. మంచు పెట్టెలో పెట్టిన అతి చల్లటి నీళ్ల కన్నా, మట్టి కుండలో సహజంగా చల్లబడిన నీళ్లు ఆరోగ్యానికి అమృతంతో సమానం. కుండ నీరు గొంతు తడపడమే కాకుండా వడదెబ్బ తగలకుండా శరీరాన్ని లోపలి నుంచి చల్లబరుస్తుంది. ఎండలోకి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా నీళ్ల సీసా వెంట తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలి. ఉదయం నిద్రలేవగానే కనీసం 2 గ్లాసుల గోరువెచ్చని నీళ్లు తాగడం వల్ల శరీరంలోని వ్యర్థాలు సులభంగా బయటకు పోతాయి.

### ప్రకృతి ప్రసాదించిన చలువ పానీయాలు

శరీరంలో వేడిని తగ్గించడానికి రంగులతో కూడిన రసాయనిక శీతల పానీయాల జోలికి అస్సలు వెళ్లకూడదు. వాటి స్థానంలో మన ఇంట్లో దొరికే పలుచటి మజ్జిగ, నిమ్మరసం, రాగి జావ, సబ్జా గింజల నీళ్లు తీసుకోవాలి. ముఖ్యంగా కొబ్బరి నీళ్లు ఖనిజ లవణాలను అందించి తక్షణ శక్తిని ఇస్తాయి. పుదీనా, నన్నారి షర్బత్ లాంటివి తాగడం వల్ల ఎండల వల్ల వచ్చే అలసట దరిచేరదు. రోజుకు కనీసం 2 లేదా 3 గ్లాసుల పలుచటి మజ్జిగ తాగడం వల్ల పొట్టలో మంట తగ్గి జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఉప్పు, నిమ్మకాయ కలిపిన నీళ్లు తాగితే చెమట ద్వారా కోల్పోయిన లవణాలు తిరిగి శరీరానికి అందుతాయి.

### ఎండను తరిమికొట్టే అమృత ఫలాలు

వేసవిలో దొరికే పండ్లలో నీటి శాతం ఎక్కువగా ఉంటుంది. పుచ్చకాయ, కర్బూజ, కీరదోస లాంటివి రోజూ ఆహారంలో భాగం చేసుకోవాలి. లేత తాటి ముంజలు వేసవి తాపాన్ని అద్భుతంగా తగ్గిస్తాయి. వీటిని తినడం వల్ల శరీరానికి చలువ చేయడమే కాకుండా ఎండల వల్ల వచ్చే అనారోగ్యాలు దూరమవుతాయి. మామిడి పండ్లను కూడా మితంగా తీసుకుంటే మంచిదే. ఈ పండ్లను రసంగా మార్చి తాగే కన్నా, నేరుగా ముక్కలు కోసుకుని తినడం వల్ల శరీరానికి అవసరమైన పీచు పదార్థం పుష్కలంగా అందుతుంది. జామ, బొప్పాయి లాంటి పండ్లు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

### కూరగాయలు, ఆకుకూరల ప్రాధాన్యం

వేసవి కాలంలో మన జీర్ణవ్యవస్థ కాస్త నెమ్మదిగా పనిచేస్తుంది. అందుకే త్వరగా అరిగే ఆహారం తీసుకోవాలి. సొరకాయ, బీరకాయ, పొట్లకాయ, బూడిద గుమ్మడి లాంటి నీటి శాతం ఎక్కువగా ఉండే కూరగాయలను వండుకోవడం ఉత్తమం. వీటివల్ల పొట్ట ఎంతో తేలికగా ఉంటుంది. అలాగే తోటకూర, పాలకూర, గోంగూర లాంటి ఆకుకూరలను రోజూవారీ భోజనంలో చేర్చుకోవాలి. వీటి ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు అందుతాయి. కడుపులో చల్లగా ఉండేలా పచ్చి కూరగాయ ముక్కలను భోజనానికి ముందు తినడం ఎంతో మేలు చేస్తుంది.

వీటికి ఎంత దూరం ఉంటే అంత మంచిది

వేసవిలో కారం, మసాలాలు దట్టించిన ఆహార పదార్థాలకు పూర్తిగా దూరం ఉండాలి. నూనెలో వేయించిన వేపుళ్లు, బయటి తిండ్లు, మాంసాహారం జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. తద్వారా శరీరంలో ఉష్ణోగ్రత అమాంతం పెరుగుతుంది. టీ, కాఫీలు ఎక్కువగా తాగడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోయి ప్రమాదకర స్థితికి చేరే అవకాశం ఉంది. పచ్చళ్లు, నిల్వ ఉంచిన ఆహార పదార్థాల కంటే ఎప్పటికప్పుడు తాజాగా వండుకున్న తేలికపాటి ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. మైదాతో చేసిన వస్తువులను పిల్లలకు కూడా వీలైనంత వరకు పెట్టకపోవడమే మంచిది.

### జీవనశైలిలో చిన్న మార్పులు.. ఎంతో మేలు

ఎండాకాలంలో ఆహారం తీసుకునే సమయాల్లో మార్పులు రాకుండా చూసుకోవాలి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది కాబట్టి, ఆ సమయంలో బయట తిరగకపోవడమే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలపాగా చుట్టుకోవడం, కళ్లకు అద్దాలు పెట్టుకోవడం, లేత రంగులో ఉండే వదులైన నూలు వస్త్రాలు ధరించడం అలవాటు చేసుకోవాలి. రాత్రి పూట త్వరగా నిద్రపోయి రోజుకు కనీసం 7 నుంచి 8 గంటల పాటు కంటినిండా నిద్రపోయేలా జాగ్రత్త పడితే వేసవి కష్టాలను సులభంగా జయించవచ్చు.

# ఉక్కపోతతో ఉక్రోషం.. ఎండలతో అసహనం

## శారీరక ఆరోగ్యంతో పాటే మానసిక ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం




రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. మన ఆదిలాబాద్, రామగుండం, ఖమ్మం, భద్రాచలం ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, గుంటూరు లాంటి చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోతున్నాయి. వేసవి కాలం రాగానే శారీరక ఆరోగ్యం గురించి మాత్రమే అందరూ ఆలోచిస్తారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్త పడతారు. చల్లటి పానీయాలు తాగుతారు. కానీ, ఈ ఉక్కిరిబిక్కిరి చేసే వేడి మన మానసిక ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని చాలామందికి తెలియదు. వాతావరణంలో ఉష్ణోగ్రతలు పెరిగే కొద్దీ మనుషుల్లో కోపం, అసహనం అమాంతం పెరిగిపోతాయని వైద్య నిపుణులు, మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**ఫీచర్స్ డెస్క్ - మనసులో మాట**

వేడి వాతావరణంలో మన శరీరం చల్లబడటానికి తీవ్రంగా శ్రమిస్తుంది. గుండె వేగంగా కొట్టుకుంటుంది. చెమట ఎక్కువగా పడుతుంది. ఈ శారీరక శ్రమను మన మెదడు ఒక రకమైన ఒత్తిడిగా భావిస్తుంది. దీనివల్ల శరీరంలో ఒత్తిడిని పెంచే రసాయనాలు (హార్మోన్లు) విడుదలవుతాయి. ఫలితంగా ఏ కారణం లేకుండానే చిన్న చిన్న విషయాలకే విపరీతమైన కోపం వస్తుంది. ఏ పనిపైనా ఏకాగ్రత కుదరదు. ఎప్పుడూ ఒక రకమైన చిరాకు ప్రదర్శిస్తుంటారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో ఈ అసహనం తారాస్థాయికి చేరుకుంటుంది.

### నిద్రలేమితో అసహనం

పగలు ఎండ భగభగలాడితే.. రాత్రిళ్లు ఉక్కపోత ప్రాణాలు తీస్తుంది. ఇళ్లలో ఫ్యాన్లు తిరుగుతున్నా వేడి గాలే వస్తుంది. ఇలాంటి వాతావరణంలో నిద్ర పట్టడం గగనంగా మారుతుంది. సరిపడా నిద్ర లేకపోవడం మానసిక ఆరోగ్యంపై నేరుగా దెబ్బకొడుతుంది. రాత్రి కనీసం 7 లేదా 8 గంటలు ప్రశాంతంగా నిద్రపోకపోతే, మరుసటి రోజు ఉదయం తీవ్రమైన బద్ధకం, అలసట ఆవహిస్తాయి. ఎదుటివారు ఏ చిన్న మాట అన్నా తట్టుకోలేక వారిపై అరుస్తుంటారు. చిన్న పిల్లలైతే నిద్రలేమి వల్ల మరింత ఎక్కువగా ఏడుస్తూ మారాం చేస్తుంటారు.

### నీటి కొరతతో గందరగోళం

ఎండాకాలంలో చెమట రూపంలో శరీరంలో నీటి శాతం వేగంగా పడిపోతుంది. మెదడు చురుగ్గా పనిచేయడానికి ప్రాణవాయువుతో పాటు నీరు కూడా చాలా అవసరం. సరైన మోతాదులో నీళ్లు తాగకపోతే ఆలోచనా శక్తి నెమ్మదిస్తుంది. దీనివల్ల ఆఫీసు పనుల్లో, వ్యక్తిగత జీవితంలో తీసుకునే నిర్ణయాల్లో గందరగోళం

- వాతావరణంలో వేడి పెరిగే కొద్దీ మనుషుల్లో పెరిగిపోతున్న అసహనం
- నిద్రలేమి, నీటి కొరతతో మెదడుపై తీవ్ర ఒత్తిడి
- కుటుంబ సభ్యులు, సహోద్యోగులతో విభేధాలకు దారితీస్తున్న వైనం
- మానసిక ప్రశాంతత కోసం నిపుణులు సూచిస్తున్న సులువైన మార్గాలు

ఏర్పడుతుంది. పనులు సరిగ్గా జరగకపోవడంతో చాలామంది తమపై తామే కోపం తెచ్చుకుంటారు. ఆ కోపాన్ని తమ ప్రమేయం లేకుండానే పక్కవారిపై చూపిస్తుంటారు.

### బంధాలపై ప్రతికూల ప్రభావం

ఈ వేడి కోపం వల్ల ఆఫీసుల్లో తోటి ఉద్యోగులతో, ఇళ్లలో కుటుంబ సభ్యులతో తరచూ వాదనలు జరుగుతుంటాయి. ట్రాఫిక్ లో వెళ్లేటప్పుడు ఇతర వాహనదారులతో రోడ్ల మీద ఘర్షణకు దిగడం వేసవిలో ఎక్కువగా కనిపిస్తుంది. మండుటెండలో ప్రయాణించి ఇంటికి రాగానే, ఇంట్లో వాళ్లు ఏదైనా చిన్న మాట అడిగినా ఏమాత్రం సహనం లేకుండా అరవడం లాంటివి ఈ ఉష్ణోగ్రతల ప్రభావమే అని గ్రహించాలి. ఇది కేవలం మీ తప్పు కాదని, వాతావరణం తీసుకొచ్చిన మార్పు అని అర్థం చేసుకుంటే సగం సమస్య తీరిపోతుంది.

### ప్రశాంతత కోసం ఇలా చేయండి

ఎండల వల్ల వచ్చే కోపాన్ని జయించడానికి శరీరాన్ని, మనసును రెండు విధాలా చల్లగా ఉంచుకోవాలి. రోజంతా కనీసం 3 నుంచి 4 లీటర్ల నీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తాగుతూ ఉండాలి. కోపం వస్తున్నట్లు అనిపించిన వెంటనే గొడవకు దిగకుండా ఒక గ్లాసు చల్లటి నీళ్లు తాగి, నెమ్మదిగా శ్వాస పీల్చుకుని వదలాలి. వీలైతే రోజుకు 2 సార్లు చన్నీటి స్నానం చేయడం వల్ల శరీరం, మనసు రెండూ తేలికపడతాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోకపోవడం, ఆర్థికపరమైన వాదనలకు దూరంగా ఉండటం ఎంతో మేలు చేస్తుంది. ప్రతిరోజూ ఉదయం 10 నిమిషాల పాటు ధ్యానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

# ఎండల్లో అతివల అవస్థలు

## ప్రయాణాలంటేనే ప్రాణసంకటం!



- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు
- కనీస సౌకర్యాలు లేక నీళ్లు తాగేందుకు జంకు
- పొంచి ఉన్న మూత్రనాళాల వ్యాధుల ముప్పు
- తప్పనిసరిగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

**ఫీచర్స్ డెస్క్ - మనసులో మాట**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. ఎండల తీవ్రతకు సామాన్యులు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. పనులు, ఉద్యోగాల నిమిత్తం రోజూ ప్రయాణాలు చేసే మహిళల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఎండ తీవ్రతకు తోడు, కనీస సౌకర్యాలు లేకపోవడంతో వారు అడుగడుగునా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### సౌకర్యాల లేమి.. అనారోగ్య ముప్పు

గంటల తరబడి బస్సుల కోసం సరైన నీడలేని చోట నిలబడటం మహిళలకు నరకాన్ని తలపిస్తుంది. దీనికి తోడు ప్రయాణాల్లో వారు ఎదుర్కొనే అతిపెద్ద సమస్య సరైన ప్రజా మరుగుదొడ్లు లేకపోవడం. ఉన్నవి కూడా కనీస పరిశుభ్రతతో ఉండవు. ఆ భయంతో చాలామంది మహిళలు నీళ్లు తాగడం బాగా తగ్గించేస్తారు. ఈ ఎండలకు శరీరంలో నీటి శాతం వేగంగా పడిపోవడంతో పాటు, తగినన్ని నీళ్లు తాగకపోవడం వల్ల మూత్రనాళాల వ్యాధులు తీవ్రంగా బాధిస్తాయి. ఉక్కపోతకు గురై వడదెబ్బ బారిన పడటంతో పాటు చర్మ సమస్యలు కూడా ఎక్కువగా వేధిస్తుంటాయి.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఎండల్లో ప్రయాణించే మహిళలు కచ్చితంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దాహం వేసినా వేయకపోయినా వెంట ఒక నీళ్ల సీసా ఉంచుకుని కొద్దికొద్దిగా తాగుతూనే ఉండాలి. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు వాడటం, ఎండ తగలకుండా ముఖం కవర్ అయ్యేలా ఒక నూలు వస్త్రం చుట్టుకోవడం మంచిది. వదులుగా ఉండే లేత రంగు నూలు దుస్తులనే ధరించాలి. ప్రయాణాల్లో ఉన్నప్పుడు నిమ్మకాయ నీళ్లు, కొబ్బరి నీళ్లు లాంటివి సేవిస్తే వడదెబ్బ నుంచి తప్పించుకోవచ్చు. గర్భిణులు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకపోవడమే ఉత్తమం.



# మాల్దీవ్స్ టు నెట్స్

## ఐపీఎల్ కోసం రంగంలోకి ముంబై దిగ్గజం..!

**ముంబై:** పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ కోసం రోహిత్ శర్మ సిద్ధమవుతున్నాడు. రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి మాల్దీవ్స్ లో వెకేషన్‌లో సరదాగా గడిపిన రోహిత్.. స్వదేశం వస్తూనే నేరుగా ముంబై స్క్వాడ్‌తో కలిశాడు. మంగళవారం సహచరులు, కోచ్ మహేల జయవర్ధనేతో కాసేపు ముచ్చటించిన హిట్‌మ్యాన్.. కిట్ బ్యాగ్‌తో మైదానంలోకి దిగాడు. నెట్స్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్.. ప్రాక్టీస్ చేసిన రోహిత్ ఐపీఎల్‌లో రఫ్ఫాడించాలనే కసితో ఉన్నాడు. ఐపీఎల్ దిగ్గజ కెప్టెన్లలో ఒకడైన రోహిత్ శర్మ మరో సీజన్‌కు రెఢీ అవుతున్నాడు. గత సీజన్‌లో దంచేసిన హిట్‌మ్యాన్ (15 మ్యాచుల్లో 418 పరుగులు) ఈసారీ శుభారంభాలు ఇవ్వాలనే కసితో ఉన్నాడు. మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిసిన రోహిత్ వెంటనే బ్యాటింగ్ ప్రాక్టీస్ మొదలెట్టాడు. శార్దూల్ ఠాకూర్, ఇతర ముంబై బౌలర్లను కాచుకున్న అతడు.. డిఫెన్స్, భారీ షాట్లు సాధన చేశాడు. అనంతరం సహచరులతో కలిసి ఫీల్డింగ్ చేశాడు. మొన్నటి వరకూ టీ20 ప్రపంచకకప్ అంబాసిడర్‌గా మైదానాల్లో సందడి చేసిన రోహిత్.. కాస్త బ్రేక్‌లో మాల్దీవ్స్‌లో కుటుంబంతో కలిసి సేదతీరాడు. ఐపీఎల్‌కు కౌంట్‌డౌన్ తన కెప్టెన్సీలో ముంబైని ఐదుసార్లు (2013, 2015, 2017, 2019, 2020) ముంబైని ఛాపియన్‌గా నిలిపిన రోహిత్.. గత రెండేళ్లుగా హార్దిక్ పాండ్యా సారథ్యంలో ఆడుతున్నాడు.



# ముంబై మహిళల టీ20 లీగ్‌కు వేళాయె

**ముంబై :** ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) మరో వినూత్న ఆలోచనతో ముందుకొచ్చింది. ఇప్పటికే పురుషుల టీ20 లీగ్ ద్వారా దేశ వ్యాప్తంగా దృష్టిని ఆకర్షించిన ఎమ్‌సీఏ తాజాగా తొలిసారి మహిళల లీగ్‌కు సిద్ధమైంది. దేశంలో మహిళల క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుంటూ ఎమ్‌సీఏ అరంగేట్రం టీ20 లీగ్ ద్వారా ప్రతిభ కల్గిన ప్లేయర్లను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగా సోమవారం రెండు టోర్నీలకు సంబంధించిన ట్రోఫీలను టీమ్‌ఇండియా స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ ఆవిష్కరించాడు. ఈ కార్యక్రమంలో ముంబై క్రికెటర్ సయాలీ సత్ఘరెతో పాటు ఎమ్‌సీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్, అశిష్ షెలార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ 'క్రికెట్ అభివృద్ధి కోసం ఎమ్‌సీఏ చేస్తున్న కార్యక్రమాలపై సంతోషంగా ఉన్నాను. కేవలం ఐపీఎల్ ద్వారానే కాకుండా టీ20 ముంబై లీగ్ ద్వారా మరింత మంది యువ ప్లేయర్లకు అవకాశం కల్పిస్తున్నది. ముంబై టీ20 లీగ్‌లో ఆడిన ప్లేయర్లలో చాలా మంది ఐపీఎల్‌తో పాటు జాతీయ జట్టులో ప్రాతినిధ్యం వహిస్తున్నారు' అని అన్నాడు.





# మానసికంగా కుంగిపోయా!

**ఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్ సంజు శాంసన్ తన కెరీర్, లక్ష్యాల గురించి భావోద్వేగ వ్యాఖ్యలు చేశాడు. భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించడం తన చిన్ననాటి కల అని, దాన్ని నిజం చేసుకోవడానికి ఎన్నో సంవత్సరాలు కృషి చేశానని తెలిపాడు. వరల్డ్ కప్ లక్ష్యాన్ని సాధించాలనే కోరిక తన మనసులో ఎప్పుడూ ఉండేదని, దాన్ని ప్రతిరోజూ ఊహించుకుంటూ ధ్యానం చేసేవాడినని వెల్లడించాడు. తన క్రికెట్ ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయని పేర్కొన్నాడు. కెరీర్‌లో విజయాల కంటే పరాజయాలే ఎక్కువ అని, ఓ సమయంలో మానసికంగా కుంగిపోయా అని సంజు చెప్పుకొచ్చాడు. తాజాగా సంజు శాంసన్ మాట్లాడుతూ... '2019లో ఐదు సంవత్సరాల గ్యాప్ తర్వాత తిరిగి జట్టులోకి వచ్చా. ఆ సమయంలో కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ నాతో మాట్లాడాడు. జట్టులోకి వచ్చాక నీ లక్ష్యం ఏంటి? అని

- విజయాల కంటే పరాజయాలే ఎక్కువ
- వరల్డ్ కప్ నా చిన్ననాటి కల
- ఎన్నో సంవత్సరాలు కష్టపడ్డా
- సంజు భావోద్వేగ వ్యాఖ్యలు!

అడిగాడు. నేను ఎలాంటి సందేహం లేకుండా భారత్‌కు వరల్డ్ కప్ అందించడమే నా టార్గెట్ అని చెప్పా. అప్పటి నుంచి 2026 వరకూ అదే లక్ష్యంతో కృషి చేశా. నా ప్రయాణంలో ఎన్నో అడ్డంకులు, వైఫల్యాలు ఎదురయ్యాయి. చిన్నప్పటి నుంచి ఎన్నోసార్లు కిందికి పడిపోయా. విజయాల కంటే పరాజయాలే ఎక్కువగా చూశా. అందుకే వైఫల్యాలను ఎలా ఎదుర్కోవాలో నాకు బాగా తెలుసు. అదే నా బలం'అని వివరించాడు. 'వరల్డ్ కప్ 2026 ముందు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నా. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో విఫలమయ్యా. ఆ సమయంలో నేను మానసికంగా కుంగిపోయా. కానీ నాలుగు ఐదు రోజుల్లోనే తిరిగి లేచి నిలబడగలిగా. నాలో ఉన్న పట్టుదలే మళ్లీ విజయాల దిశగా నడిపించింది. చివరకు భారత జట్టుకు వరల్డ్ కప్ గెలిపించాలనే కల నెరవేరింది. నా జీవితంలో చివరి శ్వాస వరకు ఇది గుర్తుంటుంది' అని సంజు శాంసన్ భావోద్వేగంగా వెల్లడించాడు. 2026 టీ20 ప్రపంచ కప్‌లో ఆడిన 5 మ్యాచుల్లో 3 హాఫ్ సెంచరీలు చేసి.. 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా సంజు నిలిచాడు.

# టీ20ల్లో అమేలియా కొత్త చరిత్ర

## అత్యంత వేగంగా వెయ్యి పరుగులు, వంద వికెట్లతో రికార్డు..!

**ఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ క్రికెటర్ అమేలియా కేర్ చరిత్ర సృష్టించింది. స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ద్వైపాక్షిక సిరీస్‌లో చెలరేగిపోతున్న కివీస్ కెప్టెన్ రెండో టీ20 మ్యాచ్‌లో వందో వికెట్ సాధించింది. తద్వారా టీ20ల్లో ఆమె అరుదైన మైలురాయిని అధిగమించింది. పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు బాదేసి, వందకు పైగా వికెట్లు తీసిన మహిళా క్రికెటర్‌గా అమేలియా అవతరించింది. ఈ ఆల్‌రౌండర్ 94వ ఇన్నింగ్స్‌లోనే ఈ ఫీట్ సొంతం చేసుకుంది. తద్వారా ఈ ఫార్మాట్‌లో అత్యంత వేగంగా వెయ్యికి పైగా పరుగులు, వందకు పైగా వికెట్లతో చరిత్ర లిఖించిందీ డాషింగ్ బ్యాటర్. మొత్తంగా.. తమ దేశం నుంచి ఈ ఘనత సాధించిన మూడో క్రికెటర్ తనే. ఆమె కంటే ముందు సోఫీ డెవినె, మిచెల్ శాంట్నర్ ఈ మార్క్ అందుకున్నారు.

### క్యారీ చాన్.. 74 ఇన్నింగ్స్‌ల్లోనే

ఓవరాల్‌గా చూస్తే.. అసోసియేట్ నేషన్స్ క్రికెటర్ క్యారీ చాన్ 74 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మైలురాయిని దాటింది. పురుషుల క్రికెట్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఈ వెటరన్ ఆటగాడు 84 ఇన్నింగ్స్‌ల్లో వెయ్యికి పైగా రన్స్, వందకు పైగా వికెట్లు సాధించాడు. మహిళా క్రికెటర్ల పరంగా చూసుకుంటే... దీప్తి శర్మ (భారత్), నిడా దార్(పాకిస్థాన్), ఎలీసా పెర్రీ(ఆస్ట్రేలియా), సోఫీ డెవినె(న్యూజిలాండ్), హీలీ మాథ్యూస్(వెస్టిండీస్)లు ఈ క్లబ్‌లో ఉన్నారు.




# ఆస్పత్రిపై దాడి యుద్ధ నేరమే: రషీద్ ఖాన్





**బాగ్దాద్:** ఆఫ్ఘనిస్తాన్‌లో ఓ డ్రగ్స్ చికిత్సాలయంపై సోమవారం రాత్రి పాకిస్థాన్ ఆకస్మిక దాడి చేసింది. ఆ దాడి వల్ల కాబూల్‌లోని ఆస్పత్రిలో 400 మంది మృతిచెందగా, మరో 250 మంది గాయపడ్డారు. డ్రగ్ రిహాబిలిటేషన్ ఆస్పత్రిపై రాత్రి 9 గంటలకు దాడి జరిగినట్లు ఆఫ్ఘన్ ప్రభుత్వ ప్రతినిధి హమ్‌దుల్లా ఫిత్రత్ తెలిపారు. అయితే ఈ ఘటన పట్ల ఆఫ్ఘన్ క్రికెటర్ రషీద్ ఖాన్ స్పందించారు. పాక్ మిలిటరీ చర్యను ఆయన ఖండించారు. పాకిస్థాన్ వైమానిక దాడుల వల్లే ప్రాణనష్టం జరిగినట్లు ఆ క్రికెటర్ చెప్పారు. పవిత్రమైన రంజాన్ మాసం సమయంలో ఈ దాడి జరగడం దారుణమన్నారు. తన ఎక్స్ అకౌంట్‌లో రషీద్ ఖాన్ రియాక్ట్ అయ్యారు.

సాధారణ పౌరులు చనిపోవడం బాధగా ఉన్నట్లు చెప్పారు. ఇండ్లను, విద్యా సంస్థలను, వైద్య కేంద్రాలను కావాలని లేదా అనుకోకుండా అటాక్ చేసినా అది యుద్ధ నేరమే అవుతుందని రషీద్ పేర్కొన్నారు. రంజాన్ పవిత్ర మాసం వేళ మనుషుల ప్రాణాలు విలువ ఇవ్వకుండా వ్యవహరిస్తున్న తీరు తీవ్రంగా కలచివేస్తున్నట్లు చెప్పారు. దీని వల్ల వైరం, ద్వేషం పెరుగుతుందన్నారు. ఐక్యరాజ్యసమితి, ఇతర మానవ హక్కుల సంఘాలు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టాలని కోరారు. నిందితులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి కష్ట సమయంలో ఆఫ్ఘన్ ప్రజలకు అండగా ఉండనున్నట్లు చెప్పారు.




# వివాదంలో సర్కే చునర్ తేరీ సాంగ్

కన్నడ నటుడు ధ్రువ సర్జా కథానాయకుడిగా ప్రేమ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న పాన్-ఇండియా చిత్రం 'ఐఅ: ది డెవిల్' భారీ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలోని 'సర్కే చునర్ తేరి సర్కే' అనే స్పెషల్ సాంగ్ అశ్లీలంగా ఉందంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ పాటపై నిషేధం విధించాలని కోరుతూ ముంబైకి చెందిన ప్రముఖ న్యాయవాది వినీత్ జిందాల్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్‌తో పాటు సమాచార ప్రసార మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశాడు. ఈ పాటలోని సాహిత్యం మరియు దృశ్యాలు అత్యంత అశ్లీలంగా, అసభ్యకరంగా ఉన్నాయని, ముఖ్యంగా మైనర్లకు హాని కలిగించే విధంగా ఉన్నాయని జిందాల్ తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. యూట్యూబ్ మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో విచ్చలవిడిగా ప్రచారంలో ఉన్న ఈ పాట, పబ్లిక్ డెన్సీని దెబ్బతీసేలా ఉందని ఆరోపించారు. ఈ పాటలో ఉపయోగించిన పదజాలం మరియు నృత్య రీతులు రెచ్చగొట్టేలా ఉన్నాయని, ఇది సమాజంలో అసభ్యతను ప్రోత్సహిస్తుందని జిందాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పాటకు సాహిత్యం రాసిన రాకీబ్ ఆలం, దర్శకుడు ప్రేమ్, సంగీత దర్శకుడు అర్జున్ జన్య మరియు గాయని మంగ్లీ వంటి వారిని కూడా ఈ ఫిర్యాదులో ప్రస్తావించాడు. ఇప్పటికే ఈ అంశంపై ఢిల్లీ పోలీస్ సైబర్ సెల్‌లో కూడా విడిగా క్రిమినల్ ఫిర్యాదు నమోదైందని, పిల్లల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నుండి ఈ పాటను వెంటనే తొలగించాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు.






# వ్యక్తిగత జీవితీలపై కెమెరాల కన్ను

## ముంబై నుంచి చెన్నైకి పాకిన జాడ్యం

## విజయ్, త్రిషల వ్యవహారంపై ఖుష్బూ

విజయ్, త్రిషల గురించి కొన్ని రోజులుగా వస్తోన్న వార్తలపై నటి ఖుష్బూ మరోమారు స్పందించారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి మాట్లాడుతూ.. ఆమె చాలా హుందాగా ఉంటుందన్నారు. తెలియని వారు చేసే కామెంట్స్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. 'ప్రస్తుతం మనం ఎలాంటి రోజుల్లో ఉన్నామంటే.. ఎవరైనా తుమ్మినా వాళ్లను నిందించేస్తున్నాం. ఇది చాలా దురదృష్టకరం. నాకు విజయ్, త్రిష ఇద్దరూ బాగా తెలుసు. ముఖ్యంగా త్రిష నాకు చాలా సన్నిహితురాలు. నాకు తెలిసిన గొప్ప మహిళల్లో తను ఒకరు. ఎంతో మృదుస్వభావి అని చెప్పారు. ఇక రూమర్స్ సృష్టించేవారు, ఫొటో గ్రాఫర్లను ఉద్దేశించి ఖుష్బూ మాట్లాడుతూ.. ఈ ఫొటోగ్రాఫర్లు ప్రతిచోటా సెలబ్రిటీల వెనకపడటం అనేది ముంబయిలో చూస్తుంటాం. ఇప్పుడు ఆ సంస్కృతి చెన్నైలో కూడా మొదలవడం బాధాకరం. ఎదుటివారి వ్యక్తిగత జీవితాల గురించి కామెంట్స్ చేసేవారు.. తమ సమస్యల కంటే ఇతరుల జీవితాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికే ఇష్టపడతారు. ఒకరి గురించి తప్పుగా మాట్లాడుతూ వారు ఒక రకమైన పైశాచిక ఆనందాన్ని పొందుతుంటారు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో 99.9 శాతం మంది ఎవరో కూడా మనకు తెలియదు. అలాంటివారు చేసే వ్యాఖ్యలకు స్పందిస్తూ మన విలువైన సమయాన్ని వృథా చేసుకోవాల్సిన అవసరం లేదని నేను భావిస్తున్నాను అని ఖుష్బూ అన్నారు. ఇటీవల కూడా ఖుష్బూ వీరిద్దరి గురించి మాట్లాడారు. 'ఈ వ్యవహారంతో ప్రజలకు ఏం సంబంధం ఉందో నాకు అర్థంకావట్లేదు. అది వారి వ్యక్తిగతం. దీనిని ఎందుకు పెద్ద విషయంలా చూస్తున్నారు?' అని పేర్కొన్నారు.

# గాడ్ ఫాదర్ దర్శకుడితో పవన్ మూవీ అంటూ ప్రచారం



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎంగా తన రాజకీయ బాధ్యతలను నిర్వర్తిస్తూనే, మరోవైపు సినిమాలను కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. ఈ క్రమంలో సోషల్ మీడియాలో ఆయన కొత్త ప్రాజెక్టుల గురించి ఏదో ఒక వార్త హల్చల్ చేస్తూనే ఉంది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో దర్శకుడు మోహన్ రాజా, పవన్ కళ్యాణ్ కాంబినేషన్‌లో ఒక భారీ సినిమా రాబోతుందంటూ వినిపించిన వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ అయ్యాయి. పవర్ స్టార్‌తో సినిమా గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టమైంది. పవన్ నెక్స్ట్ లైనప్‌లో ఉన్న సినిమాల్లో ఓజీ సీక్వెల్ లేదా ప్రీక్వెల్‌తో పాటు హరిహర వీరమల్లు పార్ట్ 2 కూడా ఉంది. అలాగే.. సురేందర్ రెడ్డితో ఓ సినిమా చేయబోతున్నారు. నెక్స్ట్ పవన్ నుంచి ఇమ్మీడియేట్‌గా సెట్స్ పైకి వెళ్లనున్న సినిమా సురేందర్ రెడ్డిదే. ఓజీ, వీరమల్లు సీక్వెల్స్ ఎప్పుడు ఉంటాయనే విషయంలో మాత్రం క్లారిటీ లేదు. ప్రస్తుతానికైతే.. పవన్ కళ్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది.

# చిరంజీవితో తప్పకుండా ఓ సినిమా చేస్తా

## ఉస్తాద్ ప్రమోషన్‌లో హరీష్ శంకర్



ఈ ఉగాదికి 'ఉస్తాద్ భగత్ సింగ్'తో పవన్ కళ్యాణ్ అభిమానుల్లో జోష్ నింపనున్నారు దర్శకుడు హరీశ్ శంకర్. పవన్ హీరోగా ఆయన తెరకెక్కించిన ఈ సినిమా 19న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో వరుస ఇంటర్వ్యూలతో బిజీగా ఉన్నారు హరీశ్. తాజాగా ఆయన చిరంజీవి గురించి మట్లాడారు. ఈ ట్రైలర్ చూసి చిరంజీవి నాతో 20 నిమిషాలు మాట్లాడారు. డైలాగులు బాగున్నాయన్నారు. పవన్ చాలా అందంగా ఉన్నారని ఆనందంగా చెప్పారు. ఆ ఫోన్ పెట్టేశాక నాకు ఓ విషయం అర్థమైంది. చిరంజీవికి పవన్ కల్యాణ్ తమ్ముడు మాత్రమే కాదు.. కొడుకు కూడా అనిపించింది. ప్రతి షాట్ గురించి చెబుతూ ఆయన మురిసిపోయారు. నేను చిరంజీవిని చాలాసార్లు కలిశాను. ఆయనతో కొన్ని యాడ్ ఫిల్మ్‌లు తీశాను. ఆయనతో నా సినిమా ప్రాసెస్‌లో ఉంది. కచ్చితంగా మెగాస్టార్‌తో ఒక 'రౌడీ అల్లుడు', 'దొంగ మొగుడు', 'గ్యాంగ్ లీడర్' లాంటి సినిమా చేసి తీరతాను' అని హరీశ్ చెప్పారు. పవన్‌కల్యాణ్ గొప్ప వ్యక్తి. 16 ఏళ్ల కుర్రాడిగా ఉన్నప్పటినుంచే సమాజం గురించి ఆలోచించేవారు. అందుకే ప్రతి విషయం పైనా స్పందిస్తారు. రాజకీయాల్లోకి వచ్చారు కాబట్టి జాతీయ సమైక్యత, సనాతన ధర్మం గురించి మాట్లాడుతున్నారని అందరూ అనుకుంటారు. కానీ, ఆయన ఖుషిలో 'యే మేరా జహాన్..' బద్రిలో 'ఐయామ్ యాన్ ఇండియన్' బాలులో 'ఇంతే ఇంతింతే సాంగ్' ఆ తర్వాత 'గుడుంబా శంకర్'లో 'లేలే లేలే ఇవ్వాళే లేలే..' ఇలా ప్రతి సినిమాలోని పాటల్లో ఆయన ఏదోఒక సందేశం ఇస్తూనే ఉన్నారు. పవన్ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే.. శ్రీశ్రీ పద్యానికి ప్యాంట్ షర్ట్ వేసి స్వాగ్ అనే ఒక ఆయువు పోస్తే అదే పవన్‌కల్యాణ్. అవతల వ్యక్తిని గౌరవించే పద్ధతి, ఒక మాట ఇస్తే దానిపై నిలబడేతత్వం. సినిమాలో సహజంగా కనిపించడం కోసం ఆయన పడే కష్టం అన్ని ఆయన గొప్పతనానికి నిదర్శనం. చిన్న డైలాగ్ కోసం కూడా రిహార్సల్స్ చేస్తారు. టైం తీసుకొని బాగా వచ్చేవరకూ ప్రాక్టీస్ చేస్తూనే ఉంటారు అని ప్రశంసించారు.



# ప్రభాస్ .. ఫౌజీ దసరాకు పక్కా

## శరవేగంగా సాగుతున్న షూటింగ్

ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్న రెబల్ స్టార్ ప్రభాస్ .. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించేందుకు సిద్ధమవుతున్నాడు. అందులో హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హిస్టారికల్ వార్ డ్రామా 'ఫౌజీ' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను ఈ ఏడాది దసరాకు రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే, అనుకున్న సమయానికి షూటింగ్ ఫినిష్ అవడం కష్టమని, ఫలితంగా పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఏది ఏమైనా సరే ఈ చిత్రాన్నివిజయదశమి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ గట్టిగా ఫిక్స్ అయ్యారట. దసరా సీజన్ టాలీవుడ్‌లో అతిపెద్ద సినిమాలకు కలిసొచ్చే సమయం కావడంతో, ఆ లోపే పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు హను రాఘవపూడి విజన్‌పై పూర్తి నమ్మకంతో ఉన్న మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ, ఆయనకు పూర్తిగా 'ఫ్రీ హ్యాండ్' ఇచ్చినట్లు తెలుస్తోంది. టెక్నికల్ వాల్యూస్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అనుకున్న సమయానికి అవుట్‌పుట్ తీసుకురావడమే లక్ష్యంగా టీమ్ పనిచేస్తోంది. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే.. ఈ ఏడాది జూలై లేదా ఆగస్టు లోపు షూటింగ్ మొత్తం పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంతో ఇమాన్వీ హీరోయిన్‌గా టాలీవుడ్‌కి పరిచయం అవుతోంది. మొత్తంగా.. ఈ సినిమాతో ప్రభాస్ మరోసారి పాన్ ఇండియా లెవల్లో సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169. PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861